# 2. అల్ బఖర (ఆవు) సూరా

## పరిచయం

'అల్ బఖర' అంటే అర్థం ఆవు. ఈ అధ్యాయం ప్రధానంగా తౌహీద్, అంటే (ఏకదైవా రాధన)ను విశదీకరించిన అధ్యాయం. దివ్య ఖుర్ఆన్ మనిషికి మార్గదర్శక గ్రంథమనీ, అందువల్ల దివ్య ఖుర్ఆన్‌లోని బోధనలను మనిషి అనుసరించాలని ప్రబోధించే అధ్యాయం ఇది. ఇందులో ఇస్లామీయ చట్టపరమైన ఆదేశాలు కూడా ఉన్నాయి.

'ఆవు' అన్న పేరు కలిగిన ఈ అధ్యాయాన్ని స్థూలంగా రెండు విభాగాలుగా విభజించ వచ్చు. మొదటి విభాగంలో ఇస్రాయీల్ సంతతికి సంబంధించిన వివరాలున్నాయి. ఇస్రాయీల్ సంతతి మూసా ప్రవక్త (అ)తో వ్యవహరించిన తీరు, ఇతర ప్రవక్తలతో వారి వ్యవహారశైలి ఇందులో ప్రస్తావనకు వచ్చాయి. చిట్టచివరి దైవగ్రంథంగా అవతరించిన దివ్య ఖుర్ఆన్‌ను విశ్వసించాలని ఇందులో వారికి ప్రత్యేక అప్పీలు చేయడం జరిగింది. రెండవ విభాగంలో మదీనాలో ఒక కొత్త ఇస్లామీయ వ్యవస్థను స్థాపించడానికి అవసరమైన న్యాయపరమైన, చట్టపరమైన అంశాలు ఉన్నాయి. ఈ సూరాలోని 67, 68 ఆయతులలో ప్రస్తావనకు వచ్చే ఆవు కథ కారణంగా ఈ సూరాకు "అల్ బఖర" అన్న పేరు పెట్టబడింది.

ప్రజల్లోని మూడు విభిన్న వర్గాల గురించిన వివరణతో ఈ సూరా ప్రారంభమవుతుంది. ఆ మూడు వర్గాలు వరుసగా – 1. అల్లాహ్‌కు భయపడేవారు, 2. దైవాన్ని, ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించేవారు, 3. దైవం పట్ల కపట విశ్వాసం ప్రదర్శించేవారు.

ఈ మూడు వర్గాలకు చెందిన ప్రజల ప్రస్తావన తర్వాత మానవులు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలనీ, ఆయనకు సహవర్తులుగా, ఆయనకు సమానులుగా ఎవరినీ నిలబెట్టరాదని నొక్కి చెప్పడం జరిగింది. ఖుర్ఆన్ యొక్క ఆయతులు దేవుని తరఫు నుంచి అవతరించినవన్న విషయంలో ఎవరికైనా సందేహం ఉంటే, ఖుర్ఆన్‌లో మాదిరి ఒక్క సూరా అయినా సరే రచించి తీసుకురమ్మన్న సవాలు కూడా ఇందులో ఉంది.

మానవ సృష్టికి సంబంధించిన కథను ఈ సూరా ప్రస్తావించింది. ఆదమ్ (అలైహిస్స లామ్)ను సృష్టించడం గురించి తెలిపింది. ఆదమ్ (అస)ను సృష్టించిన దేవుడు దైవదూతలను ఆదమ్ (అస) ముందు గౌరవసూచకంగా సాష్టాంగపడమని ఆదేశించాడు. దైవదూతలందరూ దేవుని ఆదేశాన్ని పాటించారు. కాని ఇబ్లీస్ పాటించలేదు. ఇబ్లీస్ ఒక షైతాన్. ఇబ్లీస్ దైవాదేశాన్ని తిరస్కరించి తలబిరుసుగా వ్యవహరించాడు. ఈ విధంగా మనిషికి – షైతానులకు మధ్య ఘర్షణ ప్రారంభమయ్యింది.

ఈ సూరా మదీనా కాలానికి సంబంధించిన సూరా. అందువల్ల ఇందులో ఇస్రాయీల్ సంతతి (యూద జాతి)కి సంబంధించిన ప్రస్తావనలు వివరంగా ఉన్నాయి.

అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌ను అవతరింపచేశాడని ఈ సూరా నొక్కి చెప్పింది. చిట్టచివరి దైవగ్రంథంగా, గత కాలాల్లోని దివ్య వచనాలను, అంటే మూసా (అలైహిస్సలామ్)పై

అవతరించిన తౌరాత్ గ్రంథాన్ని ఈసా (అలైహి)పై అవతరించిన ఇంజీల్ గ్రంథాన్ని ధృవీకరించే గ్రంథంగా దీనిని అవతరింపచేసినట్లు తెలియజేసింది.

దివ్య ఖుర్ఆన్‌లో ఉన్న సందేశం కూడా తౌరాత్, ఇంజీల్ గ్రంథాలలో ఉన్న సందేశం వంటిదే. దివ్య ఖుర్ఆన్‌లోని సందేశాన్ని ఇస్రాయీల్ సంతతి ప్రజలు సమగ్రంగా పరిశీలించి ఉన్నట్లయితే, తమ గ్రంథాలలో ఉన్న సందేశాన్ని ఇది ధృవీకరిస్తుందన్న వాస్తవాన్ని వారు గ్రహించి ఉండేవారు. కాని వారు దీనిని తిరస్కరించారు. మంత్రతంత్రాలలో, నానావిధ ఆచారాల్లో మునిగిపోయారు. ఇది చాలా చెడ్డ విషయం.

యూదులు కానట్లయితే ఎవరూ స్వర్గంలోకి ప్రవేశించలేరని యూదులు వాదించడాన్ని, క్రైస్తవులు కానివారు స్వర్గంలోకి ప్రవేశించలేరని క్రైస్తవులు అనడాన్ని ఈ సూరా ప్రస్తావించింది. ఇలా అనడానికి వారి వద్ద ఎలాంటి ఆధారమూ, ఎలాంటి నిరూపణ లేదనీ, నిజమైన విశ్వాసిగా దేవునికి తనను తాను సమర్పించుకున్న వ్యక్తి, సదాచరణలకు కట్టుబడిన వ్యక్తి ఎవరైనా గాని స్వర్గంలోకి ప్రవేశించగలరని ఈ సూరా వివరించింది. తౌరాత్, ఇంజీల్‌లోని దైవసందేశాన్ని మార్పులు చేర్పులకు గురిచేసి, అమాయకులను దారితప్పించిన పండితుల గురించి కూడా ఈ సూరాలో ప్రస్తావన ఉంది.

క్రైస్తవ వాదనలను కూడా ఈ సూరా తిప్పికొట్టింది. అల్లాహ్ ఒక కుమారుడిని దత్తత చేసుకున్నాడన్న వాదనను ఖండిస్తూ అల్లాహ్ ఔన్నత్యాన్ని చాటిచెప్పింది.

ఆ కాలంలో మదీనాలో కొత్తగా ఏర్పడిన ఇస్లామీయ రాజ్యానికి అత్యవసరమైన ఇస్లామీయ చట్టపరమైన ఆదేశాలు ఈ సూరాలో ఉన్నాయి. ఇవి నేటికి కూడా ముస్లిమ్ సముదాయానికి ఎంతో ముఖ్యమైనవి. ప్రజల సామూహిక జీవనానికి సంబంధించిన ముఖ్యమైన వ్యవహారాల గురించి ఆదేశాలు, వివరణలు ఈ సూరాలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ సూరా కుటుంబ వ్యవహారాలను విశదీకరించింది. కుటుంబాన్ని ఒక సత్సమాజానికి పునాది రాయిగా పరిగణించింది. ఈ సూరాలో వ్యాపార వాణిజ్యాలను ప్రోత్సహించడం జరిగింది. అయితే ఇతరుల నుంచి వడ్డీ తీసుకోవడం, లేదా ఇతరులకు వడ్డీకి రుణం ఇవ్వడంతో పాటు వడ్డీకి సంబంధించిన సమస్త రూపాలను నిషేధించడం జరిగింది. వడ్డీని తక్షణం మానుకోవాలని హెచ్చరించడం జరిగింది.

కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన అనేక అంశాలు ఈ సూరాలో ఉన్నాయి. భార్యకు ఆర్థికంగాను, మానసికంగాను భర్త తోడుగా ఉండాలని పేర్కొంది. భార్యాభర్తల మధ్య లైంగిక సంబంధాన్ని గురించి బోధనలు ఉన్నాయి. భార్య రుతుకాలంలో ఉన్నప్పుడు భర్త ఆమెకు లైంగికంగా దూరంగా ఉండాలనీ, విడాకులకు సంబంధించి – విడాకుల తర్వాత భార్యాభర్తలు మంచితనంతో, పరస్పర గౌరవాదరాలను పాటిస్తూ విడిపోవాలని, విడాకులు పొందిన స్త్రీ మూడు రుతుస్రావాల కాలంపాటు పునర్వివాహం చేసుకోకుండా ఆగాలని బోధించడం జరిగింది. పిల్లలకు పాలు పట్టడానికి సంబంధించి విడాకుల తర్వాత తల్లి, బిడ్డకు గరిష్టంగా రెండు సంవత్సరాల వరకు పాలుపట్టాలని చెప్పడం జరిగింది. భర్త మరణిస్తే వితంతువైన స్త్రీ భర్త మరణం తర్వాత నాలుగు మాసాల పదిరోజుల పాటు వేచి ఉండాలని బోధించడం జరిగింది.

## 2. అల్ బఖర[1] సూరా

## سُوْرَةُ الْبَقَرَةِ

అవతరణ : మదీనా ఆయతులు : 286

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝

**1 - 2** అలిఫ్ లామ్ మీమ్[2]. ఈ గ్రంథం (అల్లాహ్ గ్రంథం అన్న విషయం) లో ఎంతమాత్రం సందేహం లేదు.[3] భయ భక్తులు కలవారికి ఇది సన్మార్గం చూపుతుంది.[4]

الٓمّٓ ۝١ ذٰلِكَ الْكِتٰبُ لَا رَيْبَ ۛ فِيْهِ ۛ هُدًى لِّلْمُتَّقِيْنَ ۝٢

1. **'బఖర'** అంటే ఆవు అని అర్థం. ఈ సూరాలో ఆవు సంఘటన వచ్చింది. అందుకే ఈ సూరా బఖరా సూరా (ఆవు సంఘటన గల సూరా)గా వ్యవహరించబడింది. ఏ ఇంట్లోనయితే ఈ సూరా పఠించబడుతుందో ఆ ఇంటి నుంచి షైతాన్ పలాయనం చిత్తగిస్తాడని హదీసులో చెప్పబడింది. దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు : మీ ఇండ్లను శ్మశానాలుగా మార్చుకోకండి. ఏ ఇంట్లోనయితే బఖరా సూరా పఠించబడుతుందో ఆ ఇంట్లోకి షైతాన్ ప్రవేశించలేడు (సహీహ్ ముస్లిం). ఇది మహాప్రవక్త (స) మదీనాకు వచ్చిన తరువాత అవతరించిన తొలి సూరాలలోనిది. అయితే ఇందులోని కొన్ని వచనాలు ప్రవక్త (స)గారి అంతిమ హజ్ యాత్ర సందర్భంగా అవతరించాయి. కొంతమంది పండితుల ప్రకారం ఈ సూరాలో వెయ్యి సమాచారాలు, వెయ్యి ఆజ్ఞలు, వెయ్యి నిషిద్ధాంశాలున్నాయి (ఇబ్నె కసీర్).

2. **అలిఫ్ లామ్ మీమ్ :** ఇవి **'ముఖత్తఆత్'**గా వ్యవహరించబడ్డాయి. అంటే వేర్వేరుగా పఠించబడే అక్షరాలని భావం. వీటి అర్థానికి సంబంధించి ప్రమాణబద్ధమైన ఉల్లేఖనాలేవీ లేవు. వాస్తవం అల్లాహ్‌కే ఎరుక. అయితే దీనిపై మహనీయ ముహమ్మద్ (సఅసం) వారి ప్రవచనం ఉంది. ఆయన (స) ఇలా అన్నారు : "అలిఫ్- లామ్ - మీమ్ - ఒకే ఒక అక్షరమని నేనను. పైగా 'అలిఫ్' ఒక అక్షరం, 'లామ్' ఒక అక్షరం, 'మీమ్' ఒక అక్షరం. ఒక్కో అక్షరంపై ఒక్కో పుణ్యం ఉంది. ఒక్కో పుణ్యఫలం పదింతలు." (సుననె తిర్మిజీ : కితాబు ఫజాయిలిల్ ఖుర్ఆన్)

3. ఇది దైవగ్రంథం అన్న విషయంలో ఎలాంటి సంశయానికీ, సందిగ్ధానికి తావులేదు. దివ్య ఖుర్ఆన్‌లోనే మరోచోట సెలవీయబడినట్లు; "ఈ గ్రంథం సకల లోకాల ప్రభువు తరఫునుండి అవతరింపజెయ్యబడిందన్న విషయంలో సందేహానికి ఆస్కారం లేదు" (అస్ సజ్దహ్-2). కొందరు పండితులు "సందేహానికి ఆస్కారం లేదు" (లా రైబ ఫీహి) అంటే "అందులో సందేహానికి లోనుకాకండి" (లా తర్తాబూ ఫీహి) అన్న

| | |
|---|---|
| **3** వారు గోప్యమైన విషయాలను విశ్వసిస్తారు,[5] నమాజును నెలకొల్పుతారు.[6] ఇంకా మేము ప్రసాదించిన దానిలో (సంపదలో) నుంచి ఖర్చుపెడతారు.[7] | الَّذِينَ يُؤْمِنُونَ بِالْغَيْبِ وَيُقِيمُونَ الصَّلَوٰةَ وَمِمَّا رَزَقْنَٰهُمْ يُنفِقُونَ ③ |

భావమని చెప్పారు. అంతేకాదు, ఈ గ్రంథంలో పేర్కొనబడిన సంఘటనలు సత్యమైనవనటంలో, ఇందులో వివరించబడిన ఆదేశాలు ఉపదేశాలు మానవతకు మోక్షప్రదాయని అనటంలో, దేవుని ఏకత్వానికి, దైవదౌత్యానికి, పరలోకానికి సంబంధించి ఇందులో విశదీకరించబడిన విశ్వాసాలు సత్యబద్ధమైనవి అనటంలో కించిత్ అనుమానానికి కూడా తావు లేదు.

4. **మార్గదర్శక గ్రంథం :** ఆ మాటకొస్తే ఈ గ్రంథం సమస్త మానవాళికి దారిచూపే గ్రంథమే. అయితే సన్మార్గం కోసం పరితపించేవారు, దైవభీతితో జీవించే ధన్యజీవులు మాత్రమే ఈ శుభాల సరోవరాన్ని తనివితీరా ఆస్వాదించగలుగుతారు. మరణానంతర జీవితంలో దేవుని దర్బారులో నిలబడి జవాబు చెప్పుకోవలసి ఉందన్న భావన లేనివారికి, సన్మార్గాన్ని పొందాలన్న ధ్యాస మనసులో లేనివారికి, కనీసం అపమార్గానికి దూరంగా ఉండాలన్న చింతన కూడా లేనివారికి మార్గదర్శకత్వం ఎక్కడి నుంచి లభిస్తుంది? ఎలా లభిస్తుంది? ఎందుకు లభిస్తుంది?

5. **గోప్యమైన విషయాలు :** అంటే భావం మనిషి దృష్టికి, ఊహకు, పంచేంద్రియాలకు అందనివి. ఉదాహరణకు : అల్లాహ్ అస్థిత్వం, అల్లాహ్ సంకేతం, స్వర్గం, నరకం, దైవదూతల ఉనికి, సమాధియాతన, ప్రళయదినాన మానవులను శరీరాల సమేతంగా సమీకరించటం – ఇత్యాది విషయాలు. ఇవి అగోచరమైనవి. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే దైవం మరియు దైవప్రవక్త (స) తెలియజేసిన బుద్ధికందని విషయాలను సత్యమని నమ్మటం విశ్వాసం (ఈమాన్)లో అంతర్భాగం. వీటి నిరాకరణ శుద్ధ అపమార్గం.

6. **నమాజును నెలకొల్పటం** అంటే నాగా లేకుండా, సమయపాలన చేస్తూ మరీ నమాజు చేయటమనీ, దైవప్రవక్త (స) చూపిన విధానాన్ని అనుసరించి నమాజు చేయటమనీ భావం. చిత్తశుద్ధి లోపించిన నమాజు, దైవప్రవక్త (స) సంప్రదాయానికి విరుద్ధంగా చేసే నమాజు నమాజే కాదు. కపటులు కూడా నమాజు చేస్తారు. కాని అది దైవ సన్నిధిలో స్వీకారయోగ్యమవుతుందా? (వివరాల కోసం అన్ కబూత్ సూరా 45వ ఆయతుకు పాద సూచికను చూడండి).

7. **ఇన్ఫాఖ్** (ఖర్చుపెట్టడం) అనే పదం సర్వసాధారణమైనది. విధిగా ఇవ్వవలసిన దానాలు (సదఖాతె వాజిబా), స్వచ్ఛందమైన దానాలు (సదఖాతె నాఫిలా) – రెండూ ఇందులో చేరి ఉన్నాయి. విశ్వాసులైనవారు తమ శక్తి స్థోమతలనుబట్టి ఈ రెండు రకాల

4 మేము నీ వైపుకు (అంటే ప్రవక్త వైపుకు) అవతరింపజేసిన దానినీ, నీకు పూర్వం అవతరింపజేసిన వాటినీ వారు విశ్వసిస్తారు.[8] పరలోకం పట్ల కూడా వారు దృఢనమ్మకం కలిగి ఉంటారు.

وَالَّذِينَ يُؤْمِنُونَ بِمَا أُنزِلَ إِلَيْكَ وَمَا أُنزِلَ مِن قَبْلِكَ وَبِالْآخِرَةِ هُمْ يُوقِنُونَ ④

5 ఇలాంటి వారే తమ ప్రభువు తరఫు నుంచి వచ్చిన సన్మార్గాన ఉన్నారు. సాఫల్యాన్ని పొందేవారు వీరే.[9]

أُولَٰئِكَ عَلَىٰ هُدًى مِّن رَّبِّهِمْ ۖ وَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ⑤

దానాలను కూడా మనస్ఫూర్తిగా ఇస్తారు. ఈ విషయంలో వారు ఎలాంటి లోటునూ, పిసినారితనాన్నీ కనబరచరు. తల్లిదండ్రులు, భార్యాపిల్లలపై సరైన విధంగా డబ్బు ఖర్చుపెట్టటం కూడా ఇందులో చేరి ఉంది. ఈ ఖర్చు కూడా పుణ్యప్రదమైనదే.

8. వెనుకటి గ్రంథాలను విశ్వసించటమంటే అర్థం, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) కు పూర్వం దైవప్రవక్తల – (అలైహిముస్సలాం)పై అవతరించిన గ్రంథాలను, సహీఫాలను సత్యమని నమ్మటం. అయితే ఇప్పుడవి సిసలైన రూపంలో లేవు. ప్రక్షిప్తాలకు, మార్పులకు లోనైనాయి. కనుక ఇప్పుడవి ఆచరణయోగ్యం కావు. ఇప్పుడు కేవలం దివ్య ఖుర్ఆన్ మరియు దానికి తాత్పర్యంగా వున్న ప్రవక్త (స) ప్రవచనాలను మాత్రమే ఆచరించాలి. దైవదౌత్య పరంపర మహాప్రవక్త ముహమ్మద్ (స)తో పరిసమాప్త మైందన్న విషయం కూడా దీనిద్వారా తేటతెల్లం అయింది. ఒకవేళ మహాప్రవక్త (సఅసం) అనంతరం కూడా దైవసందేశం (వహీ) అవతరించవలసి వుంటే, దాన్ని కూడా తప్పక విశ్వసించాలన్న సంగతి ప్రస్తావించబడి ఉండేది. కాని అలాంటి ప్రస్తావన ఏదీ అంతిమ దైవగ్రంథంలో లేదు.

9. **సఫలీకృతులు :** ఇందులో విశ్వసించిన వారి సత్పరిణామం సూచించబడింది. ఎందుకంటే వారు విశ్వసించిన మీదట గోళ్లు గిల్లుకుంటూ, దిక్కులు చూస్తూ కూర్చోలేదు. నిత్యం సదాచరణ చేస్తూ, దైవానికి భయపడుతూ జీవించారు. విశ్వాస సంస్కరణ పట్ల సదా శ్రద్ధవహించారు. పరలోకంలో దైవప్రసన్నతను బడయటం, ఆయన కారుణ్యానికి, మన్నింపుకు నోచుకోవటమే సిసలయిన సాఫల్యం అని మరువరాదు. శాశ్వతమైన పరలోక సాఫల్యంతోపాటు ప్రాపంచిక జీవితంలో కూడా భాగ్యాలు, సుఖశాంతులు ప్రాప్తిస్తే, సుబ్హానల్లాహ్! ఇక కావలసిందేమిటీ?! అయితే శాశ్విత జీవితానికి నిలయమైన పరలోక సాఫల్యమే అసలు సాఫల్యం.

దీని తరువాత అల్లాహ్ రెండో వర్గం వారి గురించి ప్రస్తావించాడు. వారు కేవలం అవిశ్వాసులు (కాఫిర్లు) మాత్రమే కాదు, అవిశ్వాసంలో, వైరవైఖరిలో వారు ఆఖరి

**6** అవిశ్వాసులను నీవు భయపెట్టినా, భయపెట్టకపోయినా ఒకటే. ఇక వారు విశ్వసించరు.[10]

إِنَّ الَّذِينَ كَفَرُوا سَوَاءٌ عَلَيْهِمْ أَأَنذَرْتَهُمْ أَمْ لَمْ تُنذِرْهُمْ لَا يُؤْمِنُونَ ⑥

**7** అల్లాహ్ వారి హృదయాలపై, వారి చెవులపై ముద్రవేశాడు. వారి కళ్ళపై పొర వుంది. ఇంకా వారికి మహా (ఘోరమైన) శిక్ష వుంది.[11]

خَتَمَ اللَّهُ عَلَىٰ قُلُوبِهِمْ وَعَلَىٰ سَمْعِهِمْ وَعَلَىٰ أَبْصَارِهِمْ غِشَاوَةٌ وَلَهُمْ عَذَابٌ عَظِيمٌ ⑦

అంచుల దాకా పోయారు. ఆ స్థితికి చేరుకున్న వారి నుంచి ఇక మంచిని, ఇస్లాం స్వీకరణను ఆశిస్తే అది అత్యాశే అవుతుంది.

10. అందరూ ముస్లింలు కావాలన్నది దైవప్రవక్త (సఅసం) ఆకాంక్ష! ఆ మేరకే ఆయన (స) తన వంతు కృషి సలిపారు. అయితే విశ్వాసం వారి అదృష్టంలో లేదని అల్లాహ్ తెలియపరచాడు. ధిక్కార వైఖరిపై మొండికేయటం మూలంగా వారి హృదయాలపై సీలు పడిపోయింది. (అబూజహల్, అబూలహబ్ తదితరులంతా ఈ కోవలోకి వస్తారు). అయితే అల్లాహ్ అనుగ్రహంతోనే ఆయన (సఅసం) గారి సందేశ ప్రధానమైన కృషి ఫలితంగా అసంఖ్యాక జనం ఇస్లాం స్వీకరించారు. కడకు అరేబియా ద్వీపమంతా ఇస్లాం పరిధిలోకి వచ్చేసింది.

11. ధిక్కార వైఖరిపై వారు పాతుకుపోవడానికి కారణం ఏమిటో ఈ వచనంలో తెలుపబడింది. నిరంతరం కుఫ్రుకు (దైవ తిరస్కారానికి), మహాపరాధాలకు పాల్పడుతూ ఉండటం మూలంగా వారి హృదయాలు తుప్పుపట్టిపోయాయి. సత్యాన్ని సత్యంగా ఒప్పుకునే గుణం వారిలో లేకుండా పోయింది. వారి చెవులు సత్యవాక్కును వినడానికి సన్నద్ధం కాలేదు. విశ్వవ్యవస్థలో నలువైపులా విస్తరించివున్న దైవనిదర్శనాలను తిలకించటంలో వారి నేత్రాలు విఫలమైనాయి. మరలాంటప్పుడు వారు దైవాన్ని ఎలా విశ్వసిస్తారు? దేవుడిచ్చిన శక్తిసామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటూ, జీవన పరమార్థాన్ని తెలుసుకోవాలన్న ఆరాటంలో ఉండే ధన్యజీవులకు మాత్రమే ఈమాన్ (విశ్వాస) భాగ్యం ప్రాప్తిస్తుంది. లేనిపక్షంలో జనులకు క్రింద పేర్కొనబడే హదీసు వర్తిస్తుంది–

"విశ్వాసి పాపం చేసినప్పుడు అతని హృదయంపై ఒక నల్లని మచ్చ ఏర్పడుతుంది. తరువాత పశ్చాత్తాపం చెంది పాపకార్యాలకు దూరంగా మసలుకుంటే అతని హృదయంపై ఉన్న మచ్చ తొలగిపోయి, మునుపటిలా అతని హృదయం నిర్మలంగా, నిష్కళంకంగా తయారవుతుంది. ఒకవేళ అతగాడు పశ్చాత్తాపం చెందే బదులు నిరంతరం పాపిష్టి పనులకు పాల్పడసాగితే నల్లని మచ్చ క్రమంగా విస్తరిస్తూ హృదయాన్నంతటినీ ఆవరిస్తుంది." హృదయాలకు తుప్పు పట్టటమంటే ఇదే!

**8** మేము అల్లాహ్‌పట్ల, అంతిమ దినం పట్ల విశ్వాసం కలిగి ఉన్నామని కొంద రంటున్నారు. కాని యదార్థానికి వారు విశ్వసించినవారు కారు.[12]

وَمِنَ النَّاسِ مَنْ يَّقُوْلُ اٰمَنَّا بِاللّٰهِ وَبِالْيَوْمِ الْاٰخِرِ وَمَا هُمْ
بِمُؤْمِنِيْنَ ۝٨

**9** వారు అల్లాహ్‌ను, విశ్వాసులనూ మోస పుచ్చుతున్నారు. అయితే వాస్తవానికి వారు స్వయంగా–తమను తామే మోస పుచ్చు కుంటున్నారు. కాని ఈ విషయాన్ని వారు గ్రహించటం లేదు.

يُخٰدِعُوْنَ اللّٰهَ وَالَّذِيْنَ اٰمَنُوْا ۚ وَمَا يَخْدَعُوْنَ اِلَّآ اَنْفُسَهُمْ
وَمَا يَشْعُرُوْنَ ۝٩

**10** వారి హృదయాలలో రోగం ఉంది. ఆ రోగాన్ని అల్లాహ్ మరింతగా పెంచాడు.[13] ఇంకా, వారు చెప్పే అబద్ధం మూలంగా వారి కొరకు వ్యధాభరిత మయిన శిక్ష ఉంది.

فِيْ قُلُوْبِهِمْ مَّرَضٌ ۙ فَزَادَهُمُ اللّٰهُ مَرَضًا ۚ وَلَهُمْ عَذَابٌ
اَلِيْمٌ ۢ بِمَا كَانُوْا يَكْذِبُوْنَ ۝١٠

ఈ తుప్పును గురించే (దివ్య ఖుర్‌ఆన్‌లో) అల్లాహ్ ఈ విధంగా అభివర్ణించాడని మహనీయ ముహమ్మద్ (స) చెప్పారు – "వారి దుష్కార్యాల మూలంగా వారి హృదయాలకు తుప్పు పట్టింది." (అల్ ముతఫ్ఫిఫీన్–14). (తిర్మిజీలో ముతఫ్ఫిఫీన్ సూరాకు వ్యాఖ్యానంగా ఈ హదీసు వచ్చింది). ఈ స్థితిని దివ్య ఖుర్‌ఆన్ "సీలు పడటం"గా వర్ణించింది. నిరాఘాటంగా వారు సాగిస్తూపోయిన దుష్కార్యాల మూలంగా అనివార్యంగా సంభవించిన పరిణామం అది! దీన్నే మరికొన్ని చోట్ల క్రింది వాక్యాలతో ప్రస్తావించటం జరిగింది –

"వారి అవిశ్వాస వైఖరి కారణంగా అల్లాహ్ వారి హృదయాలపై ముద్రవేశాడు."
*(అన్ నిసా - 155)*

12. ఇక్కడి నుంచి మూడో వర్గం – కపట వర్గం – ప్రస్తావన మొదలవుతుంది. వారి హృదయాలు విశ్వాస భాగ్యానికి నోచుకోలేదు. అయితే వారు విశ్వాసులను మోసగించే ఉద్దేశ్యంతో వారి ముందు విశ్వాస ప్రకటన చేసేవారు. వాళ్ళు అల్లాహ్‌ను గానీ, విశ్వాసులను గానీ మోసగించలేరు. ఎందుకంటే అల్లాహ్ సర్వాన్నీ ఎరిగినవాడు. ముస్లింలకు సయితం ఆయన తన సంకేతం (వహీ) ద్వారా కపటుల కుయుక్తులను గురించి ఎప్పటికప్పుడు తెలియజెప్పేవాడు. ఆ విధంగా ఆ వంచకుల ఎత్తుగడలన్నీ ఖుద్దుగా వారికే నష్టం చేకూర్చాయి. వారు తమ పరలోక జీవితాన్ని ఎలాగూ పాడుచేసుకున్నారు. అయితే ఇహలోకంలో సయితం వారికి మిగిలింది పరాభవమే!

11 "భూమిలో కల్లోలాన్ని రేకెత్తించకండి" అని వారితో అన్నప్పుడల్లా "మేము దిద్దుబాటుకు ప్రయత్నించేవారం మాత్రమే" అని వారు సమాధానమిస్తారు.

وَإِذَا قِيلَ لَهُمْ لَا تُفْسِدُوا فِي الْأَرْضِ قَالُوا إِنَّمَا نَحْنُ مُصْلِحُونَ ⑪

12 జాగ్రత్త! నిజానికి కల్లోల జనకులు వీరే.[14] కాని వారికి ఆ విషయం తెలియటం లేదు.

أَلَا إِنَّهُمْ هُمُ الْمُفْسِدُونَ وَلَٰكِن لَّا يَشْعُرُونَ ⑫

13 "ఇతరులు (అంటే ప్రవక్త ప్రియ సహచరులు) విశ్వసించినట్లే మీరూ విశ్వసించండి" అని వారితో చెప్పినప్పుడు, "మూర్ఖ జనులు విశ్వసించినట్లుగా మేము విశ్వసించాలా?"[15] అని వారు (ఎదురు)

وَإِذَا قِيلَ لَهُمْ آمِنُوا كَمَا آمَنَ النَّاسُ قَالُوا أَنُؤْمِنُ كَمَا آمَنَ السُّفَهَاءُ

13. రోగం అంటే అర్థం ధిక్కార రోగం! కాపట్య రోగం! దాన్ని నయం చేసే ఉపాయం గనక ఆలోచించకపోతే, అది రోజురోజుకూ పెరుగుతూ పోతుంది. అలాగే అబద్ధాలు చెప్పటం, డాంబికాలు పలకటం కూడా కాపట్య లక్షణాలే. అందుకే అసత్యాలకు, కల్లబొల్లి మాటలకు కడు దూరంగా ఉండాలి.

14. 'కల్లోలం' (ఫసాద్) అనేది 'సంస్కరణ' (సలాహ్)కు వ్యతిరేక పదం. అవిశ్వాస వైఖరి ద్వారా, వంచనా పూరితమయిన చేష్టల ద్వారా లోకంలో అరాచకం, అశాంతి అలజడులు చెలరేగుతాయి. దైవవిధేయతా విధానాల ద్వారా సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. తరతరాలుగా, యుగయుగాలుగా కపటులు చేసిందల్లా ఒక్కటే – కల్లోలాన్ని వ్యాపింప జేయటం, చెడులను ప్రాచుర్యంలోనికి తీసుకు రావటం, దేవుని హద్దులను అతిక్రమించటం! ఇంత చేసి కూడా కపటులు తమను గొప్ప సంస్కర్తలుగా, శ్రేయోభిలాషులుగా చెప్పుకుంటారు.

15. అల్లాహ్‌ను విశ్వసించి, అల్లాహ్ మార్గంలో ధనప్రాణాలను అర్పించడానికి ఎన్నడూ వెనుకాడని ప్రవక్త ప్రియ సహచరులను ఈ కపటులు "మూర్ఖుల" క్రింద జమకట్టారు. ప్రవక్త ప్రియసహచరుల విశ్వాసాన్ని శంకించేవారు నేటికీ ఉన్నారు. అల్లాహ్ ఆనాటి కపటులను, నేటి కపటులను కూడా నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాడు. మహదాశయం కోసం ప్రాపంచిక స్వలాభాలను పణంగా పెట్టడం 'మూర్ఖత్వం' కానేకాదు. పైగా అదెంతో వివేకవంతమైన పని. మహాభాగ్యం. ఈ భాగ్యం కోసమే ప్రవక్త ప్రియ సహచరులు మొక్కవోని సాహసాన్ని ప్రదర్శించారు. అందువల్లనే వారు నికార్సయిన

أَلَآ إِنَّهُمْ هُمُ السُّفَهَآءُ وَلَٰكِن لَّا يَعْلَمُونَ ١٣

ప్రశ్న వేస్తారు. తస్మాత్! ముమ్మాటికీ వీరే మూర్ఖులు. కాని ఆ సంగతి వీరికి తెలియటం లేదు.[16]

وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوٓا آمَنَّا وَإِذَا خَلَوْا إِلَىٰ
شَيَاطِينِهِمْ قَالُوٓا إِنَّا مَعَكُمْ إِنَّمَا نَحْنُ مُسْتَهْزِءُونَ ١٤

**14** విశ్వాసులను కలుసుకున్నప్పుడు వారు "మేమూ విశ్వసించినవారమే" అని అంటారు. కాని తమ షైతానుల (అంటే తమ పెద్దల లేక సర్దారుల) వద్దకు పోయినప్పుడు[17] "మేము మీతోనే ఉన్నామండీ. కాకపోతే వాళ్ళతో పరిహాస మాడుతున్నామంతే" అని పలుకుతారు.

اللَّهُ يَسْتَهْزِئُ بِهِمْ وَيَمُدُّهُمْ فِي طُغْيَانِهِمْ يَعْمَهُونَ ١٥

**15** అల్లాహ్ కూడా వారితో పరిహాస మాడుతున్నాడు.[18] వారి తలబిరుసుతనాన్ని మరింత అధికం చేస్తున్నాడు. ఫలితంగా వారు అంధులై గమ్యరహితంగా తిరుగుతూ పోతున్నారు.

---

విశ్వాసులుగానే కాకుండా 'ఈమాన్' అనే దానికి ఒక ప్రమాణాన్ని, గీటురాయిని నెలకొల్పారు. కాబట్టి ఇక ప్రవక్త ప్రియసహచరుల మాదిరిగా విశ్వసించినవారి "విశ్వాసమే" ఎన్నదగినదవుతుంది. "మీరు విశ్వసించినట్లే వారు కూడా విశ్వసిస్తే అప్పుడు వారు సన్మార్గాన ఉన్నట్లు లెక్క." *(అల్ బఖర : 137)*

16. త్వరగా లభించే లాభం కోసం ఆలస్యంగా ప్రాప్తించే లాభాన్ని ఉపేక్షించటం, శాశ్వితమైన పరలోక జీవితంపై క్షణభంగురమైన ప్రాపంచిక జీవితానికి ప్రాధాన్యత నివ్వటం, అల్లాహ్‌కు బదులు జనసామాన్యానికి భయపడటం శుద్ధ అవివేకం! ప్రథమ శ్రేణి మూర్ఖత్వం! కపటులు పప్పులో కాలేసింది ఇక్కడే. తిరుగులేని ఒక యదార్థాన్ని వారు తెలుసుకోలేకపోయారు.

17. అరబీలో 'షైతానులు' అని అనబడింది. ఇక్కడ షైతానులు అంటే కురైషు సర్దారులు, యూదులు అని భావం. వారి ప్రోద్బలంపైనే ఈ కపటులు ఇస్లాం మరియు ముస్లిము లకు వ్యతిరేకంగా కుట్రలు పన్నేవారు. లేక షైతానులు అంటే స్వయానా కపటుల సర్దారులు అయినా కావచ్చు.

18. అల్లాహ్ కూడా వారితో పరిహాసమాడుతున్నాడు : అంటే భావం వారు ముస్లింలతో ఏ విధంగా దాగుడుమూతలాడుతున్నారో అల్లాహ్ కూడా వారితో అదేవిధంగా

**16** అపమార్గాన్ని సన్మార్గానికి బదులుగా కొనితెచ్చుకున్నవారు వీరే.[19] అందుచేత వారి ఈ వర్తకం వారికి లాభదాయకమూ కాలేదు, వారు సన్మార్గానికి నోచుకోనూ లేదు.

أُولَٰئِكَ الَّذِينَ اشْتَرَوُا الضَّلَالَةَ بِالْهُدَىٰ فَمَا رَبِحَت تِّجَارَتُهُمْ وَمَا كَانُوا مُهْتَدِينَ ﴿١٦﴾

**17** వారి ఉపమానం నిప్పు రాజేసిన వ్యక్తి లాంటిది. నిప్పు రాజేసినంతనే పరిసరాల్లోని వస్తువులన్నీ వెలుగులోనికి వచ్చాయి. అంతలోనే అల్లాహ్ వారి వెలుగును హరించి, వారిని కారు చీకట్లలో, ఏమీ కానరాని స్థితిలో వదిలేశాడు.[20]

مَثَلُهُمْ كَمَثَلِ الَّذِي اسْتَوْقَدَ نَارًا فَلَمَّا أَضَاءَتْ مَا حَوْلَهُ ذَهَبَ اللَّهُ بِنُورِهِمْ وَتَرَكَهُمْ فِي ظُلُمَاتٍ لَّا يُبْصِرُونَ ﴿١٧﴾

---

ప్రవర్తిస్తూ వారిని అవమానానికి, పరాజయానికి లోనుచేస్తున్నాడు. దీన్నే పరిహాసంగా చెప్పబడింది. ఇది మాట తీరు. నిజానికి అది పరిహాసం కాదు, వారి పరిహాసానికి శాస్తి. దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడినట్లు, "చెడుకు ప్రతిఫలం అటువంటి చెడే" (షూరా – 40). అలాగే **"యుఖాదివూనల్లాహ వహువ ఖాదివుహుమ్"** (వారు అల్లాహ్‌ను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. నిజానికి అల్లాహ్‌యే వారిని మోసపుచ్చుతున్నాడు) **"వ మకరూ వ మకరల్లాహు"** – వారు అల్లాహ్‌పై కుట్రపన్నారు. అల్లాహ్ వారిపై కుట్రపన్నాడు – వంటి ఆయతులను కూడా ఉదాహరించవచ్చు. ఇంకొక అర్థం ఏమిటంటే ప్రళయదినాన అల్లాహ్ కూడా వారిని ఆట పట్టిస్తాడు. అల్ హదీద్ సూరాలోని 13వ సూక్తిలో **"యౌమ యఖూలులు మునాఫిఖూన..."** అనే ఆయతు క్రింద ఇది కూలంకషంగా వివరించబడింది.

19. ఇక్కడ వర్తకం అంటే భావం సన్మార్గాన్ని వదలిపెట్టి నష్టాన్ని చవిచూసే మార్గవిహీనతను అవలంబించటం. కపటులు కాపట్య ముసుగును వేసుకుని పొద్దస్తమానం నష్టకరమైన వ్యాపారం చేశారు. ఈ నష్టం పరలోకానికి సంబంధించిన నష్టం. ప్రపంచంలోనే ఈ నష్టం వీరికి తెలియాలని ఎక్కడా లేదు. పైగా వారు వేసే వంచనా శిల్ప ఎత్తుగడల ఫలితంగా – తాత్కాలికంగా – ఒనగూడే ప్రయోజనాలను చూసుకుని వారు మురిసిపోయేవారు. దీని ఆధారంగా తెలివి తమ సొత్తని తలపోసేవారు, ముస్లింలు తెలివి తక్కువ వారనీ, తమతో వారు సరితూగలేరనీ కాకి లెక్కలు వేసుకునేవారు.

20. హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్, తదితర సహాబీలు దీని భావార్థాన్ని ఇలా వివరించారు: దైవప్రవక్త (సఅసం) మదీనా నగరానికి ఏతెంచినపుడు కొంతమంది ముస్లిములయ్యారు. కాని కొద్ది రోజుల్లోనే వారు కపట నాటకాలు మొదలెట్టారు. వారి

صُمٌّۢ بُكْمٌ عُمْیٌ فَهُمْ لَا یَرْجِعُوْنَ ﴿۱۸﴾

**18** వారు చెవిటివారు, మూగవారు, గ్రుడ్డి వారు. ఇక వారు (సరైన దారికి) మరలి రారు.

اَوْ كَصَیِّبٍ مِّنَ السَّمَآءِ فِیْهِ ظُلُمٰتٌ وَّرَعْدٌ وَّبَرْقٌ ۚ یَجْعَلُوْنَ
اَصَابِعَهُمْ فِیْۤ اٰذَانِهِمْ مِّنَ الصَّوَاعِقِ حَذَرَ الْمَوْتِ ؕ وَاللّٰهُ مُحِیْطٌۢ
بِالْكٰفِرِیْنَ ﴿۱۹﴾

**19** లేదా (వారి ఉపమానం) ఆకాశం నుంచి కురిసే భారీ వర్షం మాదిరిగా ఉంది – అందులోనూ చిమ్మ చీకట్లు, ఉరుములు, మెరుపులు! ఉరుముల గర్జన విని, మృత్యు భయంతో వారు తమ వ్రేళ్ళను తమ చెవులలో దూర్చుకుంటారు. అల్లాహ్ ఈ అవిశ్వాసులను అన్ని వైపుల నుంచీ ముట్టడిస్తాడు.

یَكَادُ الْبَرْقُ یَخْطَفُ اَبْصَارَهُمْ ؕ كُلَّمَاۤ اَضَآءَ لَهُمْ مَّشَوْا فِیْهِ ۙۗ
وَاِذَاۤ اَظْلَمَ عَلَیْهِمْ قَامُوْا ؕ وَلَوْ شَآءَ اللّٰهُ لَذَهَبَ بِسَمْعِهِمْ

**20** మెరుపులు వారి దృష్టిని ఎగరవేసుకు పోతాయా! అన్నట్టుంది వారి పరిస్థితి. అవి (మెరుపు తీగలు) వెలుగును విరజిమ్మి నపుడల్లా వారు అందులో కొంతదూరం నడుస్తారు. తర్వాత వారిపై చీకటి ఆవరించగానే నిలబడిపోతారు.[21] అల్లాహ్‌యే

ఉదాహరణ ఎటువంటిదంటే; ఒక వ్యక్తి చీకట్లో ఉన్నాడు. అతడు నిప్పు రాజేశాడు. దాంతో పరిసరాలు వెలుగుమయమయ్యాయి. ప్రయోజనకరమయిన వస్తువులు ఎక్కడున్నాయో, హానికరమయినవి ఎక్కడున్నాయో అతను చూసుకున్నాడు. కాని అంతలోనే అకస్మాత్తుగా వెలుగు పోయింది. మునుపటిలాగే అతను తిరిగి చీకటిలో చిక్కుకుపోయాడు. కపటుల పరిస్థితి కూడా ఇంతే. మొదట వారు షిర్క్ (బహుదైవారాధన) అనే తమస్సులో ఉన్నారు. తరువాత ఇస్లాం స్వీకరించి వెలుగులోకి వచ్చారు. ధర్మాధర్మాలను, ఉచితానుచితాలను తెలుసుకున్నారు. కాని ఉన్నట్టుండి వారు అవిశ్వాసం వైపునకు, కాపట్యం వైపునకు తిరిగిపోయారు. అందుచేత వారి వెలుగంతా కనుమరుగై పోయింది (ఫత్‌హుల్ ఖదీర్).

21. వీళ్లు కపటులలోని వేరొక వర్గం వారు. వారిపై ఒక్కోసారి సత్యం ప్రస్ఫుటమవుతుంది. మరి అంతలోనే వారు సంశయంలో, సందిగ్ధంలో పడిపోతూ ఉంటారు. వారి మనోగతం చీకటిలో ధారాపాతంగా కురిసే వర్షం లాంటిది. ఉరుములు, మెరుపులకు వారి హృదయాలు కంపిస్తూ ఉంటాయి. భయం కొద్దీ వారు తమ వ్రేళ్లను చెవుల్లో దూర్చుకుంటారు. అయితే వారి ఈ ఉపాయం వారిని అల్లాహ్ పట్టునుంచి కాపాడదు.

وَأَبْصَارِهِمْ إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿٢٠﴾

గనక తలచుకుంటే వారి వినేశక్తినీ, కంటి చూపునూ పోగొట్టేవాడే,[22] నిశ్చయంగా అల్లాహ్ అన్నింటి పై అధికారం గలవాడు.

يَا أَيُّهَا النَّاسُ اعْبُدُوا رَبَّكُمُ الَّذِي خَلَقَكُمْ
وَالَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ ﴿٢١﴾

**21** ప్రజలారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ పుట్టించిన మీ ప్రభువునే ఆరాధించండి–తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు.

الَّذِي جَعَلَ لَكُمُ الْأَرْضَ فِرَاشًا وَالسَّمَاءَ بِنَاءً وَأَنزَلَ مِنَ السَّمَاءِ
مَاءً فَأَخْرَجَ بِهِ مِنَ الثَّمَرَاتِ رِزْقًا لَّكُمْ ۖ فَلَا تَجْعَلُوا لِلَّهِ أَندَادًا
وَأَنتُمْ تَعْلَمُونَ ﴿٢٢﴾

**22** ఆయనే మీ కోసం భూమిని పాన్పుగానూ, ఆకాశాన్ని కప్పుగానూ చేశాడు, ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, తద్వారా పండ్లు ఫలాలను పండించి మీకు ఉపాధినొసగాడు. ఇది తెలిసి కూడా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి.[23]

ఎందుకంటే వారు అల్లాహ్ దిగ్బంధం నుంచి తప్పుకోలేరు. సత్య కిరణాలు వారిపై పడినప్పుడల్లా వారు సత్యం వైపునకు మొగ్గుచూపుతారు. కాని ఇస్లాం మరియు ముస్లిములపై కష్టకాలం వచ్చిపడగానే కలవరం చెందుతారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్). ఈ విధంగా కపటుల వర్గం సదా డోలాయమాన స్థితిలో ఉండి సత్యానికి (ఇస్లాంకు) దూరమైపోతుంది.

22. ఇదొక హెచ్చరిక. అల్లాహ్ గనక తలచుకుంటే తాను ప్రసాదించిన శక్తిసామర్థ్యాలను నిర్వీర్యం గావించగలడు. జప్తు చేసుకోగలడు. అందుకే మానవులు ఎట్టి పరిస్థితిలోనూ దైవ విధేయత పట్ల విముఖత చూపటంగానీ, ఆయన శిక్షపట్ల నిర్భయంగా, నిశ్చింతగా ఉండటంగానీ చేయరాదు.

23. సన్మార్గం, అపమార్గం రీత్యా మనుషుల్లోని మూడు వర్గాలను ప్రస్తావించిన తరువాత దేవుని ఏకత్వం వైపునకు, దైవారాధన వైపునకు సమస్త మానవాళికి పిలుపు ఇవ్వటం జరిగింది. మిమ్మల్నీ, సమస్త విశ్వాన్ని సృష్టించినవాడు అల్లాహ్ అయినప్పుడు, మీ అవసరాలను, జీవన సామగ్రిని సమకూర్చేవాడు కూడా ఆయనే అయినప్పుడు, ఆయన్ని వదలిపెట్టి ఇతరులను ఎందుకు ఆరాధిస్తారు? ఇతరులను ఆయనకు సహవర్తులుగా ఎందుకు కల్పిస్తారు? దైవాగ్రహం నుంచి మీరు సురక్షితంగా ఉండాలంటే మీరు చేయవలసిందల్లా ఒక్కటే – ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధించండి, అన్నీ తెలిసి

**23** మేము మా దాసునిపై అవతరింప జేసిన దాని విషయంలో ఒకవేళ మీకేదన్నా అనుమానముంటే, అటువంటిదే ఒక్క సూరానైనా (రచించి) తీసుకురండి. మీరు సత్యవంతులే అయితే (ఈ పని కోసం) అల్లాహ్‌ను తప్ప మీ సహాయకులందరినీ పిలుచుకోండి.[24]

وَإِنْ كُنْتُمْ فِي رَيْبٍ مِمَّا نَزَّلْنَا عَلَىٰ عَبْدِنَا فَأْتُوا بِسُورَةٍ مِنْ
مِثْلِهِ وَادْعُوا شُهَدَاءَكُمْ مِنْ دُونِ اللَّهِ إِنْ كُنْتُمْ
صَادِقِينَ ﴿٢٣﴾

**24** ఒకవేళ మీరు గనక ఈ పనిచెయ్యక పోతే– ఎన్నటికీ అది మీ వల్ల కాని పనే–[25] (దీన్ని సత్యమని ఒప్పుకుని) మానవులు, రాళ్ళు ఇంధనం కాగల ఆ అగ్ని నుండి (మిమ్మల్ని మీరు) కాపాడుకోండి.[26] అది సత్య తిరస్కారుల కోసం తయారు చేయ బడింది.[27]

فَإِنْ لَمْ تَفْعَلُوا وَلَنْ تَفْعَلُوا فَاتَّقُوا النَّارَ الَّتِي وَقُودُهَا
النَّاسُ وَالْحِجَارَةُ ۖ أُعِدَّتْ لِلْكَافِرِينَ ﴿٢٤﴾

---

కూడా షిర్క్ (బహుదైవోపాసనా) చేష్టలకు ఒడిగట్టకండి. ఇందులోనే మీ శ్రేయం ఇమిడి ఉంది.

24. తౌహీద్ (దేవుని ఏకత్వం) తరువాత రిసాలత్ (దైవదౌత్యం) గురించి చెప్పబడింది. మేము మా దాసుని (అంటే మహాప్రవక్త ముహమ్మద్)పై అవతరింపజేసే గ్రంథం మా తరఫునే అవతరింపజేయబడిందన్న విషయంలో ఏమాత్రం సందేహమున్నా మీరు మీ సమూహాన్నంతటినీ సహాయం కోసం పిలుచుకుని దీన్ని పోలిన ఒక్క సూరానైనా తయారుచేయండి అని అల్లాహ్ సవాలు విసిరాడు. ఒకవేళ మీరు ఇలా చేయలేకపోతే, నిజంగా ఈ వాక్కు మానవమాత్రుని వాక్కు కాదని గ్రహించాలి, ఇది దైవవాక్కేనని తెలుసుకున్న మీదట మీరు అల్లాహ్‌ను, ముహమ్మద్ దౌత్యాన్నీ బేషరతుగా విశ్వసించి నరకాగ్ని నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలి. ఆ నరకాగ్ని సత్య తిరస్కారుల కోసం సిద్ధం చేయబడిందని అల్లాహ్ ఈ ఆయతులో విశదపరచాడు.

25. దివ్య ఖుర్ఆన్ సత్యబద్ధతకు ఇది స్పష్టమయిన నిదర్శనం. అరబ్బు, అరబ్బేతర అవిశ్వాసులందరికీ సవాలు చేయబడింది. కాని వారు నేటికీ ఆ సవాలును స్వీకరించలేకపోయారు. ప్రళయదినం వరకూ స్వీకరించలేరు కూడా.

26. ఇబ్నె అబ్బాస్ (రజి) దృష్టిలో 'రాళ్ళు' అంటే భావం గంధకపు రాళ్ళు కావచ్చు. మరి కొంతమంది దృష్టిలో రాళ్ళు అంటే రాతితో చేయబడిన విగ్రహాలు! ప్రజలు ప్రపంచంలో ఏ రాతి విగ్రహాలనైతే పూజించారో అవే రేపు నరకాగ్నికి ఇంధనం కాబోతున్నాయి.

وَبَشِّرِ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ أَنَّ لَهُمْ جَنَّاتٍ تَجْرِي مِنْ تَحْتِهَا الْأَنْهَارُ ۖ كُلَّمَا رُزِقُوا مِنْهَا مِنْ ثَمَرَةٍ رِزْقًا ۙ قَالُوا هَٰذَا

**25** విశ్వసించి, సత్కార్యాలు చేసే వారికి[28] క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ)వనాల శుభవార్తలను అందజెయ్యి. తినడానికి అక్కడి పండ్లు వారికి ఇవ్వబడి నప్పుడల్లా, "ఇలాంటి పండ్లే ఇంతకు మునుపు మాకు ఇవ్వబడినవి"[29] అని

దివ్య ఖుర్ఆన్‌లో సెలవీయబడినట్లు, "నిస్సందేహంగా మీరూ, అల్లాహ్‌ను కాదని మీరు పూజించే చిల్లరదైవాలు నరకానికి ఇంధనం అవుతారు" (అంబియా – 98). మరిన్ని వివరాల కోసం అంబియా సూరాలోని 98 – 101 ఆయతులను, జుఖ్రుఫ్ సూరాలోని 58వ ఆయతుకు వివరణను చూడండి.

27. ఈ ఆయతు ద్వారా అవగతమయ్యే ఒక ముఖ్య విషయమేమిటంటే నరకం అసలు సత్యతిరస్కారుల కోసం, బహుదైవోపాసకుల కోసం నిర్మించబడింది. రెండో విషయం ఏమిటంటే స్వర్గనరకాలు ప్రస్తుతం ఉనికిలోనే ఉన్నాయి. ఇది ఉమ్మత్‌కు చెందిన సలఫ్‌ల దృఢ విశ్వాసం. కొంతమంది కుహనా అభ్యుదయ పండితులు, హదీసు తిరస్కారులు వ్యాఖ్యానించినట్లుగా స్వర్గనరకాలు ఉపమానం నిమిత్తం చెప్పబడినవి కావు.

28. దివ్య ఖుర్ఆన్ విశ్వాసం (ఈమాన్)తో పాటు సదాచరణ (అమలె సాలెహ్)ను అన్నిచోట్ల కలిపి ప్రస్తావించటంలోని మర్మం ఏమిటంటే ఈ రెంటికీ మధ్య విడదీయరాని సంబంధం ఉంది. సదాచరణ లేకుండా విశ్వాసం ఫలవంతం, ప్రయోజనకరం కాజాలదు. అలాగే విశ్వాసం లేని సదాచరణలకు దైవసన్నిధిలో ఎలాంటి విలువా లేదు. మరి సదాచరణలంటే దైవప్రవక్త (స) సంప్రదాయానికనుగుణంగా నెరవేర్చినవి, కేవలం దేవుని ప్రసన్నతను చూరగొనే సదుద్దేశంతో చేసినవే. దైవప్రవక్త సంప్రదాయానికి విరుద్ధంగా మంచిపని చేసినా అది స్వీకారయోగ్యం అవదు. గొప్పల కోసం, పరువు ప్రతిష్ఠల కోసం చేసిన సత్కార్యాలు కూడా వారి మొహాన తిప్పికొట్ట బడతాయి.

29. **ముతషాబిహన్ :** అంటే భావం స్వర్గంలోని పండ్లు ఫలాలన్నీ పరస్పరం ఒకే పోలిక కలిగి ఉంటాయి. లేదా అవి ప్రపంచంలోని పండ్లను పోలి ఉంటాయి. అయితే ఈ పోలిక కేవలం ఆకారానికి, పేర్లకు మాత్రమే పరిమితం అయి ఉంటుంది. వాస్తవానికి రుచి, సువాసనలో ప్రాపంచిక పండ్లకు – స్వర్గంలోని పండ్లకు ఏమాత్రం పొంతన ఉండదు. స్వర్గంలోని అనుగ్రహాలకు సంబంధించి హదీసులో ఇలా అనబడింది : "వాటిని ఏ కన్నూ కానలేదు. ఏ చెవి కూడా వాటి గురించి వినలేదు (చూడటం, వినటం అటుంచి) ఏ మానవ హృదయంలోనూ ఆ ఊహ కూడా రాలేదు" (సహీహ్ బుఖారీ – సూరె సజ్దా వ్యాఖ్యానం).

الَّذِي رُزِقْنَا مِنْ قَبْلُ وَأُتُوا بِهِ مُتَشَابِهًا ۖ وَلَهُمْ فِيهَا أَزْوَاجٌ مُطَهَّرَةٌ ۖ وَهُمْ فِيهَا خَالِدُونَ ﴿٢٥﴾

వారంటారు. నిజానికి పరస్పరం పోలి వుండే ఫలాలు వారికి ప్రసాదించ బడతాయి. వారి కొరకు పరిశుద్ధులైన[30] భార్యలుంటారు. వారు ఈ స్వర్గవనాలలో కలకాలం ఉంటారు.[31]

إِنَّ اللَّهَ لَا يَسْتَحْيِي أَنْ يَضْرِبَ مَثَلًا مَا بَعُوضَةً فَمَا فَوْقَهَا ۚ فَأَمَّا الَّذِينَ آمَنُوا فَيَعْلَمُونَ أَنَّهُ الْحَقُّ مِنْ رَبِّهِمْ ۖ وَأَمَّا الَّذِينَ

**26** నిశ్చయంగా అల్లాహ్ దేనినీ ఉపమానంగా చెప్పటానికి సిగ్గుపడడు– (కడకు) దోమ అయినాసరే, దాని కన్నా అల్పమైన వస్తువు అయినాసరే![32] విశ్వసించినవారు మాత్రం దీన్ని తమ ప్రభువు తరఫు నుంచి వచ్చిన సత్యమని భావిస్తారు.

30. అంటే రుతుస్రావం, పురిటిరక్త స్రావం వంటి అశుద్ధావస్థ వారికి ఉండదు.

31. **'ఖులూద్'** అంటే శాశ్వతం, ఎల్లకాలం అని అర్థం. స్వర్గవాసులు కలకాలం – శాశ్వతంగా – స్వర్గంలో ఉంటారు. హాయిగా సంతోషంగా ఉంటారు. కాగా, నరకవాసులు నరకంలో కలకాలం ఉంటారు. యాతనలో మ్రగ్గుతూ ఉంటారు. హదీసులో ఉంది – ప్రజలు స్వర్గం లేక నరకంలో ప్రవేశించిన మీదట దైవదూత ప్రకటన గావిస్తాడు : "ఓ నరకవాసులారా! ఇక మృత్యువు అన్నదే లేదు. ఓ స్వర్గవాసులారా! ఇంక మరణం అనేది లేదు. ఇప్పుడు ఎవరే స్థితిలో ఉన్నారో ఆ స్థితిలోనే కలకాలం ఉంటారు" (సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం).

32. దివ్య ఖుర్ఆన్ ఒక అద్భుత గ్రంథమని అల్లాహ్ తిరుగులేని నిదర్శనాలతో నిరూపించిన తరువాత కుఫ్ఫారులు (దైవ తిరస్కారులు) ఆత్మరక్షణలో పడిపోయి, వేరొక తరహాలో అభ్యంతరం లేవనెత్తారు – ఒకవేళ ఇది నిజంగా దైవవాక్కే అయినట్లయితే, అంత గొప్పవాడు అవతరింపజేసిన వాణిలో ఇంతటి అల్పమయిన వస్తువులు దృష్టాంతాలుగా ఎందుకు ఇవ్వబడతాయి? అన్నది వారి ఆక్షేపణ. దీనికి అల్లాహ్, ఒకానొక గొప్ప పరమార్థాన్ని దృష్టిలో పెట్టుకుని విషయాన్ని ఇలాంటి ఉదాహరణల ద్వారా వివరించటం ఏ మాత్రం అనుచితం కాదని బదులిచ్చాడు. అందుకే ఇలాంటి విషయాలు చెప్పడానికి సిగ్గు, బిడియం, లజ్జ వంటి వాటికి తావివ్వనవసరం లేదు. మూలంలో **'ఫౌఖహా'** అనే పదం ఉపయోగించబడింది. **ఫౌఖహా** అంటే దోమకు పైన ఉండేది. అంటే దాని రెక్కలు అని భావం. ఈ భావం తీసుకుంటే, 'దోమకన్నా అత్యల్ప వస్తువు అయినా సరే" అని అర్థం వస్తుంది. అలాగే "ఫౌఖహా"కు దానికంటే

كَفَرُوا فَيَقُولُونَ مَاذَا أَرَادَ اللَّهُ بِهَٰذَا مَثَلًا ۘ يُضِلُّ بِهِ كَثِيرًا وَيَهْدِي بِهِ كَثِيرًا ۚ وَمَا يُضِلُّ بِهِ إِلَّا الْفَاسِقِينَ ﴿٢٦﴾

కాని అవిశ్వాసులు, "ఈ ఉపమానం ద్వారా ఇంతకీ అల్లాహ్ ఏం చెప్పదలచుకుంటున్నాడు?" అని అంటారు. ఈ విధంగా ఆయన దీని ద్వారానే ఎంతో మందిని అపమార్గం పట్టిస్తాడు, మరెంతో మందిని సన్మార్గంపైకి తీసుకువస్తాడు.[33] అయితే దీని ద్వారా ఆయన అపమార్గానికి లోను చేసేది అవిధేయులను మాత్రమే.

الَّذِينَ يَنقُضُونَ عَهْدَ اللَّهِ مِن بَعْدِ مِيثَاقِهِ وَيَقْطَعُونَ

**27** వీరు ఎలాంటివారంటే అల్లాహ్‌తో చేసిన దృఢమైన ప్రమాణాన్ని[34] భంగ పరుస్తారు. అల్లాహ్ కలిపి ఉంచమని

అధికమైన అనే అర్థం కూడా వస్తుంది. అటువంటప్పుడు "దోమ అయినా దానికంటే పెద్ద వస్తువు మరేదయినా" అని అర్థం చేసుకోవాలి. ఫౌఖహా అనే పదం ద్వారా, ఈ రెండు అర్థాలూ రావటానికి ఆస్కారముంది.

33. అల్లాహ్ ఇచ్చే ఉదాహరణలతో విశ్వాసులలోని స్వీకృతగుణం (ఈమాన్) మరింత పెరిగితే, అవిశ్వాసుల్లోని తిరస్కార వైఖరి మరింత తీవ్రతరమవుతుంది. ఇదంతా అల్లాహ్ సంవిధానానికి, ఆయన అభీష్టానికి అనుగుణంగానే జరుగుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని "ఎవరయినా ఏదైనా ఒక వైపుకు తిరిగితే దాని వైపునకే మేమతన్ని మరలిస్తాము" అన్న దైవసూక్తి (అన్ నిసా - 115) ఈ సందర్భంగా గమనార్హం. హదీసులో ఉంది: "ప్రతి వ్యక్తీ దేనికోసం పుట్టించబడ్డాడో అది అతనికి సులభతరం చేయబడింది." (సహీహ్ బుఖారీ)

దైవ విధేయతా పరిధినుండి బయటికి వెళ్ళిపోయిన పనిని 'ఫిస్ఖ్' అంటారు. ఒక్కోసారి విశ్వాసి సయితం అటువంటి హద్దులను మీరిపోయి పాపానికి ఒడిగడతాడు. అయితే ఈ ఆయతులో ప్రస్తావించబడిన పాపం సాధారణ పాపం కాదు, మహాపాతకం. అవిశ్వాసి మాత్రమే అటువంటి పాతకానికి (ఫిస్ఖ్‌కు) పాల్పడతాడు. వచ్చే ఆయతులో అవిశ్వాసుల లక్షణాలు సూచించబడ్డాయి.

34. ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు "అహ్ద్" అనే పదానికి అనేక భావార్థాలను వివరించారు. 1. తాను ఆదేశించిన వాటిని చేయాలని, నిషేధించిన వాటి జోలికి పోరాదని దైవప్రవక్తల (అలైహిముస్సలాం) ద్వారా అల్లాహ్ తన సృష్టితాలకు చేసిన తాకీదు. 2. అంతిమ దైవప్రవక్త (స) ప్రభవించిన తరువాత మీరు ఆయన్ని ప్రవక్తగా ధృవీకరించాలనీ,

مَآ أَمَرَ ٱللَّهُ بِهِۦٓ أَن يُوصَلَ وَيُفْسِدُونَ فِى ٱلْأَرْضِ ۚ أُو۟لَٰٓئِكَ هُمُ ٱلْخَٰسِرُونَ ﴿٢٧﴾

చెప్పిన వాటిని త్రెంచివేస్తారు. భువిలో చెడుగును వ్యాపింపజేస్తారు. వీరే అసలు నష్టాన్ని పొందేవారు.[35]

كَيْفَ تَكْفُرُونَ بِٱللَّهِ وَكُنتُمْ أَمْوَٰتًا فَأَحْيَٰكُمْ ۖ ثُمَّ يُمِيتُكُمْ ثُمَّ يُحْيِيكُمْ ثُمَّ إِلَيْهِ تُرْجَعُونَ ﴿٢٨﴾

**28** మీరు అల్లాహ్ యెడల తిరస్కార వైఖరికి ఎలా ఒడిగట్టగలరు? చూడబోతే నిర్జీవులుగా ఉన్న మీకు ఆయనే ప్రాణం పోశాడు. మరి మీ ప్రాణం తీసేవాడూ, తిరిగి మిమ్మల్ని బ్రతికించేవాడు కూడా ఆయనే.[36] ఆ తరువాత మీరు ఆయన వైపుకే మరలించబడతారు.

ఆయన్ని విశ్వసించాలని గ్రంథవహుల (యూదుల) చేత తౌరాత్‌లో తీసుకున్న ప్రమాణం 3. ఆదం వెన్నెముక నుంచి వెలికి తీసిన తరువాత సమస్త ఆదం సంతతి నుండి అల్లాహ్ తీసుకున్న ప్రమాణం (అహ్‌దె అలస్త్). దివ్య ఖుర్ఆన్‌లో కూడా ఈ విషయం ప్రస్తావించబడింది : స్వయంగా వారిని వారికే సాక్షులుగా పెట్టి "నేను మీ ప్రభువును కానా?" అని అల్లాహ్ అడిగాడు. దానికి వారు, "ఎందుకు కావు? నిస్సందేహంగా నీవే మా ప్రభువు. దీనికి మేము సాక్షులుగా ఉన్నాము" అని అన్నారు (అల్ ఆరాఫ్ – 172). వాగ్దాన భంగం అంటే అర్థం, చేసిన బాసను నిర్లక్ష్యం చేయటం (ఇబ్నె కసీర్).

35. ఏనాటికైనా నష్టపోయేది దైవాజ్ఞల్ని ఉల్లంఘించి, భువిలో విచ్చలవిడిగా వ్యవహరించేవారే. దైవానికిగానీ, దైవప్రవక్తలకుగానీ, దైవమార్గం వైపుకు పిలిచే వారికి (దాయిలకు) గానీ వాటిల్లే నష్టం ఏమీ ఉండదు.

36. ఈ ఆయతులో రెండు మరణాల, రెండు జీవితాల ప్రస్తావన ఉంది. మొదటి మరణం అంటే ఉనికి లేనిదని అర్థం. మొదటి జీవితం అంటే తల్లి కడుపునుంచి వచ్చి మరణం సంభవించేదాకా బ్రతికి ఉండటం అన్నమాట. తరువాత మృత్యువు వస్తుంది. తరువాత పరలోక జీవితం మొదలవుతుంది. ఈ జీవితాన్నే అవిశ్వాసులు, ప్రళయదిన తిరస్కారులు త్రోసిపుచ్చుతున్నారు. సమాధి జీవితం కూడా (దానికి తగినవిధంగా) ప్రాపంచిక జీవితంగానే పరిగణించబడుతుందన్న కొంతమంది అభిప్రాయాన్ని అల్లామా షౌకానీ ఇక్కడ ప్రస్తావించారు (ఫత్‌హుల్ ఖదీర్). యదార్థానికి సమాధి జీవితం (బర్జఖ్ అవస్థ) కూడా పరలోక జీవితపు తొలి మజిలీయే. అందుచేత ఈ అవస్థను పరలోక జీవితంలో భాగంగా పరిగణించటమే సబబు.

هُوَ الَّذِي خَلَقَ لَكُم مَّا فِي الْأَرْضِ جَمِيعًا ثُمَّ اسْتَوَىٰ إِلَى السَّمَاءِ فَسَوَّاهُنَّ سَبْعَ سَمَاوَاتٍ ۚ وَهُوَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿٢٩﴾

**29** ఆయనే మీ కోసం భూమిలో ఉన్న సమస్త వస్తువులనూ సృష్టించాడు.[37] తరువాత ఆకాశం వైపుకు ధ్యానాన్ని మరల్చి,[38] తగు రీతిలో సప్తాకాశాలను నిర్మించాడు.[39] ఆయన అన్నీ తెలిసిన వాడు.

37. భువిలోని వస్తువులన్నీ ప్రాణుల కొరకు ధర్మ సమ్మతమైనవేనని దీని ఆధారంగా పేర్కొనడమైనది. ఏదైనా వస్తువు నిషిద్ధం అని మూలం (ఖుర్ఆన్, హదీసుల) ద్వారా నిరూపితమైతే తప్ప దాన్ని హరామ్‌గా భావించరాదు – అది హలాల్‌గానే భావించబడుతుంది (ఫత్‌హుల్ ఖదీర్).

38. సలఫ్‌లోని కొందరు "ఆకాశం వైపుకు అధిరోహించాడు" అని తర్జుమా చేశారు (సహీహ్ బుఖారీ). అల్లాహ్ ఆకాశాల పైకి ఎక్కడం, అర్ష్ అనే సింహాసనాన్ని అధిష్ఠించటం, భూమండలానికి చేరువలోనున్న ఆకాశం పైకి దిగి రావటం – ఇవన్నీ అల్లాహ్ గుణగణాలుగానే చెప్పబడ్డాయి. వక్రభాష్యాలు చెప్పకుండా, ఖుర్ఆన్ హదీసుల్లో పేర్కొనబడిన విధంగా ఈ విషయాలన్నింటినీ విశ్వసించటం అనివార్యం. ఖుర్ఆన్ హదీసులు కూడా ఈ మేరకు నొక్కి వక్కాణిస్తున్నాయి.

39. దీనిద్వారా బోధపడుతున్న మొదటి విషయం – ఆకాశం అనేది ఒక అర్థం చేసుకోగలిగే వస్తువు. దాని ఉనికి ఉంది. అది వాస్తవికమైనది. కేవలం ఎత్తునే ఆకాశంగా ఈ వాక్యంలో పరిగణించటం జరగలేదు. (అరబీలో సమా లేక సుముహ్వున్ అంటే ఎత్తు, పైన ఉండేది అనే అర్థాలు వస్తాయి. దీన్ని చూసుకొని కొందరు ఇక్కడ సమా అంటే ఆకాశం కాదు, కేవలం ఎత్తు, అల్లాహ్ ఎత్తుకు అధిరోహించాడు అని భాష్యం చెప్పారు. కాని ఆ తర్వాతి "సవ్వాహున్న" – ఆయన వాటిని తగురీతిలో నిర్మించాడు– అన్న వాక్యం వారి ఈ అభిప్రాయాన్ని ఖండిస్తున్నది). రెండో ముఖ్య విషయం ఏమిటంటే, ఈ ఆకాశాల సంఖ్య ఏడు. హదీసు ప్రకారం రెండు ఆకాశాల మధ్యగల అంతరం 500 ఏండ్ల ప్రయాణానికి సమానం. ఇక భూమి గురించి ఖుర్ఆన్‌లోనే ఇలా వుంది : "భూమి కూడా ఆకాశాల వంటిదే" (తలాఖ్ – 12). దీన్నిబట్టి భూముల సంఖ్య కూడా ఏడేనని విదితమవుతోంది. మహాప్రవక్త (స) వారి ఈ ప్రవచనం ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది: "ఎవరయితే అన్యాయంగా ఒకరికి చెందిన జానెడు భూమిని కబళిస్తాడో అతనికి అల్లాహ్ ప్రళయదినాన సప్తభూముల గుదిబండను తొడిగిస్తాడు" (సహీహ్ బుఖారీ). ఆకాశం కంటే ముందు భూమండలం సృష్టించబడిందన్న సంగతి కూడా ఈ ఆయతు ద్వారా తెలుస్తోంది. అయితే 'అన్నాజియాత్' సూరాలో ఆకాశం గురించి చెప్పబడిన తరువాత ఇలా అనబడింది:

**30** “నేను భువిలో ప్రతినిధిని[40] చేయబోతున్నాను” అని నీ ప్రభువు తన దూతలతో[41] అన్నప్పుడు, “భూమిలో కల్లోలాన్ని సృష్టించి, రక్తం ప్రవహింప జేసేవాణ్ణి ఎందుకు సృష్టిస్తావు (ప్రభూ)? నిన్ను స్తుతించటానికి, ప్రశంసించటానికి, నీ పవిత్రతను కొనియాడటానికి మేమున్నాము కదా!” అని వారన్నారు. దానికి అల్లాహ్, “నాకు తెలిసినవన్నీ మీకు తెలియవు”[42] అని అన్నాడు.

وَإِذْ قَالَ رَبُّكَ لِلْمَلَٰٓئِكَةِ إِنِّى جَاعِلٌ فِى ٱلْأَرْضِ خَلِيفَةً ۖ قَالُوٓا۟ أَتَجْعَلُ فِيهَا مَن يُفْسِدُ فِيهَا وَيَسْفِكُ ٱلدِّمَآءَ وَنَحْنُ نُسَبِّحُ بِحَمْدِكَ وَنُقَدِّسُ لَكَ ۖ قَالَ إِنِّىٓ أَعْلَمُ مَا لَا تَعْلَمُونَ ﴿٣٠﴾

“దాని తరువాత ఆయన భూమిని పరచాడు.” భూమిని మొదటే సృష్టించినప్పటికీ, దాన్ని చదునుచేసే, సానుకూలంగా తీర్చిదిద్దే ప్రక్రియ, ఆకాశాల నిర్మాణం తరువాత జరిగిందన్నది దీని భావం కావచ్చు (ఫత్‌హుల్ ఖదీర్). మరిన్ని వివరాల కోసం ‘హామీమ్ అస్సజ్దా’ సూరాలోని తాత్పర్యం చూడండి.

40. అరబీలో **‘ఖలీఫా’** అనే పదం వచ్చింది. ఖలీఫా అంటే ఒకదాని తర్వాత ఒకటి వచ్చేటటువంటి జాతి అని భావం. అంతేగాని మానవుడు ఈ ప్రపంచంలో దేవుని ఖలీఫా, ఆయన యొక్క ప్రతినిధి అని చెప్పటం సముచితం కాదు.

41. అరబీలో దైవదూతల కోసం **‘మలాయిక’** అనే పద ప్రయోగం జరిగింది. దైవదూతలు కాంతితో సృష్టించబడిన దేవుని సృష్టిరాశులు. ఆకాశం వారి నివాస స్థలం. దైవాజ్ఞలను పాటించటంలో, దైవస్తోత్రం చేయటంలో, దేవుని పవిత్రతను కొనియాడటంలో సదా నిమగ్నులై ఉంటారు. దేవుని ఏ ఆజ్ఞను కూడా వారు జవదాటరు.

42. మానవ సృష్టిపై దైవదూతలు ఆ విధంగా ప్రతిస్పందించడానికి కారణం అసూయ లేక ఓర్వలేనితనం ఎంతమాత్రం కాదు. మానవ సృష్టి పరమార్థాన్ని తెలుసుకునే ఉద్దేశంతో మాత్రమే వారలా అన్నారు – ఓ ప్రభూ! ఉపద్రవాన్ని రేపి, రక్తపాతం సృష్టించే దుష్టజనులు కూడా వారిలో ఉండబోతున్నప్పుడు, మరి ఈ సృష్టిని మొదలుపెట్టడంలోని ఔచిత్యం ఏమిటి? నిన్ను ఆరాధించటమే ఒకవేళ ఈ పుట్టుక పరమార్థమై ఉంటే అందుకు మేమున్నాము కదా! కొత్త సృష్టితాల ద్వారా తలెత్తే ప్రమాదాలు కూడా మా తరఫున ఉండవాయె. మరటువంటప్పుడు లేనిపోని ఈ చిక్కులెందుకు? అన్నది దైవదూతల అభిప్రాయం. దానికి అల్లాహ్ ఇలా అన్నాడు: అందలి పరమార్థం నాకు తెలుసు. మనుజ జాతిలో సంక్షోభాన్ని సృష్టించి, భూమండలాన్ని అస్తవ్యస్తం చేసే వారుంటారన్నది నిజమే అయినప్పటికీ నేను ఎందుకు

وَعَلَّمَ آدَمَ الْأَسْمَاءَ كُلَّهَا ثُمَّ عَرَضَهُمْ عَلَى الْمَلَائِكَةِ فَقَالَ
أَنْبِئُونِي بِأَسْمَاءِ هَٰؤُلَاءِ إِنْ كُنْتُمْ صَادِقِينَ ﴿٣١﴾

**31** (తరువాత) అల్లాహ్ ఆదంకు అన్ని (వస్తువుల) పేర్లనూ నేర్పి, వాటిని దూతల ముందుంచాడు. "ఒకవేళ మీరు చెప్పేదే నిజమయితే, కాస్త వీటి పేర్లు చెప్పండి?" అన్నాడు.

قَالُوا سُبْحَانَكَ لَا عِلْمَ لَنَا إِلَّا مَا عَلَّمْتَنَا إِنَّكَ أَنْتَ الْعَلِيمُ
الْحَكِيمُ ﴿٣٢﴾

**32** వారంతా ఇలా అన్నారు : "(ఓ అల్లాహ్!) నీవు అత్యంత పవిత్రుడవు. నీవు మాకు తెలియజేసినది తప్ప ఇంకేమీ మాకు తెలియదు. నిశ్చయంగా అన్నీ తెలిసినవాడవు, వివేక వంతుడవూ నీవే!"

قَالَ يَا آدَمُ أَنْبِئْهُمْ بِأَسْمَائِهِمْ فَلَمَّا أَنْبَأَهُمْ بِأَسْمَائِهِمْ قَالَ
أَلَمْ أَقُلْ لَكُمْ إِنِّي أَعْلَمُ غَيْبَ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَأَعْلَمُ
مَا تُبْدُونَ وَمَا كُنْتُمْ تَكْتُمُونَ ﴿٣٣﴾

**33** అప్పుడు అల్లాహ్ "ఓ ఆదం! వీటి పేర్లేమిటో నువ్వు తెలుపు" అన్నాడు. ఆయన వాటి పేర్లన్నీ చెప్పేయగానే అల్లాహ్ ఇలా ప్రకటించాడు: "భూమ్యాకాశాలలో గోప్యంగా వున్నవన్నీ నాకు తెలుసనీ, మీరు బహిర్గతం చేసేవీ, దాచి పెట్టేవీ[43] అన్నీ నాకు తెలుసని (ముందే) నేను మీకు చెప్పలేదా?"

---

ఈ సృష్టిని మొదలెడుతున్నానో మీకు తెలియదు. ఎందుకంటే వీరిలో ప్రవక్తలు, షహీదులు, సజ్జనులు, సాత్వికులు, మహనీయులు కూడా ఉంటారు (ఇబ్నె కసీర్).

ఆదం సంతతిలో కల్లోలాన్ని రేకెత్తించే వారుంటారన్న సంగతి దైవదూతలకు ఎలా తెలుసు? అన్నది ఇక్కడ ఉత్పన్నమయ్యే ప్రశ్న. బహుశా మానవ సృష్టికి పూర్వం వున్న సృష్టితాల నైజాన్ని గమనించి వారు ఆ విధంగా ఊహించి ఉంటారేమో! వారీవిధంగా ప్రవర్తిస్తారని అల్లాహ్‌యే ఈ సంగతిని దూతలకు ముందుగా చెప్పి ఉంటాడని మరికొంతమంది అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

43. పేర్లు (అస్మా) : పేర్లు అంటే వస్తువుల, వ్యక్తుల పేర్లని భావం. వాటి స్వభావం, వాటి లాభనష్టాల జ్ఞానం కూడా తెలిసి ఉండటం. అల్లాహ్ తన జ్ఞానం ద్వారా, దివ్యావిష్కృతి ద్వారా ఆదంకు ఇదంతా నేర్పాడు. వాటి పేర్లేమిటో కాస్త చెప్పు అని అనగానే ఆదం (అలైహిస్సలామ్) అన్నీ టకటకా చెప్పేశారు. మరి ఆ పేర్లు దూతలకు తెలియవు. ఈ విధంగా అల్లాహ్ ఆదంను సృష్టించటంలోని యుక్తినీ, పరమార్థాన్నీ దూతలకు స్పష్టపరచటంతోపాటు, ప్రపంచ వ్యవస్థను నడపటానికి మనుజ జాతి విద్యా

**34** “మీరందరూ ఆదం ముందు సాష్టాంగపడండి”[44] అని మేము దూతలను ఆజ్ఞాపించినపుడు ఇబ్లీసు తప్ప అందరూ సాష్టాంగపడ్డారు. వాడు మాత్రం[45] తిరస్కరించాడు. అహంకారి అయి, అవిధేయులలో చేరిపోయాడు.

وَإِذْ قُلْنَا لِلْمَلَٰٓئِكَةِ ٱسْجُدُوا۟ لِءَادَمَ فَسَجَدُوٓا۟ إِلَّآ إِبْلِيسَ أَبَىٰ وَٱسْتَكْبَرَ وَكَانَ مِنَ ٱلْكَٰفِرِينَ ﴿٣٤﴾

విషయకంగా ముందంజ వేయటం ఎంతో అవసరమన్న సత్యాన్ని కూడా చెప్పకనే చెప్పేశాడు. ఈ పరమార్థాన్ని తెలుసుకున్నంతనే దైవదూతలు తమ పరిమిత జ్ఞాన పరిధిని ఒప్పుకున్నారు. దైవదూతల ఈ ఒప్పుకోలు ద్వారా ‘అగోచరాల జ్ఞాని కేవలం అల్లాహ్‌యే’ అన్న యదార్థం కూడా ముందుకు వచ్చేసింది. అల్లాహ్, తాను కటాక్షించి, తన కార్యం కోసం ఎన్నుకున్న ప్రత్యేక దాసులకు కూడా అల్లాహ్ ప్రసాదించినంత జ్ఞానమే ఉంటుందన్న సత్యం కూడా దీనిద్వారా సుబోధకం అవుతోంది.

44. విజ్ఞానపరంగా శ్రేష్ఠత నొసగబడిన ఆదంకు లభించిన ఇంకొక గౌరవ పురస్కారం ఇది. ఇక్కడ ‘సజ్దా’ అనే పదం ఉపయోగించబడింది. సజ్దా అంటే తలవంచటం, వినమ్రులవటం అనే అర్థాలు వస్తాయి. ‘నేలకు నుదురును ఆనించటం’ దీనికి పరాకాష్ఠ (ఖుర్తుబి). ఇలాంటి సజ్దా ఇస్లామీయ షరీయతులో ఒక్క అల్లాహ్‌కు తప్ప మరొకరికి చేయటం ధర్మసమ్మతం కాదు. మహాప్రవక్త (సఅసం) వారి విఖ్యాత ప్రవచనం ఒకటి ఇలా వుంది : సాష్టాంగపడటం అనేది మరొకరెవరికయినా ధర్మం అయివుంటే తన భర్తకు సాష్టాంగపడమని నేను స్త్రీకి ఆజ్ఞాపించివుండేవాణ్ణి” (సుననె తిర్మిజీ). మొత్తానికి దైవాదేశాన్ని పురస్కరించుకుని దైవదూతలు హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)కు సజ్దా చేశారు. ఆ విధంగా దైవదూతలపై ఆదం (అలైహి)గారి ఆధిక్యత, పెద్దరికం చాటి చెప్పబడింది. ఎందుకంటే ఈ సజ్దా గౌరవాన్ని, ఔన్నత్యాన్ని వ్యక్తపరచేదే గానీ ఆరాధన మరియు దాస్యంతో కూడుకున్నది కాదు. అల్లాహ్ ఆదంను సృష్టిశ్రేష్ఠునిగా నిరూపించదలచాడు. నిరూపించాడు. కాని ఇప్పుడు మానవుల్లో ఎవరినయినా గొప్పవాడని నిరూపించే ఉద్దేశంతో కూడా సజ్దా చేయకూడదు.

45. ఆదం (అలైహిస్సలాం) ముందు తలవంచడానికి నిరాకరించి ఇబ్లీస్ దేవుని చేత ధూత్కరించబడ్డాడు. దివ్య ఖుర్‌ఆన్ వివరించినట్లుగా ఇబ్లీస్ జిన్నుల కోవకు చెందిన వాడు (కహఫ్ : 50). కాని అల్లాహ్ అతన్ని ఆదరించి దూతల సరసన నిలబెట్టేవాడు. అందుకే అల్లాహ్ ఆదేశానుసారం దూతలతో ఇబ్లీస్ కూడా ఆదం ముందు మోకరిల్లవలసిన పరిస్థితి ఏర్పడింది. అయితే అతనికి అహం అడ్డువచ్చింది. అతనిలోని అసూయాద్వేషాలు బుసలు కొట్టగా సాష్టాంగపడటానికి నిరాకరించాడు. కాబట్టి అసూయ, అహంకారం కూడా పాపమే. దీనికి ప్రప్రథమంగా ఒడిగట్టినవాడు ఇబ్లీస్.

**35** (తరువాత) మేము, “ఓ ఆదం! నువ్వూ, నీ భార్య – ఇద్దరూ – స్వర్గంలో ఉండండి,[46] మీరు ఇష్టపడిన చోటు నుంచి స్వేచ్ఛగా తినండి, త్రాగండి. కాని ఈ వృక్షం దరిదాపులకు కూడా పోవద్దు.[47] లేదంటే దుర్మార్గులలో చేరిపోతారు” అని చెప్పాము.

وَقُلْنَا يَا آدَمُ اسْكُنْ أَنتَ وَزَوْجُكَ الْجَنَّةَ وَكُلَا مِنْهَا رَغَدًا حَيْثُ شِئْتُمَا وَلَا تَقْرَبَا هَٰذِهِ الشَّجَرَةَ فَتَكُونَا مِنَ الظَّالِمِينَ ﴿٣٥﴾

**36** కాని షైతాన్ వారిని పెడత్రోవ పట్టించి, అక్కడి నుంచి బయటికి తీసి వేయించాడు.[48] మేము వారిని ఇలా ఆదేశించాము: “దిగిపోండి. మీరు ఒండొకరికి శత్రువులు.[49] ఒక నిర్ణీత కాలం వరకు భూమిపైనే ఉండి మీరు లబ్ది పొందవలసి ఉంది.”

فَأَزَلَّهُمَا الشَّيْطَانُ عَنْهَا فَأَخْرَجَهُمَا مِمَّا كَانَا فِيهِ ۖ وَقُلْنَا اهْبِطُوا بَعْضُكُمْ لِبَعْضٍ عَدُوٌّ ۖ وَلَكُمْ فِي الْأَرْضِ مُسْتَقَرٌّ وَمَتَاعٌ إِلَىٰ حِينٍ ﴿٣٦﴾

46. స్వర్గంలో నివసించమని చెప్పటం హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)కు లభించిన మూడవ గౌరవ పురస్కారం.

47. ఆ నిషిద్ధ వృక్షం ఏది? దీనికి సంబంధించిన వివరాలు ఖుర్ఆన్ హదీసులలో ఎక్కడా లేవు. అది గోధుమ మొక్క అని ప్రాచుర్యంలోనికి వచ్చింది. కాని అది నిరాధారమైనది. ఆ చెట్టు పేరు తెలుసుకోవలసిన అవసరం మనకు లేదు. దానివల్ల మనకు చేకూరే ప్రయోజనం కూడా ఏదీ లేదు.

48. షైతాన్ స్వర్గంలోకి జొరబడి, ఆదం దంపతులకు ఎదురుపడి వారిని అవమార్గం పట్టించాడు. లేదా దుష్ప్రేరణ ద్వారా దైవాజ్ఞను ఉల్లంఘించేలా చేశాడు. దీని గురించి స్పష్టమయిన వివరణ ఏదీ లేదు. అయితే సజ్దా చేయమని దేవుడు ఆజ్ఞాపించినపుడు దైవాజ్ఞకు ప్రతిగా తాను ఆదం కంటే గొప్పవాణ్ణని ఎలా ఆత్మవంచన చేసుకుని సజ్దా చేయడానికి నిరాకరించాడో, అలాగే “చెట్టు దరిదాపులకు పోవద్దు” అన్న దేవుని తాకీదుకు వక్రభాష్యం చెప్పి, హజ్రత్ ఆదం (అలైహిస్సలాం)ను బోల్తా కొట్టించటంలో వాడు కృతకృత్యుడు కాగలిగాడన్నది మాత్రం నిజం. దీని వివరాలు అల్ ఆరాఫ్ సూరాలో కూడా వస్తాయి. ఈ విధంగా దైవాదేశానికి ప్రతిగా అంచనాలపై ఆధారపడి, మనోభిరామం ప్రకారం మసలుకుని అసలుకే మోసం కొనితెచ్చుకున్న ‘ఘనత’ కూడా ప్రప్రథమంగా ఈ షైతాన్‌కే దక్కింది – అల్లాహ్ వీడి బారినుంచి కాపాడుగాక!

49. ఒండొకరికి శత్రువులు అంటే ఒకరు ఆదం – మరొకరు షైతాన్ అని భావం. లేదా ఆదం సంతతిలోని వారు ఒకరింకొకరికి విరోధులు అన్నది మరో భావం కావచ్చు.

**37** అప్పుడు ఆదం (అలైహిస్సలాం) తన ప్రభువు నుంచి కొన్ని మాటలు నేర్చుకుని (పశ్చాత్తాపం[50] చెందారు.) అల్లాహ్ ఆయన పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. నిశ్చయంగా ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడు కూడాను.

فَتَلَقّٰٓی اٰدَمُ مِنْ رَّبِّهٖ كَلِمٰتٍ فَتَابَ عَلَیْهِ ؕ اِنَّهٗ هُوَ التَّوَّابُ الرَّحِیْمُ ۝۳۷

**38** మేము వారితో అన్నాము: "మీరంతా ఇక్కడి నుంచి దిగిపోండి. నా ఉపదేశం ఎప్పుడు మీ వద్దకు వచ్చినా, దాన్ని అనుసరించే వారికి ఎలాంటి భయం గానీ, దుఃఖంగానీ ఉండదు."

قُلْنَا اهْبِطُوْا مِنْهَا جَمِیْعًا ۚ فَاِمَّا یَاْتِیَنَّكُمْ مِّنِّیْ هُدًی فَمَنْ تَبِعَ هُدَایَ فَلَا خَوْفٌ عَلَیْهِمْ وَلَا هُمْ یَحْزَنُوْنَ ۝۳۸

**39** ఎవరయితే దానిని నిరాకరించి, మా ఆయతులను అసత్యాలని త్రోసిపుచ్చుతారో వారే నరకాగ్నిలోకి పోయేవారు.[51] వారందులో కలకాలం పడి ఉంటారు.

وَالَّذِیْنَ كَفَرُوْا وَكَذَّبُوْا بِاٰیٰتِنَاۤ اُولٰٓىِٕكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِیْهَا خٰلِدُوْنَ ۝۳۹

50. హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) భూమండలంపైకి రాగానే తనవల్ల జరిగిన తప్పిదంపై పశ్చాత్తాపంతో కుమిలిపోతూ, క్షమాభిక్షకై ప్రార్థించసాగారు. ఆ క్లిష్ట పరిస్థితిలో సయితం అల్లాహ్ ఆయన్ని ఆదుకుని, మార్గదర్శకత్వం వహించాడు. మన్నింపు వాక్యాలను నేర్పాడు. ఈ వాక్యాలు అల్ ఆరాఫ్ సూరాలో వివరించబడ్డాయి (రబ్బనా జలమ్నా అన్ఫుసనా వ ఇల్లమ్ తగ్ఫిర్లనా వ తర్హమ్నా....). కొంతమంది ప్రబుద్ధులు ఇక్కడ ఒక కల్పిత ఉల్లేఖనాన్ని ఊతంగా తీసుకుని ఇలా వ్యాఖ్యానించారు: దైవ సింహాసనంపై **లా యిలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్** అని లిఖించి ఉండటం హజ్రత్ ఆదం చూశారట! దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆధారంగా ఆయన వేడుకోగా, అల్లాహ్ క్షమాభిక్ష పెట్టాడట! ఈ ఉల్లేఖనం నిరాధారమైనది. ఖుర్ఆన్ ప్రబోధనకు కూడా ఇది విరుద్ధమైనది. అదీగాక అసలిది అల్లాహ్ చూపిన వేడుకోలు పద్ధతికి వ్యతిరేకమైనది. దైవప్రవక్తలు ఎప్పుడు ప్రార్థించినా నేరుగా అల్లాహ్నే వేడుకున్నారు. ఏ ప్రవక్త కూడా ఒకానొక సజ్జనుని ఆసరాతో దుఆ చేసినట్టు ఎక్కడా లేదు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సయితం ఎప్పుడు దుఆ చేసినా మధ్యలో ఎవరి ఆధారాన్ని, ఆసరాను తీసుకోకుండా నేరుగా అల్లాహ్ను వేడుకున్నారు – ఇదే సరైనది.

51. దుఆ (ప్రార్థన)ను స్వీకరించినప్పటికీ అల్లాహ్ వారిని తిరిగి స్వర్గంలో వసింప

**40** ఓ ఇస్రాయీలు[52] వంశస్థులారా! నేను మీకు అనుగ్రహించిన భాగ్యాన్ని గురించి కాస్త జ్ఞాపకం చేసుకోండి. మీరు నాతో చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోండి, నేను మీతో చేసిన వాగ్దానాన్ని నెరవేరుస్తాను. మీరు నాకు మాత్రమే భయపడండి.

يٰبَنِيٓ اِسۡرَآءِيۡلَ اذۡكُرُوۡا نِعۡمَتِيَ الَّتِيٓ اَنۡعَمۡتُ عَلَيۡكُمۡ وَاَوۡفُوۡا بِعَهۡدِيٓ اُوۡفِ بِعَهۡدِكُمۡ ۚ وَاِيَّايَ فَارۡهَبُوۡنِ ﴿٤٠﴾

జేసేబదులు – ప్రపంచంలోనే ఉంటూ స్వర్గలోకాన్ని పొందేందుకు సాధన చేయమని ప్రబోధించాడు. హజ్రత్ ఆదం (అలైహిస్సలాం) ద్వారా సమస్త మానవాళికి స్వర్గ మార్గం తెలియజేయబడుతోంది – ప్రవక్తల ద్వారా నా ఉపదేశం మీకు అందుతూ ఉంటుంది. దాన్ని స్వీకరించినవారు స్వర్గ ప్రవేశానికి అర్హులవుతారు. లేదా నా శిక్షకు పాత్రులవుతారు. "వారికి ఎలాంటి భయం ఉండదు" అనేది పరలోకానికి సంబంధించినది. "దుఃఖం ఉండదు" అనే మాట ప్రాపంచిక జీవితంతో ముడిపడినది. అంటే పరలోకం గురించి భయమూ ఉండదు, ప్రపంచంలో జరిగిపోయిన దాని గురించి దుఃఖమూ ఉండదు. వేరొకచోట చెప్పబడినట్లు – "నా మార్గదర్శకత్వాన్ని అనుసరించినవాడు (ప్రపంచంలో) పెడత్రోవ పట్టడు, (పరలోకంలో) దౌర్భాగ్య స్థితికీ లోనవ్వడు" (తాహా – 123) (ఇబ్నె కసీర్). "ఎలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండవు" అన్న శుభవార్త ప్రతి నిజమైన విశ్వాసికీ వర్తిస్తుంది. అది కేవలం కొందరు వలీలకు మాత్రమే పరిమితం అన్న భావన సరైనది కాదు. ఈ విషయాన్ని కొంతమంది చిలువలు పలువలు చేసి, వక్రభాష్యం చెప్పి జన సామాన్యాన్ని అయోమయంలో పడవేసే ప్రయత్నం చేశారు. వాస్తవానికి విశ్వాసులందరూ, భయభక్తులతో జీవించే వారందరూ అల్లాహ్‌కు ప్రీతిపాత్రులే. "ఔలియా అల్లాహ్" అనే వారు ప్రత్యేక సృష్టి ఏమీ కారు. కాకపోతే 'ఔలియా అల్లాహ్' అనబడేవారి అంతస్థులు వేరుగా ఉంటాయి.

52. అసలు ఇస్రాయీల్ అంటే అర్థం అబ్దుల్లాహ్ (అల్లాహ్ దాసుడు) అని. ఇది దైవప్రవక్త హజ్రత్ యాఖూబ్ (అలైహిస్సలాం) గారి బిరుదు. యూదులను ఇస్రాయీల్ వంశస్థులుగా పిలువటం జరిగింది. అంటే యాఖూబ్ (అలైహి) సంతతి అన్నమాట! యాఖూబ్ (అలైహిస్సలాం)కు 12 మంది కుమారులవటం చేత, 12 తెగలు ఉనికి లోనికి వచ్చాయి. వారిలో చాలామంది దైవప్రవక్తలుగా నియుక్తులయ్యారు. ఇస్రాయీల్ సంతతినుండే యూదుల వర్గం వచ్చింది. అరేబియాలో తమ గత వైభవం మూలం గానూ, జ్ఞానంతో, మత ధర్మంతో వారికి గల అనుబంధం కారణంగానూ ప్రపంచంలో వారికొక ప్రత్యేక స్థానం ప్రాప్తమయింది. అందుకే వారికి గతంలోని దైవానుగ్రహాలను జ్ఞాపకం చేయించి మరీ అల్లాహ్ కోర్తున్నాడు–అంతిమ దైవప్రవక్త (స) ప్రభవనం మరియు ఆయన్ని విశ్వసించే విషయమై మీరు నాకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి

وَاٰمِنُوْا بِمَآ اَنْزَلْتُ مُصَدِّقًا لِّمَا مَعَكُمْ وَلَا تَكُوْنُوْٓا اَوَّلَ كَافِرٍۢ بِهٖ ۖ وَلَا تَشْتَرُوْا بِاٰيٰتِيْ ثَمَنًا قَلِيْلًا ۡ وَّاِيَّايَ فَاتَّقُوْنِ ﴿٤١﴾

**41** మీ వద్దనున్న గ్రంథాలకు ధృవీకరణగా నేను అవతరింపజేసిన ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్‌ను) విశ్వసించండి. దీనిపట్ల[53] అందరికంటే ముందు మీరే తిరస్కారులు కాకండి. ఇంకా నా ఆయతులను కొద్దిపాటి ధరకు అమ్ము కోకండి.[54] నాకు మాత్రమే భయపడండి.

అని! మీరు గనక మీ మాటను నిలబెట్టుకుంటే నా వాగ్దానాన్ని నేను నెరవేరుస్తాను–అంటే మీ ఘోరకృత్యాల, పాపాల మూలంగా– శిక్షగా– మీపై పడివున్న బరువులను దించివేస్తాను, తిరిగి మిమ్మల్ని ఉత్థానస్థితికి చేరుస్తాను. మీరు నాకు భయపడుతూ మసలుకోండి. లేదంటే నేను మిమ్మల్ని నిరంతరం అవమానాల పాలు చేస్తాను. మీరు, మీ పూర్వీకులు తరతరాలుగా మగ్గుతున్న దుర్భరస్థితి మీనుండి దూరం కాదు.

53. ఈ వాక్యం దివ్య ఖుర్ఆన్‌ను లేదా మహనీయ ముహమ్మద్ (స)ను సూచిస్తోంది. రెండూ సరైనవే. రెండూ అనివార్యమైనవే. దివ్య ఖుర్ఆన్ పట్ల తిరస్కారవైఖరిని అవలంబించినవాడు దైవప్రవక్త (సఅసం) పట్ల కూడా ధిక్కార వైఖరినే అవలంబించిన వాడవుతాడు. దైవప్రవక్త (స) పట్ల గడసరిగా వ్యవహరించినవాడు, దైవగ్రంథమయిన ఖుర్ఆన్ పట్ల కూడా పెడసరిగా ప్రవర్తించినట్లే లెక్క (ఇబ్నె కసీర్). "అందరికంటే ముందు మీరే తిరస్కారులవకండి" అని అనటంలోని ఉద్దేశమేమిటంటే, మీ దగ్గరున్న జ్ఞానం ఎవరి దగ్గరా లేదు, అందుచేత మీ మీద బాధ్యత అందరికన్నా అధికంగా ఉంది. రెండో విషయం ఏమిటంటే, మదీనాలో యూదులకు అందరికంటే ముందు విశ్వసించమని పిలుపు ఇవ్వబడింది. అందుకే వారికి హెచ్చరికగా చెప్పబడింది – అందరికంటే ముందు మీరే తిరస్కారులుగా పేరుమోయకండి అని! ఒకవేళ మీరు గనక ఆ పని చేస్తే యావత్తు యూదుల ధిక్కార బాధ్యత మీపైనే పడుతుంది సుమా! అని ఈ ఆయతు భావం.

54. 'కొద్దిపాటి ధరకు అమ్ముకోకండి' అంటే భావం గిట్టుబాటు ధరకు అమ్ముకోమని కాదు. ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం దైవాదేశాలతో చెలగాటమాడరాదన్నదే దీని అసలు ఉద్దేశం. దైవాదేశాలు ఎంత అమూల్యమైనవంటే ప్రపంచంలోని ధనసంపత్తులన్నింటినీ ధారబోసినా వాటి ముందు అవి దేనికీ పనికిరావు. ఇస్రాయీల్ వంశస్థులను దృష్టిలో పెట్టుకుని ఈ తాకీదు చేయబడినప్పటికీ, ప్రళయదినం వరకూ అందరికీ ఇది వర్తిస్తుంది. స్వప్రయోజనాల కోసం సత్యాసత్యాలను కలగాపులగం చేసే వారికీ, స్వార్థం కోసం, ప్రాపంచిక అందలాలకోసం ఉద్దేశ్యపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చేవారికీ ఇది తీవ్రమైన హెచ్చరిక అన్నమాట! (ఫత్‌హుల్ ఖదీర్).

**42** సత్యాన్ని అసత్యంతో కలిపి కలగా పులగం చేయకండి. తెలిసికూడా సత్యాన్ని కప్పిపుచ్చకండి.

وَلَا تَلْبِسُوا الْحَقَّ بِالْبَاطِلِ وَتَكْتُمُوا الْحَقَّ وَأَنْتُمْ تَعْلَمُونَ ﴿٤٢﴾

**43** (ఇస్రాయీలు సంతతి వారలారా!) మీరు నమాజులను నెలకొల్పండి, జకాతును ఇవ్వండి, (నా సన్నిధిలో) రుకూ చేసే వారితో పాటు మీరూ రుకూ చేయండి.

وَأَقِيمُوا الصَّلٰوةَ وَآتُوا الزَّكٰوةَ وَارْكَعُوا مَعَ الرَّاكِعِينَ ﴿٤٣﴾

**44** ప్రజలకైతే మీరు మంచిని గురించి ఆదేశిస్తారు, కాని మీ స్వయాన్ని మరచి పోతారే?! చూడబోతే మీరు గ్రంథ పారాయణం చేస్తారాయె. మరి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా మీకు లేదా?

أَتَأْمُرُونَ النَّاسَ بِالْبِرِّ وَتَنْسَوْنَ أَنْفُسَكُمْ وَأَنْتُمْ تَتْلُونَ الْكِتٰبَ أَفَلَا تَعْقِلُونَ ﴿٤٤﴾

**45** మీరు ఓర్పు ద్వారా, నమాజు ద్వారా సహాయం అర్థించండి.[55] నిశ్చయంగా ఇది కష్టమయిన పనే. కాని (దైవానికి) భయ పడేవారికి[56] (ఇది సులువైన పని).

وَاسْتَعِينُوا بِالصَّبْرِ وَالصَّلٰوةِ وَإِنَّهَا لَكَبِيرَةٌ إِلَّا عَلَى الْخٰشِعِينَ ﴿٤٥﴾

55. సహనం, నమాజు – ఇవి రెండూ సదాచార సంపన్నుల ముఖ్య ఆయుధాలు. నమాజు ద్వారానే ఒక విశ్వాసికీ – అల్లాహ్‌కు మధ్య సంబంధం ఏర్పడుతుంది. తద్వారా అతనికి దైవసహాయం, తోడ్పాటు లభిస్తుంది. పోతే, సహనం, నిగ్రహం ద్వారా మనిషి నడవడిక పరిపక్వమవుతుంది. ధర్మమార్గంలో స్థయిర్యం, నిలకడ ఒనగూడుతాయి. "దైవప్రవక్త (స)కు ఎప్పుడు, ఏ క్లిష్టసమస్య ఎదురైనా, ఆయన (స) వెంటనే నమాజు వైపు శ్రద్ధ చూపేవారు" అని హదీసులో ఉంది (ముస్నదె అహ్మద్, ఫత్‌హుల్ ఖదీర్ ఆధారం). (ఈ విషయమై మరిన్ని వివరాల కోసం అన్‌కబూత్ సూరా 45వ వచనానికి వివరణ చూడండి).

56. క్రమం తప్పకుండా నమాజు చేయటం అనేది సాధారణ వ్యక్తులకు కష్టతరమైన పనే. అయితే దైవవిధేయులకు, అల్లాహ్ భీతిగల వారికి ఇది ఏమాత్రం కష్టం కాదు. పైగా ఈ నమాజు ద్వారా వారు హాయినొందుతారు. వారి మనసులు కుదుటపడుతాయి. ఎవరు వారు? అంటే తీర్పుదినంపై గట్టి నమ్మకం కలవారు. తీర్పుదినంపై దృఢ విశ్వాసం ఉంటే చాలు, ఏ మంచి పనైనా సులభతరమైపోతుంది. కాగా; పరలోకచింతన లేని మనిషి పనికిమాలినవాడుగా తయారవుతాడు. అంతేకాదు – చెడులచెట్టుగా, పాపాలపుట్టగా కూడా మారిపోతాడు.

**46** (ఎందుకంటే) ఎట్టకేలకు తాము తమ ప్రభువును కలుసుకోవాల్సి ఉందనీ, ఆయన వైపునకే మరలిపోవలసి ఉందనీ వారు నమ్ముతారు.

الَّذِينَ يَظُنُّونَ أَنَّهُم مُّلَاقُوا رَبِّهِمْ وَأَنَّهُمْ إِلَيْهِ رَاجِعُونَ ﴿٤٦﴾

**47** ఓ ఇస్రాయీలు (యాఖూబు) సంతతి వారలారా! నేను మీపై కురిపించిన అనుగ్రహాన్నీ, (నాటి) సమస్త లోకవాసులపై[57] మీకు ఇచ్చిన ప్రాధాన్యతను గురించి (కాస్త) నెమరు వేసుకోండి.

يَا بَنِي إِسْرَائِيلَ اذْكُرُوا نِعْمَتِيَ الَّتِي أَنْعَمْتُ عَلَيْكُمْ وَأَنِّي
فَضَّلْتُكُمْ عَلَى الْعَالَمِينَ ﴿٤٧﴾

57. మరోసారి ఇస్రాయీల్ వంశస్థులకు చేయబడిన మహోపకారాలు గుర్తు చేయబడుతున్నాయి. ప్రళయదినం నాటి పరిస్థితిని వివరించి జాగరూకపరచటం జరిగింది. ఆనాడు ఎవరూ మరొకరిని ఆదుకోలేరు. సిఫార్సులు చేయలేరు. చేసినా అవి అంగీకరించబడవు. నష్టపరిహారం లేక జరిమానా చెల్లించి బయటపడే మార్గం కూడా ఉండదు. సాయం చేయడానికి ముందుకు వచ్చేవాడు కూడా ఎవడూ ఉండడు.

సమస్త లోకవాసులపై ఇస్రాయీలు సంతతికి శ్రేష్ఠతనొసగబడిందన్న విషయం మామూలు విషయం కాదు. అంటే ముహమ్మద్ (స) అనుచర సమాజానికి పూర్వం ప్రపంచజాతుల్లో గొప్పవారన్న బిరుదు బనీ ఇస్రాయీల్‌కి ఉండేది. కాని వారు దేవుని అవిధేయతకు ఒడిగట్టి ఆ విశిష్ఠతను కోల్పోయారు. ఇప్పుడా బిరుదు ముహమ్మద్ (స) అనుచర సమాజానికి లభించింది. అంటే "ఖైరె ఉమ్మత్" (శ్రేష్ఠసమాజం) అన్నమాట! ఈ ఆయతు ద్వారా చేయబడే ఒక పరోక్ష హెచ్చరిక ఏమిటంటే దేవుని తరఫున వొసగబడే గౌరవపురస్కారాలు ఏదో ఒక జాతికో, వర్గానికో ప్రత్యేకం కావు. విశ్వాసం మరియు సదాచరణ ఆధారంగా ఇవి ప్రాప్తిస్తాయి. అవిశ్వాస వైఖరికి ఒడిగట్టి, దుర్వర్తనులుగా మారినపక్షంలో దైవకానుకలు జప్తు చేసుకోబడతాయి. ఉమ్మతె ముహమ్మదియా (ముహమ్మద్–స– అనుచర సమాజం) సయితం ఈనాడు తమ దుష్కర్మల మూలంగా, ముష్రిక్కు పోకడల కారణంగా 'శ్రేష్ఠ సమాజానికి' బదులు 'హీన సమాజం'గా తయారవుతోంది. అల్లాహ్ సన్మార్గం చూపుగాక!

తాము అల్లాహ్‌కు ఎంతో ప్రీతిపాత్రులం అన్న ఊహ కూడా యూదులను నిలువునా ముంచేసింది. పరలోకంలో అల్లాహ్ పట్టునుంచి తాము సురక్షితంగా ఉండగలమని వారనుకున్నారు. కాని ఆ రోజు దైవధిక్కారులకు ఎవరూ ఎటువంటి ఆశ్రయంగానీ, తోడ్పాటుగానీ ఇవ్వజాలరని అల్లాహ్ ముందే స్పష్టపరచాడు. కాని నేటి ముస్లిం సమాజం సయితం ఈ భ్రమకు లోనయింది. తామెన్ని దుష్కార్యాలకు ఒడిగట్టినా 'సిఫారసు' ద్వారా గట్టెక్కవచ్చని కొంతమంది తలపోస్తున్నారు. మహాప్రవక్త (సఅసం)

وَاتَّقُوا يَوْمًا لَّا تَجْزِي نَفْسٌ عَن نَّفْسٍ شَيْئًا وَلَا يُقْبَلُ
مِنْهَا شَفَاعَةٌ وَلَا يُؤْخَذُ مِنْهَا عَدْلٌ وَلَا هُمْ يُنصَرُونَ ﴿٤٨﴾

**48** ఎవరూ ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేని, ఎవరి సిఫారసూ స్వీకరించబడని, ఎవరి వద్ద కూడా పరిహారం తీసుకోబడని, ఎలాంటి సాయం అందజేయబడని ఆ దినానికి భయపడండి.

وَإِذْ نَجَّيْنَاكُم مِّنْ آلِ فِرْعَوْنَ يَسُومُونَكُمْ سُوءَ الْعَذَابِ
يُذَبِّحُونَ أَبْنَاءَكُمْ وَيَسْتَحْيُونَ نِسَاءَكُمْ ۚ وَفِي ذَٰلِكُم بَلَاءٌ مِّن
رَّبِّكُمْ عَظِيمٌ ﴿٤٩﴾

**49** (ఆ సందర్భాన్ని జ్ఞాపకం చేసుకోండి) ఫిరౌను మనుషుల[58] బారి నుండి మేము మీకు విముక్తి నొసగాము. వారు మిమ్మల్ని దారుణంగా వేధించేవారు. మీ కొడుకులను చంపివేసి, కూతుళ్ళను మాత్రం విడిచిపెట్టేవాళ్ళు. ఈ విముక్తి నొసగటంలో మీ ప్రభువు తరఫునుండి మీకు గొప్ప పరీక్ష ఉండినది.

తప్పకుండా తన అనుయాయుల కోసం అల్లాహ్‌కు సిఫారసు చేస్తారు. అల్లాహ్ కూడా ఆయన (స) సిఫారసును అంగీకరిస్తాడు (సహీహ్ హదీసుల ద్వారా కూడా ఈ సంగతి నిరూపితమే). అయితే ధర్మంలో క్రొంగ్రొత్త విషయాలను సృష్టించిన (బిద్అత్‌లకు పాల్పడిన) వారు సిఫారసు భాగ్యానికి నోచుకోకుండా పోతారని కూడా హదీసులలో వచ్చింది. అంతే కాదు – చాలామంది పాపాత్ములు నరకంలో శిక్ష అనుభవించిన తరువాత – ఆయన (స) చేసిన సిఫారసుపై నరకాగ్నినుంచి బయటికి తీయబడతారు. అయితే ఏదో ఒకనాడు తమకు సిఫారసు భాగ్యం వరించకపోతుందా అన్న ఆశతో – నిశ్చింతగా ఉంటూ – మహాపాతకాలు చేస్తూపోవాలనుకునేవారు కొన్నాళ్ళపాటైనా సరే నరక యాతనను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నారా?! ఆ యాతన వారికి భరించశక్యమేనా?

58. ఫిరౌను మనుషులంటే భావం కేవలం ఫిరౌను చక్రవర్తి కుటుంబీకులు మాత్రమే కాదు, ఫిరౌను అనుయాయులంతా ఇందులోకి వచ్చేస్తారు. "మేము ఫిరౌనీయులందరినీ ముంచివేశాము" అన్న వాక్యం కేవలం ఫిరౌను ఇంటివారికే పరిమితం కాదు. అతని సైనికదళం, అతని దృక్పథాన్ని సమర్థించిన జనమంతా అందులో చేరి ఉన్నారు. మొత్తానికి ఖుర్ఆన్‌లో "ఆల్" అన్న పదం అనుచరులు అనే అర్థంలో వాడబడింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం అల్ అహ్‌జాబ్ సూరాలోని 33వ ఆయతు యొక్క పాద సూచికను చూడండి.

**50** అప్పుడు మేము మీ కోసం సముద్రాన్ని చీల్చి,[59] మిమ్మల్ని సురక్షితంగా (ఆవలి ఒడ్డుకు) చేరవేశాము. అదే సమయంలో మీరు చూస్తుండగానే ఫిరౌనీయులను అందులో ముంచివేశాము.

وَإِذْ فَرَقْنَا بِكُمُ الْبَحْرَ فَأَنجَيْنَاكُمْ وَأَغْرَقْنَا آلَ فِرْعَوْنَ
وَأَنتُمْ تَنظُرُونَ ﴿٥٠﴾

**51** (జ్ఞాపకం చేసుకోండి) మేము మూసా (అలైహిస్సలాం)కు నలభై రాత్రుల వాగ్దానం చేసి (అతన్ని పిలిచి) నప్పుడు, అతను వెళ్ళిన తరువాత మీరు ఆవు దూడను పూజించటం మొదలెట్టారు. ఆ విధంగా మీరు దుర్మార్గానికి పాల్పడ్డారు.[60]

وَإِذْ وَاعَدْنَا مُوسَىٰ أَرْبَعِينَ لَيْلَةً ثُمَّ اتَّخَذْتُمُ الْعِجْلَ
مِن بَعْدِهِ وَأَنتُمْ ظَالِمُونَ ﴿٥١﴾

59. సముద్రాన్ని చీల్చడం, అందులో మార్గం ఏర్పరచటం – ఇది దేవుని మహిమల్లోనిది. మరిన్ని వివరాలు షుఅరా సూరాలో వచ్చాయి. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్‌గానీ, మహిమల్ని తిరస్కరించే ఇతర ప్రబుద్ధులుగానీ తలపోసినట్లు ఇది సముద్రపు ఆటుపోట్ల ప్రభావం ఎంతమాత్రం కాదు.

60. ఫిరౌను ప్రజల దాస్యం నుండి విముక్తినొందిన తరువాత ఇస్రాయీల్ సంతతివారు సినాయ్ ద్వీపకల్పానికి చేరుకున్నారు. 'ఆవుదూడను పూజించే' సంఘటన జరిగింది ఆ రోజుల్లోనే. హజ్రత్ మూసా (అలైహిస్సలాం)కు తౌరాత్ గ్రంథం ప్రసాదించేందుకు అల్లాహ్ 40 రాత్రుల కోసం ఆయన్ని తూర్ పర్వతంపైకి పిలుచుకున్నాడు. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) ప్రజల మధ్య నుంచి నిష్క్రమించగానే ఇస్రాయీలీయులు సామిరీ మాయమాటల్లో పడిపోయి దూడను పూజించటం మొదలెట్టారు. మానవుడు ఎంత బరితెగించిన భౌతికవాది?! దేవుని గొప్ప గొప్ప నిదర్శనాలను తన కళ్ళారా చూసినప్పటికీ, ప్రవక్తలు (మూసా, హారూన్) తన ముందు ఉన్నప్పటికీ ఆవు దూడను తన "ఆరాధ్యదైవం"గా చేసుకున్నాడు. ఇది అతనిలోని విపరీతమైన ధార్మిక నిర్లక్ష్య భావానికి తార్కాణం. నేటి నవతరం కూడా ఈ విషయంలో ఎవరికీ ఏమాత్రం తీసిపోదు. నేటి ఆధునిక ముస్లింలు సయితం బహుదైవోపాసనతో కూడుకున్న మూఢనమ్మకాలలో, దురాచారాలలో దారుణంగా చిక్కుకుని ఉన్నారు. అయితే ముస్లిములనేవారు షిర్కులో ఎలా చిక్కుకుంటారు? అని వాళ్ళు తమ్ము తామే సముదాయించుకుంటున్నారు. చూడబోతే మరి వాళ్ళు చేసేది షిర్కే. రాతి విగ్రహాలను పూజించేవారు మాత్రమే ముష్రిక్కులని ఈ ముష్రిక్కు ముస్లింలు తలపోస్తున్నారు. కాని రాతి బొమ్మలను

ثُمَّ عَفَوْنَا عَنْكُمْ مِّنْۢ بَعْدِ ذٰلِكَ لَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿٥٢﴾

**52** అయినప్పటికీ మేము మిమ్మల్ని మన్నించి వదలిపెట్టాము – అలాగయినా కృతజ్ఞులవుతారేమోనని!

وَاِذْ اٰتَيْنَا مُوْسَى الْكِتٰبَ وَالْفُرْقَانَ لَعَلَّكُمْ تَهْتَدُوْنَ ﴿٥٣﴾

**53** ఇంకా మేము మూసాకు, మీ మార్గదర్శకత్వం నిమిత్తం గ్రంథాన్నీ, గీటురాయినీ ప్రసాదించాము.[61]

وَاِذْ قَالَ مُوْسٰى لِقَوْمِهٖ يٰقَوْمِ اِنَّكُمْ ظَلَمْتُمْ اَنْفُسَكُمْ
بِاتِّخَاذِكُمُ الْعِجْلَ فَتُوْبُوْٓا اِلٰى بَارِئِكُمْ فَاقْتُلُوْٓا اَنْفُسَكُمْ ؕ
ذٰلِكُمْ خَيْرٌ لَّكُمْ عِنْدَ بَارِئِكُمْ ؕ فَتَابَ عَلَيْكُمْ ؕ اِنَّهٗ
هُوَ التَّوَّابُ الرَّحِيْمُ ﴿٥٤﴾

**54** (గుర్తు చేయి) మూసా తన జాతి ప్రజలతో ఇలా అన్నాడు : "ఓ నా జాతివారలారా! ఆవుదూడను ఆరాధ్య దైవంగా చేసుకుని మీరు మీ స్వయానికి అన్యాయం చేసుకున్నారు. కనుక ఇప్పుడు మీరు పశ్చాత్తాప భావంతో మీ సృష్టికర్త వైపుకు మరలండి. (ఈ ఘోరకృత్యానికి పాల్పడిన) మీలోని వారిని చంపండి. మీ సృష్టికర్త వద్ద ఇదే మీ కొరకు మేలైనది." మరి ఆయన మీ పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కనికరించేవాడు.[62]

---

పూజించే బహుదైవారాధకులు ఏమేం చేస్తారో ఈ సోకాల్డ్ ముస్లింలు కూడా సమాధుల వద్దకు పోయి అదే చేస్తున్నారు. అల్లాహ్ మనల్ని ఈ షిర్క్ జాడ్యం నుంచి కాపాడుగాక!

61. ఇది కూడా ఇస్రాయీల్ వంశస్థులు ఎర్ర సముద్రందాటిన తరువాత జరిగిన సంఘటనే (ఇబ్నె కసీర్). బహుశా తౌరాత్ గ్రంథాన్నే గీటురాయి (ఫుర్ఖాన్)గా పేర్కొని ఉండవచ్చు. ఎందుకంటే ప్రతి ఆకాశగ్రంథం సత్యాసత్యాలను, ధర్మాధర్మాలను వేరు పరచేదై ఉంటుంది. లేక అద్భుతాలనే 'గీటురాయి'గా చెప్పబడి ఉండవచ్చు. అద్భుతాలు, మహిమలు కూడా ధర్మాన్ని – అధర్మాన్నీ పరికించటంలో కీలకపాత్ర వహిస్తాయి.

62. వారు చేసిన షిర్క్ చేష్టను గురించి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తీవ్రంగా మందలించిన తరువాత వారిలో పశ్చాత్తాపభావన జాగృతమయింది. ఒండొకరిని హతమార్చుకోవటమే దానికి పశ్చాత్తాపమని తీర్మానించటం జరిగింది. "ఒండొకరిని హత మార్చుకోండి" అన్నది అరబీ మూలంలో వున్న పదం. దీనికి రెండు వ్యాఖ్యానాలు చెప్పబడ్డాయి. వాటిలో ఒకటి : ఆవుదూడను పూజించిన వాళ్ళందరినీ రెండు వరుసల్లో నిలబెట్టి ఒకరినొకరు చంపుకోమని ఆదేశించటం జరిగింది. రెండోది : షిర్క్‌కు

**55** మీరు మూసాతో అన్న మాటలను గుర్తుకు తెచ్చుకోండి : "ఓ మూసా! మేము అల్లాహ్‌ను కళ్ళారా చూడనంతవరకూ నిన్ను విశ్వసించము." (మీ ఈ పెడసరి ధోరణికి శిక్షగా) మీరు చూస్తుండగానే[63] (మీపై) పిడుగుపడింది.

**56.** అయితే (ఈసారయినా) మీరు కృతజ్ఞులవుతారేమోనన్న ఉద్దేశ్యంతో చని పోయిన మిమ్మల్ని తిరిగి బ్రతికించాము.

**57.** మేము మీపై మేఘాల ఛాయను కల్పించాము. మీపై మన్న్, సల్వాలను (ఆహారంగా) దించాము. "మేము మీకు ప్రసాదించిన పరిశుద్ధమైన వస్తువులను తినండి"[64] (అని చెప్పాము. కాని, వారు

وَإِذْ قُلْتُمْ يَٰمُوسَىٰ لَن نُّؤْمِنَ لَكَ حَتَّىٰ نَرَى ٱللَّهَ جَهْرَةً
فَأَخَذَتْكُمُ ٱلصَّٰعِقَةُ وَأَنتُمْ تَنظُرُونَ ﴿٥٥﴾

ثُمَّ بَعَثْنَٰكُم مِّنۢ بَعْدِ مَوْتِكُمْ لَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿٥٦﴾

وَظَلَّلْنَا عَلَيْكُمُ ٱلْغَمَامَ وَأَنزَلْنَا عَلَيْكُمُ ٱلْمَنَّ
وَٱلسَّلْوَىٰ ۖ كُلُوا۟ مِن طَيِّبَٰتِ مَا رَزَقْنَٰكُمْ ۖ وَمَا ظَلَمُونَا

ఒడిగట్టిన వారందరినీ ఒక ప్రక్కన నిలబెట్టి, ఈ ఘోరకృత్యానికి దూరంగా – సురక్షితంగా – ఉన్న వారిని పిలిచి వారిచేత వాళ్ళను చంపించటం జరిగింది. ఆ విధంగా హతులైనవారి సంఖ్య డెబ్బయివేల వరకూ ఉంటుందని చెప్పబడింది (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

63. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) 70 మందిని తౌరాత్ గ్రంథం గ్రహించే ఉద్దేశంతో తూర్ పర్వతంపై తీసుకెళ్ళారు. హజ్రత్ మూసా (అలైహిస్సలాం) తిరిగివస్తుండగా; 'మేము అల్లాహ్‌ను ప్రత్యక్షంగా (నీతో సంభాషిస్తుండగా) చూడనంతవరకూ మేము నీ మాటల్ని నమ్మబోము' అని వారు తెగేసి చెప్పేశారు. వారి ఈ దౌష్ట్యానికి శిక్షగా వారి కళ్ళముందరే భయంకరమైన పిడుగుపడింది. ఆ దెబ్బకు వారు నేలకొరిగారు. ఈ హటాత్పరిణామానికి హజ్రత్ మూసా (అలైహిస్సలాం) కలవరం చెందారు. వాళ్ళను తిరిగి బ్రతికించమని దైవాన్ని దీనాతిదీనంగా వేడుకున్నారు. దాంతో అల్లాహ్ వారికి తిరిగి ప్రాణం పోశాడు. 'చూస్తుండగానే పిడుగుపడింది' అంటే భావం మొదట్లో పిడుగుపడిన వారిని ప్రక్కనున్న వారు చూస్తూనే ఉన్నారు. ఆఖరికి వారంతా మృత్యువు ఒడిలోకి జారుకున్నారు.

64. చాలామంది వ్యాఖ్యాతల దృష్టిలో ఇది ఈజిప్టుకు – సిరియాకు మధ్యన గల 'తీహ్' మైదానంలో జరిగిన సంఘటన. దైవాదేశానుసారం వారు 'అమాలిఖా' పురములో

وَلٰكِنْ كَانُوْٓا اَنْفُسَهُمْ يَظْلِمُوْنَ ۝

ఆ అనుగ్రహాలు అనుభవించి కృతజ్ఞులయ్యే బదులు కృతఘ్నుత చూపటం మొదలు పెట్టారు). వారు మాకెలాంటి అన్యాయం చేయలేదు, కాకపోతే వారు తమకు తామే అన్యాయం చేసుకుంటూ పోయారు.

وَاِذْ قُلْنَا ادْخُلُوْا هٰذِهِ الْقَرْيَةَ فَكُلُوْا مِنْهَا حَيْثُ شِئْتُمْ رَغَدًا وَّادْخُلُوا الْبَابَ سُجَّدًا وَّقُوْلُوْا حِطَّةٌ نَّغْفِرْ لَكُمْ

**58** (ఇంకా ఆ విషయాన్ని కూడా నెమరు వేసుకోండి). "ఈ పురములో ప్రవేశించండి.[65] అక్కడ మీకు ఇష్టమైన చోట, కోరుకున్నవిధంగా తృప్తిగా తినండి. కాని నగర ముఖద్వారం గుండా పోతున్నప్పుడు 'సజ్దా' చేస్తూ మరీ పోవాలి.[66]

ప్రవేశించడానికి నిరాకరించినప్పుడు, శిక్షగా ఇస్రాయీల్ వంశస్థులు తీహ్ మైదానంలో నలభై సంవత్సరాల పాటు పడిఉండాల్సి వచ్చింది. అయితే మరి కొంతమంది దీంతో ఏకీభవించలేదు. (వీరి ప్రకారం) సీనా ఎడారిలోకి చేరిన పిదప వారికి అన్నిటికన్నా ముందు అన్నపానీయాల సమస్య ఎదురయింది. అప్పుడు వారికోసం ఈ 'మన్న్' 'సల్వా'ల ఏర్పాటు చేయబడింది. 'మన్న్' అంటే మొక్కలపై, రాళ్ళపై కురిసి పేరుకుపోయే మంచు లేదా తియ్యటి గుళికలు, ఇది కూడా సహజసిద్ధమైనదే. తేనెలా తియ్యగా ఉంటుంది. ఎండిన తరువాత జిగట పదార్థంగా తయారవుతుంది. మరి కొంతమంది అభిప్రాయంలో ఇది తేనె లేక తీపినీరు లాంటిది. హదీసులో వుంది : "పుట్టగొడుగు కూడా ఇస్రాయీల్ సంతతిపై, హజ్రత్ మూసా అలైహిస్సలాంపై అవతరించిన మన్న్ లాంటిదే. దాని నీరు కళ్ళ జబ్బును నయం చేస్తుంది" (సహీహ్ ముస్లిం). దీని మతలబు ఏమిటంటే; ఏ విధంగానయితే ఇస్రాయీల్ వంశస్థులకు వేళాపాళా లేకుండా ఎప్పుడంటే అప్పుడు అన్నం సమకూర్చబడేదో, అదేవిధంగా పుట్టగొడుగు కూడా ఎవరూ విత్తనం నాటకుండానే, సేద్యం చేయకుండానే పండుతుంది (అహ్సనుత్తఫాసీర్). "సల్వా" : పూరేడు పిట్ట లేదా పిచ్చుక తరహాలో ఉండే పక్షి. దాన్ని జిబహ్ చేసి తినేవారు (ఫత్హుల్ ఖదీర్).

65. అధిక సంఖ్యాక వ్యాఖ్యాతలు ఈ పురమును 'బైతుల్ మఖ్దిస్'గా భావిస్తున్నారు.

66. ఇక్కడ 'సజ్దా'ను కొందరు ఒక అర్థంలో, మరికొందరు ఇంకొక అర్థంలో తీసుకున్నారు. వంగి లేక తలవంచుకుని నగరంలో ప్రవేశించాలని మొదటి వర్గం భావించగా, కృతజ్ఞతా పూర్వకంగా సాష్టాంగపడిమరీ లోపలికి వెళ్ళాలని రెండవ వర్గం అర్థం

خَطٰيٰكُمْ وَسَنَزِيْدُ الْمُحْسِنِيْنَ ﴿٥٨﴾

పోతున్నప్పుడు 'హిత్తతున్'[67] అని నోటితో పలుకుతూ ముందుకు సాగాలి. అప్పుడు మేము మీ తప్పులను మన్నిస్తాము, సదాచార సంపన్నులకు మరింతగా అనుగ్రహిస్తాము" అని మేము మీతో అన్నాము.

فَبَدَّلَ الَّذِيْنَ ظَلَمُوْا قَوْلًا غَيْرَ الَّذِيْ قِيْلَ لَهُمْ فَاَنْزَلْنَا
عَلَى الَّذِيْنَ ظَلَمُوْا رِجْزًا مِّنَ السَّمَآءِ بِمَا كَانُوْا
يَفْسُقُوْنَ ﴿٥٩﴾

**59** కాని దుర్మార్గులు వారితో అనబడిన ఈ మాటను మార్చివేశారు.[68] అందుచేత మేము కూడా ఆ దుర్మార్గులపై వారి (దుర్మార్గం), ధిక్కార వైఖరికి శాస్తిగా ఆకాశం నుంచి శిక్షను అవతరింపజేశాము.[69]

తీసుకుంది. మొత్తమ్మీద దీని భావార్థం ఒక్కటే–దేవుడు ఈ సదవకాశం కల్పించినందుకు వినయ వినమ్రతలు ఉట్టిపడుతూ వుండగా, ధన్యవాదాలను అర్పించుకుంటూ లోపలికి ప్రవేశించాలి.

67. 'హిత్తతున్' అంటే "మా పాపాలను మన్నించుము" అని అర్థం.

68. దీనికి సంబంధించిన వివరణ హదీసులో ఉంది. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలో కూడా ఈ హదీసు పొందుపరచబడి ఉంది. దీని ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా తెలియజేశారు : "సజ్దా చేస్తూ ప్రవేశించండి అని వారికి ఆజ్ఞాపించబడింది. కాని వారు తమ పిరుదులు నేలకు రాసుకునేలా దేక్కుంటూ వెళ్ళారు. 'హిత్తతున్' అనడానికి బదులు 'హబ్బతున్ ఫీషారతిన్' – అంటే 'వెన్నులో గోధుమ గింజ' అని పలికారు (కితాబుత్తఫ్సీర్). దీని ద్వారా వారిలోని తలబిరుసుతనం ఏ స్థాయికి చేరిందో, దైవాదేశాలతో పరిహాసమాడటంలో వారెంత ముందుకు వెళ్ళిపోయారో అవగతం అవుతోంది. వాస్తవమేమంటే ఏ జాతి అయినా నైతికంగా దివాలాతీసి, అధోగతి వైపుకు సాగిపోతున్నప్పుడు దైవాదేశాల పట్ల అది వ్యవహరించే తీరు ఇలాగే ఉంటుంది.

69. ఏమిటీ ఆ ఆకాశ శిక్ష? దైవాగ్రహమనీ, దట్టమైన పొగమంచు అనీ, ప్లేగు వ్యాధి అనీ కొందరు అభిప్రాయపడ్డారు. ప్లేగువ్యాధి అన్న దానికి హదీసు ద్వారా కూడా సమర్థన లభిస్తోంది. "ఈ ప్లేగు వ్యాధి కూడా ఆ యాతన మరియు శిక్షలో భాగమే. మీకు పూర్వం గతించిన కొన్ని వర్గాలపై అది విరుచుకుపడింది. మీరున్నచోట గనక ఈ వ్యాధి ప్రబలిపోతే మీరక్కణ్ణుంచి వేరొక ప్రాంతానికి బయలుదేరకండి. అలాగే

**60** మూసా (అలైహిస్సలాం) తన జాతి ప్రజల కోసం నీటిని అడిగినప్పుడు, “నీ చేతి కర్రతో ఆ (కొండ) రాతిపై కొట్టు” అని మేమన్నాము. (అలా కొట్టగా) దాన్నుండి పన్నెండు ఊటలు పెల్లుబికాయి.[70] వారిలోని ప్రతి తెగవారూ తమ తమ నీటి స్థలాన్ని తెలుసుకున్నారు. (అప్పుడు మేము వారికి ఈ విధంగా ఆదేశించాము) “అల్లాహ్ (మీకు ప్రసాదించిన) ఉపాధిని తినండి, త్రాగండి. భువిలో అలజడిని రేపుతూ తిరగకండి.”

وَإِذِ اسْتَسْقَىٰ مُوسَىٰ لِقَوْمِهِ فَقُلْنَا اضْرِب بِّعَصَاكَ الْحَجَرَ
فَانفَجَرَتْ مِنْهُ اثْنَتَا عَشْرَةَ عَيْنًا قَدْ عَلِمَ كُلُّ أُنَاسٍ
مَّشْرَبَهُمْ كُلُوا وَاشْرَبُوا مِن رِّزْقِ اللَّهِ وَلَا تَعْثَوْا فِي الْأَرْضِ
مُفْسِدِينَ ٦٠

**61** (జ్ఞాపకం చేసుకోండి) “ఓ మూసా! ఒకేరకమైన తిండిని మేము అస్సలు సహించము. అందుకే భూమిలో పండే ఆకు కూరలు, దోస కాయలు, గోధుమలు, పప్పుదినుసులు, ఉల్లిపాయలు ప్రసాదించవలసినదిగా నీ ప్రభువును ప్రార్థించు” అని మీరు డిమాండు చేసినప్పుడు అతనిలా అన్నాడు: “మీరు శ్రేష్ఠమైన వస్తువుకు బదులుగా అధమమైన దానిని కోరుకుంటున్నారెందుకు? (సరే!) ఏదయినా

وَإِذْ قُلْتُمْ يَا مُوسَىٰ لَن نَّصْبِرَ عَلَىٰ طَعَامٍ وَاحِدٍ فَادْعُ لَنَا
رَبَّكَ يُخْرِجْ لَنَا مِمَّا تُنبِتُ الْأَرْضُ مِن بَقْلِهَا وَقِثَّائِهَا
وَفُومِهَا وَعَدَسِهَا وَبَصَلِهَا قَالَ أَتَسْتَبْدِلُونَ الَّذِي
هُوَ أَدْنَىٰ بِالَّذِي هُوَ خَيْرٌ اهْبِطُوا مِصْرًا فَإِنَّ لَكُم مَّا
سَأَلْتُمْ وَضُرِبَتْ عَلَيْهِمُ الذِّلَّةُ وَالْمَسْكَنَةُ وَبَاءُوا بِغَضَبٍ

---

వేరొక ప్రాంతంలో ఎక్కడయినా ప్లేగు వ్యాధి వచ్చిందని తెలిస్తే అక్కడికీ వెళ్ళకండి” అని మహనీయ ముహమ్మద్ (స) ఉపదేశించారు (సహీహ్ ముస్లిం).

70. ఈ సంఘటన తీహ్ లోయలో జరిగిందని కొంతమంది విద్వాంసులు అభిప్రాయపడగా, కాదు – సినాయ్ ఎడారిలో సంభవించిందని మరికొందరు అభిప్రాయపడ్డారు. మొత్తానికి అక్కడ మంచినీటి ఎద్దడి ఏర్పడగా, చేతికర్రతో కొండరాతిపై కొట్టమని దేవుడు హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను ఆజ్ఞాపించాడు. ఆ విధంగా ఆ రాతి నుంచి పన్నెండు ఊటలు పుట్టుకువచ్చాయి. ఇస్రాయీల్ సంతతిలో పన్నెండు తెగలుండేవి. ఒక్కో తెగ ఒక్కో ఊటను తన కోసం ప్రత్యేకించుకుని దాహం తీర్చుకునేది. ఇది కూడా దైవప్రవక్త మూసా (అలైహిస్సలాం) ద్వారా అల్లాహ్ ప్రస్ఫుటం చేసిన ఒక అద్భుతమే.

مِّنَ اللّٰهِ ۭ ذٰلِكَ بِاَنَّھُمْ كَانُوْا يَكْفُرُوْنَ بِاٰيٰتِ اللّٰهِ
وَيَقْتُلُوْنَ النَّـبِيّٖنَ بِغَيْرِ الْحَقِّ ۭ ذٰلِكَ بِمَا عَصَوْا
وَّكَانُوْا يَعْتَدُوْنَ ۝ؕ۶۱

పట్టణానికి వెళ్ళండి. అక్కడ మీరు కోరుకున్నవన్నీ మీకు లభిస్తాయి."[71] ఇక వారిపై పరాభవం, దారిద్ర్యం రుద్దబడింది. వారు దైవాగ్రహానికి గురై తరలి పోయారు.[72] వారి ఈ దురవస్థకు కారణమేమిటంటే వారు అల్లాహ్ ఆయతుల పట్ల తిరస్కారవైఖరిని అవలంబించేవారు, అన్యాయంగా ప్రవక్తలను చంపేవారు.[73] ఇది వారి అవిధేయతకు, బరితెగించిన పోకడకు పర్యవసానం మాత్రమే![74]

71. ఇది కూడా 'తీహ్' ప్రాంతంలో జరిగిన ఘటనే. 'మిస్ర్' అంటే ఇక్కడ అర్థం ఈజిప్టు పట్టణం అని కాదు. ఏదైనా ఒక పట్టణ ప్రాంతం అని మాత్రమే దీని భావం – అంటే ఇక్కడి నుంచి ఏదో ఒక పట్నానికి తరలిపొండి, అక్కడ కష్టపడండి, వ్యవసాయం చేయండి. మీకు మనసైన కాయగూరలు, పప్పుదినుసులు పండించుకొని తినండి అని ప్రవక్త మూసా (అలైహిస్సలాం) సలహాయిచ్చారు. వాళ్ల డిమాండు ఒక విధంగా దైవప్రసాదం పట్ల కృతఘ్నుతకు, దురహంకారానికి తార్కాణం. అందుకే హజ్రత్ మూసా (అలైహిస్సలాం) "మీరు కోరుకున్నవన్నీ అక్కడ మీకు దొరుకుతాయి" అని నిష్ఠూరంగా అన్నారు.

72. ఇంతకు మునుపు వారికి లభించిన పురస్కారాలు, మహోపకారాలెక్కడ? ఇప్పుడు వారిని చుట్టుముట్టిన అవమానం, దుర్భర దారిద్ర్యం ఎక్కడ? అసలు విషయం ఏమిటంటే వాళ్ళు దైవానుగ్రహాల పట్ల కృతజ్ఞులై ఉండకుండా ఘోరతప్పిదం చేశారు. ఫలితంగా వారిపై దేవుని దెబ్బపడింది. ఆగ్రహం కూడా అనుగ్రహం మాదిరిగా అల్లాహ్ గుణం. అల్లాహ్ గుణాల విషయంలో స్వంత భాష్యాలు చెప్పకూడదు. కనుక అల్లాహ్ ఆగ్రహాన్ని 'శిక్షించాలనే ఆయన తలంపు' అనో లేక 'శిక్ష' అనో వ్యాఖ్యానించటం సమంజసం కాదు. అల్లాహ్ వారిపై ఆగ్రహోదగ్రుడయ్యాడు (ఆయన ఔన్నత్యానికి తగినవిధంగా).

73. ఇస్రాయీల్ సంతతికి దాపురించిన దురవస్థకు కారణం ఇందులో వివరించబడింది. దైవవాక్కులను ధిక్కరించటం, దైవమార్గం వైపుకు ప్రజలను పిలిచే దైవ సందేశహరులను చంపివేయటం, వారిని అధములుగా జమకట్టటం, అవమానపరచటం సాధారణ నేరం కాదు, మహాపరాధం. ఈ అపరాధం కారణంగానే వారిపై దైవాగ్రహం విరుచుకుపడింది. యూదులు ఈ అపరాధానికి ఒడిగట్టి శాపగ్రస్తులయ్యారు. అవమానాల పాలయ్యారు. ఇది దైవ సంప్రదాయం. ఈనాటికీ మానవ జాతులకు

**62** విశ్వసించినవారైనా, యూదులైనా,[75] క్రైస్తవులయినా,[76] సాబియనులయినా[77] – ఎవరయినాసరే–అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించి సదాచరణ చేస్తే వారి

إِنَّ الَّذِينَ آمَنُوا وَالَّذِينَ هَادُوا وَالنَّصَارَىٰ وَالصَّابِئِينَ
مَنْ آمَنَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ وَعَمِلَ صَالِحًا فَلَهُمْ أَجْرُهُمْ

ఈ సూత్రం వర్తిస్తుంది. దైవాదేశాలతో చెలగాటమాడేవారు, దైవానుగ్రహాలను ఖాతరు చెయ్యనివారు, దైవధర్మ ప్రచారకులను అధములుగా భావించేవారు. ఎంతటి వారైనాసరే, ఏ ప్రాంతంలో ఉండేవారైనా సరే గౌరవోన్నతుల్ని ఎలా పొందగలగుతారు?

74. పరాభవానికీ, దీనావస్థకు, దారిద్ర్యానికి గల రెండో కారణమిది. చేయరాదని చెప్పిన పనులన్నీ చేసి వారు తలబిరుసుతనం చూపారు. ఇక చేయమని చెప్పిన పనులను దైవసూచనానుసారం సజావుగా చేసేబదులు, తమకు నచ్చిన రీతిలో చేసి పెడసరి ధోరణిని ప్రదర్శించారు. ఆదేశపాలన అంటే ఏమిటీ? 'వద్దు' అన్నదాన్ని చేయకుండా ఉండటం. 'చేయండి' అన్నదాన్ని చేయటం – అదీ ఏ విధంగా చేయమంటే ఆ విధంగానే చేయాలి. అందులో తమ తరఫున ఎలాంటి హెచ్చుతగ్గులు చేయకూడదు. మార్పులు చేర్పులు కూడా చేయకూడదు. ఒకవేళ అలాచేస్తే ఇది దైవాభిమతానికి విరుద్ధం అవుతుంది. పొగరుబోతులు, గర్విష్టులు మాత్రమే ఇలాంటి చేష్టలకు ఒడిగడతారు; **"అసౌ"** అంటే వారు అవిధేయతకు పాల్పడ్డారు, ఏ విషయాల నుంచయితే వారిని వారించటం జరిగిందో వాటికి ఒడిగట్టారు అని అర్థం. **"యాతదూన్"** అంటే ఆజ్ఞాపించబడిన పనుల్లోనే హద్దులను అతిక్రమించేవారని అర్థం.

75. యహూద్ అనే పదం **'హవాదా'** లేక **'తహవ్వదున్'** అనే ధాతువు నుండి వచ్చింది. హవాదా అంటే ప్రేమ; తహవ్వదున్ అంటే పశ్చాత్తాపం; మొత్తానికి యహూద్ (యూదులు) అంటే పరస్పరం ప్రేమభావం కలిగి ఉండేవారు లేక పశ్చాత్తాపం చెందినవారు అని అసలు అర్థం. అయితే హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను నమ్మి నడుచుకునే వారిని 'యహూద్'గా వ్యవహరిస్తారు.

76. **నసారా :** నస్రాన్ అనే పదానికి బహువచనం. ఇది నుస్రత్ నుండి వచ్చింది. నుస్రత్ అంటే సహాయం అని అర్థం. ఒండొకరికి సహాయ సహకారాలందజేసుకునే వారన్న భావంలో వీరికి ఈ పేరు వచ్చింది. వీరిని 'అన్సార్లు' గా కూడా వ్యవహరిం చటం జరిగింది. వీళ్లు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహిస్సలాం – ఏసుక్రీస్తు) నుద్దేశించి "అల్లాహ్‌కు సహాయకులుగా మేమున్నాము (నహ్ను అన్సారుల్లాహి)" అని అన్నారు. (ఆలి ఇమ్రాన్ – 52, సఫ్ – 14). మొత్తమ్మీద ఈసా (ఏసుక్రీస్తు) అనుయాయులు నసారాగా పిలువబడతారు.

77. **సాబియీన్** : సాబియా అనే పదానికిది బహువచనం. తెలుగులో దీన్ని సాబియనులుగా వ్యవహరించటం జరిగింది. నిస్సందేహంగా ఈ వర్గం వారు ఒకప్పుడు సత్యధర్మాన్ని

| | |
|---|---|
| ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉం(టుం)ది. వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు.[78] | عِندَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٦٢﴾ |

అవలంబించి ఉంటారు (అందువల్లనే బహుశా దివ్య ఖుర్ఆన్‌లో వీరిపేరు యూదుల, క్రైస్తవులతో పాటు ప్రస్తావించబడింది). కాని తరువాత వీళ్లు దైవదూతలను, నక్షత్రాలను ఆరాధ్యదైవాలుగా చేసుకున్నారు. ఆ తరువాత అసలు ఏ మతాన్నీ అవలంబించలేదు. అందుకే ఒక మతమంటూ లేని వారిని సాబియనులుగా పిలువటం జరిగింది.

78. కొంతమంది ఆధునిక వ్యాఖ్యాతలు ఈ ఆయతును అర్థం చేసుకోవటంలో పొరబడ్డారు. “మతాలన్నీ ఒక్కటే” అన్న భావనకు వారు ఊతం ఇచ్చే కృషిచేశారు. అంటే ముహమ్మద్ (స) గారి దైవదౌత్యాన్ని విశ్వసించటం తప్పనిసరికాదనీ, మనిషి తానేమతాన్ని అవలంబించి మంచి పనులు చేసినా చాలు, అతను మోక్షం పొందుతాడని భాష్యం చెప్పారు. ఈ ఫిలాసఫీ చాలా ప్రమాదకరమైనది.

ఈ ఆయతుకు సరైన భావార్థం ఏమిటంటే; అల్లాహ్ ఇంతకు ముందు వచ్చిన ఆయతులలో యూదుల దుష్కార్యాల, దురాగతాల కారణంగా వారిని శిక్షార్హులుగా ఖరారుచేశాడు. మరి అటువంటప్పుడు యూదులలో నికార్సయిన వారిపట్ల దైవగ్రంథాన్నీ, దైవప్రవక్తను ఖచ్చితంగా అనుసరించి, జీవించిన వారిపట్ల అల్లాహ్ చేసే వ్యవహారం ఏమిటీ? అన్న సందేహం ఈ సందర్భంగా కలగటం సహజం. ఈ సందేహానికి అల్లాహ్ స్పష్టంగా సమాధానమిచ్చాడు – ఒక్క యూదులేకాదు, క్రైస్తవులు, సాబియనులైనాసరే – తమ తమ కాలాల్లో రుజువర్తనులై ఉండి, అల్లాహ్ మరియు అంతిమ దినంపై విశ్వాసం కలిగి ఉన్నట్లయితే, సదాచరణచేసి ఉన్నట్లయితే వారు తప్పకుండా పరలోకంలో సాఫల్యం పొందుతారు.

అదేవిధంగా ముస్లింలు ప్రస్తుతం ముహమ్మద్ (స) అందజేసిన దైవసందేశాన్ని నిష్కల్మషంగా విశ్వసించి, అల్లాహ్ మరియు అంతిమ దినంపై దృఢ నమ్మకం కలిగి ఉంటూ, మంచిపనులు చేసినట్లయితే వారు కూడా శాశ్వితమైన పరలోక భాగ్యాలకు అర్హులుగా ఖరారు చేయబడతారు. పరలోక శ్రేయోసాఫల్యాల విషయంలో ఎవరిపట్ల కూడా ఎలాంటి వివక్ష కనబరచబడదు. అక్కడ నిష్పక్షపాతంగా నిర్ణయం గైకొనబడుతుంది – ముస్లిములైనా, అంతిమ దైవప్రవక్త (స)కు ముందు గతించిన యూదులు, క్రైస్తవులు, సాబియనులైనాసరే! కొన్ని ముర్సల్ ఉల్లేఖనాలు కూడా ఈ విషయాన్నే సమర్థిస్తున్నాయి. ఉదాహరణకు ముజాహిద్‌గారు హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) కథనాన్ని ఇలా ఉటంకించారు. అందులో ఆయన ఇలా చెప్పారు–నా పూర్వాశ్ర మంలో ధర్మావలంబీకులుగా జీవితం గడిపిన నా సహవాసుల గురించి దైవప్రవక్త

**63** తూరు పర్వతాన్ని మీపైకి ఎత్తి[79] మేము మీచేత చేయించిన ప్రమాణాన్ని కాస్త జ్ఞాపకం చేసుకోండి. అప్పుడు, “మేము మీకు ప్రసాదించిన దానిని (గ్రంథాన్ని) గట్టిగా పట్టుకోండి. అందులో వున్న వాటిని బాగా జ్ఞాపకం చేసుకోండి, దీని ద్వారానే మిమ్మల్ని మీరు కాపాడుకునే అవకాశంఉంది” (అని ఉపదేశించాము.)

وَإِذْ أَخَذْنَا مِيثَاقَكُمْ وَرَفَعْنَا فَوْقَكُمُ الطُّورَ خُذُوا مَا
آتَيْنَاكُم بِقُوَّةٍ وَاذْكُرُوا مَا فِيهِ لَعَلَّكُمْ تَتَّقُونَ ﴿٦٣﴾

(సఅసం)ను అడిగాను. వాళ్లు ధర్మనిష్ఠాపరులు, దైవారాధన చేసేవారు. (అంటే మహాప్రవక్త దైవదౌత్యానికి పూర్వం వాళ్ళు తమ ధర్మంపై చిత్తశుద్ధి కలిగి ఉండేవారు). ఆ సందర్భంగానే ఈ ఆయతు అవతరించింది–ఇన్నల్లజీన ఆమనూ వల్లజీన హాదూ...(ఇబ్నె కసీర్). దివ్య ఖుర్ఆన్‌లోని ఇతర ఆయతుల ద్వారా కూడా దీనికి సమర్ధన లభిస్తోంది. ఉదాహరణకు :1. “దైవసన్నిధిలో ఆమోదించబడిన ధర్మం ఇస్లాం మాత్రమే” (ఆలి ఇమ్రాన్–19). 2. “ఇస్లాం తప్ప వేరే ఇంకొక ధర్మాన్ని అన్వేషించినవాడు ఎట్టి పరిస్థితిలోనూ సమ్మతిని పొందలేడు” (ఆలి ఇమ్రాన్–85).

హదీసులలో కూడా ఈ విషయమై మహనీయ ముహమ్మద్ (సఅసం) స్పష్టమయిన సూచనలిచ్చారు. అంటే తన దైవదౌత్యాన్ని విశ్వసించనంతవరకూ ఎవరూ మోక్షం పొందలేరు అని చెప్పారు. ఉదాహరణకు : ఆయన ఇలా అన్నారు : “ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నాను – నా అనుచర సమాజంలో ఏ వ్యక్తయినా సరే – అతను యూదుడైనా, క్రైస్తవుడైనా సరే – నేను చెప్పింది విన్నమీదట నన్ను విశ్వసించకపోతే అతను నరకంలోకి పోతాడు” (సహీహ్ ముస్లిం).

మొత్తానికి తేలిందేమంటే దివ్య ఖుర్ఆన్‌లోని ఇతర ఆయతులను ఉపేక్షించినందువల్ల “అన్ని మతాలూ ఒక్కటే” అని వాదించే వారికి దీని ద్వారా సందు దొరికింది. మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి ప్రబోధనలను విస్మరించి ఖుర్ఆన్‌కు వ్యాఖ్యానం ఇవ్వదలచిన వారు కూడా ఇలాగే పిల్లిమొగ్గలు వేస్తుంటారు. అందుకే – ప్రామాణిక హదీసులను విస్మరించి ఖుర్ఆన్‌పై యోచన చేసే ప్రయత్నం అధర్మమైనది. సహీహ్ హదీసులతో నిమిత్తం లేకుండా ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవాలనుకోవటం సరికాదు.

79. ఈ తౌరాత్‌లోని ఆజ్ఞలను పాలించటం మా వల్లకాదు అని యూదులు దురుద్దేశ్యంతో అన్నప్పుడు అల్లాహ్ తూర్ పర్వతాన్ని ఒక కప్పు మాదిరిగా వారి పైకి ఎత్తాడు. ఈ పరిణామానికి వారు భయకంపితులై, ఆజ్ఞల్ని శిరసావహిస్తామని ప్రమాణం చేశారు.

**64** కాని దీని తరువాత మీరు విముఖులై పోయారు. అయినప్పటికీ దైవానుగ్రహం, దైవకారుణ్యం మీపై ఉండింది. లేకపోతే మీరు (తీవ్రంగా) నష్టపోయేవారే.

ثُمَّ تَوَلَّيْتُم مِّن بَعْدِ ذَٰلِكَ ۖ فَلَوْلَا فَضْلُ اللَّهِ عَلَيْكُمْ وَرَحْمَتُهُ لَكُنتُم مِّنَ الْخَاسِرِينَ ﴿٦٤﴾

**65** శనివారం[80] విషయంలో ఆజ్ఞోల్లంఘనకు పాల్పడిన మీ వారి గురించి కూడా మీకు బాగా తెలుసు. "అత్యంత అసహ్యాకరమైన, ఛీత్కరించబడిన కోతులుగా మారిపోండి" అని మేము వాళ్ళను శపించాము.

وَلَقَدْ عَلِمْتُمُ الَّذِينَ اعْتَدَوْا مِنكُمْ فِي السَّبْتِ فَقُلْنَا لَهُمْ كُونُوا قِرَدَةً خَاسِئِينَ ﴿٦٥﴾

**66** దీనిని మేము ఆ కాలం వారికీ, భావి తరాల వారికీ గుణపాఠ సూచనగానూ, భయభక్తులు కలవారికి హితబోధగానూ చేశాము.

فَجَعَلْنَاهَا نَكَالًا لِّمَا بَيْنَ يَدَيْهَا وَمَا خَلْفَهَا وَمَوْعِظَةً لِّلْمُتَّقِينَ ﴿٦٦﴾

**67** మూసా తన జాతివారితో "అల్లాహ్ మిమ్మల్ని ఒక ఆవును 'జిబహ్' చేయవలసిందిగా ఆజ్ఞాపిస్తున్నాడు"[81] అని అన్నప్పుడు "ఏమిటీ, మాతో వేళాకోళం చేస్తున్నావా?" అని వారు ప్రశ్నించారు. దానికి అతను "నేనలాంటి మూర్ఖుల్లో ఒకణ్ణి కాకుండా ఉండేందుకు అల్లాహ్ శరణు వేడుతున్నాను" అని జవాబిచ్చాడు.

وَإِذْ قَالَ مُوسَىٰ لِقَوْمِهِ إِنَّ اللَّهَ يَأْمُرُكُمْ أَن تَذْبَحُوا بَقَرَةً ۖ قَالُوا أَتَتَّخِذُنَا هُزُوًا ۖ قَالَ أَعُوذُ بِاللَّهِ أَنْ أَكُونَ مِنَ الْجَاهِلِينَ ﴿٦٧﴾

80. శనివారం (సబ్త్) నాడు చేపలు పట్టడంతో సహా ఏ రకమైన ప్రాపంచిక వ్యవహారమూ జరపరాదని యూదులకు తాకీదు చేయబడింది. కాని వాళ్ళు ఏదో ఒక వంకపెట్టి ఈ ఆజ్ఞను ఉల్లంఘించేవారు. శనివారంనాడే (వారికొక పరీక్షగా) చేపలు నీటి ఉపరితలంపైకి వచ్చేవి. వాళ్లు చేపలకోసం తీరంలో గుంటలు త్రవ్వి పెట్టేవారు. గుంటల్లో పడిన చేపలను ఆదివారం పట్టుకునేవారు.

81. ఇస్రాయీల్ వంశస్థుల్లో సంతానం లేని ఒక ధనికుడుండేవాడు. అతనికి ఒక

**68** అప్పుడు వారు, "అయితే అది ఎటువంటిది అయిఉండాలో మాకు వివరించవలసిందిగా నీ ప్రభువును అర్థించు" అని అన్నారు. దానికి అతను "అది మరీ ముసలిదై ఉండకూడదు, మరీ లేగదూడగా కూడా ఉండరాదు. పైగా అది మధ్య వయస్సులోవున్న ఆవు అయి ఉండాలని ఆయన ఆజ్ఞాపిస్తున్నాడు. (సరేనా!) ఇక ఆజ్ఞాపించబడిన విధంగా చెయ్యండి" అని చెప్పాడు.

قَالُوا ادْعُ لَنَا رَبَّكَ يُبَيِّن لَّنَا مَا هِيَ ۚ قَالَ إِنَّهُ يَقُولُ
إِنَّهَا بَقَرَةٌ لَّا فَارِضٌ وَلَا بِكْرٌ عَوَانٌ بَيْنَ ذَٰلِكَ ۖ
فَافْعَلُوا مَا تُؤْمَرُونَ ﴿٦٨﴾

**69** "అది ఏ రంగుదై ఉండాలో మాకు వివరించమని నీ ప్రభువును ప్రార్థించు" అని మళ్ళీ అడిగారు. "అది పసుపు వర్ణం గలదై, నిగనిగలాడుతూ, చూసేవారికి ఆకర్షణీయంగా కనిపించేలా ఉండాలన్నది అల్లాహ్ ఆజ్ఞ" అని మూసా సమాధానమిచ్చాడు.

قَالُوا ادْعُ لَنَا رَبَّكَ يُبَيِّن لَّنَا مَا لَوْنُهَا ۚ قَالَ إِنَّهُ يَقُولُ
إِنَّهَا بَقَرَةٌ صَفْرَاءُ فَاقِعٌ لَّوْنُهَا تَسُرُّ النَّاظِرِينَ ﴿٦٩﴾

**70** అప్పుడు వారు "అది ఎలాంటిదై ఉండాలో మాకు (ఇంకా బాగా) వివరించమని నీ ప్రభువును ప్రార్థించు. మాకు ఆవు సంగతి ఇంకా ప్రస్ఫుటం కాలేదు. అల్లాహ్ గనక తలిస్తే మేము మార్గదర్శకత్వం పొందుతాము" అని అన్నారు.

قَالُوا ادْعُ لَنَا رَبَّكَ يُبَيِّن لَّنَا مَا هِيَ إِنَّ الْبَقَرَ تَشَابَهَ عَلَيْنَا
وَإِنَّا إِن شَاءَ اللَّهُ لَمُهْتَدُونَ ﴿٧٠﴾

భ్రాతృజుడు తప్ప వారసులెవరూ లేరు. ఒకరోజు రాత్రి ఆ భ్రాతృజుడు తన పినతండ్రిని దారుణంగా చంపి, శవాన్ని వేరొకరి గుమ్మం వద్ద పడవేశాడు. తెల్లవారిన తరువాత వారు ఒండొకరిని నిందితులుగా నిలబెట్టసాగారు. కడకు వ్యవహారం హజ్రత్ మూసా (అలైహిస్సలాం) కాడికి వచ్చింది. అప్పుడాయన ఆవును బలి ఇవ్వమని ఆదేశించారు. ఆవు మాంసం ముక్క ఒకటి ఆ మృతదేహంపై కొట్టగా హతుడు లేచి కూర్చున్నాడు. తనను చంపిన హంతకుడెవరో చెప్పి చచ్చిపోయాడు (ఫత్హుల్ ఖదీర్).

**71** దానికి అతను, "ఆ ఆవు పనిచేసేదీ, దుక్కి దున్నేదీ, సేద్యపు పనిలో ఉపయోగ పడేదీ అయి ఉండకూడదు. ఇంకా అది ఆరోగ్యవంతమైనదై, ఎటువంటి మచ్చలూ లేకుండా ఉండాలి అన్నది అల్లాహ్ ఆజ్ఞ" అని చెప్పాడు. దానికి వారు "నువ్వు ఇప్పుడు సరిగ్గా చెప్పావు. (మాకిప్పుడు అర్థం అయింది)" అన్నారు. అసలు వారు ఆదేశ పాలనకు ఏమాత్రం సుముఖంగా లేరు. ఎట్టకేలకు (మాట విని,) ఆవును జిబహ్[82] చేశారు.

قَالَ إِنَّهُ يَقُولُ إِنَّهَا بَقَرَةٌ لَّا ذَلُولٌ تُثِيرُ الْأَرْضَ وَلَا تَسْقِي الْحَرْثَ مُسَلَّمَةٌ لَّا شِيَةَ فِيهَا ۚ قَالُوا الْآنَ جِئْتَ بِالْحَقِّ ۚ فَذَبَحُوهَا وَمَا كَادُوا يَفْعَلُونَ ﴿٧١﴾

**72** (జ్ఞాపకం చేసుకోండి) మీరు ఒక వ్యక్తిని హత్య చేసి, ఆ విషయంలో పరస్పరం విభేదించుకోసాగారు. కాని మీ గుట్టును అల్లాహ్ రట్టు చేయాలనే నిర్ణయిం చుకున్నాడు.[83]

وَإِذْ قَتَلْتُمْ نَفْسًا فَادَّارَأْتُمْ فِيهَا ۖ وَاللَّهُ مُخْرِجٌ مَّا كُنتُمْ تَكْتُمُونَ ﴿٧٢﴾

82. ఆవును బలి ఇవ్వమని మాత్రమే వారికి చెప్పటం జరిగింది. ఏ ఆవునయినాసరే వారు జిబహ్ చేసేసి ఉంటే దైవాదేశ పాలన జరిగిపోయేది. కాని ఇస్రాయీల్ వంశస్థుల పెంకితనాన్నే చూడండి – వాళ్లు చెయ్యమన్నది చేసే బదులు నానా రకాలుగా ప్రశ్నించి లేనిపోని ఇబ్బందులకు అవకాశం కల్పించారు. అల్లాహ్ కూడా వారికోసం వ్యవహారాన్ని మరింత జటిలం చేసేశాడు. అందుకే ధర్మావలంబన విషయంలో సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాల్లోకి తలదూర్చి చిక్కుల్ని కొనితెచ్చుకోరాదనీ, సరళమార్గాన్ని అనుసరించటమే శ్రేయస్కరమని చెప్పబడింది.

83. ఈ హత్యోదంతం మూలంగానే ఆవును బలి ఇవ్వమని ఇస్రాయీల్ సంతతిని ఆజ్ఞాపించడమయింది. ఈ విధంగా అల్లాహ్ హత్యా రహస్యాన్ని బట్టబయలు చేశాడు. నిజానికి ఈ హత్య రాత్రి చీకటిలో గుట్టుచప్పుడు కాకుండా చేశారు. భావం ఏమిటంటే సత్కార్యమయినా, దుష్కార్యమయినా – మీరు దాన్ని ఎంత గప్‌చిప్‌గా, పకడ్బందీగా చేసినా అది అల్లాహ్‌కు తెలియకుండా ఉండదు. దాన్ని ప్రజల ముందుకు తెచ్చే శక్తి అల్లాహ్‌కు ఉంది. అందుకే ఏకాంతంలో వున్నా, నలుగురిలో వున్నా – నిత్యం మంచి పనులు మాత్రమే చేస్తూ ఉండండి. ఎప్పుడయినా అవి బహిర్గతం అయి, ప్రజల సమక్షంలోకి వచ్చేసినా నలుగురిలో నవ్వులపాలు కావలసిన పరిస్థితి ఏర్పడదు. పైగా అలాంటి పరిస్థితే గనక ఒకవేళ ఎదురయితే మీ గౌరవప్రతిష్ఠలు మరింతగా

فَقُلۡنَا اضۡرِبُوۡهُ بِبَعۡضِهَا ؕ كَذٰلِكَ يُحۡىِ اللّٰهُ الۡمَوۡتٰى ۙ وَيُرِيۡكُمۡ اٰيٰتِهٖ لَعَلَّكُمۡ تَعۡقِلُوۡنَ ۝٧٣

**73** కనుక "ఈ ఆవు (మాంసపు) ముక్క నొకదాన్ని హతుని దేహానికేసి కొట్టండి (అతడు లేచి నిలబడతాడు)" అని మేము అన్నాము. ఈ విధంగా అల్లాహ్ మృతులను బ్రతికించి[84] తన నిదర్శనాలను చూపుతున్నాడు - మీరు ఇకనయినా బుద్ధిగా మసలుకోవాలని!

ثُمَّ قَسَتۡ قُلُوۡبُكُمۡ مِّنۡۢ بَعۡدِ ذٰلِكَ فَهِىَ كَالۡحِجَارَةِ اَوۡ اَشَدُّ قَسۡوَةً ؕ وَاِنَّ مِنَ الۡحِجَارَةِ لَمَا يَتَفَجَّرُ مِنۡهُ الۡاَنۡهٰرُ ؕ وَاِنَّ

**74** కాని ఆ తరువాత మీ హృదయాలు కఠినమైపోయాయి. రాళ్ళ మాదిరిగా, కాదు – వాటికంటే కూడా కఠినం అయిపోయాయి.[85] కొన్ని రాళ్ళలోనుంచైతే సెలయేళ్ళు ప్రవహిస్తాయి. మరి కొన్ని

ఇనుమడిస్తాయి. చెడుపనిని ఎంత గుట్టుగా చేసినా సరే – ఏదో ఒక సందర్భంలో అది రట్టయ్యే ప్రమాదం ఉంది. దాని మూలంగా చివరికి మిగిలేది పరాభవమే సుమా!

84. చచ్చిపోయిన వ్యక్తిని తిరిగి బ్రతికించటం ద్వారా అల్లాహ్, ప్రళయదినాన మనుషులందరినీ తిరిగి లేపుతానన్న తన మాటను సూచనాప్రాయంగా తెలియజేస్తున్నాడు. ప్రళయదినాన దేవుడు చనిపోయిన వారిని మళ్ళీ బ్రతికిస్తాడన్న విషయంపై తిరస్కారులు సదా ఆశ్చర్యాన్నే వెలిబుచ్చారు. అందుకే అల్లాహ్ ఖుర్ఆన్‌లో పలుచోట్ల, పలు విధాలా ఈ విషయాన్ని వారి ముందుకు తీసుకువచ్చాడు. ఈ ఒక్క బఖరా సూరాలోనే అల్లాహ్ దీనికి సంబంధించిన ఐదు ఉపమానాలు ఇచ్చాడు : 1. ఈ సూరాలోని 56వ ఆయతు. 2. మీరు చదువుతున్న ఈ ఆయతు. 3. 243వ ఆయతు. 4. 259వ ఆయతు. 5. ఆ తరువాత వచ్చే ఆయతులో (260) హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి నాలుగు పక్షుల సంఘటన.

85. అంటే ఈ అద్భుతాలను చూచిన తరువాత – కళ్ళ ముందరే చచ్చిపోయిన వ్యక్తి తిరిగి బ్రతికిన తాజా సంఘటనను తిలకించిన మీదట – కూడా మీ హృదయాలలో నిజ దేవుని వైపు మరలాలన్న ఆలోచన (ఇనాబత్ ఇలల్లాహ్) గాని, పశ్చాత్తాపభావం గాని, క్షమాపణలు కోరుకునే గుణంగాని పెంపొందలేదు. పైపెచ్చు మీ గుండెలు రాతి గుండెలయిపోయాయి. అంతకంటే కూడా కఠినం అయిపోయాయి. హృదయాలు కఠినంగా మారితే అది మానవ సమాజాల వినాశానికి ఆనవాలని గ్రహించాలి. హృదయాలు కఠినంగా మారాయంటే వాటిలో సత్యాన్ని అంగీకరించే, మంచిని

مِنْهَا لَمَا يَشَّقَّقُ فَيَخْرُجُ مِنْهُ الْمَآءُ ۚ وَإِنَّ مِنْهَا لَمَا يَهْبِطُ مِنْ خَشْيَةِ اللّٰهِ ۗ وَمَا اللّٰهُ بِغَافِلٍ عَمَّا تَعْمَلُونَ ﴿٧٤﴾

రాళ్ళు పగలగా వాటినుంచి నీరు చిమ్ముతుంది. మరికొన్ని అల్లాహ్ భయంతో (కంపించి) క్రిందపడి పోతాయి.[86] మీ కార్యకలాపాల పట్ల అల్లాహ్ పరధ్యానంలో ఉన్నాడని అనుకోకండి.

أَفَتَطْمَعُونَ أَنْ يُؤْمِنُوا لَكُمْ وَقَدْ كَانَ فَرِيقٌ مِّنْهُمْ يَسْمَعُونَ كَلَامَ اللّٰهِ ثُمَّ يُحَرِّفُونَهُ مِنْ بَعْدِ مَا عَقَلُوهُ وَهُمْ يَعْلَمُونَ ﴿٧٥﴾

**75** (ముస్లిములారా!) వారు మీ మాటను నమ్ముతారనే (ఇప్పటికీ) మీరు ఆశపడ్తున్నారా? వాస్తవానికి వారిలో, అల్లాహ్ వాక్కును విని, అర్థం చేసుకుని కూడా ఉద్దేశ్యపూర్వకంగా దాన్ని మార్చి వేసేవారు ఉన్నారు.[87]

స్వాగతించే గుణం నశించిందని భావం. ఈ దశకు చేరిన వారిని తీర్చిదిద్దే ప్రయత్నం ఎంతగా చేసినా ఆశించిన ఫలితం రాదు. అందుకే విశ్వసించిన వారిని ప్రత్యేకంగా తాకీదు చేయటం జరిగింది – "పూర్వం గ్రంథం ఇవ్వబడిన ప్రజల మాదిరిగా విశ్వాసులు మారిపోకూడదు సుమా! ఒక సుదీర్ఘకాలం వారిపై గడచిపోయాక వారి హృదయాలు కఠినమై పోయాయి." (అల్ హదీద్ : 16)

86. రాళ్ళు, శిలలు ఎంత కఠినంగా, కరకుగా ఉన్నప్పటికీ వాటి ద్వారా ఒనగూడే ప్రయోజనాలు, అవి సయితం లోనయ్యే స్థితిగతులు వివరించబడ్డాయి. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే రాళ్ళకు సయితం ఒక రకమైన గ్రాహ్యశక్తి, స్పందన ఉన్నాయి. ఉదాహరణకు బనీ ఇస్రాయీల్ సూరాలోని 44వ ఆయతులో చెప్పబడినట్లు – "ఆయన పరిశుద్ధతను సప్తాకాశాలూ, భూమీ, భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడ నటువంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు." మరిన్ని వివరాల కోసం బనీ ఇస్రాయీల్ సూరా 44వ ఆయతుకు గల పాదసూచికను చూడండి.

87. 'యూదులు విశ్వసిస్తారని మీరు ఆశపడ్తున్నారా?' అని ముస్లిములను ఉద్దేశించి ప్రశ్నించబడింది. వారి పూర్వీకుల్లో ఒక వర్గం ఉండేది. అది ఉద్దేశ్యపూర్వకంగా దైవవాక్కులో ప్రక్షిప్తం చేసి, విషయాన్ని వక్రీకరించేది. కాబట్టి ఇలాంటివారు విశ్వసిస్తారన్న ఆశ ఏమాత్రం లేదు. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ప్రాపంచిక స్వప్రయోజనాల నాశించేవారు, అసూయాద్వేషాలతో రగిలిపోయేవారు, తమ వర్గంవారి పట్ల దురభిమానంతోనో, ఎదుటివర్గం పట్ల అసూయాద్వేషాలతోనో దైవవాక్కును

وَإِذَا لَقُوا الَّذِينَ آمَنُوا قَالُوا آمَنَّا وَإِذَا خَلَا بَعْضُهُمْ
إِلَىٰ بَعْضٍ قَالُوا أَتُحَدِّثُونَهُم بِمَا فَتَحَ اللَّهُ عَلَيْكُمْ
لِيُحَاجُّوكُم بِهِ عِندَ رَبِّكُمْ ۚ أَفَلَا تَعْقِلُونَ ﴿٧٦﴾

**76** వారు విశ్వాసులను కలుసుకున్నప్పుడు తమ విశ్వాసాన్ని వెల్లడిస్తారు.[88] తమ వర్గానికి చెందినవారిని ఏకాంతంలో కలుసుకున్నప్పుడు, "అల్లాహ్ మీకు తెలియజేసిన విషయాలను మీరు వీరికి ఎందుకు చేరవేస్తున్నారు? తద్వారా మీ ప్రభువు సమక్షంలో వారు మీపై వాదనకు బలం పొందగలరనే సంగతిని విస్మరించారా ఏమి?" అని అంటారు.

أَوَلَا يَعْلَمُونَ أَنَّ اللَّهَ يَعْلَمُ مَا يُسِرُّونَ
وَمَا يُعْلِنُونَ ﴿٧٧﴾

**77** వారు దాచేదీ, బహిర్గతం చేసేదీ – అంతా అల్లాహ్‌కు తెలుసన్న సంగతి వారికి తెలియదా?![89]

وَمِنْهُمْ أُمِّيُّونَ لَا يَعْلَمُونَ الْكِتَابَ إِلَّا أَمَانِيَّ وَإِنْ هُمْ إِلَّا
يَظُنُّونَ ﴿٧٨﴾

**78** వారిలో చదువురాని వారు కొందరున్నారు – వారికి గ్రంథజ్ఞానం లేదు. వారు కేవలం ఆశల్ని నమ్ముకొని ఉన్నారు.

తారుమారు చేయడానికి కూడా వెనుకాడరు. వారు మార్గవిహీనత యొక్క ఊబిలో దారుణంగా కూరుకుపోయారు. అందులోనుంచి ఇక వారిని వెలికి తీయటం కష్టం. ఉమ్మతె ముహమ్మదియా (ముహమ్మద్ ప్రవక్త అనుచర సమాజం) లోని కొందరు పండితులు, మత గురువులు కూడా ఖుర్ఆన్ హదీసుల్లో ప్రక్షిప్తాలకు పూనుకున్నారు. ఈ మహాపరాధానికి అల్లాహ్ మనల్ని దూరంగా ఉంచుగాక (నిసా సూరా 77వ ఆయతుకు వివరణను చూడండి).

88. ఇది యూదుల్లోని కొంతమంది ఆడే కపట నాటకం అన్నమాట! వారు ముస్లిములతో కలసి సంభాషిస్తున్నప్పుడు తమను తాము విశ్వాసులుగా పరిచయం చేసుకుంటారు. కాని వాళ్ళ మనుషులను (యూదులను) కలుసుకున్నప్పుడు, తాము తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి పరస్పరం తాకీదు చేసుకుంటారు. అవసరానికి మించిన విషయాలు ముస్లిములకు చెప్పకూడదనీ, ఒకవేళ చెప్పేస్తే అరేబియా ప్రవక్త (సఅసం) దౌత్యాన్ని సమర్థించినట్లవుతుందని, దైవసమక్షంలో ఇది తమకు ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉందని చెప్పుకుని పెదవి విరిచేవారు.

89. మీరు చెప్పినా చెప్పకపోయినా అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు. మీరు ఏదన్నా విషయం దాచినాసరే ఆయన ముస్లిములకు దాన్ని గురించి తెలియపరుస్తాడని అల్లాహ్ ఇందులో స్పష్టపరిచాడు.

లేనిపోని అంచనాలువేసి, ఊహల్లో విహరిస్తూ ఉంటారు.[90]

**79** తమ స్వహస్తాలతో లిఖించిన గ్రంథాన్ని దైవగ్రంథమని చెప్పి, ప్రాపంచిక తుచ్ఛ ప్రయోజనాన్ని పొందజూసే వారికి 'వినాశం' కలదు. వారి ఈ స్వహస్త లిఖిత రచన కూడా వారి వినాశానికి దారి తీస్తుంది. వారి ఈ సంపాదన కూడా వారి నాశనానికి కారణభూతం అవుతుంది.[91]

فَوَيْلٌ لِّلَّذِينَ يَكْتُبُونَ الْكِتَٰبَ بِأَيْدِيهِمْ ثُمَّ يَقُولُونَ هَٰذَا مِنْ عِندِ اللَّهِ لِيَشْتَرُوا بِهِۦ ثَمَنًا قَلِيلًا ۖ فَوَيْلٌ لَّهُم مِّمَّا كَتَبَتْ أَيْدِيهِمْ وَوَيْلٌ لَّهُم مِّمَّا يَكْسِبُونَ ﴿٧٩﴾

**80** పైగా "మేము నరకాగ్నిలో కొన్ని రోజులు మాత్రమే ఉంటాము" అని వారంటున్నారు. వారిని అడుగు: మీరు ఆ మేరకు అల్లాహ్ నుండి పొందిన

وَقَالُوا لَن تَمَسَّنَا النَّارُ إِلَّا أَيَّامًا مَّعْدُودَةً ۚ قُلْ أَتَّخَذْتُمْ

90. ఇప్పటివరకూ తెలిసినవారి, చదువుకున్న వారి గురించి చెప్పుకోవటం జరిగింది. ఇకపోతే చదువురానివారు. వారికి గ్రంథ (తౌరాత్) జ్ఞానం లేదు. కేవలం ఆశలు, మూఢ నమ్మకాలు మాత్రమే ఉన్నాయి. అందుకే వారు ఊహల్లో తేలియాడుతూ ఉంటారు. వారి ఈ స్థితికి వారి పండితులే కారకులు. ఉదాహరణకు: మేము అల్లాహ్‌కు ప్రీతిపాత్రులం. కాబట్టి మమ్మల్ని నరకాగ్ని జ్వాలలు ముట్టుకోవు. ఒకవేళ నరకానికిపోయినా కొన్ని రోజులే. మా మత గురువులు మమ్మల్ని కాపాడతారు – ఇలాంటి మాటలతో తమను తాము సముదాయించుకుంటూ ఉంటారు. అజ్ఞానం ఆవరించిన నేటి ముస్లిములను సయితం వారి పండితులు, గురువులు అందమైన మాటలతో అరచేతిలో స్వర్గం చూపించి మోసపుచ్చుతున్న సంగతి మనకు తెలియనిది కాదు.

91. ఇది యూద విద్వాంసుల్లో లోపించిన పాపభీతికి, నిర్లక్ష్య వైఖరికి ప్రబల తార్కాణం. వారు తమ స్వహస్తాలతో లేని విషయాలను జొప్పించి, వాటిని దైవప్రోక్తంగా అభివర్ణిస్తారు. ఈ ఆయతు ఆధారంగా కొంతమంది విద్వాంసులు, దివ్యఖుర్‌ఆన్‌ను అమ్మటం అధర్మమని చెప్పారు. కాని ఈ విధమయిన అన్వయింపు సరైనది కాదు. ప్రాపంచిక స్వప్రయోజనాల కోసం దైవవాక్కులో ప్రక్షిప్తాలు చేసేవారికి, మతం పేరిట ప్రజలను మోసగించే వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. వినాశం (వైల్) : హదీసు ప్రకారం వైల్ అనే పదానికి 'నరకంలోని ఒకానొక లోయ' అనే అర్థం కూడా ఉంది. ఆ లోయ ఎంత లోతైనదంటే – ఒక నరకవాసి అందులో పడటానికి నలభై యేళ్లు పడుతుంది (అహ్మద్, తిర్మిజీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్ – ఫత్‌హుల్ ఖదీర్ ఆధారంగా).

عِنْدَ اللّٰهِ عَهْدًا فَلَنْ يُّخْلِفَ اللّٰهُ عَهْدَهٗٓ اَمْ تَقُوْلُوْنَ عَلَى اللّٰهِ مَا لَا تَعْلَمُوْنَ ۝٨٠

వాగ్దానం[92] ఏదన్నా మీ వద్ద ఉందా? ఒకవేళ ఉంటే అల్లాహ్ ముమ్మాటికీ తన వాగ్దానానికి విరుద్ధంగా వ్యవహరించడు. (అసలు అలా జరగనే లేదు) అసలు మీరు మీకు తెలియని విషయాలను అల్లాహ్‌కు ఆపాదిస్తున్నారు.[93]

بَلٰى مَنْ كَسَبَ سَيِّئَةً وَّاَحَاطَتْ بِهٖ خَطِيْٓــَٔتُهٗ فَاُولٰٓئِكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ۝٨١

**81** నిస్సందేహంగా – ఎవడు పాపకార్యాలకు ఒడిగట్టాడో, అతని పాపాలు అతన్ని చుట్టుముట్టాయో అలాంటి వారే నరక వాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.

وَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ اُولٰٓئِكَ اَصْحٰبُ الْجَنَّةِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ۝٨٢

**82** మరెవరు విశ్వసించి, మంచిపనులు చేస్తారో వారు స్వర్గవాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు.[94]

92. ప్రపంచ ఆయుషు మొత్తం ఏడు వేల సంవత్సరాలనీ, ప్రతి వెయ్యి సంవత్సరాలకు ఒక రోజు చొప్పున కేవలం ఏడు రోజులు మాత్రమే తాము నరకాగ్నిని చవిచూస్తామని యూదులు అనేవారు. తాము నలభై రోజులపాటు ఆవుదూడను పూజించటం వల్ల నలభై రోజులకొరకు మాత్రమే నరకంలో పడవేయబడతామని మరికొందరు అభిప్రాయపడేవారు. "ఏమిటీ? ఆ మేరకు మీరు అల్లాహ్ నుండి ఏదన్నా హామీ పత్రం పొందారా?" అని అల్లాహ్ ప్రశ్నిస్తున్నాడు. అల్లాహ్ అటువంటి హామీ ఏదీ వారికి ఇవ్వనపుడు, వారెందుకిలాంటి ప్రగల్భాలు పలుకుతున్నారు?

93. 'మేము ఒకవేళ నరకానికి పోయినా స్వల్పవ్యవధి కోసం మాత్రమే పోతామన్న' మీ వాదనకు ఆధారం ఏదీ లేదు. ఇది మీ కల్పన మాత్రమే. పైపెచ్చు మీరు ఈ విషయమై అల్లాహ్‌కు అబద్ధాలు అంటగడుతున్నారు. మీకు సయితం దీనికి సంబంధించిన జ్ఞానం ఏదీ లేదాయె. రానున్న వాక్యాలలో అల్లాహ్ తన శిక్షాబహుమానాల సూత్రాన్ని విశదీకరించాడు. తీర్పుదినాన అల్లాహ్ సద్వర్తనులకు, దుర్వర్తనులకు వారి వారి కర్మలనుబట్టి ప్రతిఫలం ఇస్తాడు.

94. యూదుల బుకాయింపులను ఖండిస్తూ అల్లాహ్ స్వర్గనరకాల ప్రవేశానికి ఏఏ విషయాలు కారణభూతమవుతాయో తెలియజేశాడు. ఎవరి కర్మల పత్రంలో పాపాలే పాపాలున్నాయో, ఇంకా షిర్క్ మరియు కుఫ్ర్‌తో కూడుకున్న పనులు లిఖించబడి ఉన్నాయో వారి నివాసస్థలం నరకం అవుతుంది. వారందులో కలకాలం మగ్గవలసిందే.

وَاِذْ اَخَذْنَا مِيْثَاقَ بَنِيْٓ اِسْرَاۗءِيْلَ لَا تَعْبُدُوْنَ
اِلَّا اللّٰهَ ۣ وَبِالْوَالِدَيْنِ اِحْسَانًا وَّذِي الْقُرْبٰى
وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ وَقُوْلُوْا لِلنَّاسِ حُسْـنًا
وَّاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ ۭ ثُمَّ تَوَلَّيْتُمْ
اِلَّا قَلِيْلًا مِّنْكُمْ وَاَنْتُمْ مُّعْرِضُوْنَ ۸۳

**83** మేము ఇస్రాయీల్ వంశస్థుల నుండి వాగ్దానం తీసుకున్నాము (దాన్ని గుర్తుకు తెచ్చుకోండి) : "అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ ఆరాధించకూడదు. తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా మెలగాలి. అలాగే బంధువులను, అనాథలను, అగత్యపరులను (ఆదరించాలి). ప్రజలతో మర్యాదగా మాట్లాడాలి. నమాజును నెలకొల్పుతూ ఉండాలి, జకాత్ ఇస్తూ ఉండాలి." అయితే మీలో కొద్దిమంది తప్ప అందరూ మాట తప్పారు, ముఖం తిప్పుకున్నారు.

وَاِذْ اَخَذْنَا مِيْثَاقَكُمْ لَا تَسْفِكُوْنَ دِمَاۗءَكُمْ وَلَا تُخْرِجُوْنَ
اَنْفُسَكُمْ مِّنْ دِيَارِكُمْ ثُمَّ اَقْرَرْتُمْ وَاَنْتُمْ تَشْهَدُوْنَ ۸۴

**84** పరస్పరం రక్తం చిందించరాదనీ (చంపుకోరాదని), తోటి వారిని వారి నివాసస్థలాల నుంచి బహిష్కరించరాదనీ మీనుండి వాగ్దానం తీసుకున్నప్పుడు, దానికి మీరు అంగీకరించారు. ఆ విషయానికి స్వయంగా మీరే సాక్షులు.[95]

విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారు స్వర్గవాసులవుతారు. ఇక విశ్వాసుల్లో పాపం చేసిన వారు కూడా ఉంటారు – వారి వ్యవహారం దైవాధీనమై ఉంటుంది. ఆయన గనక తలిస్తే తన కృపతో వారిని మన్నించి, కొంతకాలం పాటు నరకంలో ఉంచి, స్వర్గానికి తరలించగలడు. లేదా దైవప్రవక్త (స) సిఫారసుపై, వారిని మన్నించి స్వర్గంలో దాఖలు చేయగలడు. సహీహ్ హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది. ఇదే అహ్లె సున్నత్ వారి విశ్వాసం.

95. ఇస్రాయీల్ సంతతి నుండి తీసుకున్న వాగ్దానాన్ని గురించి అల్లాహ్ వివరించాడు. కాని ఈ వాగ్దానాన్ని కూడా వారు భంగపరిచారు. ఈ వాగ్దానంలోని మొట్టమొదటి అంశం ఏకదైవారాధన. ప్రవక్తలందరి సందేశం కూడా ఇదే. ఈ అంశాన్నే వారు తమ సందేశ కార్యక్రమానికి మూలంగా తీసుకున్నారు (అంబియా సూరా 25వ ఆయతు ద్వారా, ఇతర ఆయతుల ద్వారా ఇది స్పష్టమవుతోంది). ఏకదైవారాధన తరువాత తల్లిదండ్రుల యెడల మంచిగా మెలగాలని ఆదేశించబడింది. దైవారాధన ప్రస్తావన వచ్చిన వెంటనే తల్లిదండ్రులతో ఉత్తమ వ్యవహారాన్ని గురించి పేర్కొనటం విశేషం. అల్లాహ్‌ను ఆరాధించటం ఎంత అవసరమో, తల్లిదండ్రుల యెడల

**85** కాని మీరు పరస్పరం చంపుకున్నారు. మీలోని ఒక వర్గం వారిని ఇండ్లనుంచి బహిష్కరించటం కూడా చేశారు. పాపానికి, దౌర్జన్యానికి పాల్పడుతూ మీరు వారికి వ్యతిరేకంగా – ఇతరులను సమర్థించారు. మరి వారు బందీలుగా పట్టుబడి మీ వద్దకు వచ్చినప్పుడు మీరు వారికోసం నష్టపరిహారం ఇచ్చిన మాట వాస్తవమే. కాని మీరు వారిని వెళ్ళగొట్టడమే అధర్మం (అప్పుడు మీరు దాన్ని అస్సలు లెక్క చేయలేదు). ఏమిటీ? మీరు కొన్ని ఆజ్ఞలను విశ్వసించి, మరి కొన్నింటిని తిరస్కరిస్తున్నారా?[96] మీలో ఇలాచేసేవారికి ప్రపంచ జీవితంలో అవమానం తప్ప ఇంకేం ప్రతిఫలం ఉంటుంది? ఇక ప్రళయ దినాన వారు మరింత కఠినమైన శిక్ష వైపు మరలించ బడతారు. అల్లాహ్‌కు మీ చేష్టలు తెలియకుండా లేవు.

ثُمَّ اَنْتُمْ هٰٓؤُلَاۗءِ تَقْتُلُوْنَ اَنْفُسَكُمْ وَتُخْرِجُوْنَ فَرِيْقًا مِّنْكُمْ مِّنْ دِيَارِهِمْ ۡ تَظٰهَرُوْنَ عَلَيْهِمْ بِالْاِثْمِ وَالْعُدْوَانِ ۭ وَاِنْ يَّاْتُوْكُمْ اُسٰرٰى تُفٰدُوْھُمْ وَھُوَ مُحَرَّمٌ عَلَيْكُمْ اِخْرَاجُهُمْ ۭ اَفَتُؤْمِنُوْنَ بِبَعْضِ الْكِتٰبِ وَتَكْفُرُوْنَ بِبَعْضٍ ۚ فَمَا جَزَاۗءُ مَنْ يَّفْعَلُ ذٰلِكَ مِنْكُمْ اِلَّا خِزْيٌ فِي الْحَيٰوةِ الدُّنْيَا ۚ وَيَوْمَ الْقِيٰمَةِ يُرَدُّوْنَ اِلٰٓى اَشَدِّ الْعَذَابِ ۭ وَمَا اللّٰهُ بِغَافِلٍ عَمَّا تَعْمَلُوْنَ ۝۸۵

సత్ప్రవర్తనను కలిగి ఉండటం కూడా అంతే అవసరం. అందులో ఎలాంటి లోటూ కనబరచకూడదు.

ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ చాలాచోట్ల తన ఆరాధన గురించి చెప్పిన తర్వాత వెంటనే రెండో స్థానంలో తల్లిదండ్రుల పట్ల విధేయత కనబరచాలనీ, వారిపట్ల అత్యుత్తమంగా మెలగాలని ఆదేశించాడు. దీనిద్వారా తల్లిదండ్రులకు విధేయత చూపటం ఎంత అవసరమో బోధపడుతోంది. తల్లిదండ్రుల తరువాత ఆత్మీయుల, అనాథల, అగత్యపరుల వంతు వస్తుంది. వారితో కూడా మృదువుగా వ్యవహరించాలి. ఈ విషయాలకు ఇస్లాంలో ఎంతో ప్రాముఖ్యం ఉంది. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కూడా వీటిని గురించి పలు విధాలుగా నొక్కి వక్కాణించారు. ఈ వాగ్దానంలో నమాజును నెలకొల్పటం గురించి, జకాత్ (విధిగా చెల్లించవలసిన దానాల) గురించి కూడా వచ్చింది. ఈ రెండు అంశాలు వెనుకటి షరీయతులలో (జీవన ధర్మాలలో) కూడా ఉండేవి. దీన్నిబట్టి వీటి ప్రాముఖ్యం ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. ఇస్లాంలో కూడా ఈ రెండు ఆరాధనలు ఎంతో ముఖ్యమైనవి. ఈ రెంటిలో

| | |
|---|---|
| **86** పరలోకానికి బదులుగా ప్రాపంచిక జీవితాన్ని కొనుక్కున్నవారు వీరే. వీరికి విధించబడే శిక్షల్లో తగ్గింపూ ఉండదు, వారికి సహాయపడటమూ జరగదు.[97] | أُولَٰئِكَ الَّذِينَ اشْتَرَوُا الْحَيَاةَ الدُّنْيَا بِالْآخِرَةِ ۖ فَلَا يُخَفَّفُ عَنْهُمُ الْعَذَابُ وَلَا هُمْ يُنصَرُونَ ﴿٨٦﴾ |

ఏ ఒక్కదానిని త్రోసిపుచ్చినా లేక దానిపట్ల వైముఖ్యం కనబరచినా అది ధిక్కార (కుఫ్ర్) వైఖరిగా భావించబడుతుంది. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) తన ఖిలాఫత్ కాలంలో 'జకాత్' చెల్లించడానికి నిరాకరించిన వారితో ధర్మయుద్ధం (జిహాద్) చేస్తానని ప్రకటించటం ఈ సందర్భంగా గమనార్హం.

96. మహాప్రవక్త (సఅసం) మదీనాకు రాకముందు అన్సార్ వర్గంలో (ఇస్లాంకు పూర్వం వీరు అవిశ్వాసులుగా ఉండేవారు) రెండు తెగలుండేవి. 1. ఔస్ 2. ఖజ్రజ్. ఇవి రెండూ అనునిత్యం పరస్పరం కత్తులు దూసుకునేవి. అలాగే మదీనాకు చెందిన యూదులలో మూడు తెగలుండేవి. 1. బనూ ఖైనుఖా, 2. బనూ నజీర్, 3. బనూ ఖురైజ. ఈ మూడు తెగలు కూడా పరస్పరం కయ్యానికి కాలుదువ్వేవి. బనూ ఖురైజ ఔస్ తెగకు మద్దతునివ్వగా, బనూ ఖైనుఖా మరియు బనూ నజీర్ ఖజ్రజ్ తెగకు అండగా నిలిచేవి. యుద్ధ సమయాలలో వారు తమ తమ కూటములకు సహాయ సహకారాలందించేవారు. ఫలితంగా వారు తమ మతానికే చెందిన వారిని చంపటం, ఇండ్ల నుంచి వెళ్ళగొట్టటం లాంటి పనులు చేసేవారు. మరి చూడబోతే తౌరాత్ గ్రంథం ప్రకారం ఇలా చేయటం నిషిద్ధం. విచిత్రం ఏమిటంటే తమ మతానికి చెందిన యూద తెగలు యుద్ధఖైదీలుగా పట్టుబడితే, నష్టపరిహారం చెల్లించి మరీ వారిని విడుదల చేయించేవారు. అదేమంటే తౌరాత్‌లో ఈ విధంగా ఆదేశించబడింది అని అనేవారు. యూదుల ఈ పరస్పర విరుద్ధమైన వైఖరిని దృష్టిలో పెట్టుకుని, వారు షరీయత్‌ను మైనపు ముద్దలా చేసుకున్నారనీ, గ్రంథంలోని కొన్ని విషయాలను విశ్వసిస్తూ మరికొన్ని విషయాలను ప్రక్కన పెడుతున్నారని చెప్పబడింది. దైవాదేశాలను నిర్లక్ష్యం చేసి సోదర సంహారానికి పాల్పడటం, ఇండ్లనుంచి వెళ్ళగొట్టటం, వారికి వ్యతిరేకంగా ఇంకొకరికి సాయపడటం – వారి షరీయతులోనే అధర్మంగా ఖరారు చేయబడింది. కాని వారు ఈ మూడు నిషిద్ధాజ్ఞల్ని ఉల్లంఘించి, ఆ తర్వాత నష్టపరిహారం చెల్లించి ఖైదీలను విడిపించమనే ఆజ్ఞను పాటించసాగారు. ఆ మూడు విషయాలకే గనక వారు కట్టుబడి ఉండే పక్షంలో అసలు నష్టపరిహారం చెల్లించవలసిన అగత్యమే ఏర్పడేది కాదుకదా!

97. షరీయతులోని కొన్ని ఆదేశాలను శిరసావహించి, మరికొన్ని ఆదేశాలకు తిలోదకాలిచ్చి నందుకు జరిగే శాస్తి ఏమిటో ఇందులో చెప్పబడింది. ఈ నేరానికి గాను ప్రాపంచిక జీవితంలో గౌరవోన్నతులకు బదులు ఘోర పరాభవం, అవమానం లభిస్తాయి.

**87** మేము మూసాకు గ్రంథం వొసగాము. అతని తరువాత కూడా ప్రవక్తలను పంపించాము. ఇంకా మేము మర్యమ్ కుమారుడైన ఈసాకు స్పష్టమైన నిదర్శనాలు ఇచ్చాము. రూహుల్ ఖుదుస్ ద్వారా అతనికి సహాయం చేశాము.[98] అయితే ఏ

وَلَقَدْ اٰتَيْنَا مُوْسَى الْكِتٰبَ وَقَفَّيْنَا مِنْۢ بَعْدِهٖ بِالرُّسُلِ ۫ وَاٰتَيْنَا عِيْسَى ابْنَ مَرْيَمَ الْبَيِّنٰتِ وَاَيَّدْنٰهُ بِرُوْحِ الْقُدُسِ ؕ

పరలోకంలో వ్యధాభరితమైన శిక్ష ఎలాగూ ఉంటుంది. దీన్నిబట్టి విదితమయ్యేదేమిటంటే సంపూర్ణ విధేయతే దైవానికి స్వీకారయోగ్యమవుతుంది. అడపాదడపా కొన్ని విషయాలను ఒప్పుకుని, వాటికనుగుణంగా మసలుకునేవారి పట్ల అల్లాహ్‌కు ఎలాంటి ఆసక్తి లేదు. ఈ ఆయతు ముస్లిములను సయితం ఆలోచింపజేస్తోంది– ఈనాడు ప్రపంచం నలుమూలలా ముస్లింలు ఎదుర్కొంటున్న అవమానాలకు కారణం, ధర్మాదేశాలలో కొన్నింటిని అవలంబించి, మరికొన్నింటిని వదలివేయటమైతే కాదుకదా?! – ఇది తీవ్రంగా ఆలోచించవలసిన విషయం.

98. **"వ ఖఫ్ఫయ్‌నా మింబాదిహీ బిర్రుసులి"** అనే వాక్యానికి భావం ఏమిటంటే హజ్రత్ మూసా (అలైహి) తరువాత నిరంతరం దైవప్రవక్తలు ప్రభవిస్తూ ఉన్నారు. కడకు బనీ ఇస్రాయీల్‌లో ఈ దైవదౌత్య పరంపర హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు)తో ముగిసింది.

'బయ్యినాత్' అంటే దేవుని తరఫున ఇవ్వబడిన సూచనలు, మహిమలు అని అర్థం. అవి ఈసా (అలైహిస్సలాం)కు ఇవ్వబడ్డాయి. ఉదాహరణకు : ఆయన మృతులను బ్రతికించటం, కుష్ఠురోగులను నయం చేయటం, అంధులకు చూపునొసగటం మొదలైనవి. ఈ విషయాలు ఆలి ఇమ్రాన్ సూరాలోని 49వ వచనంలో ప్రస్తావనకు వచ్చాయి.

**'రూహుల్ ఖుదుస్'** అనేది జిబ్రయీల్ దూత యొక్క బిరుదు. రూహ్ అంటే ఆత్మ; ఖుదుస్ అంటే పరిశుద్ధుడు – అల్లాహ్ అన్నమాట! ఈ విధంగా రూహుల్ ఖుదుస్ అనే పదానికి 'పరిశుద్ధుని ఆత్మ' అనే అర్థం వస్తుంది. జిబ్రయీల్ దూతను పరిశుద్ధుని ఆత్మ అని ఎందుకు అనటం జరిగిందంటే ఆయన 'అమ్రె తక్వీనీ' ద్వారా ఉనికిలోకి వచ్చారు. (అమ్రె తక్వీని అంటే అల్లాహ్ అల్లాహ్ యొక్క ప్రత్యేక శక్తి సామర్థ్యాల ద్వారా జిబ్రయీల్ దూత ఉనికిలోకి వచ్చారు). జిబ్రయీల్ దూత గౌరవోన్నతులను ఇనుమడింపజేసే ఉద్దేశ్యంతో ఆయన్ని పరిశుద్ధుని ఆత్మ అన్నారు. అలాగే స్వయంగా ఈసా ప్రవక్తను కూడా 'రూహ్' అని అనటం జరిగింది. మొత్తానికి రూహుల్ ఖుదుస్ అంటే, పరిశుద్ధుడైన అల్లాహ్ ఆజ్ఞ ద్వారా ఉనికిలోకి వచ్చిన జిబ్రయీల్ దూత అన్నమాట. ఇబ్నె జరీర్ కూడా ఈ విషయాన్నే సమర్థించారు. అదీగాక అల్ మాయిద

أَفَكُلَّمَا جَاءَكُمْ رَسُولٌ بِمَا لَا تَهْوَىٰ أَنفُسُكُمُ اسْتَكْبَرْتُمْ فَفَرِيقًا كَذَّبْتُمْ وَفَرِيقًا تَقْتُلُونَ ﴿٨٧﴾

ప్రవక్త అయినా మీ మనసులకు నచ్చని విషయాలు మీ వద్దకు తెచ్చినప్పుడల్లా మీరు అహంకారం ప్రదర్శించారు. వారిలో కొందరిని ధిక్కరించారు, మరి కొందరిని హతమార్చటం కూడా చేశారు.[99]

وَقَالُوا قُلُوبُنَا غُلْفٌ ۚ بَل لَّعَنَهُمُ اللَّهُ بِكُفْرِهِمْ فَقَلِيلًا مَّا يُؤْمِنُونَ ﴿٨٨﴾

**88** “మా హృదయాలు గలేబుల్లో చుట్టబడి ఉన్నాయ”ని[100] వారంటున్నారు. కాదు, వారి తిరస్కారవైఖరి మూలంగా అల్లాహ్ వారిని ధూత్కరించాడు. కనుక వారు విశ్వసించేది బహు స్వల్పం.[101]

---

సూరాలో రూహుల్ ఖుదుస్, ఇంజీలు గ్రంథం రెండూ వేర్వేరుగా ప్రస్తావించబడ్డాయి. దీనిద్వారా తెలిసేదేమిటంటే కొంతమంది అనుకుంటున్నట్లు, రూహుల్ ఖుదుస్ అంటే ఇంజీలు గ్రంథం కాదు. వేరొకచోట జిబ్రయీల్‌ను ‘రూహుల్ అమీన్’గా పిలువటం జరిగింది. ఒకసారి దైవప్రవక్త (సఅసం) తన ప్రియ సహచరులైన హజ్రత్ హస్సాన్ (రజి) కోసం దైవాన్ని ప్రార్థిస్తూ, “ఓ అల్లాహ్! రూహుల్ ఖుదుస్ ద్వారా ఆయనకు తోడ్పాటునందించు” అని అన్నారు. “జిబ్రయీల్ మీకు అండగా ఉన్నారు” అని వేరొక హదీసులో ఉంది. కనుక రూహుల్ ఖుదుస్ (పరిశుద్ధుని ఆత్మ) అంటే జిబ్రయీల్ అనే భావించాలి (ఫత్‌హుల్ బయాన్, ఇబ్నె కసీర్ – అష్రఫుల్ హవాషీ ఆధారంగా).

99. అంటే వీరు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం)ను, హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ధిక్కరించారు. హజ్రత్ జకరియా, యహ్యాలను హతమార్చారు.

100. అంటే దీని అర్థం, “ఓ ముహమ్మద్! నీ మాటల ప్రభావం మాపై ఏమీ పడదులే” అని. వేరొకచోట కూడా ఇలాంటి మాటలే అనబడ్డాయి. ఉదాహరణకు : “నీవు దేని వైపుకు మమ్మల్ని పిలుస్తున్నావో ఆ పిలుపు నుండి మా హృదయాలు సురక్షితంగా ఉన్నాయి.” (హామీమ్ అస్సజ్దహ్–5)

101. హృదయాలపై సత్యవాక్కు ప్రభావం పడకుండా ఉండటం అన్నది గర్వపడే విషయం ఎంతమాత్రం కాదు. పైగా ఇది దౌర్భాగ్యానికి, శాపగ్రస్తస్థితికి సంకేతం. వీళ్లలో ఉన్న విశ్వాసం (ఈమాన్) కూడా చాలా తక్కువ. లేక వీళ్ళలో విశ్వసించే వారు చాలా కొద్దిమంది మాత్రమే.

وَلَمَّا جَاءَهُمْ كِتَابٌ مِّنْ عِندِ اللَّهِ مُصَدِّقٌ لِّمَا مَعَهُمْ
وَكَانُوا مِن قَبْلُ يَسْتَفْتِحُونَ عَلَى الَّذِينَ كَفَرُوا فَلَمَّا
جَاءَهُم مَّا عَرَفُوا كَفَرُوا بِهِ ۚ فَلَعْنَةُ
اللَّهِ عَلَى الْكَافِرِينَ ﴿٨٩﴾

**89** వారి వద్ద (ముందు నుంచే) ఉన్న దైవగ్రంథాన్ని ధృవీకరించే గ్రంథం అల్లాహ్ వద్ద నుంచి వచ్చినప్పుడు, తెలిసి కూడా వారు దానిని తిరస్కరించసాగారు – మరి చూడబోతే దీని రాకకు మునుపు తమకు అవిశ్వాసులపై విజయం చేకూరాలని[102] వారు స్వయంగా అభిలషించేవారు. ఇటువంటి తిరస్కారులపై అల్లాహ్ శాపం పడుగాక!

بِئْسَمَا اشْتَرَوْا بِهِ أَنفُسَهُمْ أَن يَكْفُرُوا بِمَا أَنزَلَ اللَّهُ بَغْيًا
أَن يُنَزِّلَ اللَّهُ مِن فَضْلِهِ عَلَىٰ مَن يَشَاءُ مِنْ عِبَادِهِ ۖ

**90** ఏ వస్తువుకు బదులుగా వారు తమను అమ్ముకున్నారో అది అత్యంత నీచమైనది– అది వారి తిరస్కారం. అల్లాహ్ తాను ఇష్ట పడే తన దాసుణ్ణి ప్రత్యేకంగా అనుగ్రహించాడన్న అసూయతో[103] వారు అల్లాహ్ తరఫున అవతరించిన విషయాలను తిరస్క

102. మూలంలో **"యస్తఫ్తిహూన"** అనే పదం వచ్చింది. దీనికి రెండు అర్థాలున్నాయి. ఒకటి : ఆధిక్యతను ప్రసాదించమనీ, సహాయం చేయమని ప్రార్థించటం. అంటే ఈ యూదులు ముష్రిక్కుల చేతిలో ఓటమిని చవి చూసినప్పుడు, "ఓ అల్లాహ్! అంతిమ ప్రవక్తను త్వరగా పంపు. మేము అతనితో కలిసి ఈ ముష్రిక్కులపై ఆధిక్యతను సంపాదిస్తాము" అని దేవుణ్ణి ప్రార్థించేవారు. అంటే మొదటి అర్థం ప్రకారం 'యస్తఫ్తిహూన' అనే పదం "యస్తన్సిరూన" (సహాయం కోరటం) అనే అర్థంలో వాడబడిందన్నమాట! ఇక ఈ పదానికి గల రెండో అర్థం సమాచారాన్ని అందించటం. దాని ప్రకారం ఈ ఆయతుకు 'త్వరలోనే అంతిమ ప్రవక్త రానున్నాడని యూదులు ముష్రిక్కులకు తెలియజేసేవార'ని అర్థం వస్తుంది (ఫత్హుల్ ఖదీర్). తీరా ఆ అంతిమ ప్రవక్త ప్రభవించాక, యూదులు తెలిసి కూడా, అసూయకొద్దీ ఆయన్ని విశ్వసించేందుకు నిరాకరించారు.

103. హజ్రత్ ముహమ్మద్ (సఅసం) వారు తౌరాత్, బైబిలు గ్రంథాల్లో సూచించబడిన అంతిమ దైవప్రవక్తయేనన్న సంగతి వారికి తెలుసు. గ్రంథవహులు ఆయన్ని ఓ ముక్తిప్రదాతగా భావించి, ఆయన (స) రాకకోసం ఎదురుచూసిన సంగతి కూడా వాస్తవమే. కాని 'ఆ ప్రవక్త'ను దేవుడు తమ సంతతి నుండి ఎన్నుకోలేదన్న అసూయతో వారు మహనీయ ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని త్రోసిపుచ్చారు. అంటే జాతి వివక్ష, అసూయ, సంకుచిత స్వభావం సత్య స్వీకారంలో ప్రధాన అడ్డంకిగా నిలిచాయి.

فَبَآءُوْ بِغَضَبٍ عَلٰى غَضَبٍ ۚ وَلِلْكٰفِرِيْنَ عَذَابٌ
مُّهِيْنٌ ﴿٩٠﴾

రించి ఆగ్రహంపై ఆగ్రహానికి[104] పాత్రు లయ్యారు. ఇంకా ఈ తిరస్కారుల కొరకు ఘోర అవమానంతో కూడిన శిక్ష ఉంది.

وَاِذَا قِيْلَ لَهُمْ اٰمِنُوْا بِمَآ اَنْزَلَ اللّٰهُ قَالُوْا نُؤْمِنُ
بِمَآ اُنْزِلَ عَلَيْنَا وَيَكْفُرُوْنَ بِمَا وَرَآءَهٗ ۗ وَهُوَ
الْحَقُّ مُصَدِّقًا لِّمَا مَعَهُمْ ۗ قُلْ فَلِمَ تَقْتُلُوْنَ
اَنْۢبِيَآءَ اللّٰهِ مِنْ قَبْلُ اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ﴿٩١﴾

**91** "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని విశ్వసించండి" అని వారితో అన్నప్పుడు, "మాపై అవతరింపజేయబడిన దానిని మేము విశ్వసిస్తున్నాం"[105] అని సమా ధానమిస్తారు. దాని తర్వాత వచ్చిన దాన్ని, అది సత్యమైనప్పటికీ, తమ వద్ద ఉన్న గ్రంథాన్ని అది ధృవీకరిస్తున్నప్పటికీ వారు తిరస్కరిస్తారు. (సరే! అలాగైతే) వారిని ఈ విధంగా అడుగు: "(మునుపటి గ్రంథాలపై) మీకు నమ్మక ముంటే, మరి పూర్వం వచ్చిన దైవప్రవక్తలను ఎందుకు హత్య చేశారు?"[106]

وَلَقَدْ جَآءَكُمْ مُّوْسٰى بِالْبَيِّنٰتِ ثُمَّ اتَّخَذْتُمُ الْعِجْلَ
مِنْۢ بَعْدِهٖ وَاَنْتُمْ ظٰلِمُوْنَ ﴿٩٢﴾

**92** మీ వద్దకు మూసా ఈ సూచనలనే తీసుకువచ్చాడు. అయినాసరే అతను వెళ్ళిన తరువాత మీరు ఆవుదూడను పూజించారు. (అసలు విషయం ఏమి టంటే) మీరు దుర్మార్గులు.[107]

104. ఆగ్రహంపై ఆగ్రహం అంటే భావం తీవ్రమయిన కోపావేశం. ఎందుకంటే వారు మాటిమాటికీ కోపం తెప్పించే పనులే చేస్తూ పోయారు. వెనుకటి పుటల్లో ఆ వివరాలు వచ్చాయి. కాని ఇప్పుడు వారు అసూయ వల్ల దివ్య ఖుర్ఆన్‌ను, మహనీయ ముహమ్మద్ (స)ను తృణీకరించారు.

105. అంటే మాకు తౌరాత్‌పై విశ్వాసం ఉంది. కాబట్టి మేము ఖుర్ఆన్‌ను విశ్వసించవలసిన అవసరం లేదు అన్నది యూదుల ఉద్దేశ్యం.

106. అంటే–తౌరాత్‌పై విశ్వాసముందన్న మీ మాటల్లో నిజాయితీ లేదు. ఒకవేళ ఉంటే మీరు మీ కాలం నాటి ప్రవక్తలను వధించేవారు కారు. కాబట్టి మీరు మీ వాదనలో సత్యవంతులు కారు. కేవలం ఓర్వలేనితనం కారణంగా మీరు ఖుర్ఆన్‌ను విశ్వసించటం లేదు.

وَإِذْ أَخَذْنَا مِيثَاقَكُمْ وَرَفَعْنَا فَوْقَكُمُ الطُّورَ
خُذُوا مَا آتَيْنَاكُم بِقُوَّةٍ وَاسْمَعُوا ۖ قَالُوا سَمِعْنَا
وَعَصَيْنَا وَأُشْرِبُوا فِي قُلُوبِهِمُ الْعِجْلَ
بِكُفْرِهِمْ ۚ قُلْ بِئْسَمَا يَأْمُرُكُم بِهِ
إِيمَانُكُمْ إِن كُنتُم مُّؤْمِنِينَ ﴿٩٣﴾

**93** మేము తూరు పర్వతాన్ని మీపైకి ఎత్తి, మీనుండి వాగ్దానం తీసుకున్న సందర్భాన్ని మననం చేసుకోండి – (ఆ సందర్భంగా మేము) "మీకు ప్రసాదించిన దానిని గట్టిగా పట్టుకోండి. మరియు వినండి" అని అనగానే, వారు "మేము విన్నాము. కాని శిరసావహించము" అని బదులి చ్చారు.[108] అసలు వారి హృదయాలలో ఆవుదూడ పట్ల ప్రేమాభిమానాలు నూరి పోయబడ్డాయి.[109] వారి అవిశ్వాసం కారణంగా (వారికీ దుర్గతి పట్టింది).[110] వారితో అనండి : "మీరు విశ్వాసులే అయితే మీ ఈ విశ్వాసం మీకు చెడు ఆజ్ఞ ఇస్తుంది."

107. వారి తిరస్కార వైఖరికి, వైర భావానికి ఇది కూడా ఒక నిదర్శనమే. ప్రవక్త మూసా స్పష్టమయిన దైవాదేశాలను, నిదర్శనాలను తీసుకువచ్చి దైవప్రవక్తనయిన తనను అనుసరించమని కోరారు. ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే పూజించమని పిలుపు ఇచ్చారు. కాని మీరు మాత్రం హజ్రత్ మూసా (అలైహిస్సలాం)ను ఎంతగానో వేధించారు. ఆయన పట్ల దురుసుగా ప్రవర్తించారు. కడకు ఆయన కొన్నాళ్ళపాటు తూర్ పర్వతంపైకి పోగానే, ఆయన వెనకే దూడను ఆరాధ్య దైవంగా చేసుకున్నారు. మీ వైఖరి కడు శోచనీయం.

108. వారిలోని పెడసరి ధోరణికి, దురహంకారానికి ఇదొక తార్కాణం అన్నమాట! చెప్పినట్టు వింటామని అంటూనే మనసులో మరొక తలంపు కలిగి ఉండటం, ద్వంద్వార్థాలతో కూడిన వాక్యాలు పలకటం – ఇదంతా సూచించేదేమిటీ? ముమ్మాటికీ ఇది వారిలోని ఆత్మ వంచనకు అద్దం పడుతున్నది.

109. అసలే ప్రేమ గుడ్డిది అంటారు. మనిషిలో ఏదైనా ఒక వస్తువు పట్ల అమితమయిన ప్రేమ ఏర్పడిందంటే దానికోసం అతను ఏమైనా చేస్తాడు. బనీ ఇస్రాయీల్‌కు ఆవుదూడ పట్ల ప్రేమ నూరిపోయబడింది. ఆ ప్రేమ వారి నరనరాల్లో చెడు రక్తంలా ప్రవహిస్తోంది. కాబట్టి వారు ఏకదైవారాధన వైపుకు చిత్తశుద్ధితో మరలి రావటం అన్నది కష్టం.

110. అంటే దుర్బుద్ధి, ఆవుదూడ పట్ల గల ప్రేమ మూలంగా మీ హృదయాలలో 'కుఫ్ర్' (అవిశ్వాసం) గూడుకట్టుకుంది. అది ఇట్టే తొలగిపోయేది కాదు అని భావం.

**94** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఒకవేళ అల్లాహ్ వద్ద పరలోక నివాసం ఇతర మానవులెవరికీ కాకుండా కేవలం మీ కొరకే ప్రత్యేకమై ఉంటే, రండి! మీ వాదన సత్యమైందనడానికి రుజువుగా మరణాన్ని కోరండి."

قُلْ إِن كَانَتْ لَكُمُ الدَّارُ الْآخِرَةُ عِندَ اللَّهِ خَالِصَةً مِّن دُونِ النَّاسِ فَتَمَنَّوُا الْمَوْتَ إِن كُنتُمْ صَادِقِينَ ﴿٩٤﴾

**95** కాని వారు తమ చేజేతులా చేసుకున్న దురాగతాల దృష్ట్యా ఎన్నటికీ మరణాన్ని కోరరు.[111] అల్లాహ్ దుర్మార్గుల గురించి బాగా ఎరిగినవాడు.

وَلَن يَتَمَنَّوْهُ أَبَدًا بِمَا قَدَّمَتْ أَيْدِيهِمْ ۗ وَاللَّهُ عَلِيمٌ بِالظَّالِمِينَ ﴿٩٥﴾

**96** (ఓ ప్రవక్తా!) జీవితం పట్ల అందరి కన్నా ఎక్కువ వ్యామోహం వీరికే ఉందన్న విషయాన్ని నువ్వు గ్రహిస్తావు. (జీవితం పట్ల వ్యామోహంలో) వీరు ముష్రిక్కులను కూడా మించిపోయారు.[112] వీరిలోని ప్రతి

وَلَتَجِدَنَّهُمْ أَحْرَصَ النَّاسِ عَلَىٰ حَيَاةٍ وَمِنَ الَّذِينَ أَشْرَكُوا ۚ يَوَدُّ أَحَدُهُمْ لَوْ يُعَمَّرُ أَلْفَ سَنَةٍ

111. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) గారు దీన్ని 'దావతె ముబాహలా'గా పేర్కొన్నారు. అంటే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) దైవదౌత్యాన్ని తృణీకరించటంలోనూ, దైవసన్నిధిలో మీరు అందరికన్నా ఎక్కువ ప్రేమపాత్రులు అన్న ప్రకటనలోనూ మీరు సత్యవంతులే అయితే ముస్లింలు, యూదులు – ఇరువర్గాల వారూ కలసి అల్లాహ్‌ను ఈ విధంగా అభ్యర్థించాలి : "ఓ అల్లాహ్! ఇరువురిలో ఎవరు అబద్ధం చెబుతున్నా సరే వారిని మృత్యువాతకు గురిచెయ్యి." జుమా సూరాలో కూడా వారికి ఈ విధంగా సవాలు విసరబడింది. ఆలి ఇమ్రాన్ సూరాలో వచ్చిన ప్రస్తావన ప్రకారం నజరాన్‌కు చెందిన క్రైస్తవులకు కూడా ఈ రకమయిన సవాలు చేయబడింది. యూదులు కూడా క్రైస్తవుల వలెనే తమ వాదనలో అసత్యవంతులవటం చేత ఈ సవాలును స్వీకరించలేదు. అందుకే అల్లాహ్ వీళ్లను ఉద్దేశించి, "ఎట్టి పరిస్థితిలోనూ వారు మరణాన్ని కోరరు (అంటే 'ముబాహలా'కు సిద్ధమవరు)" అని అన్నాడు. ఈ వ్యాఖ్యానానికే హాఫిజ్ ఇబ్నె కసీర్ కూడా ప్రాధాన్యతనిచ్చారు.

112. మరణం సంగతి అటుంచి, అసలు ప్రాపంచిక జీవితం పట్ల వారికెంత మక్కువ ఉందంటే, ఈ విషయంలో ప్రపంచ జనులెవరూ వారితో పోటీపడలేరు. ఆఖరికి ముష్రిక్కులు కూడా. అయితే దీర్ఘాయుషు వారిని అల్లాహ్ శిక్షనుంచి కాపాడజాలదు. ఎక్కువ కాలం బ్రతికి ఉన్నంత మాత్రాన వారి పాపాల పుట్ట తరుగుతుందని ఆశిస్తే

وَمَا هُوَ بِمُزَحْزِحِهٖ مِنَ الْعَذَابِ اَنْ يُّعَمَّرَ ۭ وَاللّٰهُ
بَصِيْرٌۢ بِمَا يَعْمَلُوْنَ ۝٩٦

ఒక్కడూ వెయ్యి సంవత్సరాల వయస్సును కోరుకుంటాడు. అయితే ఈ దీర్ఘాయుష్షు కూడా వారిని శిక్ష బారి నుంచి ఏ మాత్రం తప్పించలేదు. అల్లాహ్ వారి కార్యకలాపాలన్నింటినీ చూస్తూనే ఉన్నాడు.

قُلْ مَنْ كَانَ عَدُوًّا لِّجِبْرِيْلَ فَاِنَّهٗ نَزَّلَهٗ عَلٰي قَلْبِكَ
بِاِذْنِ اللّٰهِ مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ وَھُدًى وَّبُشْرٰى
لِلْمُؤْمِنِيْنَ ۝٩٧

**97** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "జిబ్రీల్‌కు శత్రువు అయిన ప్రతివాడూ (అల్లాహ్‌తో శత్రుత్వాన్ని కొనితెచ్చుకున్నాడన్న) యదార్థాన్ని గ్రహించాలి. ఎందుకంటే అల్లాహ్ సూచనపైనే ఆయన నీ హృదయంపై ఈ సందేశాన్ని అవతరింపజేశాడు. ఇది (ఈ ఖుర్‌ఆన్) తనకు పూర్వం వచ్చిన గ్రంథాలను ధృవీకరిస్తుంది. విశ్వసించే వారికి మార్గ దర్శకత్వం వహిస్తూ, వారికి శుభవార్త ఇస్తుంది.[113]

పొరబాటే. తాము అల్లాహ్‌కు ఎంతో ఇష్టమైన వారం అనీ, స్వర్గం తమ స్వంతమనీ, మిగిలిన వారంతా నరకవాసులన్న వాదనలో యూదులు సత్యసంధులు కారని, పైగా వారు కేవలం కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని తేలిపోయింది. ఆ విషయం నిజమై ఉంటే, లేదా కనీసం తమ వాదనలో తాము అతిశయిల్లటం లేదన్న నమ్మకం స్వయంగా వారికుంటే "మరణాన్ని కోరటానికి" వారు వెనుకంజవేసేవారు కాదు. నోటితో వారు ఎన్ని గొప్పలు చెప్పినప్పటికీ, వాగ్ధాటితో తమ చుట్టూ ఎంత సుందరమైన వలయాన్ని అల్లుకున్నప్పటికీ మనస్సాక్షి మాత్రం వారిని నిరంతరం హెచ్చరిస్తూనే ఉంటుంది. అల్లాహ్ సన్నిధిలో నిలబడిన రోజున అవిధేయులకు పట్టే దుర్గతే తమకూ పడుతుంది అన్న యదార్థం కూడా వారికి తెలియనిది కాదు.

113. హదీసు ప్రకారం : కొంతమంది యూద పండితులు మహాప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, "మీరు గనక ఈ సందేహాలకు సరైన సమాధానం ఇస్తే మేము విశ్వసిస్తాము. ఎందుకంటే దైవప్రవక్త అయినవాడు మాత్రమే వీటికి సమాధానం ఇవ్వగలుగుతాడు" అని ప్రతిపాదించారు. మహాప్రవక్త (స) వారి సందేహాలన్నింటికీ సమాధానం ఇచ్చిన మీదట, "మీపై దైవవాణిని తీసుకువచ్చేది ఎవరు?" అని ప్రశ్నించారు. "జిబ్రీల్" అని ఆయన (స) బదులిచ్చారు. అప్పుడు యూదులు, "జిబ్రీల్ అయితే అతడు మా శత్రువు. అతడు వైమనస్యాన్ని, మారణకాండను, విపత్తును తీసుకుని వస్తూ ఉంటాడు"

مَنْ كَانَ عَدُوًّا لِّلّٰهِ وَمَلٰٓئِكَتِهٖ وَرُسُلِهٖ وَجِبْرِيْلَ وَمِيْكٰلَ فَاِنَّ اللّٰهَ عَدُوٌّ لِّلْكٰفِرِيْنَ ﴿٩٨﴾

**98** ఎవరు అల్లాహ్‌కు, ఆయన దూతలకు, ఆయన ప్రవక్తలకు, జిబ్రీల్ మరియు మీకాయీల్‌కు శత్రువులుగా ఉంటారో, అటువంటి అవిశ్వాసులకు అల్లాహ్ శత్రువుగా[114] ఉంటాడు.

అని వంకపెట్టి మహాప్రవక్త (స) దైవదౌత్యాన్ని శిరసావహించటానికి నిరాకరించారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

114. "మీకాయీల్ (దూత) మా నేస్తం" అని యూదులనేవారు. కాగా; "వాళ్ళందరూ నా ప్రియ దాసులే. వారికీ లేక వారిలో ఏ ఒక్కరికైనా శత్రువుగా ఉన్నవాడు, అల్లాహ్‌కు శత్రువు" అని స్వయంగా అల్లాహ్ అంటున్నాడు. "నా స్నేహితులలో ఎవరిపట్లనయినా వైరం వహించినవాడు వాస్తవానికి నాపై యుద్ధప్రకటన చేశాడు" అని హదీసులో ఉంది (సహీహ్ బుఖారీ). అంటే అల్లాహ్ స్నేహితుల్లోని ఏ ఒక్కరితోనయినా శత్రుత్వం వహిస్తే సమస్త స్నేహితులతో (ఔలియాలతో) శత్రుత్వం వహించినట్లే. అంతేకాదు, అల్లాహ్‌తో శత్రుత్వం కొనితెచ్చుకున్నట్లే. కాబట్టి "ఔలియా అల్లాహ్"ను అభిమానించటం, ఆదరించటం ఎంతో అవసరం. వారిపట్ల ద్వేషం, వైరభావం కలిగి ఉండటం అపరాధం. పైగా అది అల్లాహ్‌కు వ్యతిరేకంగా యుద్ధ ప్రకటన చేయటం వంటిదే. ఇంతకీ ఆ 'ఔలియా అల్లాహ్' ఎవరు? యూనుస్ సూరాలోని 62, 63 ఆయతులను అధ్యయనం చేయండి.

అయితే ఔలియా అల్లాహ్ (అల్లాహ్ స్నేహితుల) పట్ల ఆదరాభిమానాలు కలిగి ఉండటమంటే భావం వారు చనిపోయిన తరువాత వారి సమాధుల వద్దకు పోయి మొక్కటం, సమాధులపై పెద్ద పెద్ద గుంబదులు, గోపురాలు నిర్మించటం ఎంతమాత్రం కాదు. వారి పేరున ఏడాదికోసారి ఉరుసులనే మేళాలు, తిరునాళ్ళు ఏర్పాటు చేయటం, వారి పేరుమీద మొక్కుబడులు చేసుకోవటం, సమాధులకు స్నానాదులు చేయించి, సరికొత్త పరదాలను కప్పటం ధర్మసమ్మతం కాదు. అలాగే ఆ మృతులను అక్కరలు తీర్చేవారుగా, కష్టాలనుంచి గట్టెక్కించే వారుగా, లాభనష్టాలు చేకూర్చగల శక్తి ఉన్నవారుగా నమ్మి, వారి ముందు వేడుకోవటం, సామూహికంగా సమాధుల ముందు నిలబడి ధ్యానించటం, వాటి ముందు మోకరిల్లటం – ఎంతమాత్రం సమ్మతం కాదు. దురదృష్టవశాత్తు "ఔలియా అల్లాహ్ పట్ల అభిమానం" అనే పేరుపై ఈ వ్యాపారం మహా జోరుగా సాగుతోంది. చూడబోతే అది ఒకప్పటి లాత్, మనాత్ దేవతల పూజను పునరుద్ధరించే ప్రయత్నంగా కానవస్తుంది. నిజానికి ఇది 'ప్రేమ' కాదు. ఇదొక రకమయిన "పూజ". ఇది షిర్క్. ఘోర అపచారం. ఈ సమాధి పూజనుండి అల్లాహ్ మనల్ని కాపాడుగాక!

**99** (ఓ ప్రవక్తా!) స్పష్టమయిన సూచనలను మేము నీపై అవతరింపజేశాము. అవిధేయులు తప్ప వేరెవరూ వాటిని త్రోసిపుచ్చరు.

وَلَقَدْ أَنزَلْنَا إِلَيْكَ آيَاتٍ بَيِّنَاتٍ ۖ وَمَا يَكْفُرُ بِهَا إِلَّا
الْفَاسِقُونَ ﴿٩٩﴾

**100** వారెప్పుడు ఏ వాగ్దానం చేసినా, వారిలోని ఏదో ఒక వర్గం దాన్ని భంగపరుస్తుంది. పైగా వారిలో అనేకులు విశ్వాసులు కారు.

أَوَكُلَّمَا عَاهَدُوا عَهْدًا نَّبَذَهُ فَرِيقٌ مِّنْهُم ۚ بَلْ أَكْثَرُهُمْ
لَا يُؤْمِنُونَ ﴿١٠٠﴾

**101** వారి వద్దకు, వారి గ్రంథాన్ని నిజమని ధృవీకరించే ప్రవక్త అల్లాహ్ తరపు నుంచి ఎప్పుడు వచ్చినా ఆ గ్రంథవహులలోని ఒక వర్గం వారు, దైవ గ్రంథాన్ని, అసలు దాని గురించి ఏమీ తెలియని వారుగా[115] వెనుక పడవేశారు.

وَلَمَّا جَاءَهُمْ رَسُولٌ مِّنْ عِندِ اللَّهِ مُصَدِّقٌ لِّمَا مَعَهُمْ
نَبَذَ فَرِيقٌ مِّنَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ كِتَابَ اللَّهِ وَرَاءَ
ظُهُورِهِمْ كَأَنَّهُمْ لَا يَعْلَمُونَ ﴿١٠١﴾

**102** వారు సులైమాను రాజ్యంలోని షైతానులు అవలంబించిన విషయాల వెనుకపడ్డారు. అసలు సులైమాను ఎన్నడూ అవిశ్వాసానికి ఒడిగట్టలేదు, ఈ అవిశ్వాస పోకడ అసలు షైతానులదే. వారు ప్రజలకు చేతబడిని నేర్పేవారు.[116]

وَاتَّبَعُوا مَا تَتْلُو الشَّيَاطِينُ عَلَىٰ مُلْكِ سُلَيْمَانَ ۖ
وَمَا كَفَرَ سُلَيْمَانُ وَلَٰكِنَّ الشَّيَاطِينَ كَفَرُوا يُعَلِّمُونَ
النَّاسَ السِّحْرَ وَمَا أُنزِلَ عَلَى الْمَلَكَيْنِ بِبَابِلَ

115. అల్లాహ్ తన అంతిమ సందేశహరుణ్ణి (సఅసం) ఉద్దేశించి ఏమంటున్నాడంటే; మేము మీకు ఎన్నో స్పష్టమయిన సూచనలను, వాక్యాలను ఇచ్చిపంపాము. వాటిని చూసిన తరువాత యూదులు సయితం విశ్వసించాల్సిందే. అదీగాక వారి గ్రంథమైన తౌరాత్‌లోనూ మీ గుణగణాలు తెలుపబడ్డాయి. మిమ్మల్ని వారు విశ్వసించాలన్న ప్రమాణ ప్రస్తావన కూడా ఉంది.

కాని వారు ఎప్పుడు వాగ్దాన పాలన చేశారనీ ఈ వాగ్దానాన్ని కూడా పాలించటానికి!? వాగ్దాన భంగం చేయటం వారిలోని ఒక వర్గానికి హాబీ అయిపోయింది. ఆఖరికి దైవగ్రంథాన్ని కూడా వారు మరుగున పడవేశారు. దాని గురించి తమకేమీ తెలీనట్లే వ్యవహరించారు.

116. అంటే యూదులు దైవగ్రంథాన్ని, చేసిన బాసను నిర్లక్ష్యం చేసిందిగాక, షైతాను

هَارُوْتَ وَمَارُوْتَ ۚ وَمَا يُعَلِّمٰنِ مِنْ اَحَدٍ حَتّٰى يَقُوْلَآ اِنَّمَا
نَحْنُ فِتْنَةٌ فَلَا تَكْفُرْ ۚ فَيَتَعَلَّمُوْنَ مِنْهُمَا مَا يُفَرِّقُوْنَ

వారు బాబిలోనియాలో హారూత్, మారూత్ అనే ఇద్దరు దైవదూతలపై అవతరింపజేయబడిన విద్య వెంట పడ్డారు.[117] "మేము ఒక పరీక్ష వంటి

అడుగుజాడల్లో నడుస్తూ, చేతబడి వంటి క్షుద్రవిద్యల వెంటబడ్డారు. అంతేకాదు, హజ్రత్ సులైమాను (అలైహిస్సలాం) అసలు దైవప్రవక్తే కారనీ (దైవం మన్నించుగాక!), ఆయనొక మాంత్రికుడనీ, మంత్రతంత్రాల శక్తితో రాజ్యమేలాడనీ అపవాదు మోపారు. ఈ అపవాదును అల్లాహ్ ఖండించాడు : హజ్రత్ సులైమాను (అలైహిస్సలాం) చేతబడి చేసేవారు కాదు. ఎందుకంటే చేతబడి అనేది ఒక అవిశ్వాస పోకడ. అలాంటి అవిశ్వాసంతో కూడుకున్న చేష్టకు ఆయన ఎందుకు పాల్పడతారు?

హజ్రత్ సులైమాను (అలైహిస్సలాం) కాలంలో క్షుద్రవిద్యలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయని చెబుతారు. దీని నివారణోపాయంలో భాగంగా సులైమాను (అలైహిస్సలాం) క్షుద్ర సాహిత్యాన్ని సేకరించి వాటిని తన సింహాసనం క్రింద పాతిపెట్టేశారు. హజ్రత్ సులైమాన్ (అలైహిస్సలాం) మరణించిన తరువాత ఈ షైతానులు, మాంత్రికులు కలసి ఆ సాహిత్యాన్ని వెలికితీశారు. సులైమాన్ శక్తియుక్తుల, అధికారం వైభవాల వెనుక ఉన్న అసలు రహస్యం ఈ చేతబడేనని ప్రజలకు నమ్మ బలికారు. దీని ఆధారంగా ఈ దుర్మార్గులు హజ్రత్ సులైమాను (అలైహిస్సలాం)ను అవిశ్వాసి (కాఫిర్)గా ఖరారు చేశారు. అయితే అల్లాహ్ దీనిని ఖండించటమేగాక దీనిని ఒక నీలాపనిందగా అభివర్ణించాడు, సులైమానును ఒక నికార్సయిన విశ్వాసిగా పేర్కొన్నాడు (ఇబ్నె కసీర్).

117. కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు **'వమా ఉన్జిల'** అనే పదంలోని 'మా' అనే అక్షరాన్ని నకారాత్మక భావంలో తీసుకుని, హారూత్, మారూత్‌లపై అసలేమీ అవతరించలేదని అభిప్రాయపడ్డారు. అయితే ఖుర్ఆన్‌లో వచ్చిన తర్వాతి ప్రస్తావన ఈ అభిప్రాయాన్ని సమర్థించేదిగా లేదు. అందుకే ఇబ్నె జరీర్ మొదలగు వ్యాఖ్యానకర్తలు ఈ వాదనను త్రోసిపుచ్చారు (ఇబ్నె కసీర్). అలాగే హారూత్ మారూత్‌ల గురించి ఎన్నో ఇస్రాయీలీ ఉల్లేఖనాలు ఉన్నాయి. అయితే దైవప్రవక్త (స) స్వయంగా చెప్పినట్లు ప్రమాణబద్ధమైన ఉల్లేఖనం ఈ నేపథ్యంలో ఏ ఒక్కటీ లేదు. అల్లాహ్ వివరాల్లోకి పోకుండా, ఎంతో క్లుప్తంగా ఈ సంఘటనను ఖుర్ఆన్‌లో ప్రస్తావించాడు. కాబట్టి మనం ఈ విషయాన్ని అంతవరకు మాత్రమే విశ్వసించాలి (తఫ్సీర్ ఇబ్నె కసీర్). అల్లాహ్ ఇద్దరు దూతలకు చేతబడి విద్యను ఇచ్చి బాబిలోనియాకు పంపాడని ఖుర్ఆన్‌లోని ఈ వాక్యం ద్వారా తెలియవస్తోంది. (1) దీని ఉద్దేశ్యం ఏమై ఉంటుంది? (వాస్తవం దైవానికే ఎరుక) అంటే దైవప్రవక్తల ద్వారా వ్యక్తమయ్యే మహిమలు వేరు, ఈ చేతబడి వేరు. అల్లాహ్

وَيَتَعَلَّمُونَ مَا يَضُرُّهُمْ وَلَا يَنفَعُهُمْ ۚ وَلَقَدْ عَلِمُوا لَمَنِ اشْتَرَاهُ مَا لَهُ بِهِ بَيْنَ الْمَرْءِ وَزَوْجِهِ ۚ وَمَا هُم بِضَارِّينَ بِهِ مِنْ أَحَدٍ إِلَّا بِإِذْنِ اللَّهِ ۚ

వారం.[118] నువ్వు మాత్రం అవిశ్వాసానికి పాల్పడకు" అని (స్పష్టంగా) చెప్పనంత వరకూ వారు (ఇద్దరూ) ఎవరికీ ఆ విద్యను నేర్పేవారు కూడా కాదు. అయినప్పటికీ జనులు వారి దగ్గర భార్యాభర్తలను విడగొట్టే విద్యను నేర్చుకునేవారు. ఎంత చేసినా వారు అల్లాహ్ అనుమతి లేకుండా ఆ చేతబడి ద్వారా ఎవరికీ ఎలాంటి కీడు

తరఫున మాకు ఒసగబడిన చేతబడి ఇదిగో ఇలా ఉంటుంది, (ఈ కాలంలో చేతబడి సర్వత్రా ప్రబలిపోయిన కారణంగా దైవప్రవక్తలు కూడా మాంత్రికులే అయి ఉంటారేమో! అని కొంతమంది అనుమానించటం మొదలెట్టారు). ప్రజలు ఈ అపోహకు గురి కారాదన్న ఉద్దేశ్యంతో – ఒక పరీక్షగా – దైవదూతలను అవతరింప జేయటం జరిగింది.

(2) రెండో ఉద్దేశ్యం : బనీ ఇస్రాయీల్ నైతికంగా ఎంతగా దివాలా తీసిందో, చేతబడి వంటి క్షుద్రవిద్యను నేర్చుకోవటానికి వారు ఎలా దైవదూతల వెంటపడ్డారో తెలియజేయటం కూడా దీని ఉద్దేశ్యం అయ్యుండవచ్చు. చేతబడి అవిశ్వాసంతో కూడుకున్న పని అనీ, తాము ప్రజలకు ఒక పరీక్షగా మాత్రమే ప్రభవింపజెయ్యబడ్డామని దూతలు స్పష్టం చేసిన పిదప కూడా వారు ఈ క్షుద్రవిద్య కోసం ఎగబడ్డారు. తద్వారా ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురాల్లో కలతలు రేపి, అనుమానాల బీజాలు నాటి, వాళ్ళ సంసారాల్లో నిప్పులు పోయాలనీ, కాపురాలను కూల్చాలనీ వారు తహతహలాడేవారు. అంటే; అది వారి అధోగతికి, కుల్లుమోతు తనానికీ ఒక ప్రబల నిదర్శనం, కొంపలు కూల్చే వారి కార్యక్రమంలో ఒక ముఖ్యాంశం అన్నమాట! అల్లాహ్ మనల్ని దాన్నుంచి రక్షించుగాక!

118. ఇది మిథ్యను ఖండించే ఉద్దేశ్యంతో, ఒక గురువు వద్ద మిథ్యావాదాన్ని నేర్చుకోవటం వంటిది. మిథ్యావాదాన్ని ఖండిస్తాననీ, ధర్మరక్షణ కోసం ఆ విద్యను ఉపయోగిస్తానని శిష్యుడు ఇచ్చిన హామీపై గురువు అతనికి ఆ విద్యను నేర్పుతాడు. అంటే గురువు తన శిష్యుణ్ణి నమ్మాడు. కాని విద్య నేర్చుకున్న తరువాత శిష్యుడు సయితం మిథ్యావాదిగా మారిపోయి, మిథ్యను ప్రాచుర్యంలోనికి తెస్తే ఆ దోషం గురువుది కాదుకదా! "మేము అల్లాహ్ తరఫున దాసుల పాలిట ఓ పరీక్ష వంటి వాళ్ళం" అన్న ఆ ఇద్దరు దైవదూతల మాటల్లోని ఆంతర్యం ఇదే.

فِي الْآخِرَةِ مِنْ خَلَاقٍ ۚ وَلَبِئْسَ مَا شَرَوْا بِهِ أَنْفُسَهُمْ ۚ لَوْ كَانُوا يَعْلَمُونَ ﴿١٠٢﴾

కలిగించలేరు సుమా![119] తమకు నష్టం తప్ప ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని దానిని వారు నేర్చుకుంటున్నారు. ఆ విద్యను కొనుక్కున్న వారికి పరలోకంలో (అక్కడి సుఖసౌఖ్యాలలో) ఎలాంటి భాగం లేదన్న సంగతి వారికి సయితం తెలుసు. ఎంత నీచమైన వస్తువుకు బదులుగా వారు తమను తాము అమ్ముకుంటున్నారో వారికి తెలిస్తే ఎంత బావుండు!

وَلَوْ أَنَّهُمْ آمَنُوا وَاتَّقَوْا لَمَثُوبَةٌ مِنْ عِنْدِ اللَّهِ خَيْرٌ ۖ لَوْ كَانُوا يَعْلَمُونَ ﴿١٠٣﴾

**103** వారే గనక విశ్వసించి, భక్తిపరులుగా వ్యవహరించి ఉంటే అల్లాహ్ తరఫున వారికి అత్యుత్తమ పుణ్యఫలం లభించి ఉండేది. ఆ సంగతిని వారు తెలుసుకో గలిగితే ఎంత బావుండేది!

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَقُولُوا رَاعِنَا وَقُولُوا انْظُرْنَا وَاسْمَعُوا ۗ وَلِلْكَافِرِينَ عَذَابٌ أَلِيمٌ ﴿١٠٤﴾

**104** ఓ విశ్వాసులారా! (దైవప్రవక్త – సల్లల్లాహు అలైహి వ సల్లం–ను) 'రాయినా' అని అనకండి, 'ఉన్‌జుర్నా'[120] అని అనండి. శ్రద్ధగా వింటూ ఉండండి. అవిశ్వాసుల కొరకు బాధాకరమైన శిక్ష ఉంది.

119. దైవ ప్రణాళికకు ప్రమేయం లేనంతవరకూ ఈ చేతబడి కూడా ఎవరికీ ఎటువంటి హాని కలిగించజాలదు. చేతబడిని నేర్చుకోవటాన్ని, దానిని ఆచరణలో పెట్టడాన్నీ ఇస్లాం అధర్మంగా ఖరారు చేసింది. ఏ మేలును ఆశిస్తున్నా, ఏ కీడును పారద్రోలాలనుకున్నా అల్లాహ్ వైపుకు మరలాలి. ఎందుకంటే ఆయనే అందరి సృష్టికర్త. జగతిలో ఏ పని జరిగినా ఆయన ఆమోదించిన ప్రణాళికకు అనుగుణంగానే జరుగుతుంది.

120. **'రాయినా'** అంటే మమ్మల్ని కాస్త దృష్టిలో పెట్టుకోండి అని అసలు అర్థం. విషయం అర్థం కానప్పుడు ప్రేక్షకులు ఈ విధంగా చెప్పి వక్తను సావధానపరచేవారు. ఇలా చెప్పటం తప్పు కూడా కాదు. కాని యూదులు తమలోని ఈర్ష్య వల్ల ఈ పదాన్ని వక్రీకరించి ప్రయోగించేవారు. దాంతో అసలు అర్థం కాస్తా మారిపోయి చెడు అర్థం వచ్చేది. ఆ విధంగా వారు తమ మనసులోని అక్కసును, ఆవేశాన్ని చల్లార్చుకునేవారు.

مَا يَوَدُّ الَّذِيْنَ كَفَرُوْا مِنْ اَهْلِ الْكِتٰبِ وَلَا الْمُشْرِكِيْنَ
اَنْ يُّنَزَّلَ عَلَيْكُمْ مِّنْ خَيْرٍ مِّنْ رَّبِّكُمْ ؕ وَاللّٰهُ يَخْتَصُّ
بِرَحْمَتِهٖ مَنْ يَّشَآءُ ؕ وَاللّٰهُ ذُو الْفَضْلِ الْعَظِيْمِ ۝١٠٥

**105** మీపై మీ ప్రభువు తరఫునుంచి ఏదైనా మేలుతో కూడుకున్న విషయం అవతరించటం గ్రంథవహుల్లోని తిరస్కారులకుగానీ, ముష్రిక్కులకుగానీ ఏమాత్రం ఇష్టం లేదు. (వారెంతగా అసూయ చెందినా ఫరవాలేదు) అల్లాహ్ తన ప్రత్యేక కారుణ్యం నుంచి తాను కోరిన వారికి అనుగ్రహిస్తాడు, అల్లాహ్ గొప్ప అనుగ్రహం కలవాడు.

مَا نَنْسَخْ مِنْ اٰيَةٍ اَوْ نُنْسِهَا نَاْتِ بِخَيْرٍ مِّنْهَآ اَوْ مِثْلِهَا ؕ اَلَمْ
تَعْلَمْ اَنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَىْءٍ قَدِيْرٌ ۝١٠٦

**106** (ఓ ప్రవక్తా!) ఏదేని ఒక వాక్యాన్ని మేము రద్దుపరచినా[121] లేక మరపింప జేసినా (దాని స్థానంలో) దానికన్నా ఉత్తమమైన దానినీ లేదా కనీసం దానికి సమానమైన దానిని తీసుకువస్తాము. అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడన్న సంగతి నీకు తెలియదా?

ఉదాహరణకు : 'రాయినా' (ఓ మా కాపరివాడా!) లేక 'రాయినన్' (చిలిపి మనిషీ!) మొదలైన పద ప్రయోగాలు చేసేవారు. ఈ ద్వంద్వ స్వభావం వారికి కొత్తేమీ కాదు. సలాం చేయవలసి వచ్చినపుడు కూడా వాళ్ళు "అస్సలాము అలైకుమ్" బదులు "అస్సాము అలైకుమ్" (మీకు చావు వచ్చుగాక!) అని పలికేవారు. అందుకే అల్లాహ్ వారిని 'రాయినా' బదులు 'ఉన్‌జుర్నా' అని పలకమని ఉపదేశించాడు. ఉన్‌జుర్‌నా అంటే మా వైపు చూడు, మమ్మల్ని కూడా దృష్టిలో పెట్టుకో అని అర్థం. ఇందులో పెడర్థాలు రావు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే వ్యంగ్యానికి, పరిహాసానికి ఆస్కారం కల్పించే పదాలను ఉపయోగించటం, ఎదుటివారిని అగౌరవపరచే ధోరణిని అవలంబించటం సమంజసం కాదు. అలాగే మాటల్లోనూ, చేతల్లోనూ అవిశ్వాసుల పద్ధతులను అనుసరించకుండా జాగ్రత్త పడటం మంచిది. తద్వారా ముస్లింలు, "ఎవరు అన్యుల పద్ధతులను పోలిన పద్ధతులనే అవలంబిస్తాడో అతడు వారిలోని వాడుగానే పరిగణించబడతాడు" అన్న మహాప్రవక్త (స) హెచ్చరికను ఖచ్చితంగా ఖాతరు చేసిన వారవుతారు. ఈ ప్రవచనం అబూ దావూద్ గ్రంథంలో ఉంది.

121. అరబీలో **'నస్ఖ్'** అనే పదం వచ్చింది. నిఘంటువు ప్రకారం నస్ఖ్ అంటే నకలు చేయటం అని అర్థం. కాని షరీయతు పరిభాషలో ఏదేని ఒక ఆదేశాన్ని మార్చి దాని స్థానంలో కొత్త ఆదేశాన్ని తీసుకురావటాన్ని 'నస్ఖ్' అంటారు. ఈ మార్పు అల్లాహ్

**107** భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌దేననీ, అల్లాహ్ తప్ప మరొక రెవరూ మీ రక్షకులూ, సహాయకులూ కారన్న విషయం నీకు తెలియదా?

أَلَمْ تَعْلَمْ أَنَّ اللَّهَ لَهُ مُلْكُ السَّمَاوَاتِ وَالْأَرْضِ
وَمَا لَكُم مِّن دُونِ اللَّهِ مِن وَلِيٍّ وَلَا نَصِيرٍ ﴿١٠٧﴾

తరపున జరిగింది. అల్లాహ్ తాను కోరిన సమయంలో తాను కోరిన ఆదేశాన్ని రద్దుపరచి, నూతన ఆదేశాన్ని ప్రవేశపెట్టగలడు. ఒకప్పుడు ఆదం (అలైహిస్సలాం) కాలంలో అన్నాచెల్లెళ్ళ మధ్య వివాహబంధం ధర్మసమ్మతంగా ఉండేది. అప్పట్లో అది అధర్మం కాదు. కాని కొంతకాలం తర్వాత ఇది హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేయబడింది. అలాగే దివ్య ఖుర్‌ఆన్‌లో కూడా అల్లాహ్ కొన్ని ఆదేశాలను అవతరింపజేసిన తరువాత వాటిని రద్దు చేశాడు. వాటి స్థానంలో సరికొత్త ఆదేశాలను అవతరింపజేశాడు. అటువంటి ఆయతులు ఎన్ని ఉంటాయి? అన్న విషయమై భిన్నాభిప్రాయాలున్నాయి. వాటి సంఖ్య కేవలం 'అయిదు' అని షాహ్ వలీయుల్లాహ్ గారు 'ఫౌజుల్ కబీర్'లో వివరించారు. ఈ రద్దు కూడా మూడు విధాలుగా ఉంటుంది. ఒకటి : ఒక ఆయతును రద్దుపరచి దాని స్థానంలో మరొక ఆయతును అవతరింపజేయటం. రెండు : రెండో తరహా ఎటువంటిదంటే, మొదటిసారిగా వచ్చిన ఆజ్ఞల వాక్యం ఖుర్‌ఆన్‌లో ఉంటుంది. దాని పారాయణం కూడా జరుగుతుంది, దాంతో పాటు తదుపరి అవతరించిన వాక్యం కూడా ఖుర్‌ఆన్‌లో పొందుపరచబడి ఉంటుంది – అంటే కొత్తగా వచ్చిన ఆయతుతో పాటు రద్దు పరచబడిన ఆయతు కూడా యథాతథంగా ఉంచబడుతుందన్నమాట! దీన్నే "నస్ఖ్ మఅత్తిలావత్" అని అంటారు. మూడు : ఇక మూడో తరహా రద్దు ఎలాంటిదంటే, ఆయతుల పారాయణం రద్దుచేయబడుతుంది. ఆ వాక్యాలు ఖుర్‌ఆన్‌లో పఠించబడవు. అంటే మహనీయ ముహమ్మద్ (సఅసం) దివ్య ఖుర్‌ఆన్‌లో ఆ ఆయత్‌ను పొందుపరచలేదు. కాని దాని ఆదేశాన్ని మాత్రం ఆయన యథాతథంగా ఉంచారు. ఉదాహరణకు: "వివాహితుడైన పురుషుడు, వివాహితురాలైన స్త్రీ – ఒకవేళ వ్యభిచారం చేస్తే వారికి శిలాశిక్ష విధించాలి" (ముఅత్తా ఇమామ్ మాలిక్ – కితాబుల్ హుదూద్). ఈ వాక్యాలు కూడా ఒకప్పుడు ఖుర్‌ఆన్‌లో అంతర్భాగంగా ఉండేవి. వాటి పఠనం కూడా జరిగేది. కాని ఆ తరువాత ఈ ఆయతుల పఠనం రద్దయింది. అయితే వాటి ఆదేశం మాత్రం అలాగే ఉంచబడింది.

**"మా ననసఖ్ మిన్ ఆయతిన్......."** అన్న పై ఆయతులో అల్లాహ్ మొదటి రెండు రకాల రద్దుల గురించి చెబుతున్నాడు. **"మా ననసఖ్ మిన్ ఆయతిన్"** (మేము ఏదేని వాక్యాన్ని రద్దుపరచినా) అన్న వాక్యం రెండవ రకమైన రద్దును సూచిస్తున్నది (అంటే మేము వాటిని రద్దుచేసినా కూడా వాటిని మీచేత మరిపింపజేయము. అవి ఖుర్‌ఆన్‌లో యథాతథంగా ఉంటాయి). ఇకపోతే **"అవ్ నున్‌సిహా"** (లేక మేము

أَمْ تُرِيدُونَ أَنْ تَسْأَلُوا رَسُولَكُمْ كَمَا سُئِلَ مُوسَىٰ
مِنْ قَبْلُ ۗ وَمَنْ يَتَبَدَّلِ الْكُفْرَ بِالْإِيمَانِ فَقَدْ ضَلَّ
سَوَاءَ السَّبِيلِ ﴿١٠٨﴾

**108** లోగడ మూసా (అలైహిస్సలాం)కు వేయబడినటువంటి ప్రశ్నలే మీరు మీ ప్రవక్త (ముహమ్మద్–స)కు వేయదలుస్తు న్నారా?[122] (అయితే వినండి) విశ్వాసాన్ని అవిశ్వాస వైఖరి ద్వారా మార్చేవాడు రుజు మార్గం నుంచి తప్పిపోతాడు.

وَدَّ كَثِيرٌ مِنْ أَهْلِ الْكِتَابِ لَوْ يَرُدُّونَكُمْ مِنْ بَعْدِ
إِيمَانِكُمْ كُفَّارًا حَسَدًا مِنْ عِنْدِ أَنْفُسِهِمْ مِنْ بَعْدِ

**109** ఈ గ్రంథవహుల్లోని అనేకులు, సత్యమేదో స్పష్టంగా తెలిసిపోయినప్పటికీ– కేవలం తమ మనసులలో ఉన్న అసూయ మూలంగా మిమ్మల్ని కూడా విశ్వాస మార్గం నుంచి అవిశ్వాసం వైపు

మరిపింపజేసినా) అన్న వాక్యం మొదటిరకపు రద్దును సూచిస్తున్నది (అంటే ఒక ఆయతు యొక్క పారాయణం, దాని ఆదేశం రెండింటినీ మరిపింపజేస్తాడు అల్లాహ్).

"మేము మరిపింపజేస్తాము" అంటే భావం ఆ ఆదేశంతో పాటు, తత్సంబంధిత ఆయతును కూడా మేము లేపుకుంటాము. అంటే మీరు మరచిపోయేలా చేసి, కొత్త ఆదేశాన్ని అవతరింపజేస్తాము. లేక మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మనోఫలకంపై నుంచే మేము దాన్ని చెరిపేస్తాము.

యూదులు తౌరాత్ గ్రంథాన్ని మార్పులకు వీలులేని గ్రంథంగా ఖరారు చేసేవారు. ఖుర్ఆన్‌లో కూడా కొన్ని ఆదేశాలు రద్దు కావటంపై వారు ఆక్షేపణను తెలియజేశారు. కాని అల్లాహ్ వారి ఆక్షేపణను ఖండిస్తూ, భూమ్యాకాశాల సార్వభౌమత్వం అల్లాహ్‌దేననీ, తాను సముచితం అనుకున్న దానిని ఆయన సమ్మతించి ఆమోదిస్తాడనీ స్పష్టం చేశాడు. నిజమే. ఏ ఆజ్ఞ ఎప్పుడు, ఎక్కడ సరిగ్గా వర్తిస్తుందో, దేనిలో మానవాళి శ్రేయోసాఫల్యాలు ఇమిడి ఉన్నాయో ఆయనకు బాగా తెలుసు. అందుకే ఆయన తాను తలచిన ఆదేశాన్ని రద్దుపరచగలడు, తాను తలచిన దానిని ప్రవేశపెట్టగలడు. అది ఆయన తిరుగులేని అధికారానికి, గుణగణాలకు దర్పణం అన్నమాట! కొంతమంది ప్రాచీన మార్గభ్రష్టులు (ఉదాహరణకు అబూ ముస్లిం అస్ఫహానీ మూతజిలి వంటివారు), నేటి సోకాల్డ్ అభ్యుదయవాదులు కూడా యూదుల మాదిరిగానే, ఖుర్ఆన్‌లో అల్లాహ్ తరఫున జరిగిన ఈ 'రద్దు'ను నమ్మ నిరాకరించారు. నిజానికి పైన వివరించబడిన విషయమే సరైనది. సలఫె సాలిహీన్ విశ్వాసం కూడా అదే. అంటే ఖుర్ఆన్‌లో నస్ఖ్ (రద్దు) జరిగిందని!

122. ఈ ఆయతులో ముస్లిములకు (మహాప్రవక్త ప్రియసహచరులకు) హెచ్చరిక ఉంది.

مَا تَبَيَّنَ لَهُمُ الْحَقُّ ۚ فَاعْفُوا وَاصْفَحُوا حَتَّىٰ يَأْتِيَ
اللَّهُ بِأَمْرِهِ ۗ إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿١٠٩﴾

మళ్ళించాలని చూస్తున్నారు. కాబట్టి అల్లాహ్ తన ఆదేశాన్ని తీసుకువచ్చే వరకూ మీరు కూడా మన్నింపుల వైఖరిని అవలంబిస్తూ ఉండండి, వారిని పట్టించు కోకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్నిం టిపై అధికారం కలవాడు.

وَأَقِيمُوا الصَّلَاةَ وَآتُوا الزَّكَاةَ ۚ وَمَا تُقَدِّمُوا
لِأَنفُسِكُم مِّنْ خَيْرٍ تَجِدُوهُ عِندَ اللَّهِ ۗ إِنَّ اللَّهَ
بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ﴿١١٠﴾

**110** మీరు మాత్రం నమాజును నెలకొల్పుతూ, జకాత్‌ను ఇస్తూ ఉండండి, మీరు మీ కోసం ఏ మంచి పనులను ముందుగా పంపుకున్నా అల్లాహ్ వద్ద వాటిని పొందుతారు. నిస్సందేహంగా అల్లాహ్ మీ కార్యకలాపాలన్నింటినీ గమనిస్తూనే ఉన్నాడు.[123]

وَقَالُوا لَن يَدْخُلَ الْجَنَّةَ إِلَّا مَن كَانَ هُودًا
أَوْ نَصَارَىٰ ۗ تِلْكَ أَمَانِيُّهُمْ ۗ قُلْ هَاتُوا
بُرْهَانَكُمْ إِن كُنتُمْ صَادِقِينَ ﴿١١١﴾

**111** “యూదులు, క్రైస్తవులు తప్ప వేరెవరూ స్వర్గంలో ప్రవేశించలేర”ని వారంటున్నారు. ఇవి వారి ఆశలు, ఆకాంక్షలు మాత్రమే. “మీరు మీ వాదనలో సత్యవంతులే అయితే ఆ మేరకు ఏదన్నా నిదర్శనం సమర్పించండి” అని వారిని అడుగు.[124]

---

యూదుల వలెనే మీరు ప్రవక్తకు తిక్క ప్రశ్నలు వేసి, పెడసరి మాటలు పలికి విశ్వాసంలో కల్తీకి తావీయకండి. ఎందుకంటే ఇలాంటి పనికిమాలిన ప్రశ్నల్లో నుంచి ‘అవిశ్వాస వాసన’ వస్తోంది.

123. యూదుల హృదయాలలో తిష్ఠవేసి వున్న అసూయా ద్వేషాల మూలంగా వాళ్ళు ఇస్లాంను, అంతిమ దైవప్రవక్త (స)ను విశ్వసించేందుకు నిరాకరించారు. తాము దారి తప్పినది గాక, ముస్లింలను సయితం పెడత్రోవ పట్టించజూశారు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిముల కర్తవ్యం ఏమిటో తెలుపటం జరిగింది. ఇలాంటి పరీక్షా సమయంలో వారు అల్లాహ్ వైపుకే మరలాలి. నమాజును స్థాపించాలి, దానధర్మాలు చేస్తూ ఉండాలి. సహనం, సంయమనాన్ని పాటించాలి. దుర్మార్గుల దుశ్చేష్టలను పట్టించుకోకుండా, వారి పట్ల మన్నింపుల వైఖరినే అవలంబించాలి. తద్వారా దైవసహాయం మీకు అందుతుంది.

124. ఇక్కడ గ్రంథవహుల గర్వాతిశయం, ఆత్మ ఆధిక్యతా భావం మరోసారి ప్రస్తావించ

بَلٰى مَنْ اَسْلَمَ وَجْهَهٗ لِلّٰهِ وَهُوَ مُحْسِنٌ فَلَهٗٓ اَجْرُهٗ عِنْدَ
رَبِّهٖ ۪ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ﴿١١٢﴾

**112** ఔను మరి! ఎవడైతే ఆచరణలో అత్యుత్తమ రీతిని అవలంబించి తనను తాను అల్లాహ్ సన్నిధిలో సమర్పించుకుంటాడో,[125] అతనికి తన ప్రభువు వద్ద ప్రతిఫలం ఉంది. అలాంటి వారికి ఎలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండవు.

وَقَالَتِ الْيَهُوْدُ لَيْسَتِ النَّصٰرٰى عَلٰى شَيْءٍ ۪ وَّقَالَتِ النَّصٰرٰى
لَيْسَتِ الْيَهُوْدُ عَلٰى شَيْءٍ ۙ وَّهُمْ يَتْلُوْنَ الْكِتٰبَ ؕ كَذٰلِكَ قَالَ
الَّذِيْنَ لَا يَعْلَمُوْنَ مِثْلَ قَوْلِهِمْ ۚ فَاللّٰهُ يَحْكُمُ بَيْنَهُمْ يَوْمَ
الْقِيٰمَةِ فِيْمَا كَانُوْا فِيْهِ يَخْتَلِفُوْنَ ﴿١١٣﴾

**113** క్రైస్తవులు సత్యంపై లేరని యూదులు అంటున్నారు.[126] యూదులు సత్యంపై లేరని క్రైస్తవులంటున్నారు. మరి చూడబోతే వారంతా గ్రంథాన్ని చదువుతున్నారు. జ్ఞానం లేనివాళ్ళు కూడా ఇలాంటి మాటే అంటున్నారు.[127] కనుక అల్లాహ్ ప్రళయ దినాన వీళ్ళ భేదాభిప్రాయం గురించి వీళ్ళ మధ్య తీర్పు చేస్తాడు.

---

బడింది. ఇవి కేవలం వారి భ్రమలు మాత్రమేననీ, వాటి వెనుక ఎలాంటి ఆధారమూ లేదని అల్లాహ్ స్పష్టం చేశాడు.

125. **"అస్లమ వజ్‌హహు లిల్లాహి"** – అంటే కేవలం అల్లాహ్ ప్రసన్నతను చూరగొనే లక్ష్యంతో పనిచేసేవారు అని భావం. "వహువ ముహ్సినున్" – అంటే చిత్తశుద్ధితో, అంతిమ దైవప్రవక్త (సఅసం) సంప్రదాయానికనుగుణంగా ఆచరించేవాడు అని మతలబు. సదాచరణ దైవసమక్షంలో స్వీకారయోగ్యమవడానికి ఈ రెండు సూత్రాలను దృష్టిలో పెట్టుకోవటం అవసరం. ఈ రెండు సూత్రాల ప్రాతిపదికపై చేసిన మంచిపనుల ఆధారంగానే పరలోక సాఫల్యం, మోక్షం ప్రాప్తిస్తాయి. అంతేగాని ఉత్త ఆశలు, ఆకాంక్షల వల్ల ఒరిగేదేమీ ఉండదు.

126. యూదులు తౌరాతు గ్రంథం చదువుతారు. అందులో హజ్రత్ మూసా (అలైహిస్సలాం)గారు, హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) రాకను గురించి ధృవీకరించి ఉన్నారు. కాని యూదులు మాత్రం ఈ విషయం తెలిసికూడా ప్రవక్తగా హజ్రత్ ఈసా (అలైహిస్సలాం)ను తిరస్కరించేవారు.

ఇక క్రైస్తవుల వద్ద బైబిలు గ్రంథం ఉంది. అందులో మూసా (అలైహిస్సలాం) మరియు తౌరాతు గ్రంథాల ధృవీకరణ ఉంది. అయినప్పటికీ క్రైస్తవులు యూదుల వద్ద ఏమీ లేదని చెబుతున్నారు. ఈ పరస్పర వాగ్యుద్ధానికి కారణమేమిటంటే, ఇరువర్గాల వారు

**114** అల్లాహ్ మస్జిదులలో, ఆయన నామస్మరణను అడ్డుకుని,[128] వాటిని పాడు చేయడానికి ప్రయత్నించే[129] వానికంటే పరమ దుర్మార్గుడు ఎవడుంటాడు?

وَمَنْ أَظْلَمُ مِمَّنْ مَّنَعَ مَسَٰجِدَ ٱللَّهِ أَن يُذْكَرَ فِيهَا ٱسْمُهُۥ وَسَعَىٰ فِى خَرَابِهَآ ۚ أُو۟لَٰٓئِكَ مَا كَانَ لَهُمْ أَن يَدْخُلُوهَآ

ఒండొకరి యెడల సదభిప్రాయం కలిగిలేరు. పైగా ఒకరింకొకరిపట్ల వైరభావం కలిగి ఉన్నారు. ఒకరంటే ఇంకొకరికి అసూయ కూడా ఉంది. దానికి తోడు వారు ఊహాలోకాల్లో విహరిస్తున్నారు.

127. గ్రంథవహులకు (యూదులు, క్రైస్తవులకు) ప్రతిగా అరేబియా ముష్రిక్కులు నిరక్షరాస్యులు (ఉమ్మీలు). విద్యాగంధం సోకనివారు. అందుకనే వారిని జ్ఞానం లేనివాళ్ళుగా వ్యవహరించటం జరిగింది. అయినాసరే వారు – ముష్రిక్కులై ఉండికూడా – గ్రంథవహుల మాదిరిగానే బీరాలు పోయేవారు. తామే సత్యమార్గంపై ఉన్నామని తలపోసేవారు. అంతటితో ఆగక మహాప్రవక్త ముహమ్మద్ (స) వారిని 'సాబియీ' (మతధర్మం లేనివాడు) గా పిలిచేవారు.

128. ఇంతకీ మస్జిదులలో దైవనామ స్మరణ జరగకుండా అడ్డగించిన వారెవరు? దీనిపై ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు రెండు రకాల అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఒక అభిప్రాయం ప్రకారం క్రైస్తవులు రోము చక్రవర్తితో కుమ్మక్కై బైతుల్ మఖ్దిస్‌లో యూదులను ఆరాధన చేయకుండా ఆపారు. తత్సంబంధమైన కుట్రలో వారు పాలుపంచుకున్నారు. ఇబ్నె జరీర్ తబ్రీ కూడా ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. అయితే హాఫిజ్ ఇబ్నె కసీర్ ఈ అభిప్రాయంతో విభేదించి, మక్కాకు చెందిన బహుదైవారాధకులు ఈ కృత్యానికి పాల్పడ్డారని అన్నారు. వారు రెండు విధాలుగా ఈ పనిచేశారు. ఒకటి : అంతిమ దైవప్రవక్త (సఅసం)ను, ఆయన సహచరుల (రజి)ను మక్కా నగరం వదలివెళ్ళేలా పరిస్థితుల్ని సృష్టించారు. ఈ విధంగా ముస్లింలను కాబా గృహంలో ఆరాధన చేయకుండా ఆపారు. రెండు : హుదైబియా ఒప్పందం సందర్భంగా కూడా వారు ఇటువంటి పాత్రనే పోషించారు. మా పితామహులను, కొడుకులను సంహరించిన వారిని మేము మక్కా లోపల అడుగుపెట్టనిచ్చేది లేదని తెగేసి చెప్పారు. మరి చూడబోతే కాబా గృహ సందర్శన కోసం వచ్చే వారిని అడ్డుకోవటం సత్సంప్రదాయం కానేకాదు.

129. ఆరాధనా గృహాన్ని నేలమట్టం చేయటం, కట్టడానికి నష్టం చేకూర్చటం మాత్రమే విచ్ఛిన్నకరమైన పనికాదు, ఆరాధన నుండి, దైవనామ స్మరణ నుండి ఆపటం, షరీయత్ ఆదేశాలను పాటించకుండా నిరోధించటం, మస్జిదుల్లో తిష్ఠవేసిన ముష్రిక్కు పోకడలను సమూలంగా తుడిచిపెట్టడానికి నడుం బిగించినవారిని అడ్డగించటం – ఇత్యాదివన్నీ విచ్ఛిన్నకరమయిన పనులుగా, విధ్వంసకర చేష్టలుగానే పరిగణించ బడతాయి.

الَّا خَآئِفِيْنَ ۬ؕ لَهُمْ فِى الدُّنْيَا خِزْىٌ وَّلَهُمْ فِى الْاٰخِرَةِ عَذَابٌ عَظِيْمٌ ﴿۱۱۴﴾

అటువంటి వారు వాటిలో ప్రవేశించినా భయపడుతూనే ప్రవేశించాలి సుమా![130] వారికి ప్రపంచంలోనూ పరాభవం తప్పదు, పరలోకంలో కూడా మహా ఘోర శిక్ష తప్పదు.

وَلِلّٰهِ الْمَشْرِقُ وَالْمَغْرِبُ ۚ فَاَيْنَمَا تُوَلُّوْا فَثَمَّ وَجْهُ اللّٰهِ ؕ اِنَّ اللّٰهَ وَاسِعٌ عَلِيْمٌ ﴿۱۱۵﴾

**115** ప్రాక్ పశ్చిమాలకు అధిపతి అల్లాహ్‌యే. మీరు మీ ముఖాన్ని ఏ వైపుకు త్రిప్పినా, అటు అల్లాహ్ సమ్ముఖం లభిస్తుంది.[131] నిస్సందేహంగా అల్లాహ్ విస్తృతి కలవాడు, సర్వమూ తెలిసినవాడు.

130. ఇది ముస్లిములకు శుభవార్త అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అతి త్వరలో ముస్లిములకు విజయం వరిస్తుందనీ, ముష్రిక్కులు కాబా గృహ ప్రాంగణంలో అడుగుపెట్టేటప్పుడు భయాందోళనకు గురవుతారని, ఎందుకంటే ఒకప్పుడు ముస్లింలపై తాము పాల్పడిన అఘాయిత్యాలకు ప్రతీకారం ముస్లిములు తీర్చుకుంటారేమోనన్న అనుమానం వారికి కలుగుతుందని దీని భావం. అనుకున్నట్లే శీఘ్రగతిన ముస్లింలకు ఈ ఆధిక్యత లభించింది.

మరి కొంతమంది దీనిపై వ్యాఖ్యానిస్తూ ఈ అర్థం తీసుకున్నారు: అల్లాహ్ తన కృపతో మీకు గనక విజయం ప్రసాదిస్తే మీరు ఈ ముష్రిక్కులను మక్కా నగరంలో ఉండటానికి కొన్ని షరతులు విధించాలి. వారిపై 'జిజ్‌యా'ను విధించాలి. హిజ్రీ 8వ సంవత్సరంలో మక్కా విజయం చేకూరిన తరువాత మహాప్రవక్త (సఅసం), వచ్చే ఏడాది నుంచి ఏ ముష్రిక్కుకూ హజ్ చేసేందుకు, నగ్నంగా కాబా ప్రదక్షిణ చేసేందుకు అనుమతి ఉండబోదనీ, ప్రతి ఒక్కరూ తాము చేసుకున్న సంధి షరతులకు కట్టుబడి మరీ ఇక్కడ ఉండవలసి ఉంటుందనీ ప్రకటన గావించారు.

131. మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ (ప్రస్థానం) చేసిన తరువాత ముస్లిములు బైతుల్ మఖ్దిస్ వైపుకు అభిముఖమై నమాజ్ చేస్తున్నప్పుడు వారికి దుఃఖం కలిగేది. ఆ సందర్భంగానే ఈ ఆయతు అవతరించింది. మరి కొందరి అభిప్రాయం ప్రకారం : బైతుల్ మఖ్దిస్ వైపు నుంచి మళ్ళీ కాబా దిశ వైపుకు తిరగాలని ఆజ్ఞాపించబడినప్పుడు యూదులు రకరకాల అభ్యంతరాలను లేవనెత్తారు. వాటికి సమాధానంగా ఈ వచనం అవతరించింది. మరికొంతమంది ఇలా అభిప్రాయపడ్డారు : ఈ ఆయతు అవతరించటానికి అసలు కారణమేమంటే, ప్రయాణంలో ఉన్నప్పుడు వాహనంపై కూర్చుని నఫిల్ నమాజులు చేసుకునేందుకు అనుమతి ఉంది. అప్పుడు వాహనం ఏ దిశలో పోతున్నా నమాజ్‌ను చేయవచ్చునని విశదీకరించబడింది. ఒక్కోసారి అనేక కారణాలు

وَقَالُوا اتَّخَذَ اللّٰهُ وَلَدًا ۙ سُبْحٰنَهٗ ؕ بَلْ لَّهٗ مَا فِي السَّمٰوٰتِ
وَالْاَرْضِ ؕ كُلٌّ لَّهٗ قٰنِتُوْنَ ﴿١١٦﴾

**116** అల్లాహ్‌కు సంతానం కలదని వీళ్ళు అంటున్నారు. (ఇలాంటి మాటలకు) ఆయన అతీతుడు, పవిత్రుడు. పైగా భూమ్యాకాశాలలోవున్న సమస్తమూ ఆయనదే. అవన్నీ ఆయన (ఆజ్ఞల)కు తల ఒగ్గి ఉన్నాయి.

بَدِيْعُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ وَاِذَا قَضٰۤى اَمْرًا فَاِنَّمَا يَقُوْلُ
لَهٗ كُنْ فَيَكُوْنُ ﴿١١٧﴾

**117** భూమ్యాకాశాలను ప్రప్రథమంగా సృష్టించినవాడు ఆయనే. ఆయన ఏ పనినైనా చేయ సంకల్పించుకున్నప్పుడు దాన్ని 'అయిపో' అని అంటే చాలు, అది అయిపోతుంది.[132]

وَقَالَ الَّذِيْنَ لَا يَعْلَمُوْنَ لَوْلَا يُكَلِّمُنَا اللّٰهُ اَوْ تَاْتِيْنَاۤ
اٰيَةٌ ؕ كَذٰلِكَ قَالَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ مِّثْلَ

**118** జ్ఞానం లేనివాళ్లు, "అల్లాహ్ స్వయంగా మాతో ఎందుకు మాట్లాడడు? లేక మా వద్దకు ఏదైనా సూచన ఎందుకు రాదు?"[133] అని అంటారు. వారి పూర్వీకులు కూడా ఇలాంటి పలుకులే పలికారు. వారందరి హృదయాలు ఒకే

కలసి ఒక ఆయతు అవతరణకు ఆస్కారం కల్పిస్తాయి. అట్టి పరిస్థితిలో ఇలాంటి ఆయతుల అవతరణా నేపథ్యాన్ని విడమరచి చెప్పే ఉల్లేఖనాలు అనేకం మన ముందుకు వస్తాయి. ఒక ఉల్లేఖనంలో ఒక కారణం చెప్పబడితే, మరో ఉల్లేఖనంలో మరో కారణం వివరించబడుతుంది. ఈ ఆయతు కూడా ఆ కోవకు చెందినదే (అహ్సనుత్తఫాసీర్ నుంచి సంగ్రహం).

132. భూమ్యాకాశాల్లో ఉన్న సకల చరాచరాలకు దేవుడు అల్లాహ్‌యే. నిఖిల జగతిలో ఉన్నవన్నీ ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తున్నాయి. అంతేకాదు, ఎలాంటి నమూనా కూడా లేకుండా భూమ్యాకాశాలను పుట్టించినవాడు, సమపాళ్ళలో వాటిని తీర్చిదిద్దినవాడూ ఆయనే. తాను చేయదలచుకున్న ప్రతి పనికోసం ఆయన 'అయిపో' అంటే చాలు, అది అయిపోతుంది. అంతటి అద్భుతం చేసే మహోన్నతునికి సంతానం అవసరం ఏముంది?

133. వీరు అరేబియాకు చెందిన ముష్రిక్కులు. వీరు కూడా యూదుల లాగే డిమాండు చేయసాగారు – అల్లాహ్ నేరుగా మాతో ఎందుకు సంభాషించడు? ఏదైనా స్పష్టమయిన నిదర్శనం మా వద్దకు పంపిస్తే, మేము దాన్ని చూసి విశ్వసించేవాళ్ళం కదా! అనేవారు.

قَوْلِهِمْ ۚ تَشَابَهَتْ قُلُوبُهُمْ ۗ قَدْ بَيَّنَّا الْآيَاتِ لِقَوْمٍ يُوقِنُونَ ﴿١١٨﴾

విధమైనవి.[134] వాస్తవానికి నమ్మేవారి కోసం మేము మా సూచనలను స్పష్టం చేసే ఉంచాము.

إِنَّا أَرْسَلْنَاكَ بِالْحَقِّ بَشِيرًا وَنَذِيرًا ۖ وَلَا تُسْأَلُ عَنْ أَصْحَابِ الْجَحِيمِ ﴿١١٩﴾

**119** (ఓ ప్రవక్తా!) మేము నిన్ను సత్యంతో పాటు శుభవార్త నిచ్చేవానిగా, హెచ్చరించే వానిగా చేసి పంపాము. నరకవాసుల గురించి నిన్ను (నిలదీసి) అడగటం జరగదు.

وَلَنْ تَرْضَىٰ عَنْكَ الْيَهُودُ وَلَا النَّصَارَىٰ حَتَّىٰ تَتَّبِعَ مِلَّتَهُمْ ۗ قُلْ إِنَّ هُدَى اللَّهِ هُوَ الْهُدَىٰ ۗ وَلَئِنِ اتَّبَعْتَ أَهْوَاءَهُمْ بَعْدَ الَّذِي جَاءَكَ مِنَ الْعِلْمِ ۙ مَا لَكَ مِنَ اللَّهِ مِنْ وَلِيٍّ وَلَا نَصِيرٍ ﴿١٢٠﴾

**120** (ఓ ముహమ్మద్!) నువ్వు వారి విధానాన్ని అనుసరించనంతవరకూ[135] యూదులు, క్రైస్తవులు నిన్ను ఇష్టపడరు. అల్లాహ్ చూపిన మార్గమే సరైన మార్గం[136] అని నువ్వు వారికి చెప్పేయి. ఒకవేళ నువ్వు నీ వద్దకు జ్ఞానం వచ్చిన మీదట కూడా వారి కోరికలను అనుసరిస్తే, అల్లాహ్ (పట్టు) నుండి నిన్ను రక్షించేవాడు, సహాయకుడూ ఎవడూ ఉండడు.[137]

(దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు బనీ ఇస్రాయీల్ సూరా 90వ ఆయతు నుంచి 93వ ఆయతు వరకు ఉన్నాయి).

134. అంటే తిరస్కారం, శత్రుత్వం, తలబిరుసుతనంలో అరబ్బు బహుదైవారాధకుల హృదయాలు తమ పూర్వీకుల హృదయాలలాగే కరకుగా మారిపోయినై. తూర్ సూరాలోని 52 – 53 ఆయతుల్లో చెప్పబడినట్లు, వీరికి పూర్వం ఏ ప్రవక్త వచ్చినా అతన్ని జనులు మాంత్రికుడనో, ఉన్మాది అనో అన్నారు. ఏమిటీ, వీరు ఒండొకరికి ఈ మేరకు తాకీదు చేసిపోతున్నారా? కాదు కాదు... అసలు వీళ్ళంతా తలబిరుసులు. అంటే వీళ్ళందరిలోనూ ఇంచుమించుగా ఒకేవిధమైన అహంకార భావం ఉంది. అందుకే సత్య సందేశ ప్రదాతల ముందు వీళ్ళు కొంగ్రొత్త డిమాండ్లు చేస్తూ ఉంటారు. లేదనుకుంటే ప్రవక్తలను ఉన్మాదులుగా అభివర్ణిస్తూ ఉంటారు.

135. అంటే యూదత్వాన్ని లేక క్రైస్తవాన్ని అవలంబించటం అని భావం.

136. అది ఇప్పుడు ఇస్లాం రూపంలో ఉంది. మహాప్రవక్త (సఅసం) పిలుపు ఇచ్చేది దాని వైపునకే – ప్రక్షిప్తాలకు లోనైన యూద,క్రైస్తవ మతాల వైపుకు కాదు.

137. ఇందులో హెచ్చరిక ఉంది. జ్ఞానం లభించిన మీదట కూడా (ఓ ముహమ్మద్!)

**121** మేము ఎవరికి గ్రంథం వొసగామో వారు[138] దానిని పారాయణం చేయ వలసిన రీతిలో పారాయణం చేస్తారు.[139] (అంతేకాదు,) వారు ఈ గ్రంథాన్ని విశ్వసి స్తారు. ఇక, దీనిపట్ల తిరస్కార వైఖరిని అవలంబించినవారే నష్టపోయేది.[140]

ٱلَّذِينَ ءَاتَيْنَٰهُمُ ٱلْكِتَٰبَ يَتْلُونَهُۥ حَقَّ تِلَاوَتِهِۦٓ أُو۟لَٰٓئِكَ يُؤْمِنُونَ بِهِۦ ۗ وَمَن يَكْفُرْ بِهِۦ فَأُو۟لَٰٓئِكَ هُمُ ٱلْخَٰسِرُونَ ﴿١٢١﴾

ఒకవేళ నీవుగనక వారిని సంతోషపరచటానికి, వారిలోని మార్గవిహీనుల పద్ధతులను గనక అవలంబించినట్లయితే నీకు సహాయపడే వాడెవడూ ఉండడు. ఇందులో ముహమ్మద్ (స) ద్వారా ఆయన అనుచర సమాజాన్ని హెచ్చరించటం జరుగుతున్నది. అదేమంటే వారు ధర్మంలో సరికొత్త పోకడలు పోయేవారిని, మార్గభ్రష్టులను సంతోషపెట్టే ఉద్దేశ్యంతో ధర్మావలంబనలో ఎలాంటి మెతక వైఖరికి, వక్రభాష్యాలకు తావు కల్పించరాదు.

138. గ్రంథవహుల్లోని అవినీతిపరుల దుశ్చేష్టలను, దుర్నీతిని వివరించిన తరువాత సద్వర్తనుల ప్రస్తావన వచ్చింది. ఈ వాక్యంలో ఆ సజ్జనుల గుణగణాలు తెలుపబడటం తోపాటు, వారు విశ్వసించినవారన్న శుభవార్త కూడా యివ్వబడింది. అటువంటి వారిలో అబ్దుల్లాహ్ బిన్ సలాం (రజి) మరియు ఆయన లాంటి ఇతర సహచరులు కూడా ఉన్నారు. వారు ఒకప్పుడు యూదులుగా ఉండేవారు. కాని ఇస్లాం సత్యామృతాన్ని ఆస్వాదించే భాగ్యం వారికి లభించింది.

139. "పఠించవలసిన విధంగా పఠిస్తారు" అన్న వాక్యానికి పలు అర్థాలు వివరించబడ్డాయి. (1). బాగా చదువుతారు. శ్రద్ధతో, ఏకాగ్రతతో పారాయణం చేస్తారు. పఠన సందర్భంగా స్వర్గప్రస్తావన వస్తే స్వర్గంలో ప్రవేశం కల్పించమని ప్రభువును వేడుకుంటారు. నరక ప్రస్తావన వస్తే దాని బారినుంచి రక్షించమని ప్రార్థిస్తారు. (2). అందులో ధర్మసమ్మతంగా ఖరారు చేయబడిన అంశాలను ధర్మసమ్మతాలుగా విశ్వసిస్తారు. అధర్మం అని స్పష్టం చేయబడిన వాటిని అధర్మంగానే భావిస్తారు. అంతేగాని (యూదుల మాదిరిగా) ప్రక్షిప్తాలకు పాల్పడటంగానీ, తప్పుడు అన్వయింపులు చేయటంగానీ చేయరు. (3). అందులో పొందుపరచబడివున్న విషయాలను గురించి అందరికీ వివరిస్తారు, వాటిని దాచి ఉంచరు. (4). అందులో చేయమని ఆజ్ఞాపించబడిన వాటిని (ముహ్కమాత్‌ను) చేస్తారు, అస్పష్టంగా ఉన్న (ముతషాబిహాత్) విషయాలను విశ్వసిస్తారు, అర్థంకాని విషయాలను గురించి విద్వాంసులను అడిగి తెలుసుకుంటారు. (5). అందలి ఒక్కో విషయాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తారు (ఫత్‌హుల్ ఖదీర్).

**122** ఓ (యాఖూబు) ఇస్రాయీలు సంతతివారలారా! నేను మీపై కురిపించిన వరాలను జ్ఞప్తికి తెచ్చుకోండి. నేను మీకు సమస్త లోకాలపై (అలనాటి అన్ని జాతులపై, సమాజాలపై) శ్రేష్ఠతను వొసగాను.

يٰبَنِيْٓ اِسْرَآءِيْلَ اذْكُرُوْا نِعْمَتِيَ الَّتِيْٓ اَنْعَمْتُ عَلَيْكُمْ وَاَنِّيْ
فَضَّلْتُكُمْ عَلَى الْعٰلَمِيْنَ ﴿١٢٢﴾

**123** ఎవరూ ఎవరికీ ఏ విధంగానూ తోడ్పడలేని, ఎవరినుంచీ పరిహారం కూడా స్వీకరించబడని, ఏ సిఫారసూ ఎవరికీ ప్రయోజనకరం కాజాలని, ఎవరికీ సహాయం కూడా చేయజాలని ఆ దినానికి భయపడండి.

وَاتَّقُوْا يَوْمًا لَّا تَجْزِيْ نَفْسٌ عَنْ نَّفْسٍ شَيْـًٔا وَّلَا يُقْبَلُ مِنْهَا
عَدْلٌ وَّلَا تَنْفَعُهَا شَفَاعَةٌ وَّلَا هُمْ يُنْصَرُوْنَ ﴿١٢٣﴾

**124** (జ్ఞాపకం చేసుకోండి) ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను అతని ప్రభువు అనేక విషయాలలో పరీక్షించగా,[141] అతను అన్నింటిలోనూ (నికార్సుగా) నెగ్గుకు వచ్చాడు. అప్పుడు అల్లాహ్ అతన్ని ఉద్దేశించి, "నేను నిన్ను ప్రజలకు నాయకునిగా చేస్తాను" అన్నాడు. దానికి

وَاِذِ ابْتَلٰٓى اِبْرٰهٖمَ رَبُّهٗ بِكَلِمٰتٍ فَاَتَمَّهُنَّ ۭ قَالَ اِنِّىْ جَاعِلُكَ
لِلنَّاسِ اِمَامًا ۭ قَالَ وَمِنْ ذُرِّيَّتِيْ ۭ قَالَ لَا يَنَالُ عَهْدِي

పఠించవలసిన రీతిలో పఠిస్తారన్న వాక్యంలో ఇన్ని పరమార్థాలు ఇమిడి ఉన్నాయి. వీటన్నింటిపట్ల శ్రద్ధాసక్తులు కలిగి ఉన్న వారికే దేవుని మార్గదర్శకత్వం ప్రాప్తిస్తుంది.

140. గ్రంథవహుల్లో దైవప్రవక్త (సఅసం) సందేశాన్ని విశ్వసించనివారు నరకానికి పోతారు (సహీహ్ ముస్లిం).

141. ఇక్కడ **'కలిమాతిన్'** అంటే భావం షరీయత్ ఆదేశాలు, హజ్ క్రియలు, త్యాగం, దైవమార్గంలో వలసపోవటం, నమ్రూద్ తరఫున ఎదురైన అగ్ని పరీక్ష – అన్నీ ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు పెట్టబడిన కఠిన పరీక్షలే. ఈ పరీక్షలన్నింటినీ ఆయన సహన స్థయిర్యాలతో ఎదుర్కోవటమేగాకుండా, వాటిలో పూర్తిగా నెగ్గారు కూడా. దీనికి ప్రతిఫలంగా ఆయన మానవాళికి నేతగా సన్మానించబడ్డారు. అందుకే ఒక్క ముస్లింలేగాక, యూదులు, క్రైస్తవులు, అరబ్బు ముష్రిక్కులు – అందరూ ఆయన్ని అభిమానిస్తారు, ఆదరిస్తారు. తమ పితామహునిగా ఆయన్ని పరిగణిస్తారు.

الظّٰلِمِيْنَ ﴿١٢٤﴾

అతను "నా సంతానాన్ని కూడానా!" అని అడిగాడు.[142] అప్పుడు అల్లాహ్, "దుర్మా ర్గులకు నా వాగ్దానం వర్తించదు" అని సమాధానం ఇచ్చాడు.

وَإِذْ جَعَلْنَا الْبَيْتَ مَثَابَةً لِّلنَّاسِ وَأَمْنًا ۖ وَاتَّخِذُوا مِن مَّقَامِ إِبْرٰهِمَ

**125** (జ్ఞాపకం చేసుకోండి) మేము ఈ గృహాన్ని (కాబా గృహాన్ని) మానవులందరి పుణ్యక్షేత్రంగానూ, శాంతి నిలయంగానూ చేశాము.[143] మీరు ఇబ్రాహీము నిలబడిన

142. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)గారి ఈ కోర్కెను కూడా అల్లాహ్ నెరవేర్చాడు. దివ్య ఖుర్‌ఆన్‌లోనూ ఆ విషయం ప్రస్తావనకు వచ్చింది : "మేము అతని వంశంలో ప్రవక్త పదవినీ, గ్రంథాన్నీ ఉంచాము" (అన్ కబూత్–27). ఇబ్రాహీం (అలైహిస్సలాం) తరువాత వచ్చిన ప్రవక్తలు అందరూ ఆయన వంశీయులే. దైవగ్రంథాలు కూడా ఆయన వంశీయులపైనే అవతరింపజేయబడ్డాయి (ఇబ్నె కసీర్). దాంతోపాటు "నా వాగ్దానం దుర్మార్గులకు వర్తించదు" అని అనబడటం గమనార్హం. ఇబ్రాహీం (అలైహిస్సలాం) వ్యక్తిత్వం ఎంతో విశిష్ఠమైనది, దైవసన్నిధిలో సయితం ఆయనకు గొప్ప అంతస్థులు ప్రాప్తించాయి – అయినప్పటికీ ఇబ్రాహీం సంతతిలోని అసమర్థులను, అవిశ్వాసులను, ముష్రిక్కులను అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు. వారికి రేపు పట్టే దుర్గతిని, దురవస్థను దూరం చేసేవాడు కూడా ఎవడూ ఉండడు. అల్లాహ్ ఇక్కడ కులగోత్రాలను, కుహనా ప్రతిష్ఠలను కూకటి వ్రేళ్ళతో పెకలించేశాడు. విశ్వాసం (ఈమాన్) మరియు సత్కార్యాలు (అమలుస్సాలిహ్) లేకుండా ఎవరూ దేవుని మెప్పును పొందలేరు. ప్రవక్తల పుత్ర రత్నాలయినా, చక్రవర్తుల మానసపుత్రులయినా, పీర్ సాహెబ్బుల ఆశీస్సులు పొందినవారైనా – ఎవరయినాసరే విశ్వసించి, మంచి పనులు చేయటం అనివార్యం. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరి ఆచరణ అయితే అతన్ని వెనుక వదిలేసిందో అతని వంశం అతన్ని ముందుకు తీసుకెళ్ళదు" (సహీహ్ ముస్లిం).

143. కాబా గృహ నిర్మాతలలో ప్రప్రథముడైన హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ద్వారా అల్లాహ్ కాబా గృహానికి సంబంధించిన రెండు విషయాలను ఇందులో ప్రస్ఫుటం చేశాడు. ఒకటి : 'మానవులందరి పుణ్యక్షేత్రం' అన్నది. దీనికి – మాటిమాటికీ మరలి రావలసిన స్థలం అన్న అర్థం కూడా వస్తుంది. ఒకసారి ఈ కాబా గృహాన్ని సందర్శించిన వ్యక్తి మరోసారి, ఇంకోసారి కూడా అక్కడికి రావాలని ఉవ్విళ్ళూరు తుంటాడు. ఎన్నిసార్లు సందర్శించినా ఆకర్షణ తగ్గదు. రెండు : అదొక శాంతి నిలయం. అక్కడ శత్రుభయం కూడా ఉండదు. అజ్ఞాన కాలంలో సయితం ప్రజలు ఆ పుణ్యక్షేత్రం

مُصَلًّى وَعَهِدْنَا إِلَىٰ إِبْرَاهِيمَ وَإِسْمَاعِيلَ أَن طَهِّرَا بَيْتِيَ لِلطَّائِفِينَ
وَالْعَاكِفِينَ وَالرُّكَّعِ السُّجُودِ ﴿١٢٥﴾

ప్రదేశాన్ని[144] నమాజు స్థలంగా చేసుకోండి. “మీరు నా గృహాన్ని (సందర్శించి) ప్రదక్షిణ చేసేవారికోసం, అక్కడ ఏతెకాఫ్ పాటించేవారి కోసం, రుకూ సజ్దాలు చేసేవారి కోసం దానిని పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంచాలి” అని ఇబ్రాహీము, ఇస్మాయీలు నుంచి మేము వాగ్దానం తీసుకున్నాము.

وَإِذْ قَالَ إِبْرَاهِيمُ رَبِّ اجْعَلْ هَٰذَا بَلَدًا آمِنًا وَارْزُقْ أَهْلَهُ مِنَ
الثَّمَرَاتِ مَنْ آمَنَ مِنْهُم بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۖ قَالَ وَمَن كَفَرَ
فَأُمَتِّعُهُ قَلِيلًا ثُمَّ أَضْطَرُّهُ إِلَىٰ عَذَابِ النَّارِ ۖ وَبِئْسَ الْمَصِيرُ ﴿١٢٦﴾

**126** “నా ప్రభూ! నీవు ఈ ప్రదేశాన్ని శాంతి నగరంగా చెయ్యి. ఈ నగర వాసులలో అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ విశ్వసించే వారికి పండ్లు ఫలాలను ఆహారంగా ప్రసాదించు”[145] అని ఇబ్రాహీం అర్థించినప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలికాడు: “నేను విశ్వసించని వారికి కూడా కొంత ప్రయోజనం చేకూర్చుతాను. కాని చివరకు వారిని అగ్నిశిక్ష వైపుకు ఈడుస్తాను. అది అత్యంత చెడ్డ నివాసస్థలం.”

---

పరిధిలో శత్రువును సంహరించేవారు కాదు. ఆ పవిత్ర గృహానికి గల ప్రత్యేకతను, గౌరవాన్నీ, ఆనవాయితీని ఇస్లాం అనుయాయులు ఇప్పటి వరకూ కాపాడుకుంటూ వస్తున్నారు. పైగా ఈ విషయమై ఇస్లాం తన అనుయాయులకు మరింత గట్టిగా తాకీదు చేసింది.

144. అరబీలో **‘మఖామె ఇబ్రాహీమ్’** అని అనబడింది. మఖామె ఇబ్రాహీం అనేది ఒక రాయి. ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ఆ రాతిమీదే నిలబడి కాబా గృహాన్ని నిర్మించారు. ఆ రాయిపై ఆయన పాదచిహ్నాలు కూడా ఉన్నాయి. ఇప్పుడా రాయి ఒక అద్దాల కేసులో సురక్షితంగా ఉంచబడింది. హజ్, ఉమ్రాలకు వెళ్ళిన ప్రతి ఒక్కరూ కాబా ప్రదక్షిణ సందర్భంగా దాన్ని చూడవచ్చు. కాబా ప్రదక్షిణ పూర్తయ్యాక ఆ స్థలంలో రెండు రకాతుల నమాజు చేయటం సంప్రదాయం (సున్నత్).

145. ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ ప్రార్థనను అల్లాహ్ ఆమోదించాడు. ఆ నగరం (మక్కా) నేడు శాంతి నగరంగా విరాజిల్లుతోంది. అక్కడ వర్షాలు అంతగా

**127** ఇబ్రాహీం (అలైహిస్సలాం), ఇస్మాయిల్ (అలైహిస్సలాం) – ఇద్దరూ (కాబా) గృహ పునాదులను, గోడలను లేపుతూ, ఇలా ప్రార్థించేవారు : "మా ప్రభూ! మా సేవను స్వీకరించు. నీవు మాత్రమే సర్వం వినేవాడవు, సర్వం తెలిసినవాడవు."

وَاِذْ يَرْفَعُ اِبْرٰهٖمُ الْقَوَاعِدَ مِنَ الْبَيْتِ وَاِسْمٰعِيْلُ رَبَّنَا تَقَبَّلْ مِنَّا ؕ اِنَّكَ اَنْتَ السَّمِيْعُ الْعَلِيْمُ ﴿۱۲۷﴾

**128** "మా ప్రభూ! మమ్మల్ని నీ విధేయులు(ముస్లిములు)గా చేసుకో. మా సంతతి నుండి కూడా నీ విధేయతకు కట్టుబడి ఉండే ఒక సమూహాన్ని ప్రభవింపజెయ్యి. మాకు మా ఆరాధనా రీతులను నేర్పు. మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా నీవు మాత్రమే పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడవు, అపారంగా కరుణించేవాడవు."

رَبَّنَا وَاجْعَلْنَا مُسْلِمَيْنِ لَكَ وَمِنْ ذُرِّيَّتِنَآ اُمَّةً مُّسْلِمَةً لَّكَ ۪ وَاَرِنَا مَنَاسِكَنَا وَتُبْ عَلَيْنَا ۚ اِنَّكَ اَنْتَ التَّوَّابُ الرَّحِيْمُ ﴿۱۲۸﴾

**129** "మా ప్రభూ! నీ వాక్యాలను వారికి చదివి వినిపించే, గ్రంథజ్ఞానాన్ని నేర్పించే, విజ్ఞతా వివేచనలను[146] విడమరచి చెప్పే, వారిని పరిశుద్ధపరచే[147] ఒక ప్రవక్తను[148]

رَبَّنَا وَابْعَثْ فِيْهِمْ رَسُوْلًا مِّنْهُمْ يَتْلُوْا عَلَيْهِمْ اٰيٰتِكَ وَيُعَلِّمُهُمُ الْكِتٰبَ وَالْحِكْمَةَ وَيُزَكِّيْهِمْ ؕ اِنَّكَ اَنْتَ

---

కురవకపోయినప్పటికీ, అది వ్యవసాయానికి అనువైన ప్రదేశం కానప్పటికీ ప్రపంచం నలుమూలల నుంచీ ఆహార ధాన్యాలు, పండ్లు ఫలాలు పుష్కలంగా సమకూరుతున్నాయి. పరిస్థితుల ఈ స్వరూపాన్ని చూసి అందరూ నివ్వెరపోతున్నారు.

146. గ్రంథం అంటే దివ్య ఖుర్ఆన్ అనీ, విజ్ఞత అంటే హదీసు అనీ భావం. దైవ వాక్యాల పారాయణం గురించి చెప్పిన తరువాత గ్రంథజ్ఞానం గురించి, వివేకాన్ని గురించి చెప్పటం విశేషం! స్వతహాగా దివ్య ఖుర్ఆన్ పారాయణం కూడా ఎంతో పుణ్యప్రదమైనదనే విషయాన్ని ఇది సూచిస్తున్నది. ఒకవేళ అందలి దివ్య వచనాల భావార్థం కూడా తెలిస్తే ఇక చెప్పవలసిన పనేలేదు. కాని దైవ వచనాల అర్థం తెలీకపోయినప్పటికీ, చిత్తశుద్ధితో పారాయణం చేసినందుకు పుణ్యం ఎటూ పోదు. అందుకే తమకు అర్థం తెలియదు కదా! అంటూ అసలు పారాయణానికే ఉపక్రమించకుండా ఉండటం సమంజసం కాదు. పైగా వీలైనంతవరకు ఖుర్ఆన్ వచనాలను అర్థం చేసుకుంటూ పారాయణం చేయటానికి కృషిచేయాలి.

147. 'పరిశుద్ధపరచటం' అంటే తన జాతి ప్రజలను మూఢాచారాల నుంచి, బహుదైవారాధన

| | |
|---|---|
| الْعَزِيزُ الْحَكِيمُ ﴿١٢٩﴾ | స్వయంగా వారి జాతి నుండే వారిలో ప్రభవింపజెయ్యి. నిస్సందేహంగా నీవు సర్వాధికుడవు, వివేకవంతుడవు." |
| وَمَنْ يَرْغَبُ عَنْ مِلَّةِ إِبْرٰهِيمَ إِلَّا مَنْ سَفِهَ نَفْسَهُ ۚ وَلَقَدِ اصْطَفَيْنٰهُ فِي الدُّنْيَا ۖ وَإِنَّهُ فِي الْآخِرَةِ لَمِنَ الصّٰلِحِينَ ﴿١٣٠﴾ | **130** శుద్ధ అవివేకి మాత్రమే ఇబ్రాహీం ధర్మం (విధానం) పట్ల విరక్తి చెందుతాడు. మేము అతన్ని ప్రపంచంలోనూ ఎన్ను కున్నాము, పరలోకంలో కూడా అతడు సజ్జనుల సరసన[149] ఉంటాడు. |
| إِذْ قَالَ لَهُ رَبُّهُ أَسْلِمْ ۙ قَالَ أَسْلَمْتُ لِرَبِّ الْعٰلَمِينَ ﴿١٣١﴾ | **131** "(ఆత్మ) సమర్పణ చేసుకో" అని అతని ప్రభువు అతన్ని ఆదేశించినప్పుడల్లా "సకల లోకాల ప్రభువు సమక్షంలో నన్ను నేను సమర్పించుకున్నాను"[150] అని అతను సమాధానం ఇచ్చాడు. |

నుంచి కాపాడటం, నైతికపు రుగ్మతలను నిర్మూలించటం అని భావం. దైవప్రవక్త (సఅసం)కు అప్పగించబడిన నాలుగు విద్యుక్త ధర్మాలలో ఇది చివరిది.

148. ఇది హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం), ఇస్మాయీల్ (అలైహిస్సలాం)ల చివరి ప్రార్థన. దీనికి కూడా అల్లాహ్ ఆమోదముద్ర వేశాడు. హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతతినుండి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రభవింపజేశాడు. అందుకే హజ్రత్ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రవచించారు : నేను నా తండ్రి హజ్రత్ ఇబ్రాహీం – అలైహిస్సలాం – ప్రార్థనా ఫలాన్ని. హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) ఇచ్చిన శుభవార్తను. నా తల్లిగారి కలల పంటను" (ఫత్హుర్రబ్బానీ – సంపుటి : 20, పేజీ – 181, 189).

149. ఈ ఆయతులో అల్లాహ్ హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఔన్నత్యాన్ని అందరికీ అవగతం చేస్తున్నాడు. ఇహపరాలలో తాను ఆయనకు ఇచ్చిన గౌరవోన్నతుల్ని గురించి చెప్పటమేగాక, ఆయన విధానం పట్ల వైముఖ్యం ప్రదర్శించటం అజ్ఞానానికి, అవివేకానికి తార్కాణమని తెలియజేస్తున్నాడు.

**గమనిక :** సాధారణంగా రగిబ ( رَغِبَ ) అంటే ఇష్టపడటం, అభిమానించటం అనే అర్థాలు వస్తాయి. కాని 'రగిబ'తో పాటు అన్ (عَنْ)వస్తే మాత్రం అయిష్టత, నిర్లక్ష్యం అనే అర్థాలు వస్తాయి.

150. మరి ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు అంతటి ఔన్నత్యం ఎందుకు లభించింది? అన్న

وَوَصّٰى بِهَآ اِبْرٰهٖمُ بَنِيْهِ وَيَعْقُوْبُ ۭ يٰبَنِىَّ اِنَّ اللّٰهَ اصْطَفٰى لَكُمُ الدِّيْنَ فَلَا تَمُوْتُنَّ اِلَّا وَاَنْتُمْ مُّسْلِمُوْنَ ١٣٢

**132** ఈ ఉపదేశమే ఇబ్రాహీం మరియు యాఖూబ్ తమ సంతానానికి చేశారు. వారిలా అన్నారు : "నా బిడ్డలారా! అల్లాహ్ మీ కోసం ఈ (విధేయతా) ధర్మాన్నే ఇష్ట పడ్డాడు. కనుక మీరు ముస్లింలుగా తప్ప మరణించ కూడదు సుమా!"[151]

اَمْ كُنْتُمْ شُهَدَآءَ اِذْ حَضَرَ يَعْقُوْبَ الْمَوْتُ ۙ اِذْ قَالَ لِبَنِيْهِ مَا تَعْبُدُوْنَ مِنْۢ بَعْدِىْ ۭ قَالُوْا نَعْبُدُ اِلٰهَكَ وَاِلٰهَ

**133** ఏమిటీ, యాఖూబ్ మరణ ఘడియల్లో ఉన్నప్పుడు మీరక్కడ ఉన్నారా?[152] ఆ సమయంలో ఆయన తన సంతానాన్నుద్దేశించి, "నా తదనంతరం మీరు దేనిని ఆరాధిస్తారు?" అని అడిగాడు. దానికి వారంతా, "మీ ఆరాధ్య దైవాన్ని,

ప్రశ్న ఇక్కడ ఉత్పన్నం కావచ్చు. అసలు విషయం ఏమిటంటే దైవాజ్ఞాపాలనలో ఆయన నిరుపమానమైన విధేయతను చూపారు. ఎన్ని విధాలుగా పరీక్షించినా నెగ్గుకు వచ్చారు.

151. దైవ ప్రవక్తలైన ఇబ్రాహీం, యాఖూబ్‌లు ఇరువురూ తమ సంతానానికి "అద్దీన్" గురించి వసీయతు చేశారు. ఆ 'అద్దీన్' అనేది ఇస్లాం మాత్రమేగాని యూదమతం కాదు. పై వాక్యాల ద్వారా ఈ విషయమే బోధపడుతున్నది. దివ్య ఖుర్ఆన్‌లోని ఇతర చోట్ల కూడా పదే పదే ఈ విషయం పునరావృతం అవుతూ ఉంది. ఉదాహరణకు: "ఇన్నద్దీన ఇన్దల్లాహిల్ ఇస్లాం" (అల్లాహ్ వద్ద ఆమోదయోగ్యమైన ధర్మం ఇస్లాం మాత్రమే) (ఆలి ఇమ్రాన్ : 19).

152. ఇక్కడ యూదులను నిలదీసి అడగటం జరిగింది. మీ పెద్దలగు ఇబ్రాహీం, యాఖూబులు తమ సంతానానికి యూదత్వంపై స్థిరంగా ఉండమని తాకీదు చేసినట్లు మీరు చెబుతున్నారు కదా! ఆ సమయంలో మీరు అక్కడ ఉన్నారా? దానికి వారు 'అవున'ని అంటే అది అన్నిటికన్నా పెద్ద అబద్ధంగా, నీలాపనిందగా భావించబడుతుంది. ఒకవేళ వారు 'లేదు' అని అన్నారనుకోండి, అట్టి పరిస్థితిలో వారు చెబుతున్నది నిజం కాదని అనుకోవాలి. ఎందుకంటే ఆ మహనీయులు తాకీదు చేసింది యూదత్వం గురించో, క్రైస్తవం గురించో, బహు దైవత్వం గురించో కాదు – వారు తాకీదు చేసింది ఇస్లాం గురించి మాత్రమే. ఆ మాటకువస్తే ప్రవక్తలందరి ధర్మం కూడా ఇస్లామే. వారు అందజేసిన షరీయతులో, ఆచరణా విధానంలో పాక్షికంగా తేడాపాడాలున్నప్పటికీ మౌలికంగా వారు ఆచరించి చూపిన జీవన ధర్మం మాత్రం ఒక్కటే – అదే ఇస్లాం! అదే దైవవిధేయతా విధానం!! ఈ విషయాన్నే మహనీయ

మీ పితామహులగు ఇబ్రాహీం, ఇస్మాయీలు, ఇస్హాఖ్‌ల ఆరాధ్యదైవం అయిన ఏకైక ఆరాధ్యుణ్ణి మాత్రమే ఆరాధిస్తాము, ఆయనకే విధేయులై ఉంటాము" అని జవాబు ఇచ్చారు.

آبَآئِكَ إِبْرٰهِمَ وَإِسْمٰعِيلَ وَإِسْحٰقَ إِلٰهًا وَاحِدًا ۚ وَنَحْنُ لَهٗ مُسْلِمُونَ ﴿١٣٣﴾

**134** అది గతించిన ఒక సమూహం. వారు చేసుకున్నది వారికి చెందుతుంది. మీరు చేసేది మీకు చెందుతుంది. వారి కర్మల గురించి మీరు ప్రశ్నించబడరు.[153]

تِلْكَ أُمَّةٌ قَدْ خَلَتْ ۚ لَهَا مَا كَسَبَتْ وَلَكُمْ مَّا كَسَبْتُمْ ۚ وَلَا تُسْـَٔلُونَ عَمَّا كَانُوا يَعْمَلُونَ ﴿١٣٤﴾

**135** మీరు యూదులుగానో, క్రైస్తవులుగానో మారిపోతే సన్మార్గం పొందగలరని వారు అంటారు. (ఓ ముహమ్మద్!) మీరు వారికి స్పష్టంగా చెప్పండి : "కాదు, ఇబ్రాహీము ధర్మాన్ని అనుసరించేవారే సన్మార్గంపై ఉన్నారు. ఇబ్రాహీం స్వచ్ఛమైన ఏకదైవారాధకుడు, అతను బహుదైవోపాసకుడు కాదు."[154]

وَقَالُوا كُونُوا هُودًا أَوْ نَصٰرٰى تَهْتَدُوا ۗ قُلْ بَلْ مِلَّةَ إِبْرٰهِمَ حَنِيفًا ۖ وَمَا كَانَ مِنَ الْمُشْرِكِينَ ﴿١٣٥﴾

ముహమ్మద్ (సఅసం) ఈ విధంగా ప్రవచించారు : "ప్రవక్తల సమూహం సవతి సంతానం వంటిది, వారి తల్లులు వేరు, కాని వారి ధర్మం మాత్రం ఒక్కటే" (సహీహ్ బుఖారీ, కితాబుల్ అంబియా – బాబు వజ్‌కుర్ ఫిల్ కితాబి మర్యమ. . . . ).

153. ఇది కూడా యూదులకే వర్తిస్తుంది. మీ పూర్వీకుల్లోని ప్రవక్తల, మహనీయుల ఘనకార్యాలను చెప్పుకుని మురిసిపోవటం వల్ల ప్రయోజనం ఏమీలేదు. వారు చేసుకున్న పుణ్యకార్యాల పుణ్యఫలం వారికే లభిస్తుంది – మీకు మాత్రం లభించదు. మీకు మాత్రం మీరు సంపాదించుకున్నదే లభిస్తుంది. దీన్నిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే తాతముత్తాతల సత్కర్మలను తలచుకుని, వాటి ఆశ్రయం పొందజూడటం సరైనది కాదు. విశ్వాసం, సత్కార్యాలు – ఇవి రెండూ చాలా ముఖ్యం. వెనుకటి పుణ్యపురుషుల మూలధనం కూడా ఈ రెండు వస్తువులే. ప్రళయదినం వరకూ రాబోయే తరాల మోక్షం కూడా ఈ రెండింటితోనే ముడిపడి ఉంది.

154. యూదులు యూదత్వాన్ని స్వీకరించమనీ, క్రైస్తవులు క్రైస్తవాన్ని పుచ్చుకోమనీ ముస్లింలకు పిలుపు ఇస్తున్నారు. సన్మార్గం తమ తమ మతాలలోనే ఉందని వారంటున్నారు. అయితే సన్మార్గం ఇబ్రాహీం విధానాన్ని అనుసరించిన వారికే

**136** (ముస్లిములారా!) మీరు ఇలా ప్రకటించండి : "మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మాపై అవతరింపజేయ బడిన దానినీ, ఇబ్రాహీం, ఇస్మాయీల్, ఇస్‌హాఖ్, యాఖూబ్ మరియు వారి సంతతిపై అవతరింపజేయబడిన దానినీ, మూసా, ఈసా ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున వొసగబడిన దానిని కూడా మేము విశ్వసించాము . మేము వారిలో ఎవరి మధ్య కూడా ఎలాంటి విచక్షణ (వివక్ష)ను పాటించము. మేము ఆయనకే విధేయు లము."[155]

قُولُوٓا آمَنَّا بِاللَّهِ وَمَآ أُنزِلَ إِلَيْنَا وَمَآ أُنزِلَ إِلَىٰٓ إِبْرَٰهِـۧمَ
وَإِسْمَٰعِيلَ وَإِسْحَٰقَ وَيَعْقُوبَ وَالْأَسْبَاطِ وَمَآ أُوتِيَ مُوسَىٰ
وَعِيسَىٰ وَمَآ أُوتِيَ النَّبِيُّونَ مِن رَّبِّهِمْ لَا نُفَرِّقُ بَيْنَ أَحَدٍ
مِّنْهُمْ وَنَحْنُ لَهُۥ مُسْلِمُونَ ﴿١٣٦﴾

లభిస్తుందనీ, ఇబ్రాహీం ఏమాత్రం కల్తీలేని ఏక దైవారాధకుడనీ గ్రంథవహులకు స్పష్టం చేయబడింది. ఇబ్రాహీం బహుదైవోపాసకుడు కాడు. కాని యూదత్వంలో, క్రైస్తవంలో షిర్క్ (బహు దైవారాధన) సమ్మిళితం అయి ఉంది.

**హెచ్చరిక :** ఇప్పుడు ముస్లిములలో సయితం షిర్క్ ధోరణులు పొడసూపుతున్నాయి. ఇస్లాం ప్రబోధనలన్నీ ఖుర్‌ఆన్ హదీసులలో సురక్షితంగా ఉన్నప్పటికీ, దేవుని ఏకత్వపు భావన వాటిలో అత్యంత స్పష్టంగా విశదీకరించబడినప్పటికీ, యూదత్వం, క్రైస్తవం ఇంకా బహుదైవత్వ మతాలకంటే ఇస్లాం ఎంతో విలక్షణమైన జీవన ధర్మం అని ఖుర్‌ఆన్ హదీసులు చెబుతున్నప్పటికీ ముస్లింలలోని ఓ పెద్ద వర్గం యొక్క విశ్వాసాలలో, ఆచరణలలో పెచ్చరిల్లిన ముదనష్టపు ముష్రిక్కు భావాలు ప్రపంచం దృష్టిలో ఇస్లాంకుగల వైశిష్ట్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఎందుకంటే అన్య మతాలవారు అందరూ నేరుగా ఖుర్‌ఆన్ హదీసులను తరచి చూసి 'ఇస్లాం అంటే ఇది' అన్న నిర్ణయానికి రాలేరు. వారు మాత్రం ఒక్క చూపులో ముస్లింల ఆచరణలను చూసి 'ఓహో! ఇస్లాం ధర్మం బోధించేది ఇదేనేమో!' అనుకుంటారు. రానున్న ఆయతులో ఈమాన్ ప్రామాణికత వివరించబడింది.

155. ఈమాన్ అంటే – ప్రవక్తలందరిపై అల్లాహ్ తరఫున అవతరింపజేయబడిన దానినీ, లేక వారికి వొసగబడిన దానినీ విశ్వసించాలి. ఏ ఒక్క దైవప్రవక్తనుగానీ, దైవగ్రంథాన్ని గానీ తిరస్కరించకూడదు. ఏదో ఒక గ్రంథాన్నీ, ఎవరో ఒక ప్రవక్తను విశ్వసించటం, మిగిలిన గ్రంథాలను లేక ప్రవక్తలను విశ్వసించ నిరాకరించటం అంటే ప్రవక్తల మధ్య భేదాన్ని పాటించటమే. ఈ భేదభావాన్ని ఇస్లాం సమ్మతించదు. కాకపోతే ఇప్పుడు

فَإِنْ آمَنُوا بِمِثْلِ مَا آمَنْتُمْ بِهِ فَقَدِ اهْتَدَوْا ۖ وَإِنْ تَوَلَّوْا
فَإِنَّمَا هُمْ فِي شِقَاقٍ ۖ فَسَيَكْفِيكَهُمُ اللَّهُ ۚ وَهُوَ السَّمِيعُ
الْعَلِيمُ ﴿١٣٧﴾

**137** ఒకవేళ వారు మీరు విశ్వసించినట్లే విశ్వసిస్తే, సన్మార్గం పొందగలరు. విముఖత గనక చూపితే వైరభావానికి లోనై ఉన్నారన్నది సుస్పష్టం. వారి బారి నుండి (రక్షించటానికి) నీకు అల్లాహ్ చాలు.[156] ఆయన అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు.

صِبْغَةَ اللَّهِ ۖ وَمَنْ أَحْسَنُ مِنَ اللَّهِ صِبْغَةً ۖ وَنَحْنُ لَهُ
عَابِدُونَ ﴿١٣٨﴾

**138** అల్లాహ్ రంగును స్వీకరించండి. అల్లాహ్ రంగుకన్నా మంచి రంగు ఎవరిది కాగలదు?[157] మేము మాత్రం ఆయన్నే ఆరాధిస్తాము.

---

ఆచరించవలసింది ఖుర్ఆన్ ప్రకారమే. వెనుకటి గ్రంథాలలో వున్న విషయాలను అవలంబించకూడదు. ఎందుకంటే ఇప్పుడవి అసలు సిసలు స్థితిలో లేవు. అవి మార్పులు చేర్పులకు లోనయ్యాయి. దివ్య ఖుర్ఆన్ అవతరించిన తరువాత వాటిలోని ఆదేశాలు, ఉపదేశాలన్నీ వాటంతట అవే రద్దయిపోతాయి.

156. ప్రవక్త ప్రియ సహచరులు (రజి) కూడా ఇందులో పేర్కొనబడిన విధంగానే విశ్వసించారు. అందుచేతనే ప్రియసహచరుల ఉదాహరణను ఇస్తూ, (ప్రవక్త సహచరులారా!) ఒకవేళ వారు కూడా మీరు విశ్వసించినట్లే విశ్వసిస్తే ముమ్మాటికీ వారు సన్మార్గాన ఉంటారు. మంకుతనంతో ముఖం త్రిప్పుకుంటే, మీరు ఏమాత్రం ఆందోళన చెందవలసిన పనిలేదు. వారి కుట్రలు, కుయుక్తులు మిమ్మల్ని ఏమీ చేయలేవు. ఎందుకంటే అల్లాహ్ మీకు అండగా ఉన్నాడు. అదే జరిగింది కూడా. కొన్నేండ్లలోనే ఈ వాగ్దానం నెరవేరింది. బనూ ఖైనుఖా, బనూ నజీర్ (మదీనా) నగరం నుంచి బహిష్కరించబడ్డారు. బనూ ఖురైజ వధించబడ్డారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతి నొందినప్పుడు ఒక పలక ఆయన ఒడిలో ఉండటం కనిపించిందనీ, దానిపై ఈ ఆయతులోని **"ఫ సయక్ఫీకహుముల్లాహ్"** అని రాసివున్న చోటే ఆయనగారి రక్తపు బిందువులు కారిపడినట్లు చారిత్రక ఉల్లేఖనాల ఆధారంగా తెలుస్తున్నది. ఆ ఖుర్ఆన్ ప్రతి (ముస్హఫ్) నేటికీ టర్కి దేశంలో ఉన్నదని చెబుతారు.

157. క్రైస్తవులు పసుపు పచ్చని రంగుగల నీరును ప్రత్యేకించుకున్నారు. దాన్ని వారు క్రైస్తవ పిల్లలకు ఇస్తారు. క్రైస్తవం (బాప్తిస్మం) పుచ్చుకోదలచిన వారందరికీ అది ఇవ్వబడుతుంది. దీన్నే వారు 'బాప్తిస్మం' పుచ్చుకోవటం అని అంటారు. ఈ ఆచారం వారి దృష్టిలో చాలా ముఖ్యమైనది. బాప్తిస్మం పుచ్చుకోని వారిని వారు పరిశుద్ధులుగా

**139** వారితో చెప్పు : "ఏమిటీ, మాకూ ప్రభువు, మీకూ ప్రభువు అయిన అల్లాహ్ విషయంలో మీరు మాతో వాదులాడు తారా? మా ఆచరణలు మాకు, మీ ఆచరణలు మీకు. మేము ఆయనకే అంకితం అయ్యాము.[158]

قُلْ أَتُحَاجُّونَنَا فِي اللَّهِ وَهُوَ رَبُّنَا وَرَبُّكُمْ وَلَنَا أَعْمَالُنَا
وَلَكُمْ أَعْمَالُكُمْ وَنَحْنُ لَهُ مُخْلِصُونَ ١٣٩

**140** ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్హాఖు, యాకూబు మరియు వారి సంతానం యూదులుగానో, క్రైస్తవులుగానో ఉన్నారని మీరు అంటున్నారా? "ఏమిటీ, మీకు ఎక్కువ తెలుసా లేక అల్లాహ్‌కు ఎక్కువ తెలుసా?"[159] అని వారిని అడుగు. అల్లాహ్ అప్పగించిన సాక్ష్యాన్ని దాచిపెట్టే వానికన్నా ఎక్కువ అన్యాయస్థుడు ఎవడు కాగలడు? మీ చేష్టల పట్ల అల్లాహ్ అజాగ్రత్తగా లేడు.[160]

أَمْ تَقُولُونَ إِنَّ إِبْرَاهِيمَ وَإِسْمَاعِيلَ وَإِسْحَاقَ وَيَعْقُوبَ
وَالْأَسْبَاطَ كَانُوا هُودًا أَوْ نَصَارَىٰ ۗ قُلْ أَأَنْتُمْ أَعْلَمُ أَمِ
اللَّهُ ۗ وَمَنْ أَظْلَمُ مِمَّنْ كَتَمَ شَهَادَةً عِنْدَهُ مِنَ اللَّهِ ۗ
وَمَا اللَّهُ بِغَافِلٍ عَمَّا تَعْمَلُونَ ١٤٠

---

భావించరు. అల్లాహ్ వారి ఈ పోకడను ఖండిస్తూ, అసలు రంగు అల్లాహ్‌దేనని, అల్లాహ్ రంగును మించినది వేరొకటి లేదని చెప్పాడు. అల్లాహ్ రంగు అంటే భావం సహజ ధర్మం. సహజ ధర్మం ఇస్లాం మాత్రమే. ప్రవక్తలందరూ తమ తమ కాలాల్లో, తమ జాతి ప్రజలకు ఈ ధర్మం వైపునకే పిలిచారు – అంటే దేవుని ఏకత్వం వైపుకు మానవాళిని ఆహ్వానించారు.

158. ఒక్కడైన అల్లాహ్‌ను ఆరాధించేవారం మేము. ఆయన కోసమే మేము మా దాస్యాన్ని ప్రత్యేకించుకున్నాము. ఆయన చేయమన్న వాటిని చేస్తున్నాము. చేయరాదన్న వాటి జోలికి పోకుండా ఉంటున్నాము. మీరు అందుకోసం మాతో తగవులాటకు దిగుతున్నారా? వాస్తవానికి ఆయన మాకూ ప్రభువే, మీకూ ప్రభువే. మేము మా ప్రభువు విషయంలో ఏం చేస్తున్నామో మీరూ అదే చేయాలి. మీరు గనక అలా చేయకపోతే దాని పర్యవసానం మీరే అనుభవిస్తారు. దానికి మేం బాధ్యులం కాము. మేము మాత్రం మా ప్రభువు కొరకే చిత్తశుద్ధితో ఆచరణ చేస్తాము.

159. దైవప్రవక్తలు, వారి పుత్రులు యూదులుగానో, క్రైస్తవులుగానో ఉన్నారని మీరు చెబుతున్నారు – అల్లాహ్ ఈ విషయాన్ని త్రోసిపుచ్చాడు. ఇప్పుడు మీరే చెప్పండి? మీకు ఎక్కువ తెలుసా? లేక అల్లాహ్‌కా?

**141** అది గతించిన ఓ సమాజం. వారు చేసుకున్నది వారికి చెందుతుంది. మీరు చేసుకున్నది మీకు లభిస్తుంది. వారి కర్మల గురించి మీరు ప్రశ్నించబడరు.[161]

تِلْكَ أُمَّةٌ قَدْ خَلَتْ ۖ لَهَا مَا كَسَبَتْ وَلَكُم مَّا كَسَبْتُمْ ۖ
وَلَا تُسْأَلُونَ عَمَّا كَانُوا يَعْمَلُونَ ﴿١٤١﴾

**142** "వీరు ఏ ఖిబ్లా వైపుకు అభిముఖులయ్యేవారో దాన్నుంచి మరలటానికి కారణం ఏమిటీ?" అని మూర్ఖజనులు అంటారు. (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : తూర్పు పడమరలు (అన్నీ) అల్లాహ్‌వే. తాను తలచిన వారికి ఆయన రుజుమార్గం చూపుతాడు.[162]

سَيَقُولُ السُّفَهَاءُ مِنَ النَّاسِ مَا وَلَّاهُمْ عَن قِبْلَتِهِمُ الَّتِي
كَانُوا عَلَيْهَا ۚ قُل لِّلَّهِ الْمَشْرِقُ وَالْمَغْرِبُ ۚ يَهْدِي مَن يَشَاءُ
إِلَىٰ صِرَاطٍ مُّسْتَقِيمٍ ﴿١٤٢﴾

160. దైవప్రవక్తలు యూదులుగానీ, క్రైస్తవులుగానీ కారన్న సంగతి స్వయంగా మీకూ తెలుసు. అలాగే మీ గ్రంథాలలో అంతిమ దైవప్రవక్త (స) రాకకు సంబంధించిన సూచనలు కూడా ఉన్నాయి. కాని మీరు ఈ సాక్ష్యాలను కప్పిపుచ్చి మహాపరాధానికి ఒడిగడుతున్నారు. ఆ సంగతి అల్లాహ్‌కు తెలీదని మాత్రం అనుకోకండి.

161. ఈ ఆయతులో మరోసారి మనిషి చేయవలసిన 'ఆచరణ' గురించి నొక్కి చెప్పబడింది. స్వయంగా ఏమీ చేయకుండా పూర్వీకుల్లోని పుణ్య పురుషుల 'ఆసరా' ద్వారా గట్టెక్కవచ్చని అనుకుంటే ఒరిగేది ఏమీ ఉండదని జాగరూకపరచటం జరిగింది. ఎందుకంటే దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు : ఎవరినయితే అతని ఆచరణ వెనుక వదలిపెట్టిందో, అతన్ని అతని వంశం ముందుకు తీసుకొనిపోజాలదు (సహీహ్ ముస్లిం). మీ పూర్వీకులు ఏదన్నా పుణ్యం చేసుకుని ఉంటే అది వారికి ఉపయోగపడుతుంది. వారి కర్మల గురించి మిమ్మల్ని నిలదీయటం జరగదు. అలాగే వారి పుణ్యకార్యాలు మీ ఖాతాలో జమ చెయ్యబడవు. దివ్య ఖుర్‌ఆన్‌లో చెప్పబడినట్లు "బరువు మోసేవాడెవ్వడూ మరొకరి బరువును మోయడు" (ఫాతిర్ – 18). "మానవుడు దేని కోసం పరిశ్రమిస్తాడో అది తప్ప మరొకటేదీ అతనికి ప్రాప్తించదు" *(అన్ నజ్మ్ – 39).*

162. మహాప్రవక్త (సఅసం) మక్కా నుండి మదీనాకు వలసపోయిన తరువాత సుమారు 16, 17 మాసాల వరకూ 'బైతుల్ మఖ్దిస్' వైపుకు తిరిగి నమాజు చేసేవారు. అయితే ఇబ్రాహీం గారి ఖిబ్లా అయిన కాబాగృహం వైపుకు తిరిగి నమాజు చేయాలన్న కోరిక ఆయన (స) మనసులో ఉండేది. అందుకోసం ఆయన (స) పలుసార్లు ప్రార్థించారు. కొన్నిసార్లు ఆకాశం వైపు కూడా ఆశగా చూశారు. ఎట్టకేలకు అల్లాహ్

وَكَذَٰلِكَ جَعَلْنَٰكُمْ أُمَّةً وَسَطًا لِّتَكُونُوا۟ شُهَدَآءَ عَلَى ٱلنَّاسِ وَيَكُونَ
ٱلرَّسُولُ عَلَيْكُمْ شَهِيدًا ۗ وَمَا جَعَلْنَا ٱلْقِبْلَةَ ٱلَّتِى كُنتَ عَلَيْهَآ
إِلَّا لِنَعْلَمَ مَن يَتَّبِعُ ٱلرَّسُولَ مِمَّن يَنقَلِبُ عَلَىٰ عَقِبَيْهِ ۚ

**143** అదేవిధంగా మేము మిమ్మల్ని ఒక "న్యాయశీల సమాజం" (ఉమ్మతె వసత్)[163]గా చేశాము – మీరు ప్రజలపై సాక్షులుగా, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మీపై సాక్షిగా ఉండటం కోసం (మేమిలా చేశాము.) ప్రవక్తకు విధేయత

ఖిబ్లా మార్పుకు సంబంధించిన ఆదేశాన్ని ఇచ్చాడు. దీనిపై యూదులు, కపటులు పెద్ద రాద్ధాంతమే చేశారు. వాస్తవానికి నమాజు అనేది ఒక ఆరాధన. ఆరాధన చేసే వానికి ఆరాధ్య దైవం నుంచి ఏ సూచన అందిందో దాని ప్రకారమే ఆరాధించవలసి ఉంటుంది. కాబట్టి అల్లాహ్ ఏ దిక్కుకు తిరగమంటే ఆ వైపుకు తిరగటం దాసుల విధి. అదీగాక వారు ఆరాధించే దైవం సకల లోకాల ప్రభువు. తూర్పు పడమరలన్నీ ఆయనవే. కాబట్టి ఏ వైపుకు తిరుగుతున్నామన్నది ముఖ్యం కాదు, ఆజ్ఞాపాలనలో ఎంతటి చిత్తశుద్ధి ఉంది? అన్నదే ప్రధానం. ఏ దిక్కుకు తిరిగి ప్రార్థన చేసినా అది ప్రార్థనే. కాకపోతే ఆ దిక్కుకు తిరిగి ప్రార్థన చేసుకోవచ్చు అని అల్లాహ్ తరఫున సెలవీయబడి ఉండాలంతే. ఖిబ్లా మార్పుకు సంబంధించిన ఈ ఆదేశం అస్ర్ నమాజ్ వేళ అవతరించింది. అస్ర్ నమాజు కాబా గృహం వైపు తిరిగి చేయబడింది.

163. అరబీలో **'వసత్'** అని ఉంది. 'వసత్' అంటే మధ్యస్థం అని అసలు అర్థం. కాని మెరుగైన, ఉత్తమమైన అన్న అర్థంలో కూడా ఈ పదం ప్రయోగించబడుతుంది. ఇక్కడ ఈ భావంలోనే ఇది ప్రయోగించబడింది. అంటే మీకు అత్యుత్తమమైన 'ఖిబ్లా'ను ప్రసాదించినట్లే, మిమ్మల్ని అందరికన్నా మెరుగైన సమాజంగా కూడా చేయటం జరిగింది. ఇలా చేయటంలోని ముఖ్యోద్దేశం మీరు మానవాళి కొరకు సాక్షులుగా ఉండాలన్నదే. మరో చోట సెలవీయబడినట్లు – "దైవప్రవక్త మీపై సాక్షిగా ఉండటానికీ, మీరు ప్రజల విషయంలో సాక్షులుగా ఉండటానికి (మేము ఇలా చేశాము)" అల్ హజ్ – 78).

కొన్ని హదీసులలో ఈ విషయం ఇలా విశదీకరించబడింది : ప్రళయదినాన అల్లాహ్ తన ప్రవక్తలనుద్దేశించి, మీరు మానవాళికి నా సందేశం అందజేశారా? లేదా? అని ప్రశ్నిస్తాడు. అందజేశామని వారు జవాబిస్తారు. ఈ మేరకు ఎవరన్నా సాక్షులుగా ఉన్నారా? అని తిరిగి ప్రశ్నించబడుతుంది. 'ఉన్నారు. ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులు ఈ విషయానికి సాక్షులు' అని వారంటారు. అప్పుడు మానవాళి కొరకు సాక్ష్యం ఇచ్చే గౌరవం ముహమ్మద్ (స) అనుచర సమాజానికి దక్కుతుంది. అందుకే ఉమ్మతె వసత్‌ను 'న్యాయశీల సమాజం'గా కూడా అనువదించటం జరిగింది (తఫ్సీర్ ఇబ్నె కసీర్). 'మధ్యస్థ సమాజం' అని కూడా అనువాదాలు జరిగాయి.

وَإِنْ كَانَتْ لَكَبِيرَةً إِلَّا عَلَى الَّذِينَ هَدَى اللَّهُ ۗ وَمَا كَانَ اللَّهُ
لِيُضِيعَ إِيمَانَكُمْ ۚ إِنَّ اللَّهَ بِالنَّاسِ لَرَءُوفٌ رَحِيمٌ ﴿١٤٣﴾

చూపటంలో ఎవరు నిజాయితీపరులో, మరెవరు వెనుతిరిగి పోయేవారో[164] తెలుసుకునే (పరీక్షించే) నిమిత్తమే మేము, పూర్వం నీవు అభిముఖుడవై ఉండిన దిశను మీ 'ఖిబ్లా'గా నిర్ధారించాము. ఇదెంతో కష్టమైన విషయమే అయినప్పటికీ అల్లాహ్ సన్మార్గం చూపిన వారికి (ఏ మాత్రం కష్టతరం కాదు). అల్లాహ్ మీ విశ్వాసాన్ని వృధా కానివ్వడు.[165] నిశ్చయంగా అల్లాహ్ (తన దాసులైన) మానవుల యెడల అమితమైన వాత్సల్యం కలవాడు! పరమ కృపాశీలుడు.

అంటే రెండు అతివాదాలకు అతీతమైనది, మధ్యేమార్గంతో కూడుకున్నది అన్న భావంలో ఈ తర్జుమా అయింది. రెండు అనువాదాలు కూడా సరైనవే.

164. 'ఖిబ్లా' మార్పు ఉద్దేశ్యం ఇందులో వివరించబడింది. నిజమైన విశ్వాసులు ఎల్లప్పుడూ దైవప్రవక్త (సఅసం) నుంచి అందే సూచన కోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఒక్క సైగ చేస్తే చాలు, కర్తవ్య నిర్వహణకై నడుం బిగిస్తారు. అందుకే ఒకవైపు నుంచి మరో వైపుకు మరలటం వారికి ఏమాత్రం కష్టతరం అనిపించలేదు. ఒకచోట కొందరు నమాజులో నిమగ్నమై ఉండగా– అకస్మాత్తుగా – ఖిబ్లా మార్పుకు సంబంధించిన ఆదేశం వచ్చింది. అందరూ రుకూ (వంగిన) స్థితిలో ఉన్నారు. ఆజ్ఞాపించబడిన తక్షణమే వారు తమ దిశను మరల్చుకున్నారు. ఆ ప్రార్థనా స్థలం ఇప్పుడు 'మస్జిదె ఖిబ్లతైన్' (రెండు ఖిబ్లాల మసీదు)గా పిలువబడుతుంది. అంటే ఒకే నమాజులో రెండు దిశల వైపుకు అభిముఖం అయిన మస్జిదు అన్నమాట! మస్జిదె ఖుబాలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. ఆయతులో అల్లాహ్, **'లినాలమ'** (మేము తెలుసుకోవటం కోసం) అని అన్నాడు. చూడబోతే ఏ దాసులు ఎటువంటివారో ఆయనకు బాగా తెలుసు. మరి అల్లాహ్ 'లినాలమ' అని ఎందుకు అన్నట్లు?! అన్న సందేహం ఈ సందర్భంగా జనించవచ్చు. దీని భావం ఏమిటంటే, నమ్మకం గలవారిని – సందేహాలకు లోనై ఉన్నవారిని అల్లాహ్ వేరుపరచదలిచాడు, ఇరువర్గాల వారిని స్పష్టపరచదలిచాడు – ఇది దానికి భావం! (ఫత్హుల్ ఖదీర్).

165. ఖిబ్లా మార్పు జరిగిన సందర్భంగా కొంతమంది ప్రవక్త సహచరులకు కూడా తమ సత్కర్మలకు సంబంధించి కించిత్ అనుమానం కలిగింది. ఇప్పటి వరకూ మనం బైతుల్ మఖ్దిస్ వైపుకు తిరిగి చేసిన నమాజులు ఏం కావాలి? వాటి పుణ్యం

قَدْ نَرٰى تَقَلُّبَ وَجْهِكَ فِي السَّمَآءِ ۚ فَلَنُوَلِّيَنَّكَ قِبْلَةً تَرْضٰهَا ۖ فَوَلِّ
وَجْهَكَ شَطْرَ الْمَسْجِدِ الْحَرَامِ ۗ وَحَيْثُ مَا كُنْتُمْ فَوَلُّوْا وُجُوْهَكُمْ
شَطْرَهٗ ۗ وَاِنَّ الَّذِيْنَ اُوْتُوا الْكِتٰبَ لَيَعْلَمُوْنَ اَنَّهُ الْحَقُّ مِنْ رَّبِّهِمْ ۗ
وَمَا اللّٰهُ بِغَافِلٍ عَمَّا يَعْمَلُوْنَ ﴿١٤٤﴾

**144** (ఓ ప్రవక్తా!) నువ్వు నీ ముఖాన్ని మాటిమాటికీ ఆకాశం వైపుకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. కాబట్టి ఇప్పుడు మేము, నువ్వు ఇష్టపడే ఆ దిశ వైపుకే నిన్ను త్రిప్పుతున్నాము. కనుక నువ్వు నీ ముఖాన్ని మస్జిదె హరామ్ వైపుకు త్రిప్పుకో. మీరెక్కడున్నా సరే ఇక మీదట మీ ముఖాలను దాని వైపుకే త్రిప్పాలి. (ఖిబ్లా మార్పుకు సంబంధించిన) ఈ విషయం, తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమేనని గ్రంథం ఇవ్వబడిన వారికి బాగా తెలుసు.[166] అల్లాహ్ వారి కార్యకలాపాల పట్ల అజాగ్రత్తగా లేడు.

وَمَآ اَنْتَ بِتَابِعٍ قِبْلَتَهُمْ ۚ وَمَا بَعْضُهُمْ بِتَابِعٍ قِبْلَةَ بَعْضٍ ۗ

**145** ఒకవేళ నీవు గ్రంథవహులకు నిదర్శనాలన్నీ చూపినా, వారు నీ 'ఖిబ్లా'ను అనుసరించరు.[167] వారి 'ఖిబ్లా'ను అంగీక

దక్కుతుందా? లేదా? ఇప్పటి దాకా చేసిన నమాజులన్నీ వృథా అయిపోయినట్లేనా?! అలాగయితే బైతుల్ మఖ్దిస్ వైపుకు తిరిగి నమాజు చేసే కాలంలో చనిపోయిన సహచరుల సంగతేమిటి?! – వారి ఈ సందేహాన్ని అల్లాహ్ నివృత్తి చేశాడు. వారు చేసిన నమాజులు ఏమాత్రం నిరర్థకం కావనీ, వాటి పుణ్యఫలం వారికి లభిస్తుందనీ స్పష్టం చేశాడు. ఈ ఆయతులో నమాజును ఈమాన్ (విశ్వాసం)తో పోల్చి నమాజులేని విశ్వాసానికి అర్థమేలేదని అవగతం చేయటం జరిగింది. నమాజును సజావుగా నెలకొల్పినప్పుడు, దైవాజ్ఞలను సక్రమంగా పాటించినపుడే ఈమాన్‌కు సార్థకత చేకూరుతుంది (ఫత్‌హుల్ ఖదీర్).

166. కాబాగృహం అంతిమ దైవప్రవక్త (స)కు 'ఖిబ్లా'గా ఉంటుందన్న సంగతి గ్రంథవహుల వద్ద ఉన్న వివిధ 'సహీఫా'లలో స్పష్టంగా సూచించబడింది. అందుచేత ఆ విషయం సత్యబద్ధం అని కూడా వారికి తెలుసు. అయినప్పటికీ వారి జాత్యహంకారం, ఓర్వలేనితనం సత్య స్వీకారంలో వారికి అడ్డంకిగా నిలిచాయి.

167. యూదుల వ్యతిరేకతకు అసలు కారణం అసూయ, అక్కసు గనక ఎన్ని నిదర్శనాలు సమర్పించినా వారి మనసులు మారవు. పరివర్తన రావాలంటే మనసులు నిర్మలంగా ఉండాలి. సంకుచిత భావాలు, అసూయా ద్వేషాలు సదా సత్యమార్గంలో అవరోధాలుగానే నిలుస్తాయి.

وَلَئِنِ اتَّبَعْتَ أَهْوَاءَهُم مِّن بَعْدِ مَا جَاءَكَ مِنَ
الْعِلْمِ ۙ إِنَّكَ إِذًا لَّمِنَ الظَّالِمِينَ ﴿١٤٥﴾

రించటం అన్నది నీవల్ల కూడా కానిపని.[168] వారిలో కూడా కొందరు మరికొందరి 'ఖిబ్లా'ను అనుసరించరు.[169] ఒకవేళ నువ్వు – జ్ఞానం వచ్చేసిన తరువాత కూడా – వారి కోరికలను అనుసరించినట్లయితే నువ్వు కూడా దుర్మార్గులలో చేరిపోతావు సుమా![170]

الَّذِينَ آتَيْنَاهُمُ الْكِتَابَ يَعْرِفُونَهُ كَمَا يَعْرِفُونَ أَبْنَاءَهُمْ ۖ وَإِنَّ
فَرِيقًا مِّنْهُمْ لَيَكْتُمُونَ الْحَقَّ وَهُمْ يَعْلَمُونَ ﴿١٤٦﴾

**146** మేము ఎవరికి గ్రంథం వొసగామో వారు తమ కన్న కొడుకులను గుర్తుపట్టి నట్లే అతన్ని (అనగా ముహమ్మద్–స–ను) గుర్తు పడతారు. వారిలోని ఒక సమూహం సత్యాన్ని గుర్తించి కూడా దాన్ని కప్పి పుచ్చుతుంది.[171]

الْحَقُّ مِن رَّبِّكَ ۖ فَلَا تَكُونَنَّ مِنَ الْمُمْتَرِينَ ﴿١٤٧﴾

**147** అయితే ఇది నీ ప్రభువు తరఫు నుంచి వచ్చిన (స్పష్టమయిన) సత్యం. (జాగ్రత్త!) నీవు మాత్రం సంశయాల్లో ఊగిసలాడేవారి సరసన చేరకు.[172]

168. దైవప్రవక్త (సఅసం) దైవవాణిననుసరించి ఆచరించే వారవటంచేత యూదుల కోర్కెలను అనుసరించలేదు. యూదులు కోరారు కదా! అని వారి 'ఖిబ్లా' వైపుకు మరలలేదు.

169. యూదులు, క్రైస్తవులు కూడా బైతుల్ మఖ్దిస్‌నే తమ 'ఖిబ్లా'గా చేసుకున్నప్పటికీ అందులో యూదులు "సఖ్‌రయె బైతుల్ ముఖ్దిస్"ను ఖిబ్లాగా భావిస్తుండగా, క్రైస్తవులు బైతుల్ మఖ్దిస్ యొక్క తూర్పు దిక్కును తమ ఖిబ్లాగా చేసుకున్నారు. గ్రంథవహులనబడే ఈ రెండు వర్గాల మధ్యనే 'ఖిబ్లా' వ్యవహారంలో ఏకాభిప్రాయం లేనప్పుడు, ముస్లింలు ఈ విషయంలో తమను అనుసరిస్తారని వారు ఎలా ఆశించగలరు?

170. ఇంతకుముందు కూడా ఇలాంటి హెచ్చరిక వచ్చింది. ఖుర్‌ఆన్ హదీసుల పరిజ్ఞానాన్ని ఆర్జించిన పిదప కూడా మార్గవిహీనుల అడుగుజాడల్లో నడవటం అన్యాయమే కదా! అలాంటి అన్యాయానికి పాల్పడితే దాని పర్యవసానం తీవ్రంగా ఉంటుందని అల్లాహ్ హెచ్చరిస్తున్నాడు.

171. ఇక్కడ గ్రంథవహుల్లోని కొందరు బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చినందుకు

**148** ప్రతి ఒక్కడూ ఏదో ఒక దిక్కుకు తిరుగుతున్నాడు.[173] కాబట్టి మీరు సత్కార్యాలలో మించిపోయేందుకు ప్రయత్నించండి. మీరు ఎక్కడ ఉన్నాసరే అల్లాహ్ మిమ్మల్ని సమీకరిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలవాడు.

وَلِكُلٍّ وِّجْهَةٌ هُوَ مُوَلِّيهَا فَاسْتَبِقُوا الْخَيْرٰتِ أَيْنَ مَا تَكُونُوا
يَأْتِ بِكُمُ اللّٰهُ جَمِيعًا إِنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿١٤٨﴾

అపరాధులుగా ఖరారు చేయబడ్డారు. ఎందుకంటే యూదుల్లో కొంతమంది అబ్దుల్లా బిన్ సలాం (రజి) లాంటివారు కూడా ఉండేవారు. కాని ఆయన (రజి) మాత్రం తన అంతరాత్మ ప్రబోధాన్ని అణచిపెట్టడం సహించలేక ఇస్లాం స్వీకరించారు.

172. దేవుని తరపున దైవప్రవక్తపై ఏ ఆదేశం అవతరించినా అది సత్యబద్ధం అయి ఉంటుంది. అందులో సందేహానికీ, అనుమానానికి ఆస్కారం ఉండకూడదు.

173. అంటే అన్ని మతాలవారు తమదంటూ ఒక దిక్కును నిర్ధారించుకున్నారు. ఈ వాక్యానికిగల మరొక అర్థం ఏమిటంటే, ప్రతి మతమూ తనదైన ఒక పంథాను, మార్గాన్ని నిర్ధారించి పెట్టుకుంది. దివ్య ఖుర్ఆన్‌లోనే వేరొకచోట సెలవీయబడినట్లు "మీలో ప్రతి ఒక్కరి కోసం మేము ఒక నిబంధనావళినీ, మార్గాన్నీ నిర్ధారించాము. అల్లాహ్‌యే గనక తలిస్తే మీ అందరినీ ఒకే సమాజంగా చేసి ఉండేవాడు. అయితే మీకు వొసగబడిన దానిలో మిమ్మల్ని పరీక్షించాలన్నది ఆయన అభిలాష" (అల్ మాయిదహ్ : 48). అంటే అల్లాహ్ సన్మార్గాన్నీ, అపమార్గాన్ని కూడా స్పష్టపరచిన తరువాత, ఆ రెంటిలో ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకునే ఏ స్వేచ్ఛనైతే మనిషికి ఇచ్చాడో, దాని ఆధారంగా జనులు వివిధ పద్ధతులను, జీవన విధానాలను ఏర్పరచుకున్నారు. ఆ విధానాలు భిన్నంగా ఉంటాయి. ఒకటి మరొకదానితో ఏమాత్రం సమరసం చెందదు. అల్లాహ్‌యే గనక తలచుకుంటే అందరి మెడలు వంచి అందరినీ ఒకే మార్గంపై – రుజుమార్గంపై – తీసుకురాగలిగేవాడే. ఒకవేళ ఆయన గనక అలా చేసి ఉన్నట్లయితే మనిషికి ఇవ్వబడిన 'స్వేచ్ఛ' మరియు 'ఎంపిక' అధికారానికి అర్థమే ఉండేది కాదు. వాస్తవానికి అల్లాహ్ – ఇచ్చిన ఈ స్వేచ్ఛయే మనిషి పాలిట పరీక్ష! కనుక ఓ ముస్లిములారా! మీరు ఈ పరీక్షలో నెగ్గుకురావాలి. దానికోసం మీరు సదాచరణ వైపుకు సమాయత్తం కావాలి. సమాయత్తం కావటంతోనే సరిపోదు, ఒండొకరిని మించిపోవాలి. ఇదే దైవమార్గం. ఇదే ప్రవక్త చూపిన మార్గం. మీరు ఈ మార్గంపైనే ముందుకు సాగండి.

وَمِنْ حَيْثُ خَرَجْتَ فَوَلِّ وَجْهَكَ شَطْرَ الْمَسْجِدِ الْحَرَامِ ۖ وَإِنَّهُ
لَلْحَقُّ مِن رَّبِّكَ ۗ وَمَا اللَّهُ بِغَافِلٍ عَمَّا تَعْمَلُونَ ﴿١٤٩﴾

**149** నీవు ఎక్కడి నుంచి బయలుదేరినా (నమాజు కోసం) నీ ముఖాన్ని మస్జిదె హరాం వైపునకు త్రిప్పు. ఇదే నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యం. మీరు చేసే దంతా అల్లాహ్‌కు తెలియకుండా లేదు.

وَمِنْ حَيْثُ خَرَجْتَ فَوَلِّ وَجْهَكَ شَطْرَ الْمَسْجِدِ الْحَرَامِ ۚ وَحَيْثُ
مَا كُنتُمْ فَوَلُّوا وُجُوهَكُمْ شَطْرَهُ لِئَلَّا يَكُونَ لِلنَّاسِ عَلَيْكُمْ حُجَّةٌ

**150** ఏ స్థలం నుంచి నీవు వెడలినా నీ ముఖాన్ని మజ్జిదె హరాం వైపునకు త్రిప్పు.[174] మీరు ఎక్కడ ఉన్నాసరే, మీ ముఖాలను దాని వైపునకే త్రిప్పండి– జనులు మీతో వాదులాటకు దిగకుండా ఉండటానికి[175] (ఇలాగే చేయండి).

174. 'ఖిబ్లా' వైపుకు ముఖం త్రిప్పుకోండి అన్న ఆజ్ఞ ఒకటి, రెండు కాదు – మూడుసార్లు చెప్పబడింది. దీన్నిబట్టి ఈ విషయానికి ఎంత ప్రాముఖ్యం ఉందో అర్థమవుతోంది. అసలు విషయం ఏమిటంటే ముస్లింలకు ఇది తొలి 'నస్ఖ్' అనుభవం. అంటే కొనసాగుతున్న ఒక ఆనవాయితీ మారటం ముస్లింలకు ఇదే మొదటిసారి! ఈ ఆనవాయితీ మార్పు వల్ల కలిగే మానసిక తటపటాయింపును దూరం చేసే ఉద్దేశ్యంతో ఇలా చెప్పబడి ఉండవచ్చు. లేక అనేక అనివార్య పరిస్థితుల దృష్ట్యా కూడా పదే పదే ఆ విషయం పునరావృతం అయి ఉండవచ్చు. కాబా గృహం తమ ఖిబ్లాగా ఉంటే బాగుంటుందన్న కోరిక ముహమ్మద్ (స) ఆంతర్యంలో జనించింది. ఇదొక కారణం. దానికి ఒకసారి "ఫసల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామ్" అని చెప్పబడింది. ఏ సైద్ధాంతిక సమాజానికయినా తమ జీవన విధానానికి, ఆరాధనా రీతులకు ఒక కేంద్రస్థానం ఎంతైనా అవసరం. ఇది మరొక కారణం. అందుకని ఇక్కడ మరోసారి **"ఫవల్లి వజ్‌హక షత్‌రల్ మస్జిదిల్ హరామ్"** అని అనబడింది. ఖిబ్లా మార్పుపై వ్యతిరేకుల, ప్రతికూలుర, విమర్శకుల నోళ్లు మూయించటం కూడా అవసరమే. ఇది ఇంకో కారణం. అందుకని ఇక్కడ కూడా మరోమారు ఆ వాక్యం పునరావృత మయింది (ఫత్‌హుల్ ఖదీర్).

175. అంటే – "ముస్లిముల ఖిబ్లా కాబా గృహం అయి ఉన్నప్పటికీ వీళ్లు బైతుల్ మఖ్దిస్ వైపుకు తిరిగి నమాజ్ చేస్తున్నారేమిటీ?" అన్న ప్రశ్నను గ్రంథవహులు లేవనెత్తి, గొడవ చేయకుండా ఉండేందుకుగాను ముందుగానే ఈ విధంగా ఆదేశించడమయింది అని భావం.

إِلَّا الَّذِينَ ظَلَمُوا مِنْهُمْ فَلَا تَخْشَوْهُمْ وَاخْشَوْنِي وَلِأُتِمَّ
نِعْمَتِي عَلَيْكُمْ وَلَعَلَّكُمْ تَهْتَدُونَ ﴿١٥٠﴾

వారిలోని దుర్మార్గులకు (వారు ఎలాగూ రాద్ధాంతం చేసేవారే. అంతమాత్రాన మీరు వారికి) భయపడకండి.[176] నాకు మాత్రమే భయపడండి[177] – నేను నా అనుగ్రహాన్ని మీపై సంపూర్తి గావించ టానికి, మీరు సన్మార్గగాములు అవటానికి.

كَمَا أَرْسَلْنَا فِيكُمْ رَسُولًا مِّنكُمْ يَتْلُو عَلَيْكُمْ آيَاتِنَا وَيُزَكِّيكُمْ
وَيُعَلِّمُكُمُ الْكِتَابَ وَالْحِكْمَةَ وَيُعَلِّمُكُم مَّا لَمْ تَكُونُوا تَعْلَمُونَ ﴿١٥١﴾

**151** అదేవిధంగా[178] మేము మీ వద్దకు స్వయంగా మీలో నుండే ఒక ప్రవక్తను (నియుక్తంచేసి) పంపాము. అతడు మీకు మా వాక్యాలను చదివి వినిపిస్తున్నాడు, మిమ్మల్ని పరిశుద్ధుల్ని చేస్తున్నాడు, మీకు గ్రంథజ్ఞానాన్నీ, వివేకవంతమైన విషయా లను బోధిస్తున్నాడు, ఇంకా మీకు తెలియని విషయాలను నేర్పుతున్నాడు.

176. ఇక్కడ **'జలమూ'** అంటే వైరభావం కలవారని అర్థం. అంతిమ దైవప్రవక్త (స) వారి 'ఖిబ్లా' కాబా గృహమేనని తెలిసి కూడా గ్రంథం కలవారిలోని విరోధులు బుద్ధిపూర్వ కంగా ఏదో ఒకటి అంటారు. బైతుల్ మఖ్దిస్ దిశనుండి మరలిపోయి ఈ ప్రవక్త ఎట్టకేలకు తమ తాతముత్తాతల ధర్మం వైపుకే మొగ్గిపోయాడని అక్కసును వెళ్ళగ్రక్కుతారు. మరికొంతమంది విద్వాంసుల దృష్టిలో ఇక్కడ 'జలమూ' అంటే ముష్రిక్కులు అని భావం.

177. దుర్మార్గులకు భయపడకండి. అంటే ముష్రిక్కులు అనే మాటలను పట్టించుకోకండి. "ముహమ్మద్ (సఅసం) ఆఖరికి మా 'ఖిబ్లా' వైపుకు అభిముఖం అయిపోయాడు. కొన్నాళ్ళుపోతే మా పూర్వీకుల ధర్మాన్ని కూడా అవలంబిస్తాడు" – అని ముష్రిక్కులు చంకలు గుద్దుకుని మరీ చెప్పుకున్నారు. దానిపై అల్లాహ్ ముస్లింలను ఉద్దేశ్యించి, "మీరు నాకు మాత్రమే భయపడండి, నేనిచ్చిన సూచనలను నిర్భయంగా అమలు చేయండి" అని ఓదార్చాడు. ఖిబ్లా మార్పును అనుగ్రహాల పరిపూర్తిగా, సన్మార్గ భాగ్యానికి ప్రతీకగా అభివర్ణించాడు. దైవాదేశాలను శిరసావహించే మనిషి సదా గౌరవ పురస్కారాలకు అర్హుడవుతాడనీ, సన్మార్గ భాగ్యం కూడా అతన్ని వరిస్తుందని స్పష్టం చేశాడు.

178. అరబీ మూలంలో **'కమా'** అనే పదం వచ్చింది. అంటే 'అదే విధంగా' అని అర్థం.

152 అందుకే మీరు నన్ను స్మరించండి, నేను మిమ్మల్ని జ్ఞాపకముంచుకుంటాను. నాకు కృతజ్ఞులై ఉండండి. కృతఘ్నుతకు పాల్పడకండి.[179]

فَاذْكُرُونِي أَذْكُرْكُمْ وَاشْكُرُوا لِي وَلَا تَكْفُرُونِ ﴿١٥٢﴾

**153** ఓ విశ్వాసులారా! సహనం మరియు నమాజు ద్వారా సహాయం అర్థించండి. అల్లాహ్ సహనం పాటించేవారికి తోడుగా ఉంటాడు.[180]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اسْتَعِينُوا بِالصَّبْرِ وَالصَّلَاةِ إِنَّ اللَّهَ مَعَ الصَّابِرِينَ ﴿١٥٣﴾

ఈ పదానికి వెనుకటి వాక్యంతో సంబంధం ఉంది. ఈ ఆయతుకు భావం ఏమిటంటే, ఇంతకు ముందు మీలో నుంచే ఒక ప్రవక్త ప్రభవింపబడ్డాడు. ఆ ప్రవక్త మీకు దివ్య వచనాలను వినిపిస్తున్నాడు. మిమ్మల్ని పరిశుద్ధపరుస్తున్నాడు. మీకు గ్రంథాన్ని, వివేకాన్ని బోధిస్తున్నాడు. మీకు తెలియని విషయాలను నేర్పుతున్నాడు. ఇది మీ కొరకు ఒక మహాభాగ్యం. ఓ గొప్ప వరం. మీకు ఆ వరం ఎలా లభించిందో అదేవిధంగా ఈ పరిపూర్ణ అనుగ్రహం, సన్మార్గ సద్బుద్ధి మీకు ప్రాప్తించాయి.

179. కాబట్టి మీరు ఈ అనుగ్రహ భాగ్యాలకు ప్రతిగా నన్ను ధ్యానించండి, నా నామ స్మరణ చేయండి, నా పవిత్రతను కొనియాడండి, నన్నే స్తుతించండి. ఈ వరాలను సద్వినియోగం చేసుకుంటూ కృతజ్ఞులై మెలగండి. కృతజ్ఞతా భావం పెరిగినకొద్దీ మీ అనుగ్రహాలు మీ పాలిట శుభకరంగా పరిణమిస్తాయి. మీ జీవితాలలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి.

అందుకే మీరు నేను చేసిన మేలును మరువకండి. 'కృతఘ్నుతా వైఖరి'కి ఒడిగట్టిన వారిని అల్లాహ్ ఈసడించుకుంటాడు. **"లయిన్ షకర్తుమ్ ల అజీదన్నకుమ్. వ లయిన్ కఫర్తుమ్ ఇన్న అజాబీ లషదీద్"** (ఇబ్రాహీం – 7) అన్న ఖుర్ఆన్ వాక్యం ఇక్కడ గమనార్హం.

180. మనిషి తన జీవితంలో రెండు ముఖ్య స్థితులను ఎదుర్కొంటాడు. ఒకటి : సుఖసౌఖ్యాల స్థితి. రెండు : కష్టాలు, కడగండ్ల స్థితి. సుఖసౌఖ్యాలు ప్రాప్తించినపుడు అతడు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి. కష్టాలెదురైనప్పుడు సహనంతో, ఓపికతో దైవసహాయాన్ని అర్థించాలి. హదీసులో ఇలా అనబడింది : "విశ్వాసి వ్యవహారం కడు విచిత్రమైనది. కలిమి కలిగినప్పుడు అతడు అల్లాహ్‌కు కృతజ్ఞుడవుతాడు. బాధ కలిగినప్పుడు ఓర్పు వహిస్తాడు. రెండు పరిస్థితులూ అతనికి మేలు చేకూర్చుతాయి" (సహీహ్ ముస్లిం).

ఓర్పు కూడా రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి : నిషిద్ధ విషయాలను, పాపాలను

**154** దైవమార్గంలో చంపబడిన వారిని మృతులు[181] అని అనకండి. వారు బ్రతికే ఉన్నారు. కాని ఆ విషయం మీకు అర్థం కాదు.

وَلَا تَقُولُوا لِمَن يُقْتَلُ فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتٌ ۚ بَلْ أَحْيَاءٌ وَلَٰكِن
لَّا تَشْعُرُونَ ﴿١٥٤﴾

**155** మేము ఏదో ఒకవిధంగా మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తూ ఉంటాము – భయంతో, ఆకలిదప్పులతో, ధన ప్రాణాల నష్టంతో, పండ్లకొరతతో (పరీక్షిస్తాము)! ఈ సహనమూర్తులకు శుభవార్త ఇవ్వండి.

وَلَنَبْلُوَنَّكُم بِشَيْءٍ مِّنَ الْخَوْفِ وَالْجُوعِ وَنَقْصٍ مِّنَ الْأَمْوَالِ
وَالْأَنفُسِ وَالثَّمَرَاتِ ۗ وَبَشِّرِ الصَّابِرِينَ ﴿١٥٥﴾

**156** వారికెప్పుడు ఏ ఆపద వచ్చిపడినా, "మేము ఖుద్దుగా అల్లాహ్‌కు చెందిన వారము,[182] మేము మరలిపోవలసింది కూడా ఆయన వద్దకేకదా!"అని అంటారు.

الَّذِينَ إِذَا أَصَابَتْهُم مُّصِيبَةٌ قَالُوا إِنَّا لِلَّهِ وَإِنَّا إِلَيْهِ
رَاجِعُونَ ﴿١٥٦﴾

---

విడనాడటం, వాటికి దూరంగా ఉండటానికి తన్ను తాను నిగ్రహించుకోవటం. భోగలాలసను, మనసైన వాటిని త్యాగం చేయటం, క్షణభంగురమైన ప్రయోజనాలను వదులుకోవటం వల్ల మనసుకు కలిగే అసంతృప్తిని ఓర్చుకోవటం. రెండు : దైవాదేశాలను పాటించటంలో ఎదురయ్యే కష్టాలను, బాధలను ఓర్పుతో, నేర్పుతో భరించటం. మరికొంతమంది ఇలా అభివర్ణించారు: అల్లాహ్‌కు ఇష్టమయిన వాటిని ఆచరణలో పెట్టాలి. మనసుకు, శరీరానికి ఎంత బాధ కలిగినా సరే అల్లాహ్‌కు ఇష్టంలేని విషయాలకు దూరంగా మసలుకోవాలి. కోర్కెలు, అభిరుచులు ఎంతగా ఉబలాటం చేసినా దైవసమ్మతం కాని వాటిని త్యజించాలి–ఇదే ఓర్పు! (ఇబ్నె కసీర్).

181. దైవమార్గంలో అమరగతి నొందినవారిని మృతులని అనకూడదు. ఎందుకంటే వారి గౌరవార్థం ఇలాంటి మాటలు అనరాదన్నమాట! ఈ సమాధి జీవితాన్ని "బర్‌జఖ్ జీవితం" అంటారు. దీన్ని మనం అర్థం చేసుకోలేము. ఈ జీవితం వివిధ స్థాయిల్లో ప్రవక్తలకు, విశ్వాసులకు చివరికి అవిశ్వాసులకు కూడా ఇవ్వబడుతుంది. అమరగతుని ఆత్మ – కొన్ని ఉల్లేఖనాల ప్రకారం విశ్వాసి ఆత్మకూడా – ఒక పక్షి ఉదరంలో ఉండి స్వర్గంలో తాను కోరినచోట విహరిస్తూ ఉంటుంది (ఇబ్నె కసీర్ – ఇంకా ఆలి ఇమ్రాన్ సూరా 169వ వచనంలో చూడండి).

182. ఈ ఆయతులో సహనం వహించేవారికి శుభవార్తలు అందజేయబడ్డాయి. నష్టం వాటిల్లినపుడు 'ఇన్నా లిల్లాహి వ యిన్నా ఇలైహి రాజివూన్'తో పాటు, **"అల్లాహుమ్మఅ్**

**157** వారిపై వారి ప్రభువు దయానుగ్రహాలు, కారుణ్యం ఉన్నాయి. సన్మార్గాన్ని పొందినవారు కూడా వీరే.

أُولَٰئِكَ عَلَيْهِمْ صَلَوَاتٌ مِّن رَّبِّهِمْ وَرَحْمَةٌ ۖ وَأُولَٰئِكَ هُمُ الْمُهْتَدُونَ ﴿١٥٧﴾

**158** నిస్సందేహంగా సఫా మర్వాలు అల్లాహ్ చిహ్నాల[183] లోనివి. కనుక కాబా గృహాన్ని (సందర్శించి) హజ్ ఉమ్రహ్‌లు చేసే వారు వాటి మధ్య ప్రదక్షిణ చేస్తే అందులో ఏ మాత్రం తప్పులేదు.[184] స్వచ్ఛందంగా ఎవరైనా ఏదైనా సత్కార్యం చేస్తే అల్లాహ్ ఆదరించేవాడు, తెలుసుకునేవాడు.

إِنَّ الصَّفَا وَالْمَرْوَةَ مِن شَعَائِرِ اللَّهِ ۖ فَمَنْ حَجَّ الْبَيْتَ أَوِ اعْتَمَرَ
فَلَا جُنَاحَ عَلَيْهِ أَن يَطَّوَّفَ بِهِمَا ۚ وَمَن تَطَوَّعَ خَيْرًا فَإِنَّ
اللَّهَ شَاكِرٌ عَلِيمٌ ﴿١٥٨﴾

**జుర్‌నీ ఫీ ముసీబతీ వ అఖ్‌లిఫ్ లీ ఖైరమ్ మ్మిన్‌హా"** పఠించటం ఎంతో మహత్పూర్వకమైనదని, దీన్ని తప్పక చదవాలని చెప్పబడింది (సహీహ్ ముస్లిం – కితాబుల్ జనాయిజ్).

183. ఆయతులో **'షఆయిర్'** అనే పదం వచ్చింది. 'షయీరతున్' దాని ఏకవచనం. షఆయిర్ అంటే చిహ్నాలు, గుర్తులు అని అర్థం. ఇక్కడ షఆయిర్ అంటే అల్లాహ్ నిర్ణయించిన హజ్ క్రియలు అని భావం. ఉదా : మౌఖఫ్ (అరఫాత్ మైదానం, అక్కడ ఆగటం), సఫా మర్వాల మధ్య సయీ చేయటం (పరుగెత్తటం), హదీ (ఖుర్బానీ పశువు), మన్‌హర్ (ఖుర్బానీ ఇచ్చే స్థలం) మొదలగునవి.

184. సఫా – మర్వాల మధ్య పరుగెత్తటం దోషం కాదు సరికదా అది హజ్ సందర్భంగా పాటించే క్రియల్లో ఒక అంశం. మరయితే దివ్య ఖుర్ఆన్ పదజాలాన్ని బట్టి (అంటే – వాటి మధ్య 'సయీ' చేస్తే అది తప్పు కాదు అని చెప్పటాన్ని బట్టి) బహుశా ఈ క్రియను పాటించవలసిన అవసరం లేదేమో! అన్న సంశయం కొందరికి కలగటం సహజం. ఎవరికో కాదు, స్వయంగా ప్రవక్త ప్రియసహచరులకే ఈ సందేహం కలిగింది. ఈ విషయం హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దృష్టికి వచ్చినప్పుడు ఆమె గారు ఇలా అభిప్రాయపడ్డారు : "ఒకవేళ మీరనుకునేదే నిజమైతే, 'వారు వాటిమధ్య ప్రదక్షిణ చేయకపోయినా తప్పులేదు' అని అల్లాహ్ సెలవిచ్చి ఉండేవాడు." ఆ తరువాత ఆమెగారు ఈ ఆయతు పూర్వరంగాన్ని విశదీకరించారు – దాని ప్రకారం ఇస్లాం స్వీకరణకు పూర్వం అన్సారులు మనాత్ విగ్రహం పేరున కీర్తనలు ఆలాపించేవారు. దానికోసం వారు 'ముషల్లల్' కొండపైన పూజలు కూడా చేసేవారు. అటువంటి పనులు చేసిన తాము, సఫా–మర్వా కొండల మధ్య పరుగులు తీయటం కూడా

**159** మేము అవతరింపజేసిన నిదర్శనాలను మరియు సన్మార్గాన్ని ప్రజల కొరకు గ్రంథంలో విశదపరచిన తరువాత కూడా వాటిని దాచిపెట్టే వారిని అల్లాహ్ శపిస్తాడు. ఇంకా, వేరే శపించేవారు కూడా వారిని శపిస్తారు.[185]

إِنَّ الَّذِينَ يَكْتُمُونَ مَا أَنزَلْنَا مِنَ الْبَيِّنَاتِ وَالْهُدَىٰ مِن بَعْدِ مَا بَيَّنَّاهُ لِلنَّاسِ فِي الْكِتَابِ ۙ أُولَٰئِكَ يَلْعَنُهُمُ اللَّهُ وَيَلْعَنُهُمُ اللَّاعِنُونَ ﴿١٥٩﴾

**160** అయితే పశ్చాత్తాపం చెంది, తమ ప్రవర్తనను సంస్కరించుకుని, సత్యాన్ని బహిర్గతం చేసిన వారి పశ్చాత్తాపాన్ని నేను స్వీకరిస్తాను (వారి తప్పును మన్నిస్తాను). నేను పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాణ్ణి, అపారంగా కనికరించేవాణ్ణి.

إِلَّا الَّذِينَ تَابُوا وَأَصْلَحُوا وَبَيَّنُوا فَأُولَٰئِكَ أَتُوبُ عَلَيْهِمْ ۚ وَأَنَا التَّوَّابُ الرَّحِيمُ ﴿١٦٠﴾

---

తప్పేనేమో! అని అనుమానించసాగారు. ఇస్లాం స్వీకరించిన మీదట వారు దైవప్రవక్త (సఅసం)ను ఈ విషయమై ప్రశ్నించగా ఈ ఆయతు అవతరించింది. సఫా–మర్వాల మధ్య 'సయీ' చేయటం తప్పు కాదు అని అందులో స్పష్టపరచటం జరిగింది (సహీహ్ బుఖారీ, కితాబుల్ హజ్).

మరికొంతమంది ఈ ఆయతు నేపథ్యాన్ని గురించి ఇలా వివరిస్తున్నారు : అజ్ఞానకాలంలో ముష్రిక్కులు సఫా–మర్వా పర్వతాలపై రెండు విగ్రహాలను ప్రతిష్ఠించారు. సఫా పర్వతంపై 'అసాఫ్' అనే పేరుగల విగ్రహం, మర్వా పర్వతంపై 'నాయిలా' అనే విగ్రహం ఉండేవి. 'సయీ' సందర్భంగా వాళ్ళు ఆ విగ్రహాలను ముద్దాడేవారు. లేదా చేత్తో తాకేవారు. కాని ఇస్లాం స్వీకరించిన తరువాత వారి ఆంతర్యాల్లో, 'సయీ' చేయటం బహుశా తప్పేమోనన్న శంక కలిగింది. వారి మనస్సుల్లో ఉన్న ఈ జంకును దూరం చేయడానికి అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి, 'సయీ' చేయటం చాలా అవసరమని బోధించాడు. ఈ 'సయీ' సఫా నుండి మొదలై మర్వా వద్ద ముగుస్తుంది (ఐసరుత్తఫాసీర్).

185. అల్లాహ్ తన గ్రంథంలో అవతరింపజేసిన విషయాలను బుద్ధిపూర్వకంగా దాచి ఉంచటం ఘోర పాపం. ఈ పాపానికి పాల్పడిన వారిని అల్లాహ్‌యే గాక శపించే వారు కూడా శపిస్తారు. హదీసులో ఇలా ఉంది : "తనకు తెలిసిన విషయం గురించి ఎవరయినా అతన్ని ప్రశ్నించగా, అతను దాన్ని దాచిపెడితే, ప్రళయదినాన అతని నోట్లో అగ్ని కళ్ళెం వేయబడుతుంది" (అబూ దావూద్ – కితాబుల్ ఇల్మ్).

إِنَّ الَّذِينَ كَفَرُوا وَمَاتُوا وَهُمْ كُفَّارٌ أُولَٰئِكَ عَلَيْهِمْ
لَعْنَةُ اللَّهِ وَالْمَلَائِكَةِ وَالنَّاسِ أَجْمَعِينَ ﴿١٦١﴾

**161** నిశ్చయంగా అవిశ్వాసానికి పాల్పడి, అవిశ్వాస స్థితిలోనే మరణించిన వారిపై అల్లాహ్ మరియు ఆయన దూతల ఇంకా జనులందరి శాపం పడుతుంది.[186]

خَالِدِينَ فِيهَا ۖ لَا يُخَفَّفُ عَنْهُمُ الْعَذَابُ وَلَا هُمْ يُنظَرُونَ ﴿١٦٢﴾

**162** అందులోనే వారు ఎల్లకాలం ఉంటారు. వారి శిక్షను తగ్గించటంగానీ, వారికి కొంత విడుపు ఇవ్వటంగానీ జరగదు.

وَإِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ ۖ لَّا إِلَٰهَ إِلَّا هُوَ الرَّحْمَٰنُ الرَّحِيمُ ﴿١٦٣﴾

**163** మీ అందరి ఆరాధ్య దైవం ఒకే ఆరాధ్య దైవం. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనే లేడు.[187] ఆయన అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు.

إِنَّ فِي خَلْقِ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَاخْتِلَافِ اللَّيْلِ وَالنَّهَارِ
وَالْفُلْكِ الَّتِي تَجْرِي فِي الْبَحْرِ بِمَا يَنفَعُ النَّاسَ وَمَا أَنزَلَ اللَّهُ

**164** భూమ్యాకాశాల సృష్టిలో, రేయింబవళ్ళ (నిరంతర) మార్పిడిలో, ప్రజలకు లాభం చేకూర్చే వస్తువులను మోసుకుంటూ సముద్రాలలో నడిచే ఓడలలో,

186. దీనిద్వారా స్పష్టమయ్యేదేమిటంటే, చనిపోయిన వ్యక్తి ఖచ్చితంగా అవిశ్వాస స్థితిలో మరణించాడన్న దృఢ నమ్మకం ఉన్నప్పుడు అతన్ని శపించటం సమ్మతమే. కాని ముస్లిం అయిన వ్యక్తిని – అతనెంత పాపాత్ముడు, దుర్మార్గుడైనాసరే – శపించటం ధర్మ సమ్మతం కాదు. ఎందుకంటే అతడు మరణ ఘడియలు ఆసన్నమైనపుడు నిజంగా పశ్చాత్తాపం చెందాడేమో! లేక అల్లాహ్ అతని ఇతరత్రా పుణ్యకార్యాల ఆధారంగా అతని కర్మల పత్రంపై "మన్నింపుల పెన్ను"ను ప్రయోగించాడేమో!! ఎవరికి తెలుసు? దాన్ని గురించి మానవ మాత్రులమైన మనం తెలుసుకోవటం అసాధ్యం. అయితే నిరంతరం శాపకారణమైన పనులు చేస్తూ, లతుకోరు చేష్టలకు పాల్పడుతూ కూడా పశ్చాత్తాప పడకుండా, క్షమాభిక్షకై వేడుకోకుండా ఉంటే అటువంటి దౌర్భాగ్యులను గురించి వారు శాపగ్రస్త పనులు చేస్తున్నారని మాత్రం చెప్పవచ్చు.

187. ఈ ఆయతులో ఇంకొకసారి దేవుని ఏకత్వ సందేశం ఇవ్వబడింది. ఈ ఏక దైవారాధనా పిలుపు మక్కాలోని ముష్రిక్కులకు మింగుడు పడేది కాదు. "ఏమిటీ, ఈయన ఇన్ని ఆరాధ్య దైవాల స్థానంలో ఒకే దైవాన్ని ప్రతిపాదిస్తున్నాడా? ఇది కడు ఆశ్చర్యకరమైన

ఆకాశం నుంచి అల్లాహ్ వర్షపు నీటిని కురిపించి మృతభూమిని బ్రతికించటంలో,[188] ఇంకా అందులో అన్ని రకాల ప్రాణులను వ్యాపింపజేయటంలో, వీచే పవనాల దిశలు మార్చటంలో, భూమ్యాకాశాల మధ్య (దేవుని) నియమ నిబంధనలకు కట్టుబడి మసలుకుంటున్న మేఘాలలో బుద్ధిమంతులకు (దేవుని శక్తి సామర్థ్యాలకు సంబంధించిన) ఎన్నో సూచనలున్నాయి.

مِنَ السَّمَآءِ مِن مَّآءٍ فَأَحْيَا بِهِ الْأَرْضَ بَعْدَ مَوْتِهَا وَبَثَّ فِيهَا مِن كُلِّ دَآبَّةٍ وَتَصْرِيفِ الرِّيٰحِ وَالسَّحَابِ الْمُسَخَّرِ بَيْنَ السَّمَآءِ وَالْأَرْضِ لَاٰيٰتٍ لِّقَوْمٍ يَعْقِلُونَ ﴿١٦٤﴾

**165** కాని అల్లాహ్‌ను కాదని ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టి, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా వారిని ప్రేమించేవారు కూడా ప్రజలలో కొందరు ఉన్నారు.[189] అయితే విశ్వసిం

وَمِنَ النَّاسِ مَن يَتَّخِذُ مِن دُونِ اللّٰهِ أَندَادًا يُحِبُّونَهُمْ كَحُبِّ

విషయం కదూ!" అని వారు అనేవారు (సాద్–5). అందుకే తరువాతి ఆయతులో దేవుని ఏకత్వపు నిదర్శనాలు తెలుపబడ్డాయి.

188. ఈ ఆయతు ఎంతో సమగ్రమైనది. విశ్వ వ్యవస్థ నిర్మాణానికి, దాని నిర్వహణకు, ప్రణాళికకు సంబంధించిన ఏడు ముఖ్యాంశాలు ఇందులో ఒకేచోట చేర్చబడ్డాయి. మరే ఆయతులోనూ ఇన్ని ప్రధానాంశాలు రాలేదు. 1. భూమ్యాకాశాల నిర్మాణం. వాటి వైశాల్యం, ఔన్నత్యం గురించి వర్ణించటం ఎవరితరమూ కాదు. 2. రేయింబవళ్లు ఒకదాన్ని తరుముకుంటూ ఇంకొకటి రావటం, పగటి వెలుగు, రాత్రి చీకటి మానవుల కార్యక్రమాలను, విశ్రాంతి సమయాన్ని నిర్ధారించుకోవటంలో ఎంతగానో దోహదపడుతున్నాయి. పగలు సుదీర్ఘంగా ఉన్నప్పుడు రాత్రి కుదించబడటం, రేయి పెరిగినప్పుడు పగలు తరగటం – ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పరచబడింది. 3. సముద్రాలలో పయనించే ఓడలు. వాటి ద్వారా టన్నుల కొద్దీ వర్తక సామగ్రి ఒక ప్రాంతం నుంచి వేరొక ప్రాంతానికి తరలించబడుతుంది. 4. భూమి సస్యశ్యామలంగా, పైరుపచ్చగా ఉండటానికి ఆకాశం నుంచి వర్షాలు కురవటం ఎంతో అవసరం. అల్లాహ్‌యే గనక ఆ కారుణ్య జల్లును కురిపించకపోతే నేల బీటలు వారుతుంది. అన్నపానీయాలు లేకుండా పోతాయి. అనావృష్టి వల్ల కరువు కాటకాలు సంభవిస్తాయి. పశుగ్రాసం లేకుండా పోతుంది. దేవుని ఈ ఆగ్రహోదగ్ర స్థితికి మానవుడు తట్టుకోలేడు.

ٱللَّهِ ۗ وَٱلَّذِينَ ءَامَنُوٓا۟ أَشَدُّ حُبًّا لِّلَّهِ ۗ وَلَوْ يَرَى ٱلَّذِينَ ظَلَمُوٓا۟ إِذْ
يَرَوْنَ ٱلْعَذَابَ أَنَّ ٱلْقُوَّةَ لِلَّهِ جَمِيعًا وَأَنَّ
ٱللَّهَ شَدِيدُ ٱلْعَذَابِ ﴿١٦٥﴾

చినవారు అల్లాహ్‌ను అంతకంటే ప్రగాఢంగా (అధికంగా) ప్రేమిస్తారు.[190] సర్వశక్తులూ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయనీ, అల్లాహ్ చాలా కఠినంగా శిక్షించేవాడన్న యదార్థాన్ని ముష్రిక్కులు, అల్లాహ్ విధించే శిక్షలను చూసిన తరువాత తెలుసుకునే బదులు, ఇప్పుడే తెలుసుకుంటే ఎంత బాగుంటుంది! (తెలుసుకుంటే వారు ఈ షిర్క్ పాపానికి ఒడిగట్టరు).

కాబట్టి ఇంగిత జ్ఞానమున్నవారు ఆకాశం నుంచి కురిసే ఈ వర్షంపై ఆలోచించాలి. 5. ధరణిలో నలువైపులా వ్యాపించి ఉన్న ప్రాణుల్లో సయితం సూచనలున్నాయి. పశువుల పుట్టుక, ఎగుమతి దిగుమతుల్లో వాటి ఉపయోగం, వ్యవసాయం కోసం అవి ఉపయోగపడుతున్న తీరు, యుద్ధాలు ప్రయాణాల కోసం కూడా వాటిని వాడుకోవటం, పాల ఉత్పత్తి, మాంసాహార సేకరణ – ఇన్ని విధాలుగా పశువులు మనుజ జాతికి ఉపయోగపడుతున్నాయి. 6. ఇక గాలులనే చూడండి – చల్లని గాలులు, వేడి గాలులు, రుతుపవనాలు, ఫలప్రదం కాని పవనాలు, అతి శీతల వాయువులు – నలు దిక్కుల నుంచీ వీస్తూ మానవ మనుగడకు దోహదపడుతున్నాయి. 7. ఇక కురిసే మేఘాలు. వాటిని అల్లాహ్ తాను కోరిన ప్రదేశాలలో కురిపిస్తాడు. ఇదంతా ఒక్కడైన ఆ దేవుని అద్భుత శక్తికి ప్రతీక కాదా? ఇవన్నీ ఆయన నిదర్శనాలు కావా?? ఈ సృష్టి ప్రక్రియలోగానీ, ఈ వ్యూహరచనలోగానీ, ఈ కార్య నిర్వహణలో గానీ వేరొకరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? లేరు. ముమ్మాటికీ లేరు. మరలాంటప్పుడు ఆ దైవాన్ని వదిలిపెట్టి ఇతరులను తమ అక్కరలు తీర్చేవారుగా భావించటం ఎంతవరకు సమంజసం? ఇది వివేకవంతమైన పనేనా? – ఆలోచించండి!

189. అల్లాహ్ తన దైవత్వానికి సంబంధించిన ఇన్ని స్పష్టమయిన నిదర్శనాలను ఇచ్చినప్పటికీ, అల్లాహ్‌ను కాదని ఇతరులను పూజించేవారు, అల్లాహ్‌ను ప్రేమించవలసిన విధంగా చిల్లరదేముళ్ళను ప్రేమించేవారు లోకంలో ఉన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రభవించిన కాలంలోనే కాదు, ఈ కాలంలోనూ షిర్క్ (బహు దైవారాధన)కు సంబంధించిన అటువంటి ప్రదర్శనలు లెక్కకు మించి కనిపిస్తాయి. ఇస్లాం పేరు చెప్పుకునే ప్రబుద్ధులలో సయితం ఈ రుగ్మత ప్రబలి ఉంది. వీళ్లు దైవేతరులను, పీర్లను, ఫకీర్లను, బాబాలను ఆరాధ్య దైవాలుగా కొలవటమే గాకుండా అల్లాహ్‌కన్నా అధికంగా వారిని అభిమానిస్తున్నారు. దేవుని ఏకత్వం (తౌహీద్) గురించి నొక్కి

**166** ఆ సమయంలో, వీళ్ళచేత అనుసరించబడిన నాయకులు తమ అనుచరులతో తమకు ఏ మాత్రం సంబంధం లేనట్లుగా ప్రవర్తిస్తారు. ఇంకా వారు శిక్షను కళ్ళారా చూసుకుంటారు. వారి మధ్య ఉండే సంబంధబాంధవ్యాలన్నీ తెగిపోతాయి.

إِذْ تَبَرَّأَ الَّذِينَ اتُّبِعُوا مِنَ الَّذِينَ اتَّبَعُوا وَرَأَوُا الْعَذَابَ وَتَقَطَّعَتْ بِهِمُ الْأَسْبَابُ ﴿١٦٦﴾

**167** అప్పుడు (కనువిప్పు కలిగిన) అనుచరులు ఇలా అంటారు : "మేమే గనక మరోసారి ప్రాపంచిక జీవితం వైపుకు మరలించబడటమంటూ జరిగితే వీరు (ఈ

وَقَالَ الَّذِينَ اتَّبَعُوا لَوْ أَنَّ لَنَا كَرَّةً فَنَتَبَرَّأَ مِنْهُمْ كَمَا تَبَرَّءُوا

వక్కాణించినపుడు ఆనాటి ముష్రిక్కులు ఎంతగా రెచ్చిపోయేవారో, వీళ్లూ అంతగానే రెచ్చిపోతుంటారు. పరిస్థితుల ఆ స్వరూపాన్ని అల్లాహ్ ఈ ఆయతులో ఈ విధంగా చిత్రీకరించాడు : "ఒక్క అల్లాహ్‌ను గురించి మాత్రమే ప్రస్తావించటం జరిగినప్పుడు పరలోకం పట్ల విశ్వాసం లేని వారి హృదయాలు బాధతో కుంచించుకుపోతాయి. ఆయనను తప్ప ఇతరులను గురించి ప్రస్తావించటం జరిగినప్పుడు ఒక్కసారిగా వారి ముఖాలు సంతోషంతో వెలిగిపోతాయి" (అజ్జుమర్ – 45).

190. కాని విశ్వాసులు (మోమిన్లు) మాత్రం ఇందుకు భిన్నంగా, ఒక్క అల్లాహ్‌నే ఆరాధిస్తారు. వారు అల్లాహ్ యెడల అమితమైన ప్రేమను కలిగి ఉంటారు. ముష్రిక్కులది మాత్రం ద్వంద్వ స్వభావం. ఆపదల్లో ఉన్నప్పుడు వారు తమ ఇష్ట దేవతలను మరచిపోయి, ఒక్కడైన అల్లాహ్‌నే మొరపెట్టుకుంటారు. సముద్రపు తుఫానులలో చిక్కుకున్నప్పుడు వారికి తమ కుల దైవాలు గుర్తుకు రావు. గండం గట్టెక్కడానికి సర్వలోక ప్రభువు ఆసరా తప్ప మరో ఆశ్రయం వారికి ఉండదు. ఆ దృశ్యాలనే ఖుర్ఆన్ ఎంతో చక్కగా చిత్రీకరించింది: 1. "వారు పడవలోకి ఎక్కినపుడు తమ ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకుంటారు" (అన్‌కబూత్ – 65). 2. "(సముద్రంలో) వారి మీదకు ఒక కెరటం నీడల మాదిరిగా క్రమ్ముకుని వచ్చినపుడు వారు తమ ధర్మాన్ని పూర్తిగా అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని ఆయన్ని మొరపెట్టుకుంటారు" (లుక్మాన్ – 32). 3. "అకస్మాత్తుగా ఎదురుగాలి ఉధృతమై అన్ని దిశల నుండి అలల తాకిడి తగలగా ప్రయాణీకులు తాము తుఫానులో చిక్కుకుపోయామని తెలుసుకుంటారు. ఆ సమయంలో అందరూ తమ ధర్మాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకుంటారు" (యూనుస్ – 22).

مِنَّا ۗ كَذٰلِكَ يُرِيهِمُ اللّٰهُ اَعْمَالَهُمْ حَسَرٰتٍ عَلَيْهِمْ ۗ وَمَا هُمْ بِخٰرِجِيْنَ مِنَ النَّارِ ﴿١٦٧﴾

అయ్యావార్లు) మా పట్ల ఇక్కడ విసుగును ప్రదర్శించినట్లే మేమూ వీరిపట్ల విసుగును ప్రదర్శించేవారం.[191] ఈ విధంగా వారు సిగ్గుతో కుంచించుకు పోయే విధంగా అల్లాహ్ వారి కర్మలను వారికి చూపిస్తాడు. అయినాసరే వారు నరకం నుంచి బయట పడటమన్నది అసంభవం.

يٰۤاَيُّهَا النَّاسُ كُلُوْا مِمَّا فِى الْاَرْضِ حَلٰلًا طَيِّبًا ۖ وَّلَا تَتَّبِعُوْا خُطُوٰتِ الشَّيْطٰنِ ۚ اِنَّهٗ لَكُمْ عَدُوٌّ مُّبِيْنٌ ﴿١٦٨﴾

**168** ప్రజలారా! భూమిలోని ధర్మసమ్మత మైన, పవిత్రమైన వస్తువులన్నింటినీ తినండి. కాని షైతాన్ అడుగుజాడలలో మాత్రం నడవకండి.[192] వాడు మీకు బహిరంగ శత్రువు.

اِنَّمَا يَاْمُرُكُمْ بِالسُّوْۤءِ وَالْفَحْشَاۤءِ وَاَنْ تَقُوْلُوْا عَلَى اللّٰهِ مَا لَا تَعْلَمُوْنَ ﴿١٦٩﴾

**169** వాడు మిమ్మల్ని కేవలం చెడు వైపుకు, నీతి బాహ్యత వైపుకు పురికొల్పుతాడు. ఏ విషయాల జ్ఞానం మీకు లేదో వాటిని అల్లాహ్ పేరుతో చెప్పమని మీకు ఆజ్ఞాపి స్తాడు.

191. పరలోకంలో – దైవసమక్షంలో – తాము ఆరాధించిన పీర్లు, బాబాల నిస్సహాయ స్థితిని చూసి ముష్రిక్కులు సిగ్గుతో కుంచించుకుపోతారు. కాని వారి ఈ పశ్చాత్తాపం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. ప్రపంచంలోనే వారికి ఆ జ్ఞానోదయం అయి ఉంటే అది వారికి లాభదాయకం అయి ఉండేది.

192. అంటే షైతాన్ అడుగుజాడల్లో నడిచి అల్లాహ్ ధర్మసమ్మతం (హలాల్) గావించిన వస్తువులను అనవసరంగా నిషిద్ధం (హరాం) చేసుకోకండి. బహుదైవోపాసకులనే చూడండి, వారు తమ దేవీదేవతల పేర వదలిన జంతువులను తినటాన్ని హరామ్ చేసుకున్నారు. దీని వివరాలు అల్ అన్ఆమ్ సూరాలో వస్తాయి. అల్లాహ్ ఇలా సెలవిచ్చినట్లు మహాప్రవక్త (సఅసం) తెలిపారు : “నేను నా దాసులను ఏకదైవారాధ కులు (హనీఫ్) గానే పుట్టించాను. కాని షైతానులు వాళ్ళను వారి ధర్మం నుండి పెడత్రోవ పట్టించారు. వారి కోసం నేను సమ్మతించిన విషయాలను వారిపై నిషిద్ధంగా చేశారు” (సహీహ్ ముస్లిం).

وَإِذَا قِيلَ لَهُمُ اتَّبِعُوا مَا أَنزَلَ اللَّهُ قَالُوا بَلْ نَتَّبِعُ
مَا أَلْفَيْنَا عَلَيْهِ آبَاءَنَا ۗ أَوَلَوْ كَانَ آبَاؤُهُمْ
لَا يَعْقِلُونَ شَيْئًا وَلَا يَهْتَدُونَ ﴿١٧٠﴾

**170** "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్ని అనుసరించండి" అని వారికి చెప్పినప్పుడల్లా, "మా తాతలు తండ్రులు అవలంబిస్తూ ఉండగా చూచిన పద్ధతినే మేము పాటిస్తాము" అని వారు సమాధానమిస్తారు. వారి పూర్వీకులు ఒట్టి అవివేకులు, మార్గ విహీనులైనప్పటికీ (వీళ్లు వారినే అనుసరిస్తారన్నమాట!)[193]

وَمَثَلُ الَّذِينَ كَفَرُوا كَمَثَلِ الَّذِي يَنْعِقُ بِمَا لَا يَسْمَعُ إِلَّا
دُعَاءً وَنِدَاءً ۚ صُمٌّ بُكْمٌ عُمْيٌ فَهُمْ لَا يَعْقِلُونَ ﴿١٧١﴾

**171** సత్య తిరస్కారుల ఉపమానం పశువుల కాపరి యొక్క కేకను, అరుపును మాత్రమే వినే పశువుల వంటిది (ఆలోచన అన్నమాటే ఉండదు). వారు చెవిటివారు, మూగవారు, గ్రుడ్డివారు. వారు అర్థం చేసుకోరు.[194]

193. అంతెందుకూ, ఈ కాలపు బిద్అతీలనే (ధర్మంలో లేనిపోని కొత్త విషయాలను సృష్టించేవారినే) చూడండి – మీరు చేసే ఈ పనులకు దీన్ (ధర్మం)లో ఎలాంటి ఆధారం లేదు కదా! అని అంటే, మా తాతముత్తాతల కాలం నుంచి ఇది ఆనవాయితీగా వస్తోంది, ఇప్పుడు మేము చెయ్యకూడదంటే ఎలా? అని జవాబు ఇస్తారు. వాస్తవానికి వారి తాతముత్తాతలు కూడా ధర్మావగాహన లేనివారే. వారు సయితం సన్మార్గానికి నోచుకోలేదు. కాబట్టి షరీయత్ నిదర్శనాలు ముందుకు వచ్చేసిన తరువాత తాతముత్తాతల ఆచారాలను పట్టుకు వ్రేలాడటం తప్పు. అలాగే దైవోపదేశం, దైవప్రవక్త (స) మార్గం స్పష్టమైపోయాక తమ ఇమాములు, విద్వాంసులు క్రోడీకరించి ఇచ్చిన అంశాలనే ప్రమాణబద్ధంగా తీసుకోవటం సమంజసం కాదు. అల్లాహ్ ముస్లిం సోదరులను ఈ ఊబినుంచి వెలికి తీయుగాక!

194. తమ పూర్వీకుల అంధానుసరణలో బుద్ధివివేకాలను స్థంభింపజేసుకున్న సత్య తిరస్కారులను పశువుల మందతో పోల్చటం జరిగింది. పశువుల కాపరి కేకవేసి పిలిచినపుడు అతని పిలుపును మాత్రం అవి వింటాయి. కాని అతను ఎందుకు కేకేశాడో ఆలోచించవు. ఈ అనుయాయుల పరిస్థితీ ఇంతే. వారు సత్య వాణిని వినలేని బధిరులు. సత్యం పలకలేని మూగజీవులు. సత్యాన్ని చూడలేని అంధులు. సత్య సందేశం, దేవుని ఏకత్వపు సందేశం, దైవప్రవక్త (స) విధానం గురించి ఏమాత్రం మెదడుకు మేత పెట్టని బద్ధకస్థులు. ఈ ఆయతులో **దుఆ, నిదా** అనే రెండు పదాలు

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ كُلُوا۟ مِن طَيِّبَٰتِ مَا رَزَقْنَٰكُمْ وَٱشْكُرُوا۟ لِلَّهِ إِن كُنتُمْ إِيَّاهُ تَعْبُدُونَ ﴿١٧٢﴾

**172** ఓ విశ్వసించిన వారలారా! మీరు కేవలం అల్లాహ్‌ను ఆరాధించేవారే అయితే మేము మీకు ప్రసాదించిన పవిత్రమైన వస్తువులను తినండి, త్రాగండి, అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపండి.[195]

إِنَّمَا حَرَّمَ عَلَيْكُمُ ٱلْمَيْتَةَ وَٱلدَّمَ وَلَحْمَ ٱلْخِنزِيرِ وَمَآ أُهِلَّ بِهِۦ

**173** అల్లాహ్ మీ కొరకు నిషేధించినవి ఇవే: చచ్చిన జంతువులు, (ప్రవహించిన) రక్తం, పందిమాంసం, ఇంకా అల్లాహ్ తప్ప ఇతరుల పేరుతో పిలువబడినది.[196]

ఉపయోగించబడ్డాయి. దగ్గర్లో ఉన్న వాటిని పిలువటానికి దుఆ, దూరంలో ఉన్నవాటిని పిలువటానికి నిదా అనే పదాలు ఉపయోగిస్తారు. వాటినే మేము అరుపు, కేక అని తర్జుమా చేశాం.

195. పవిత్రమైన వస్తువులన్నింటినీ భుజించాలనీ, అల్లాహ్‌కు కృతజ్ఞులై మెలగాలనీ ఇందులో విశ్వాసులకు తాకీదు చేయబడింది. 1. అల్లాహ్ ధర్మసమ్మతం గావించిన వస్తువులే పవిత్రం, పరిశుద్ధమనీ, నిషిద్ధ వస్తువులన్నీ అపవిత్రం మరియు అశుద్ధమైనవనీ దీనిద్వారా అవగతం అవుతోంది. నిషిద్ధ వస్తువులు శరీరానికి ఎంత శక్తినీ, మనసుకు ఎంత తృప్తిని ఇచ్చినప్పటికీ (పాశ్చాత్యులకు పంది మాంసం ఎంతో ఇష్టమైనట్లుగా) అవి అపవిత్రమైనవే. 2. దాంతో పాటు బహు దైవారాధకులు తమ దేవీదేవతల పేరు మీద అచ్చువేసి వదలిపెట్టిన జంతువులను, వస్తువులను తమ కోసం హరామ్ చేసుకుంటారు. (అల్ అన్‌ఆమ్ సూరాలో వివరాలు ఉన్నాయి). వారి ఈ చేష్ట అధర్మం. వారు తమ కోసం ఒక వస్తువును నిషేధించుకున్నంత మాత్రాన శాస్త్రబద్ధంగా అది నిషిద్ధ వస్తువు కాబోదు. కాబట్టి మీరు ఈ ముష్రిక్కుల మాదిరిగా హలాల్ వస్తువులను హరామ్ చేసుకోకండి. (హరామ్ చేయబడిన వస్తువులు ఏవేవో తరువాతి వచనంలో వివరించబడ్డాయి). 3. మీరు నిజంగా ఒకే దైవాన్ని ఆరాధించేవారైతే వీలయినంత అధికంగా ఆయనకు కృతజ్ఞతలు చెల్లించండి.

196. ఈ ఆయతులో నాల్గు నిషిద్ధ (హరామ్) వస్తువుల ప్రస్తావన వచ్చింది. అయితే అరబీ మూలంలో 'ఇన్నమా' అనే పద ప్రయోగం జరగటంవల్ల ఈ నాలుగు వస్తువులు మాత్రమే నిషిద్ధం కాబోలు! అన్న సంశయం కలుగుతుంది. కాని వీటితోపాటు మరికొన్ని వస్తువులు కూడా హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేయబడ్డాయి. కాబట్టి ఈ 'ఇన్నమా' అనే పదప్రయోగం ఒకానొక ప్రత్యేక నేపథ్యంలో జరిగిందని గ్రహించాలి. అంటే ముష్రిక్కులు ధర్మసమ్మతమైన వాటిని సయితం తమ కొరకు అధర్మం చేసుకోవటాన్ని ఎత్తిచూపిస్తూ ఇలా అనబడింది: 'నిషిద్ధ వస్తువులు అవి కావు, నిజానికి

لِغَيْرِ اللّٰهِ ۚ فَمَنِ اضْطُرَّ غَيْرَ بَاغٍ وَّلَا عَادٍ فَلَآ اِثْمَ عَلَيْهِ ۭ اِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿١٧٣﴾

ఎవరయినా ఉద్దేశ్యపూర్వకంగా కాకుండా, హద్దులను అతిక్రమించకుండా – గత్యంతరం లేని స్థితిలో – తింటే పాపం కాదు. నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, జాలిచూపేవాడు.

నిషిద్ధ వస్తువులు ఇవి' అని అల్లాహ్ చెప్పదలిచాడు. దీన్నే "హస్రె ఇజాఫీ" అని అంటారు. అంటే ఇవిగాక మరికొన్ని నిషిద్ధ వస్తువులు కూడా ఉన్నాయన్నమాట!.

జంతువుల ధర్మసమ్మతికి, నిషిద్ధానికి సంబంధించిన రెండు సూత్రాలు హదీసులో తెలియపరచబడ్డాయి. ఈ ఆయతుకు సరైన వివరణగా అవి మన దృష్టిలో మెదలుతూ ఉండాలి. క్రూర మృగాలలో గోళ్ళతో, కోరలతో వేటాడేవి, పక్షి జాతికి చెందినవాటిలో కాళ్ళతో తన్నుకుపోయేవి నిషిద్ధాలు. హదీసులో నిషిద్ధంగా నిరూపితమైన వేరితర జంతువులు కూడా హరామే. ఉదాహరణకు : గాడిద, కుక్క లాంటివి కూడా నిషిద్ధమే. దీన్నిబట్టి రూఢీ అయ్యే మరో ముఖ్యవిషయం ఏమిటంటే ఖుర్ఆన్ మాదిరిగా హదీసు కూడా దీన్ (ధర్మం) యొక్క మూలాధారమే. ఖుర్ఆన్‌తో పాటు హదీసును కూడా నమ్మినడుచుకున్నప్పుడు మాత్రమే ధర్మం పరిపూర్ణం అవుతుంది. హదీసును ఉపేక్షించి కేవలం ఖుర్ఆన్‌ను అనుసరిస్తామని ఎవరయినా అంటే అది సరైనది కాదు.

ఇక చచ్చిన జంతువు అంటే అర్థం జిబహ్ చేయకుండానే సహజ మరణం పొందిన లేక ప్రమాదం జరిగి చచ్చిపోయిన హలాల్ జంతువు అన్నమాట! (దీనికి సంబంధించిన వివరాలు అల్ మాయిద సూరాలో వస్తాయి) లేదా షరీయత్ సూచించిన పద్ధతికి విరుద్ధంగా జిబహ్ చేయబడిన జంతువు. అంటే గొంతు పిసకటం ద్వారానో, కఱ్ఱతో బాదటం ద్వారానో, రాయి విసరటం ద్వారానో ప్రాణం తీయబడినది అని భావం. అయితే హదీసులో రెండు మృత జంతువులు హలాల్ (ధర్మసమ్మతం) అని స్పష్టంగా చెప్పబడింది. 1. చేప. 2. మిడుత. ఈ 'మృత' ఆదేశం నుంచి ఈ రెండు జంతువులకూ మినహాయింపు ఉంది. 'రక్తం' అంటే జంతువును జిబహ్ చేసే సమయంలో ప్రవహించే రక్తం అన్నమాట! జిబహ్ తరువాత కూడా మాంసానికి రక్తం ఒకవేళ అంటుకుని ఉన్నా ఫరవాలేదు. హదీసు ప్రకారం రక్తంతో కూడుకున్న కాలేయం, గుల్మం కూడా ధర్మ సమ్మతమే.

పంది మాంసం నిషిద్ధం. అది అత్యంత నీచమైన, పరమ జుగుప్సాకరమైన జంతువు. అల్లాహ్ దీనిని హరామ్‌గా ఖరారు చేశాడు. అలాగే దైవేతరుని పేరుతో పిలువబడిన జంతువు లేక వస్తువు కూడా నిషిద్ధమే. అంటే అల్లాహ్ పేరుమీద గాక వేరొకరి పేరు మీద జిబహ్ చేయబడిన జంతువు. ఉదాహరణకు : అరబ్బు ముష్రిక్కులు అల్లాహ్

إِنَّ الَّذِينَ يَكْتُمُونَ مَا أَنزَلَ اللَّهُ مِنَ الْكِتَابِ وَيَشْتَرُونَ
بِهِ ثَمَنًا قَلِيلًا أُولَٰئِكَ مَا يَأْكُلُونَ فِي بُطُونِهِمْ إِلَّا النَّارَ
وَلَا يُكَلِّمُهُمُ اللَّهُ يَوْمَ الْقِيَامَةِ وَلَا يُزَكِّيهِمْ
وَلَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿١٧٤﴾

**174** అల్లాహ్ తన గ్రంథంలో అవతరింప జేసిన విషయాలను దాచేవారు, వాటిని కొద్దిపాటి ధరకు అమ్ముకునేవారు వాస్తవానికి తమ పొట్టలను అగ్నితో నింపుకుంటున్నారు. ప్రళయదినాన అల్లాహ్ వారితో అస్సలు మాట్లాడడు. వారిని పరిశుద్ధపరచడు. పైపెచ్చు వారికి బాధాకరమైన శిక్ష కలదు.

పేరు మీద గాకుండా లాత్, ఉజ్జా తదితర దేవతల పేరున జంతువులను కోసేవారు. జోరాష్ట్రియన్లు అగ్ని పేరున కోసేవారు.

ధర్మజ్ఞానం లేని ముస్లింలు చనిపోయిన తమ పూర్వీకుల పట్ల గల అభిమానాన్ని, భక్తినీ చాటుకోవటానికి, వారి ప్రసన్నతను చూరగొనడానికి, వారి ద్వారా తమ అక్కరలు తీర్చుకోవటానికి సమాధుల వద్ద, దర్గాలవద్ద, ఆస్థానాల వద్ద జిబహ్ చేసే జంతువులు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఈ సందర్భంగా జంతువులను జిబహ్ చేస్తున్నప్పుడు అల్లాహ్ పేరు చెప్పినప్పటికీ అవి ధర్మసమ్మతం కాజాలవు. ఎందుకంటే ఈ తతంగం వెనుక వారి ఉద్దేశ్యం దైవప్రసన్నతను పొందటం ఎంతమాత్రం కాదు. సమాధిలో వున్న వ్యక్తిని మెప్పించటానికి, దైవేతరుని సంతోషాన్ని బడయటానికి మాత్రమే వారు ఈ తతంగాన్ని జరిపించారు. కాబట్టి ఇది షిర్క్. అదేవిధంగా జంతువులు మాత్రమే గాకుండా దైవేతరుల పేరిట వారు సమర్పించే ఇతరత్రా వస్తువులు, నజరానాలు, నైవేద్యాలు – అన్నీ అధర్మంగానే పరిగణించబడతాయి. ఉదాహరణకు: దర్గాల, సమాధుల వద్దకు ఆహార వస్తువులు, వస్త్రాలు తీసుకువెళ్ళి కానుకగా సమర్పించుకోవటం, దర్గా చుట్టూ తిష్ఠవేసిన వారికి తినిపించటం, మిఠాయిలు పంచిపెట్టడం, హుండీలో నగదు వేయటం, ఉరుసుల సందర్భంగా పాలు, పండ్లు ఫలహారాలు పంపించటం – ఇవన్నీ హరామ్ కోవలోకే వస్తాయి. ఎందుకంటే ఇవన్నీ దైవేతరుని పేర చేసుకున్న మొక్కుబడులు. మొక్కుబడులు కూడా నమాజ్, రోజాల మాదిరిగా ఆరాధనలే. కాగా; ఆరాధన అన్నది ఒక్క అల్లాహ్‌కే ప్రత్యేకం కావాలి. అది ఇతరుల పేర జరిగితే షిర్క్ అవుతుంది. (బహు దైవారాధన) అందుకే హదీసులో అనబడింది – "దైవేతరుని పేర జంతువును బలి ఇచ్చినవాడు శాపగ్రస్తుడు" అని! (సహీహ్ అల్ జామె).

"తఫ్సీరె అజీజీ"లో నీషాపూరీ వ్యాఖ్యానం ఆధారంగా ఇలా అనబడింది : "ఏ ముస్లిం అయినాసరే దైవేతరుని సామీప్యం పొందే సంకల్పంతో జంతువును జిబహ్ చేస్తే అతడు ధర్మభ్రష్టుడు అయిపోతాడు, అతను చేసిన జిబహ్ ఒక ధర్మభ్రష్టుడు

**175** అపమార్గాన్ని సన్మార్గానికి బదులుగా, శిక్షను క్షమాభిక్షకు బదులుగా కొనుక్కున్న వారు వీరే. వారు నరకాగ్నిని ఎలా భరిస్తారో?

أُولَٰئِكَ الَّذِينَ اشْتَرَوُا الضَّلَالَةَ بِالْهُدَىٰ وَالْعَذَابَ بِالْمَغْفِرَةِ ۚ فَمَا أَصْبَرَهُمْ عَلَى النَّارِ ﴿١٧٥﴾

**176** ఇలా ఎందుకు జరిగిందంటే, అల్లాహ్ సత్యంతో కూడుకున్న గ్రంథాన్ని అవతరింపజేయగా, ఈ గ్రంథంతో విభేదించేవారు, తమ పెడసరి ధోరణిలో బహుదూరం వెళ్ళిపోయారు.

ذَٰلِكَ بِأَنَّ اللَّهَ نَزَّلَ الْكِتَابَ بِالْحَقِّ ۗ وَإِنَّ الَّذِينَ اخْتَلَفُوا فِي الْكِتَابِ لَفِي شِقَاقٍ بَعِيدٍ ﴿١٧٦﴾

**177** మీరు మీ ముఖాలను తూర్పు దిక్కుకో, పడమర దిక్కుకో తిప్పటమే సదాచరణ కాదు. సదాచరణ అంటే[197]

لَيْسَ الْبِرَّ أَنْ تُوَلُّوا وُجُوهَكُمْ قِبَلَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ وَلَٰكِنَّ الْبِرَّ مَنْ آمَنَ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ وَالْمَلَائِكَةِ وَالْكِتَابِ

ఇచ్చిన జంతు బలి అవుతుంది అన్న విషయంలో పండితుల మధ్య ఏకాభిప్రాయం ఉంది" (అల్ అన్ ఆమ్ సూరా 145వ ఆయతు, అన్ నహ్ల్ సూరా 115వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను కూడా చూడండి).

197. అసలు ఈ ఆయతు 'ఖిబ్లా' నేపథ్యంలోనే అవతరించింది. ఒకవైపు నుంచి (బైతుల్ మఖ్దిస్ పడమటి భాగాన్ని శ్రేష్ఠమైనదిగా భావించే) యూదులు, మరోవైపు నుంచి (బైతుల్ మఖ్దిస్ తూర్పు ప్రాంతానికి ప్రాముఖ్యం ఇచ్చే) క్రైస్తవులు ముస్లింల 'ఖిబ్లా' మార్పుపై రాద్ధాంతం చేస్తూ ఉండగా కొందరు ముస్లింల మనసు నొచ్చుకునేది. అప్పుడు అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేసి, తూర్పు వైపుకో, పడమర వైపుకో ముఖాన్ని త్రిప్పటం స్వతహాగా సత్కార్యం ఏమీ కాదని, ఒక కేంద్రస్థానం కోసమే, (సామూహిక లక్ష్యం కోసం) ఈ 'ఖిబ్లా' అనేది నిర్ధారితం అవుతుందనీ చెప్పదలిచాడు. ఇంకా అల్లాహ్ క్రింది విషయాలను కూడా ఈ సందర్భంగా స్పష్టపరిచాడు :

నిజానికి సత్కార్యం అంటే ధర్మం యొక్క మౌలికాంశాలపై దృఢవిశ్వాసం కలిగి ఉండాలి. దైవం సూచించిన మంచిపనులను సజావుగా నిర్వర్తించాలి. నీతీ నడవడికలను కలిగి ఉండాలి. అల్లాహ్‌ను విశ్వసించటమంటే ఖుర్ఆన్ హదీసులలో సూచించబడినట్లుగా ఆయన అస్థిత్వాన్నీ, ఆయన గుణగణాలను, ఆయన అధికారాలను వక్రభాష్యాలు చెప్పకుండా, ఉపమానాలు ఇవ్వకుండా విశ్వసించాలి. ఆయనకు సహవర్తులుగా ఇతరులను నిలబెట్టకూడదు. ఆయన ఆజ్ఞలన్నింటినీ శిరసావహించాలి. అంతిమ దినాన్ని విశ్వసించటమంటే అర్థం శిక్షాబహుమానాల

وَالنَّبِيّٖنَ ۚ وَاٰتَى الْمَالَ عَلٰى حُبِّهٖ ذَوِى الْقُرْبٰى وَالْيَتٰمٰى
وَالْمَسٰكِيْنَ وَابْنَ السَّبِيْلِ ۙ وَالسَّآئِلِيْنَ وَفِى الرِّقَابِ ۚ
وَاَقَامَ الصَّلٰوةَ وَاٰتَى الزَّكٰوةَ ۚ وَالْمُوْفُوْنَ بِعَهْدِهِمْ اِذَا
عٰهَدُوْا ۚ وَالصّٰبِرِيْنَ فِى الْبَاْسَآءِ وَالضَّرَّآءِ وَحِيْنَ
الْبَاْسِ ۗ اُولٰٓئِكَ الَّذِيْنَ صَدَقُوْا ۗ وَاُولٰٓئِكَ هُمُ الْمُتَّقُوْنَ ﴿١٧٧﴾

వాస్తవానికి అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ, దైవదూతలనూ, దైవగ్రంథాన్నీ, దైవప్రవక్తలనూ విశ్వసించటం. ధనప్రీతి ఉన్నప్పటికీ సమీపబంధువులకు, అనాథలకు, అగత్యపరులకు, బాటసారులకు, యాచించే వారికి (ధనాన్ని) ఇవ్వటం, బానిసలకు విముక్తి నొసగటం, నమాజును నెల కొల్పటం, జకాతును చెల్లిస్తూ ఉండటం, ఇచ్చిన మాటను నిలుపుకోవటం, లేమిలో కష్టకాలంలో, యుద్ధ సమయాలలో సహన స్థయిర్యాలను కనబరచటం– ఇవన్నీ కలిగి వున్నవారే వాస్తవానికి సత్యమూర్తులు. భయభక్తులు కలవారు కూడా వీరే.

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُتِبَ عَلَيْكُمُ الْقِصَاصُ فِى الْقَتْلٰى ۗ اَلْحُرُّ
بِالْحُرِّ وَالْعَبْدُ بِالْعَبْدِ وَالْاُنْثٰى بِالْاُنْثٰى ۗ فَمَنْ عُفِىَ لَهٗ مِنْ اَخِيْهِ

**178** ఓ విశ్వాసులారా! హతుల విషయంలో ప్రతీకార న్యాయం (ఖిసాస్) మీ కొరకు విధిగా నిర్ణయించబడింది. స్వతంత్రునికి బదులుగా స్వతంత్రుణ్ణి, బానిసకు బదులుగా బానిసను, స్త్రీకి బదులుగా స్త్రీని (మాత్రమే) హతమార్చాలి.[198]

దినాన్ని, స్వర్గనరకాలను నమ్మటం. అలాగే దైవగ్రంథాన్ని విశ్వసించటమంటే అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలన్నింటినీ నమ్మాలన్న భావం అందులో అంతర్లీనమై ఉంది. దైవదూతల ఉనికిని సత్యమని ధృవీకరించాలి. దైవప్రవక్తలందరి రాకను నిజమని నమ్మాలి. ఈ విశ్వాసాలతో పాటు (అంటే దేవుని హక్కులతోపాటు) సత్కార్యాలు (దాసుల హక్కులు) కూడా నెరవేర్చాలి. సిరిసంపదల పట్ల ఎంత వ్యామోహం ఉన్నప్పటికీ ఆప్తులకు, అవసరం ఉన్నవారికీ ఎంతో కొంత ఇవ్వాలి. కష్టకాలంలో, ఆర్థిక ఇబ్బందుల్లో కలవరపడకుండా ఆత్మ నిబ్బరంతో పరిస్థితులకు ఎదురీదటం నేర్చుకోవాలి. ఇది చెప్పుకున్నంత సులభం కాదు. చాలా కఠినమయిన విషయం. అయితే కలిమిలో ఉబ్బితబ్బిబ్బవకుండా, లేమిలో కృంగిపోకుండా మసలుకునే సజ్జనులను అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడు. **అల్ బఅ్‌సా** ( الْبَاْسَآءِ ) అంటే ఆర్థిక లేమి, తీవ్రమైన పేదరికం; **అజ్జర్రా** ( الضَّرَّآءِ ) అంటే నష్టం లేక రోగం; **అల్ బఅ్‌స్** ( الْبَاْسِ ) అంటే యుద్ధం, యుద్ధ తీవ్రత.

شَيْءٌ فَاتِّبَاعٌ بِالْمَعْرُوفِ وَأَدَاءٌ إِلَيْهِ بِإِحْسَانٍ ذَٰلِكَ تَخْفِيفٌ مِّن
رَّبِّكُمْ وَرَحْمَةٌ فَمَنِ اعْتَدَىٰ بَعْدَ ذَٰلِكَ فَلَهُ عَذَابٌ أَلِيمٌ ﴿١٧٨﴾

ఒకవేళ హతుని సోదరుడు హంతకుణ్ణి కనికరించదలిస్తే అతను రక్తశుల్కాన్ని న్యాయసమ్మతంగా అడగాలి. హంతకుడు కూడా రక్తధనాన్ని ఉత్తమ రీతిలో అతనికి చెల్లించాలి.[199] ఇది మీ ప్రభువు తరపున ఇవ్వబడిన వెసులుబాటు, కారుణ్యం.[200] ఆ తరువాత కూడా ఎవరయినా హద్దులు అతిక్రమిస్తే అతనికి వ్యధాభరితమైన శిక్ష ఉంటుంది.[201]

198. అజ్ఞాన యుగంలో ఒక నిర్ణీత చట్టం, న్యాయవ్యవస్థ ఉండేవి కావు. అందుచేత బలం, అధికారం ఉన్న తెగలు, వర్గాలు బలహీన వర్గాలపై, నిమ్న తెగలపై దౌర్జన్యం చేసేవి. అడ్డం వచ్చిన వారిని తెగనరికేవి. ఎవరయినా ఏదైనా వర్గానికి చెందిన ఒక వ్యక్తిని చంపితే ప్రతీకారంగా హంతకుణ్ణి చంపేబదులు హంతకుని తెగకు చెందిన అనేకమందిని పొట్టన పెట్టుకునేవారు. ఒక్కోసారి పూర్తి తెగనే మట్టుబెట్టేవారు. ఒక్కోసారి స్త్రీకి బదులుగా పురుషునిపై, బానిసకు బదులుగా యజమానిపై, స్వతంత్రునిపై ప్రతీకారం తీర్చుకునేవారు. అల్లాహ్ ఈ తేడాను, విచక్షణను రూపుమాపుతూ ప్రతీకార న్యాయానికి సంబంధించిన కొన్ని నియమాలను నిర్ధారించాడు. హత్యకు పాల్పడిన వాణ్ణి 'ఖిసాస్' (బదులు) గా హతమార్చాలని ఆదేశించాడు. ఒకవేళ హంతకుడు బానిస అయితే ఆ బానిసనే హతమార్చాలి. హంతకుడు స్వతంత్రుడైతే ప్రతీకారంగా ఆ స్వతంత్రుణ్ణే వధించాలి. స్త్రీకి బదులుగా స్త్రీనే వధించాలి. హత్యానేరానికి పాల్పడినవాడు పురుషుడైనపుడు స్త్రీని ప్రతీకారంగా చంపటంగానీ, హత్య చేసింది స్త్రీ అయినపుడు ప్రతీకారంగా పురుషుణ్ణి వధించటంగానీ న్యాయం, ధర్మం కాదు. 'ఖిసాస్'లో హంతకుణ్ణి మాత్రమే వధించటం జరుగుతుంది. ఆ హంతకుడు స్త్రీగానీ, పురుషుడుగానీ – ఎవరయినా సరే! "ముస్లింలందరి రక్తం (వారు పురుషులైనా, స్త్రీలైనా సరే) సమానమైనది" అని హదీసులో ఉంది (సుననె అబూదావూద్). మరిన్ని వివరాల కోసం అల్ మాయిద సూరా 45వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి.

199. క్షమాభిక్ష రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి : రక్తశుల్కం (లేక నష్ట పరిహారం) తీసుకోకుండా పెట్టే క్షమాభిక్ష. రెండు : ప్రతీకారం తీర్చుకునేబదులు రక్తశుల్కం తీసుకుని వదలివేయటం. రెండో పద్ధతి ననుసరించినప్పుడు రక్తశుల్కం తీసుకోవాలని నిర్ణయించుకున్న (హతుని తరపు) వ్యక్తి ఉత్తమ రీతిలో మెలగాలి. మరోవైపు హంతకుడు హతుని వారసులకు ఉత్తమరీతిలోనే నష్టపరిహారం చెల్లించాలి. హతుని

**179** ఓ బుద్ధిమంతులారా! ఈ ప్రతీకార న్యాయంలోనే మీ జీవనం ఉంది–ఇలా ఉంటేనే మీరు (అమానుషాల నుండి) ఆగి ఉంటారు.[202]

وَلَكُمْ فِي الْقِصَاصِ حَيٰوةٌ يّٰاُولِي الْاَلْبَابِ لَعَلَّكُمْ تَتَّقُوْنَ ﴿١٧٩﴾

**180** మీలో ఎవరికయినా మరణ ఘడియలు సమీపించి, వారివద్ద ఆస్తిపాస్తులున్నట్లయితే, వారు తమ తల్లిదండ్రుల, సమీప బంధువుల పేర ఉత్తమరీతిలో

كُتِبَ عَلَيْكُمْ اِذَا حَضَرَ اَحَدَكُمُ الْمَوْتُ اِنْ تَرَكَ خَيْرًا ۖۚ الْوَصِيَّةُ

వారసులు తనకు క్షమాభిక్ష పెట్టి ఉపకారం చేశారు. "ఉపకారానికి బదులు ఉపకారమే కాగలదు" (అర్రహ్మాన్ - 60). కాబట్టి హంతకుడు కూడా ఉపకార భావంతోనే వ్యవహరించాలి.

200. **'ఖిసాస్'** (ప్రతీకారం), **'దియత్'** (రక్తశుల్కం), **'మాఫీ'** (క్షమాభిక్ష) రూపంలో అల్లాహ్ మీకు కల్పించిన సౌకర్యం మామూలు సౌకర్యం కాదు. ఆయనే గనక ఈ విధంగా మీపై దయదలచి ఉండకపోతే మీ మధ్యగల కక్షలు కార్పణ్యాలు ముదిరి నరమేధం నిరంతరాయంగా కొనసాగేది. లోగడ తౌరాత్ గ్రంథాన్ని అనుసరించే వారికి ఖిసాస్ లేదా క్షమాపణ - రెండింటిలో ఏదో ఒకటి ఉండేది. రక్తశుల్కం ఉండేది కాదు. బైబిల్‌లో కేవలం క్షమాభిక్ష గురించి చెప్పబడింది. అందులో ఖిసాస్ గురించిగానీ, దియత్ (రక్తశుల్కం) గురించిగానీ ఏమీ అనబడలేదు (ఇబ్నె కసీర్).

201. రక్త శుల్కం (దియత్) తీసుకున్న తర్వాత కూడా ప్రతీకారంతో హత్యకు పాల్పడితే అది తలబిరుసుతనంగా, హద్దుల అతిక్రమణగా పరిగణించబడుతుంది. దానికి ఇహంలోనూ, పరలోకంలోనూ కఠిన శిక్షను అనుభవించవలసి ఉంటుంది. ఎందుకంటే ప్రతీకార చర్యకు పాల్పడి ఇప్పుడు అతను స్వయంగా నేరస్థుడైపోయాడు. నేరస్థుడికి శిక్ష తప్పదు కదా!

202. 'ఖిసాస్' (బదులు లేక ప్రతీకారం)గా తాను కూడా చంపబడతానన్న భయం హంతకునికి ఉన్నప్పుడే అతడు హత్యా నేరానికి పాల్పడేందుకు జంకుతాడు. మనుషుల్లో నెలకొనే ఈ 'ఖిసాస్' భీతి మూలంగా సమాజంలో రక్తపాతం, హత్యాకాండ వంటివి బహు అరుదుగా జరుగుతాయి. సమాజంలో శాంతి సౌమనస్యాలు నెలకొంటాయి. సవూదీ అరేబియా దేశంలో ఇప్పటికీ ఈ పరిస్థితిని వీక్షించవచ్చు. ఇది కేవలం ఇస్లామీయ శిక్షా విధానం చలువ మాత్రమే. ఇతర ముస్లిం దేశాలు కూడా ఈ శిక్షాస్మృతిని ప్రవేశపెట్టినట్లయితే ప్రజా బాహుళ్యానికి మేలు చేకూర్చినట్లవుతుంది.

వీలునామా వ్రాసిపోవటం విధిగా చేయ బడింది.[203] భయభక్తులు కలవారికి ఈ విధ్యుక్త ధర్మం మరింతగా వర్తిస్తుంది.

لِلْوَالِدَيْنِ وَالْأَقْرَبِينَ بِالْمَعْرُوفِ ۖ حَقًّا عَلَى الْمُتَّقِينَ ﴿١٨٠﴾

**181** వీలునామా (వసీయతు గురించి) విన్న తరువాత కూడా ఏ వ్యక్తయినా దాన్ని మార్చివేస్తే ఆ పాపమంతా ఆ మార్చిన వానిపైనే పడుతుంది. వాస్తవానికి అల్లాహ్ వినేవాడు, తెలిసినవాడూను.

فَمَنْ بَدَّلَهُ بَعْدَمَا سَمِعَهُ فَإِنَّمَا إِثْمُهُ عَلَى الَّذِينَ
يُبَدِّلُونَهُ ۚ إِنَّ اللَّهَ سَمِيعٌ عَلِيمٌ ﴿١٨١﴾

**182** వీలునామా చేసేవాడు పొరబాటున పక్షపాత వైఖరిని అవలంబించాడనో లేక పాపంతో కూడుకున్న శాసనం చేశాడనో భయపడినవారు[204] సంబంధీకులందరినీ పిలిచి, వారందరి మధ్య రాజీ కుదిరిస్తే అందులో దోషం లేదు. అల్లాహ్ క్షమించే వాడు, కనికరించేవాడు కూడా.

فَمَنْ خَافَ مِنْ مُوصٍ جَنَفًا أَوْ إِثْمًا فَأَصْلَحَ بَيْنَهُمْ
فَلَا إِثْمَ عَلَيْهِ ۚ إِنَّ اللَّهَ غَفُورٌ رَحِيمٌ ﴿١٨٢﴾

203. వసీయతుకు సంబంధించిన ఈ ఆజ్ఞ వారసత్వ పంపకాల ఆయతు అవతరించక ముందు వచ్చింది. అయితే ఇప్పుడీ ఆజ్ఞ రద్దు పరచబడింది. మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: “అల్లాహ్ ప్రతి హక్కుదారునికీ అతని హక్కును ఇచ్చేశాడు (అంటే వారసుల ఆస్తి భాగాలు నిర్ధారించబడ్డాయి). కాబట్టి ఇకమీదట ఏ వారసుని పేరిట కూడా వసీయతు చేయటం (వీలునామా రాయటం) ధర్మసమ్మతం కాదు” (సుననె తిర్మిజీ, ఇబ్నె మాజ – కితాబుల్ వసాయ). అయితే వారసత్వ హక్కు లభించనటువంటి బంధువుల పేర వీలు వ్రాయవచ్చు. లేదా దైవమార్గంలో ఖర్చుపెట్టే ఉద్దేశంతో కూడా వీలు వ్రాయవచ్చు. కాని ఈ వీలు గరిష్ట పరిమితి ఆస్తిలో మూడో వంతు మాత్రమే. అంతకుమించి వీలు వ్రాసేందుకు అనుమతి లేదు (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఫరాయిజ్).

204. మూలంలో **‘జనఫన్’** మరియు **‘ఇస్మన్’** అనే రెండు పదాలు ఉపయోగించబడ్డాయి. ‘జనఫన్’ (మొగ్గిపోవటం) – అంటే పొరపాటువల్లనో, మరుపువల్లనో బంధువుల్లో ఏ ఒక్కరి వైపుకైనా మొగ్గిపోవటం. ఇక ‘ఇస్మన్’ అంటే ఉద్దేశ్యపూర్వకంగా ఒకరివైపు మొగ్గిపోవటం (ఐసరుత్తఫాసీర్). లేక ఇస్మన్ అంటే పాపంతో కూడుకున్న వీలునామా రాయటం. ఇటువంటి వీలునామాను తప్పకుండా మార్చాలి. దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలుపరచకూడదు. దీనిద్వారా తెలిసేదేమిటంటే వీలునామా

**183** ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించబడింది – మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది.[205]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ ﴿١٨٣﴾

**184** అదీ లెక్కించదగిన కొన్ని రోజులు మాత్రమే. అయితే మీలో వ్యాధిగ్రస్తులుగానో, ప్రయాణీకులుగానో ఉన్నవారు ఆ ఉపవాసాల లెక్క ఇతర దినాలలో పూర్తి చేసుకోవాలి.[206] స్థోమత ఉన్న వారు[207]

أَيَّامًا مَّعْدُودَاتٍ ۚ فَمَن كَانَ مِنكُم مَّرِيضًا أَوْ عَلَىٰ سَفَرٍ فَعِدَّةٌ مِّنْ أَيَّامٍ أُخَرَ ۚ وَعَلَى الَّذِينَ يُطِيقُونَهُ فِدْيَةٌ

రాయటంలో న్యాయాన్ని పాటించటం చాలా అవసరం. అలాగాకుండా ప్రపంచాన్ని వదలివెళ్ళినప్పుడు కూడా ఆత్మీయులకు అన్యాయం చేసివెళితే పరలోక సాఫల్యం రీత్యా అది అతని కొరకు అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

205. **సియామ్, సౌమ్ :** సౌమ్ అంటే ఉపవాసం అని అర్థం – అంటే షరీయత్ పరిభాషలో ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానీయాలకు, భార్యతో సంభోగానికి దూరంగా ఉండటం అని అర్థం. ఈ వ్రతం కేవలం దైవప్రసన్నత కొరకే పాటించాలి. ఇది ఆత్మశుద్ధికి అత్యంత ముఖ్యమైన ఆరాధన గనక మీకు పూర్వం గతించిన సమాజాలపై కూడా ఈ ఆరాధన విధిగా నిర్ణయించబడింది. భయభక్తులను అలవరచుకోవటం, నిగ్రహం సంయమనాలను పుణికిపుచ్చుకోవటం దీని అసలు ఉద్దేశ్యం. మానవుని నీతి నడవడికలను సంస్కరించటంలో, అతని జీవన రథాన్ని ధర్మపథంలో నడిపించటంలో ఈ రోజా ఎంతగానో దోహదకారి అవుతుంది.

206. ఇది వ్యాధిగ్రస్తులకు, ప్రయాణీకులకు ఇవ్వబడిన రాయితీని సూచిస్తోంది. ప్రయాణీకులు లేక వ్యాధిగ్రస్తులు రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించలేని పక్షంలో, తరువాత వారు ఆ దినాలను పూర్తి చేసుకోవాలి.

207. అరబీలో **'యుతీఖూనహు'** అనే పదం ఉంది. దానికి 'శక్తిని కలిగి ఉండటం' అని అర్థం; అయితే ఆ పదాన్నే 'అతి కష్టంమీద ఉపవాసం ఉండగలగటం' అని కూడా తర్జుమా చేయటం జరిగింది. ఇది ఇబ్నె అబ్బాస్ (రజి) గారి తర్జుమా. ఇమామ్ బుఖారి కూడా ఈ తర్జుమాను ఇష్టపడ్డారు. అంటే విపరీతమైన వృద్ధాప్యం లేక నయమయ్యే సూచనలు లేని రోగం వల్ల అతి కష్టమ్మీద ఉపవాసం ఉండగలిగేవారు, ఇక తమ వల్ల బాధను ఓర్చుకోవటం సాధ్యం కాదనుకున్నప్పుడు, పరిహారంగా ఒక

طَعَامُ مِسْكِينٍ ۖ فَمَنْ تَطَوَّعَ خَيْرًا فَهُوَ خَيْرٌ لَّهُ ۚ وَأَنْ تَصُومُوا خَيْرٌ لَّكُمْ ۖ إِنْ كُنْتُمْ تَعْلَمُونَ ﴿١٨٤﴾

(ఉపవాస వ్రతం పాటించక పోయినందుకు) పరిహారంగా ఒక నిరుపేదకు అన్నం పెట్టాలి. కాని ఎవరైనా స్వచ్ఛందంగా ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే, అది వారికే మేలు.[208] మీరు గ్రహించగలిగితే ఉపవాసం ఉండటమే మీ కొరకు శ్రేయస్కరం.

شَهْرُ رَمَضَانَ الَّذِي أُنْزِلَ فِيهِ الْقُرْآنُ هُدًى لِلنَّاسِ وَبَيِّنَاتٍ مِنَ الْهُدَىٰ وَالْفُرْقَانِ ۚ فَمَنْ شَهِدَ مِنْكُمُ

**185** రమజాను నెల – ఖుర్‌ఆన్ అవతరింపజేయబడిన నెల.[209] అది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. కనుక మీలో ఎవరు ఈ నెలను చూస్తారో వారు ఉపవాసాలుండాలి.

నిరుపేదకు అన్నం పెట్టాలి. అయితే ఈ పదానికి మెజారిటీ ఉలమాలు “స్థోమత ఉన్నవారు” అని తర్జుమా చేశారు. దీని భావం ఏమిటంటే ఇస్లాం ఆవిర్భవించిన తొలి రోజుల్లో జనులకు ఉపవాసం ఉండటం అలవాటులేని కారణంగా ఆరోగ్యవంతులకు, ఉపవాసం పాటించే శక్తిగలవారికి కూడా ‘రాయితీ’ ఇవ్వబడింది. ఒకవేళ మీరు ఉపవాసం ఉండదలచుకోనిపక్షంలో మీ తరఫున ఒక పేదవానికి అన్నం పెట్టండి అని అనబడింది. ఆ తరువాత “ఫమన్ షహిద మిన్‌కుముష్షహ్‌ర ఫల్ యసుమ్‌హు” (మీలో ఈ నెలను చూసినవారు ఉపవాసం పాటించాలి) అనే ఆయతు ద్వారా ఈ రాయితీ కూడా ఎత్తివేయబడింది – అంటే శక్తికలిగి ఉన్నవారు ప్రతి ఒక్కరూ కూడా ఇకపై ఉపవాసం ఉండాల్సిందే. కాకపోతే విపరీతమైన ముసలితనంతో బాధపడేవారు, దీర్ఘకాలిక రోగాలతో కాలం వెళ్ళదీస్తున్నవారు మాత్రం తమ తరఫున ఫిదియా (పరిహారం) ఇచ్చుకోవచ్చు. గర్భవతులకు, బాలింతలకు ఉపవాసం కష్టంగా పరిణమిస్తే అలాంటప్పుడు వారు “మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులై ఉంటే....”అన్న ఆయతు భావంలోకి వస్తారు. వారు ఆ స్థితిలో ఉపవాసం ఉండక పోయినా ఫర్వాలేదు. అయితే తరువాత వారు విడిచిపెట్టిన ఆ ఉపవాసాల సంఖ్యను పూర్తిచేయవలసి ఉంటుంది (తొహ్ఫతుల్ అహ్వజీ – తిర్మిజీ వివరణ గ్రంథం).

208. ఏ వ్యక్తి అయినా స్వచ్ఛందంగా ఒక నిరుపేదకు బదులు ఇద్దరేసి, ముగ్గురేసి నిరుపేదలకు అన్నం తినిపిస్తే అది అతనికే శ్రేయస్కరం అవుతుంది.

209. రమజాన్ నెలలో ఖుర్‌ఆన్ అవతరింపజేయబడిందంటే దాని అర్థం పూర్తిగా ఈ

الشَّهْرَ فَلْيَصُمْهُ ۖ وَمَنْ كَانَ مَرِيضًا أَوْ عَلَىٰ سَفَرٍ فَعِدَّةٌ
مِّنْ أَيَّامٍ أُخَرَ ۗ يُرِيدُ اللَّهُ بِكُمُ الْيُسْرَ وَلَا يُرِيدُ بِكُمُ الْعُسْرَ
وَلِتُكْمِلُوا الْعِدَّةَ وَلِتُكَبِّرُوا اللَّهَ عَلَىٰ مَا هَدَاكُمْ
وَلَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿١٨٥﴾

అయితే రోగగ్రస్తునిగానో, ప్రయాణీకునిగానో ఉన్నవారు ఇతర దినాలలో ఈ లెక్కను పూర్తిచేయాలి. అల్లాహ్ మీకు సౌలభ్యాన్ని సమకూర్చదలుస్తున్నాడే గాని మిమ్మల్ని కష్టపెట్టదలచటం లేదు. మీరు (ఉపవాసాల) నిర్ణీత సంఖ్యను పూర్తిచేసుకోవాలన్నదీ, తాను అనుగ్రహించిన సన్మార్గ భాగ్యానికి ప్రతిగా ఆయన గొప్పతనాన్ని కీర్తించి, తగురీతిలో మీరు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నది అల్లాహ్ అభిలాష!

గ్రంథం ఈ ఒక్క మాసంలోనే అవతరించిందని కాదు. అసలు ఇది రమజాన్ నెలలోని ఘనమయిన రేయి (లైలతుల్ ఖద్ర్)లో భూమండలానికి సమీపంలోనున్న ఆకాశంపై అవతరింపజేయబడింది. అక్కడ అది 'బైతుల్ ఇజ్జత్'లో భద్రపరచబడింది. అక్కడినుంచి క్రమక్రమంగా, కొద్దికొద్దిగా, పరిస్థితుల కనుగుణంగా అవతరించి 23 సంవత్సరాల వ్యవధిలో పూర్తయింది (ఇబ్నె కసీర్). అందుచేత ఖుర్ఆన్ రమజాన్ నెలలోనో, లైలతుల్ ఖద్ర్‌లోనో, లైలతున్ ముబారకాలోనో అవతరించిందని అంటే ఇది కూడా సరైనదే. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ 'లౌహె మహ్‌ఫూజ్' నుంచి సమీప ఆకాశంలోకి అవతరింపజేయబడినది రమజాన్ నెలలోనే. లైలతుల్ ఖద్ర్ అన్నా, లైలతున్ ముబారక అని అన్నా రెండూ ఒక్కటే. అది రమజాన్ నెలలో వచ్చే శ్రేష్ఠమయిన రేయి మాత్రమే.

మరికొంతమంది విద్వాంసులు ఈ విధంగా వ్యాఖ్యానించారు: "ఖుర్ఆన్ అవతరణ రమజాన్ నెలలోనే మొదలయింది. హిరా కొండపై అవతరించిన మొట్టమొదటి 'వహీ' (దైవవాణి) రమజాన్ నెలలోనే. కాబట్టి దివ్య ఖుర్ఆన్‌కు – రమజాన్ నెలకు అవినాభావ సంబంధం ఉంది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుభప్రదమైన ఈ మాసంలోనే హజ్రత్ జిబ్రీల్ (అలైహిస్సలాం)కు ఖుర్ఆన్ అప్పజెప్పేవారు. ఆయన (సఅసం) మరణించిన ఏడాది వచ్చిన రమజాన్‌లో రెండుసార్లు జిబ్రీల్‌కు ఖుర్ఆన్ అప్పజెప్పారు. రమజాన్ నెలలోని మూడు రాత్రులలో ఆయన (స) తన సహచరులను సామూహికంగా ఖియాముల్లయిల్ (రాత్రి నమాజు) చేయించారు. దాన్నే ప్రస్తుతం తరావీహ్‌గా వ్యవహరించడం జరుగుతోంది (సహీహ్ సుననె తిర్మిజీ, సహీహ్ సుననె ఇబ్నెమాజ – అల్‌బానీ). ఈ తరావీహ్ నమాజు 8 రకాతులుగా ఉండేది. విత్ర్‌తో కలుపుకుని 11 రకాతులు అయ్యేది. హజ్రత్ జాబిర్ (రజి), హజ్రత్ ఆయిషా

**186** (ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచే వాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని (నువ్వు వారికి చెప్పు).[210] కాబట్టి వారు కూడా నా ఆదేశాన్ని శిరసావహించాలి, నన్ను విశ్వసించాలి (ఈ విషయం నీవు వారికి తెలియజేయి). తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందగల్గుతారు.

وَإِذَا سَأَلَكَ عِبَادِي عَنِّي فَإِنِّي قَرِيبٌ ۖ أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ ۖ فَلْيَسْتَجِيبُوا لِي وَلْيُؤْمِنُوا بِي لَعَلَّهُمْ يَرْشُدُونَ ﴿١٨٦﴾

(రజి.అన్హా) ఉల్లేఖనాల్లో తత్సంబంధిత వివరాలు ఉన్నాయి (బుఖారీ, కితాబుత్త హజ్జుద్). మహాప్రవక్త (సఅసం) 20 రకాతులు తరావీహ్ నమాజు చేసినట్లు ఏ సహీహ్ హదీసు ద్వారా కూడా నిరూపితం కాలేదు. అయితే కొంతమంది సహాబా (దైవప్రవక్త సహచరులు) పదకొండు రకాతులకన్నా ఎక్కువ చేసినట్లు ఆధారాలున్నాయి. కనుక కేవలం నఫిల్ సంకల్పంతో ఇరవై రకాతులు లేక వాటికంటే ఎక్కువ లేక తక్కువ రకాతులు చేయవచ్చు.

210. ఒకవైపు రమజాన్ నెలకు సంబంధించిన ఆదేశాలు, ఉపదేశాలు కొనసాగుతుండగానే మధ్యలో దుఆ (ప్రార్థన, వేడుకోలు) ప్రస్తావన రావటం గమనార్హం. దీన్నిబట్టి రమజాన్ మాసంలో 'దుఆ'కు గల ప్రాధాన్యం ఎటువంటిదో బోధపడుతోంది. కనుక వీలైనంత అధికంగా అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండాలి. ముఖ్యంగా ఉపవాసి ఉపవాస విరమణకు ముందు చేసే దుఆ ఎంతో విశిష్ఠమైనదనీ, అది దుఆ స్వీకరించబడే సమయమని చెప్పబడింది (ముస్నదె అహ్మద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజ - ఇబ్నె కసీర్ ఆధారంగా).

అయితే దుఆ స్వీకార యోగ్యానికి కూడా కొన్ని షరతులున్నాయన్న సంగతిని మరువరాదు. ఖుర్ఆన్ హదీసులలో అవి సూచించబడ్డాయి. వాటిలో రెండు షరతులు ఇక్కడ పేర్కొనబడ్డాయి. అవేమంటే : 1. నిజభావంలో అల్లాహ్‌ను విశ్వసించాలి. ఆ విశ్వాసం కల్తీలేనిదై ఉండాలి. అందులో సంశయానికి, ఊగిసలాటకు కించిత్తు ఆస్కారం కూడా ఉండకూడదు. 2. అల్లాహ్‌కు విధేయులై ఉండాలి. ఏ దశలోనూ, ఏ పనిలోనూ అవిధేయతా భావం, ధిక్కరణా ధోరణి తొంగిచూడకూడదు. వినయ వినమ్రతలు అణువణువునా తొణికిసలాడుతూ ఉండాలి. అలాగే హదీసులలో కూడా కొన్ని ముఖ్యాంశాలు పేర్కొనబడ్డాయి. వాటి ప్రకారం మనిషి అధర్మ సంపాదనతో కడుపు నింపుకోకుండా ఉండాలి. అతని వేడుకోలులో భీతి, అణకువ, అశక్తతలతో పాటు ఆశాభావం అభివ్యక్తమవుతూ ఉండాలి.

**187** ఉపవాస కాలంలోని రాత్రులలో మీరు మీ భార్యలను కలుసుకోవటం మీ కొరకు ధర్మ సమ్మతం చేయబడింది. వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు. మీరు రహస్యంగా ఆత్మద్రోహానికి పాల్పడుతున్నారనే సంగతి అల్లాహ్‌కు తెలుసు. అయినప్పటికీ ఆయన క్షమాగుణంతో మీ వైపుకు మరలి, మీ తప్పును మన్నించాడు. ఇకనుంచి మీరు మీ భార్యలతో (ఉపవాసపు రాత్రులందు) రమించడానికీ, అల్లాహ్ మీ కొరకు రాసిపెట్టిన దాన్ని అన్వేషించటానికీ మీకు అనుమతి ఉంది. తొలిజాములోని తెలుపు నడిరేయి నల్లని చారలో నుండి ప్రస్ఫుటం అయ్యే వరకూ తినండి, త్రాగండి.[211] ఆ తరువాత (వీటన్నింటినీ పరిత్యజించి) రాత్రి చీకటి పడేవరకూ ఉపవాసం ఉండండి.[212]

اُحِلَّ لَكُمْ لَيْلَةَ الصِّيَامِ الرَّفَثُ اِلٰى نِسَآىِٕكُمْ ؕ هُنَّ
لِبَاسٌ لَّكُمْ وَاَنْتُمْ لِبَاسٌ لَّهُنَّ ؕ عَلِمَ اللّٰهُ اَنَّكُمْ كُنْتُمْ
تَخْتَانُوْنَ اَنْفُسَكُمْ فَتَابَ عَلَيْكُمْ وَعَفَا عَنْكُمْ ۚ فَالْـٰٔنَ
بَاشِرُوْهُنَّ وَابْتَغُوْا مَا كَتَبَ اللّٰهُ لَكُمْ ۪ وَكُلُوْا وَاشْرَبُوْا حَتّٰى
يَتَبَيَّنَ لَكُمُ الْخَيْطُ الْاَبْيَضُ مِنَ الْخَيْطِ الْاَسْوَدِ مِنَ الْفَجْرِ ۪
ثُمَّ اَتِمُّوا الصِّيَامَ اِلَى الَّيْلِ ۚ وَلَا تُبَاشِرُوْهُنَّ وَاَنْتُمْ

211. ఇస్లాం ఆవిర్భవించిన తొలికాలంలో ఉన్న ఆజ్ఞ ప్రకారం సాయంత్రం ఉపవాస విరమణ తరువాత ఇషా నమాజు వరకు లేదా రాత్రి నిద్రించేవరకు మాత్రమే తినటానికీ, త్రాగటానికీ, భార్యతో సంభోగించటానికీ అనుమతి ఉండేది. నిద్రపట్టిన తరువాత ఇక ఈ మూడింటిలో ఏ ఒక్కటీ చేయకూడదు. ఈ ఆంక్ష ఒకింత కఠినమైనదే. దీన్ని ఖచ్చితంగా ఆచరణలో పెట్టటం కష్టతరం. అందువల్ల కొంతకాలం తరువాత అల్లాహ్ ఈ రెండు ఆంక్షలను కూడా ఎత్తివేసి, తెల్లవారుజాము వరకూ అన్నపానీయాలు తీసుకోవచ్చునీ, రతిక్రీడలో పాల్గొనవచ్చునీ తెలియపరిచాడు. **రఫస్** అంటే భార్యతో సంభోగించటం; **ఖైతుల్ అబ్‌యజ్** (తెల్ల దారం) అంటే ఉషోదయమనీ, **ఖైతుల్ అస్‌వద్** (నల్ల దారం) అంటే రాత్రి అనీ భావం (ఇబ్నె కసీర్).

**గమనార్హ విషయం :** దీనిద్వారా అవగతమయ్యే మరో అంశం ఏమిటంటే; సంభోగంవల్ల ఏర్పడిన అశుద్ధావస్థలో ఉపవాస సంకల్పం చేసుకోవటంలో తప్పు లేదు. ఎందుకంటే సహ్‌రీ వేళ వరకూ దేవుడు రతిక్రీడకు అనుమతించాడు. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిం ఉల్లేఖనాల ద్వారా కూడా ఈ అభిప్రాయానికి సమర్థన లభిస్తోంది (ఇబ్నె కసీర్).

212. అంటే సూర్యాస్తమయం కాగానే ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయాలి. ఇఫ్తార్‌లో

عٰكِفُوْنَ فِي الْمَسٰجِدِ ۭ تِلْكَ حُدُوْدُ اللّٰهِ فَلَا تَقْرَبُوْهَا ۭ
كَذٰلِكَ يُبَيِّنُ اللّٰهُ اٰيٰتِهٖ لِلنَّاسِ لَعَلَّهُمْ يَتَّقُوْنَ ١٨٧

ఇంకా – మీరు మస్జిదులలో 'ఏతెకాఫ్' పాటించేకాలంలో మాత్రం మీ భార్యలతో సమాగమం జరపకండి.[213] ఇవి అల్లాహ్ (నిర్ధారించిన) హద్దులు. మీరు వాటి దరిదాపులకు కూడా పోకండి. ప్రజలు అప్రమత్తంగా ఉండగలందులకుగాను అల్లాహ్ తన ఆయతులను ఇలా విడ మరచి చెబుతున్నాడు.

وَلَا تَاْكُلُوْٓا اَمْوَالَكُمْ بَيْنَكُمْ بِالْبَاطِلِ وَتُدْلُوْا بِهَآ
اِلَى الْحُكَّامِ لِتَاْكُلُوْا فَرِيْقًا مِّنْ اَمْوَالِ النَّاسِ
بِالْاِثْمِ وَاَنْتُمْ تَعْلَمُوْنَ ١٨٨

**188** ఒకరి సొమ్మును ఇంకొకరు అన్యాయంగా స్వాహా చేయకండి. బుద్ధిపూర్వకంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంతభాగం కాజేయటం కోసం

అనవసర జాప్యం చేయకూడదు. ఉపవాస విరమణలో వేగిరపడమని, ఇదెంతో శ్రేయోదాయకమని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది. 'విసాల్' చేయకండి. విసాల్ అంటే ఒక రోజు ఉపవాసం ఉండి, ఉపవాస విరమణ చేయకుండానే మరునాడు ఉపవాసం ఉండటం. మహాప్రవక్త (స) దీనిని చాలా గట్టిగా వారించారు (హదీసు గ్రంథాల్లో దీని వివరాలు ఉన్నాయి).

213. మస్జిదులో 'ఏతెకాఫ్' పాటిస్తున్నప్పుడు భార్యతో సంభోగించటం, ఆమెను ముద్దుపెట్టుకోవటం వంటివి సమ్మతం కావు. అయితే ఆమెతో కలసి మాట్లాడవచ్చు. ముఖ్య విషయాలను చర్చించవచ్చు. 'ఆకిఫూన ఫిల్ మసాజిద్' (మస్జిదుల్లో ఏతెకాఫ్ చేస్తున్నప్పుడు) అని అనడాన్ని బట్టి ఏతెకాఫ్ దీక్ష మస్జిద్‌లోనే చేయటం అవసరమని రూఢీ అవుతోంది. కాబట్టి స్త్రీలు తమ నివాస గృహాలలో 'ఏతెకాఫ్' పాటించటం సరైంది కాదు. మహాప్రవక్త (సఅసం) వారి సతీమణులు కూడా 'ఏతెకాఫ్' కోసం మస్జిద్‌నే ఎన్నుకున్నారు. అయితే మస్జిద్‌లో స్త్రీల కోసం ప్రతిదీ వేరుగా ఏర్పాటు చేయటం అవసరం. ఆడవారు, మగవారు కలసిపోకూడదన్నదే దీని ఉద్దేశ్యం. మస్జిద్‌లో ఆ మేరకు సదుపాయాలు సమకూరనంతవరకూ, స్త్రీలకు సురక్షితమైన స్థానం కల్పించనంతవరకూ వారిని మస్జిద్‌లో ఏతెకాఫ్ కోసం కూర్చోవటానికి సుతరామూ అనుమతి ఇవ్వకూడదు. స్త్రీలు కూడా ఈ విషయంలో మొండి పట్టు పట్టరాదు. ఎందుకంటే ఇదొక స్వచ్ఛంద (నఫిల్) ఆరాధన. విధిగా నిర్వర్తించవలసిన (ఫర్జ్) ఆరాధన ఏమీ కాదు. కాబట్టి గట్టి భద్రత, వసతి సౌకర్యం సమకూరనంతవరకూ ఈ స్వచ్ఛంద ఆరాధనను స్త్రీలు పరిత్యజించటమే మంచిది. "పరమార్థాల ప్రాప్తికై

అధికారులకు ముడుపులు చెల్లించకండి. అది (న్యాయం కాదన్న సంగతి) మీకూ తెలిసినదే.[214]

189 (ఓ ప్రవక్తా!) ప్రజలు నిన్ను నెలవంక గురించి ప్రశ్నిస్తున్నారు కదూ! ఇది ప్రజల (ఆరాధనల) వేళలను, హజ్ కాలాన్ని నిర్ధారించటానికి (జరిగిన ఏర్పాటు) అని నువ్వు వారికి సమాధానం ఇవ్వు. (ఇహ్రామ్ స్థితిలో) మీరు మీ ఇళ్ళలోకి వెనుక వైపు నుంచి రావటం సత్కార్యం కాదు. అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగివున్న వాడిదే అసలు సత్కార్యం. మీరు మీ ఇండ్ల లోకి వాకిళ్ళ నుండే ప్రవేశించండి.[215] సాఫల్యం పొందగలందులకుగాను అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.

يَسْـَٔلُونَكَ عَنِ الْأَهِلَّةِ ۖ قُلْ هِىَ مَوَاقِيتُ لِلنَّاسِ وَالْحَجِّ ۗ وَلَيْسَ الْبِرُّ بِأَن تَأْتُوا الْبُيُوتَ مِن ظُهُورِهَا وَلَٰكِنَّ الْبِرَّ مَنِ اتَّقَىٰ ۗ وَأْتُوا الْبُيُوتَ مِنْ أَبْوَابِهَا ۚ وَاتَّقُوا اللَّهَ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿١٨٩﴾

ప్రాకులాడేకన్నా, పొంచివున్న ప్రమాదాల నుంచి తప్పించుకోవటం ప్రథమ కర్తవ్యం” అన్నది ఫికహ్ సూత్రం.

214. ఒక వ్యక్తి ఏదేని సొమ్ముకు, ఆస్తికి హక్కుదారుడైనప్పటికీ ఒక్కోసారి తన హక్కును నిరూపించుకోవటానికి కావలసిన ఆధారాలు, సాక్ష్యాలు అతని వద్ద ఉండవు. ఎదుటివాని ఈ బలహీనతను సొమ్ము చేసుకునే ఉద్దేశ్యంతో ఎవరయినా న్యాయ స్థానాన్నిగానీ, సంబంధిత అధికారులనుగానీ ఆశ్రయించి, లంచాలు ఇచ్చి తన పక్షాన తీర్పువచ్చేలా చేసుకుంటే అది ముమ్మాటికీ అక్రమమే అవుతుంది. ఒకరి సొమ్మును అన్యాయంగా కబళించటం అంటే ఇదే. ఇది దుర్మార్గం, దురాగతం! న్యాయస్థానం పై పై ఆధారాలను, సాక్ష్యాలను చూసి తీర్పు వినిపిస్తుంది. అంతమాత్రాన (అంటే న్యాయస్థానం తీర్పు ఇచ్చినంతమాత్రాన) ఒక హరామ్ వస్తువు హలాల్ అయిపోదు. ఒక అన్యాయం న్యాయంగా మారిపోదు. కాబట్టి ఇలాంటి అన్యాయానికి పాల్పడినవాడు దేవుని దృష్టిలో నేరస్థుడుగానే పరిగణించబడతాడు (ఇబ్నె కసీర్).

215. అజ్ఞాన కాలంలో అన్సార్లు హజ్ లేక ఉమ్రహ్ కొరకు ఇహ్రామ్ దీక్షబూనిన తరువాత కూడా ఏదైనా అవసరం ఏర్పడి తమ ఇండ్లకు రాదలచినప్పుడు ముందువైపు నుంచి వచ్చే బదులు వెనుకవైపు నుంచి గోడదూకి మరీ వచ్చేవారు. పైగా ఇలా రావటం సత్కార్యం అని వారు భావించేవారు. ఇది ముమ్మాటికీ సత్కార్యం కాదనీ, దేవుని

وَقَاتِلُوا فِي سَبِيلِ اللَّهِ الَّذِينَ يُقَاتِلُونَكُمْ
وَلَا تَعْتَدُوا إِنَّ اللَّهَ لَا يُحِبُّ الْمُعْتَدِينَ ١٩٠

**190** మీతో పోరాడే వారితో మీరు కూడా దైవమార్గంలో పోరాడండి. కాని మితిమీరకండి.[216] మితిమీరి పోయేవారిని అల్లాహ్ ఇష్టపడడు.

وَاقْتُلُوهُمْ حَيْثُ ثَقِفْتُمُوهُمْ وَأَخْرِجُوهُمْ مِنْ حَيْثُ
أَخْرَجُوكُمْ وَالْفِتْنَةُ أَشَدُّ مِنَ الْقَتْلِ وَلَا تُقَاتِلُوهُمْ
عِنْدَ الْمَسْجِدِ الْحَرَامِ حَتَّىٰ يُقَاتِلُوكُمْ فِيهِ فَإِنْ

**191** వారు ఎక్కడ ఎదురైనా మీరు వారితో తలపడండి, మిమ్మల్ని ఎక్కడినుంచి వారు తరిమికొట్టారో, అక్కడి నుంచి మీరు కూడా వారిని తరిమికొట్టండి. ఫిత్నా (కుఫ్ర్, షిర్క్, పీడన) అనేది చంపటంకన్నా తీవ్రమైనది.[217] 'మస్జిదె హరామ్' వద్ద వారు

హద్దులను ఖాతరు చెయ్యటమే సిసలయిన సత్కార్యం అని అల్లాహ్ వారికి స్పష్టపరిచాదు (ఐసరుత్తఫాసీర్).

216. ఈ ఆయతులో మొట్టమొదటిసారిగా శత్రువులతో పోరాడేందుకు అనుమతించబడింది. అదీ ఎప్పుడు? ముస్లింలను తుదముట్టించే సంకల్పంతో వారు దండెత్తి వస్తున్నారని తెలిసినప్పుడు. అయితే అట్టి పరిస్థితుల్లో కూడా ఎంత వరకు పోరాడాలో అంతవరకే పోరాడాలనీ, మితిమీరకూడదనీ తాకీదు చేయబడింది. దీని భావం ఏమిటంటే యుద్ధంలో పాల్గొనకుండా ఉండేవారినీ, స్త్రీలను, పిల్లలను, వృద్ధులను చంపకూడదు. యుద్ధంలో పాల్గొన్న వారిని సైతం చిత్రవధ చేయరాదు. పండ్లు ఫలాలను ఇచ్చే వృక్షాలను నరకరాదు. ఏ పాపం ఎరుగని పశువులను అనవసరంగా వధించటం కూడా హద్దు మీరటంగానే పరిగణించబడుతుంది. ఇలాంటి ఆగడాలకు దూరంగా ఉండాలని నొక్కి వక్కాణించబడింది (ఇబ్నె కసీర్).

217. మక్కాలో ఉండగా ముస్లింలు బలహీనులుగా, చెల్లాచెదురుగా ఉండేవారు. అందువల్ల అవిశ్వాసులతో తలపడేందుకు వారికి అనుమతి ఇవ్వబడలేదు. కాని హిజ్రత్ అనంతరం ముస్లింలు ఒక శక్తిగా, సంఘటిత సమాజంగా ఆవిర్భవించారు. శత్రువుకు అర్థమయ్యే భాషలో సమాధానం చెప్పగల శక్తియుక్తులు వారికి ఒనగూడాయనుకున్న తరువాత జిహాద్‌కు అనుమతి ఇవ్వబడింది. ముస్లింలపై దండెత్తి వచ్చిన వారిని మాత్రమే మొదట్లో ఆయన (స) ప్రతిఘటించేవారు. ఆ తరువాత రణనీతి మార్చబడింది. అవసరం అనుకున్నప్పుడు అవిశ్వాసుల ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయి యుద్ధంచేసేవారు. హద్దులను అతిక్రమించకూడదని ఖుర్ఆన్ తాకీదు చేసింది. అందుకే ద్రోహబుద్ధికి పాల్పడరాదనీ, వాగ్దానాన్ని భంగం చేయరాదని, చిత్రవధ చేయరాదనీ, స్త్రీలను పిల్లలను చంపరాదనీ, చర్చిలలో ప్రార్థనలో నిమగ్నులై ఉన్న మతాచార్యులకు కీడు తలపెట్టరాదని

تَلُوكُمْ فَاقْتُلُوهُمْ كَذٰلِكَ جَزَآءُ الْكٰفِرِيْنَ ﴿١٩١﴾

మీతో యుద్ధం చేయనంతవరకూ మీరూ వారితో పోరాడకండి. వారు గనక మిమ్మల్ని హతమార్చడానికి యత్నిస్తే మీరు కూడా దీటైన జవాబు ఇవ్వండి.[218] అవిశ్వాసులకు సరైన సమాధానం ఇదే.

فَاِنِ انْتَهَوْا فَاِنَّ اللّٰهَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿١٩٢﴾

**192** ఒకవేళ వారు గనక (తమ దమన నీతిని) మానుకుంటే నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు.

وَقٰتِلُوْهُمْ حَتّٰى لَا تَكُوْنَ فِتْنَةٌ وَّيَكُوْنَ الدِّيْنُ
لِلّٰهِ ۖ فَاِنِ انْتَهَوْا فَلَا عُدْوَانَ اِلَّا عَلَى الظّٰلِمِيْنَ ﴿١٩٣﴾

**193** పీడన (ఫిత్నా) సమసిపోనంత వరకూ, దైవధర్మానిది పైచేయి కానంత వరకూ వారితో పోరాడుతూనే ఉండండి. ఒకవేళ వారు యుద్ధాన్ని విరమిస్తే (మీరూ విరమించండి). మెడలు వంచవలసింది దౌర్జన్య పరులవే.

اَلشَّهْرُ الْحَرَامُ بِالشَّهْرِ الْحَرَامِ وَالْحُرُمٰتُ قِصَاصٌ ۚ فَمَنِ

**194** నిషిద్ధమాసం నిషిద్ధమాసానికి బదులుగా ఉన్నది. నిషేధాజ్ఞలు సరిసమానంగా వర్తిస్తాయి.[219] మీపై ఎవరయినా

మహాప్రవక్త (సఅసం) తన సహచరులకు తాకీదు చేశారు. అలాగే చెట్లను నరికివేయటం, పంటలను కాల్చివేయటం, పశువులను అకారణంగా చంపివేయటం వంటి వాటిని కూడా వారించారు *(ఇబ్నె కసీర్, సహీహ్ ముస్లిం – కితాబుల్ జిహాద్).*

మక్కాకు చెందిన అవిశ్వాసులు ఒకప్పుడు మిమ్మల్ని వేధించారు. బహిష్కరించారు. నగరం వదలిపోయే పరిస్థితిని సృష్టించారు. కాబట్టి ఇప్పుడు వారు ఎక్కడ ముఖాముఖీ అయినా వారితో తలపడండి; వారిని కూడా అక్కడి నుంచి వెళ్ళగొట్టండి అని చెప్పబడింది. 'మక్కా విజయం' తరువాత ముస్లింలు కానివారికి ఒక నిర్ణీత గడువు ఇవ్వబడింది. ఒప్పందం ప్రకారం గడువు ముగిసిన తరువాత వారిని మక్కా నగరం నుంచి బహిష్కరించటం జరిగింది. పీడన, ఉపద్రవం (ఫిత్నా) అంటే కుఫ్ర్ మరియు షిర్క్ అని అర్థం. ఇది మారణకాండ కన్నా చాలా చెడ్డది, తీవ్రమైనది. కాబట్టి ఈ 'ఫిత్నా'ను రూపుమాపడానికి అవసరమైతే జిహాద్ చేయడానికి కూడా వెనుకాడకూడదు.

218. నిజానికి పవిత్ర మక్కా క్షేత్ర పరిధిలో మారణకాండకు పాల్పడరాదు. కాని అవిశ్వాసులు గనక ఒకవేళ ఈ నిషేధాజ్ఞను ఖాతరు చెయ్యకుండా కత్తి దూసినట్లయితే అట్టి పరిస్థితుల్లో వారికి దీటుగా జవాబు ఇవ్వటం సమంజసమే.

اعْتَدٰى عَلَيْكُمْ فَاعْتَدُوْا عَلَيْهِ بِمِثْلِ مَا اعْتَدٰى عَلَيْكُمْ ۖ وَاتَّقُوا اللّٰهَ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ مَعَ الْمُتَّقِيْنَ ﴿١٩٤﴾

దౌర్జన్యానికి ఒడిగడితే మీరు కూడా వారిపై ఆ మేరకు ప్రతీకారం తీర్చుకోండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ భక్తిగలవారికి తోడుగా ఉన్నాడన్న విషయాన్ని తెలుసుకోండి.

وَاَنْفِقُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ وَلَا تُلْقُوْا بِاَيْدِيْكُمْ اِلَى التَّهْلُكَةِ ۖ وَاَحْسِنُوْا ۚ اِنَّ اللّٰهَ يُحِبُّ الْمُحْسِنِيْنَ ﴿١٩٥﴾

**195** అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి. చేజేతులా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి.[220] ఉత్తమంగా మసలుకోండి. నిస్సందేహంగా అల్లాహ్ ఉత్తమంగా వ్యవహరించేవారిని ప్రేమిస్తాడు.

---

219. హిజ్రీ 6వ సంవత్సరంలో మహాప్రవక్త (సఅసం) 1400 మంది సహచరులను వెంటబెట్టుకుని **'ఉమ్రహ్'** చేసే నిమిత్తం మక్కాకు బయలుదేరారు. అయితే మక్కా నగరంలో ప్రవేశించేందుకు అవిశ్వాసులు అనుమతించలేదు. వచ్చే ఏడాది కేవలం మూడు రోజుల పాటు నగరంలోకి వచ్చి ఉమ్రహ్ చేసుకోవచ్చని అంగీకారం కుదిరింది. అది జీకఅద నెల. అది నిషిద్ధ మాసాలలోని ఒక మాసం. మరుసటి సంవత్సరం ముస్లింలు అదే మాసంలో ఉమ్రహ్ సంకల్పంతో బయలుదేరినప్పుడు అల్లాహ్ ఈ ఆదేశాలను అవతరింపజేశాడు. దీని భావం ఏమిటంటే ఈసారి కూడా మక్కా అవిశ్వాసులు ఈ నెలకు గల పవిత్రతను కాలరాచి (క్రితంసారి వలే) మిమ్మల్ని మక్కా నగరంలో అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకుంటే, మీరు మాత్రం ఊరుకోవద్దు. శక్తియుక్తులన్నింటినీ ఒడ్డి వారితో పోరాడండి. ప్రత్యర్థి వర్గంవారు నియమాలను ఉల్లంఘించినప్పుడు మీరు చేతులు నలుపుకుంటూ కూర్చోనవసరం లేదు. దెబ్బకు దెబ్బ కొట్టి వారికి గుణపాఠం నేర్పండి (ఇబ్నె కసీర్).

220. చేజేతులా వినాశం పాలు చేసుకోకండి అన్న ఈ వచనానికి పలువురు పలు వ్యాఖ్యానాలు చెప్పారు. దైవమార్గంలో పిసినారులుగా వ్యవహరించటం వినాశానికి హేతువని కొందరు, జిహాద్‌ను విడనాడటమే వినాశానికి మూలకారణం అని మరికొందరు, నిరంతరం పాపాలు చేస్తూ పోవటమే వినాశానికి అసలు ప్రాతిపదిక అని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. జిహాద్‌ను పరిత్యజించి పిరికివారుగా జీవించగోరినా, దైవమార్గంలో ఖర్చుపెట్టకుండా తమ చేతిని కట్టిపడేసుకున్నా – దాని పరిణామం ఒక్కటే. మీ శత్రువు బలపడతాడు. అతని దృష్టిలో మీకు పూచిక పుల్లంత విలువ కూడా లేకుండాపోతుంది. ఫలితంగా అతడు మిమ్మల్ని అణచివేసే వ్యూహాన్ని రచిస్తాడు. అలాగే మనిషి చేసిన తప్పును తలచుకుని సిగ్గుతో కుంచించుకు పోయే బదులు నిరంతరం పాపాలు చేస్తూ పోయాడనుకోండి, అది పరలోకం దృష్ట్యా అతని పాలిట వినాశకరంగా పరిణమిస్తుంది.

**196** హజ్, ఉమ్రహ్‌లను అల్లాహ్ కొరకు పూర్తిచేయండి.[221] ఒకవేళ మీరు నిలువరించబడితే, మీరు ఇవ్వగలిగిన ఖుర్బానీని ఇచ్చివేయండి.[222] మీరు ఇచ్చే ఖుర్బానీ, ఖుర్బానీ స్థలానికి చేరనంతవరకూ శిరో ముండనం చేయించుకోకండి.[223] అయితే మీలో వ్యాధిగ్రస్తులుగా ఉన్నవారు, లేదా తలలో బాధ ఉన్నవారు (శిరో ముండనం చేయించుకుంటే ఫరవాలేదు. కాని వారు) దీనికి పరిహారంగా ఉపవాసం ఉండటమో, దానధర్మాలు చేయటమో, ఖుర్బానీ ఇవ్వటమో చేయాలి.[224] మరి ఆ

وَاَتِمُّوا الْحَجَّ وَالْعُمْرَةَ لِلّٰهِ ؕ فَاِنْ اُحْصِرْتُمْ فَمَا اسْتَيْسَرَ
مِنَ الْهَدْيِ ۚ وَلَا تَحْلِقُوْا رُءُوْسَكُمْ حَتّٰى يَبْلُغَ الْهَدْيُ مَحِلَّهٗ ؕ

221. అంటే, హజ్ లేక ఉమ్రహ్ కొరకు ఒకసారి దీక్షబూనిన తరువాత దానిని పూర్తిచేయటం అనివార్యం – అది నఫిల్ హజ్, నఫిల్ ఉమ్రహ్ అయినాసరే! (ఐసరుత్తఫాసీర్).

222. ఒకవేళ మార్గమధ్యంలో శత్రువులు మిమ్మల్ని అడ్డుకోవటమో లేక మీరు తీవ్రంగా రోగగ్రస్తులవటమో జరిగితే అక్కడే ఒక పశువును – మేకనుగానీ, ఆవునుగానీ, ఒంటెలో ఏడవ భాగంగానీ– జిబహ్‌చేసి, శిరో ముండనం చేయించుకుని దీక్షనుండి బయటపడవచ్చు. హుదైబియా ఒప్పందం సందర్భంగా మహాప్రవక్త (సఅసం) మరియు ఆయన ప్రియ సహచరులు (రజి) ఈ విధానాన్నే అవలంబించారు. హుదైబియా స్థలం మక్కా పొలిమేరలకు ఆవల ఉంది (ఫత్‌హుల్ ఖదీర్). అసంపూర్ణంగా ఉండిపోయిన ఆ హజ్ లేక ఉమ్రా యాత్రను మరు సంవత్సరం పూర్తి చేసుకోవాలి. దైవప్రవక్త (స) కూడా హి.శ. 6వ యేట చేయలేకపోయిన ఉమ్రాను హి.శ. 7వ యేట ఖజా (పూర్తి) చేశారు.

223. అంటే హజ్ క్రియలన్నీ పూర్తయ్యేవరకు శిరోముండనం చేయించుకోరాదని దీని భావం. అత్యవసర పరిస్థితులు ఏర్పడి ఉంటే అది వేరే విషయం. సాధారణ పరిస్థితులున్నప్పుడు, శాంతి భద్రతలు నెలకొని ఉన్నప్పుడు మాత్రం క్రమబద్ధంగా హజ్ క్రియలన్నింటినీ నెరవేర్చిన తరువాతే శిరోముండనం చేయించుకోవాలి (అంటే ఇహ్రామ్ దీక్షను విరమించాలి).

224. శిరో ముండనం చేయించుకోవటం తప్ప వేరే మార్గాంతరం లేని పరిస్థితి ఎవరికయినా ఆసన్నమైతే అప్పుడు వారు తల క్షవరం చేయించుకోవచ్చు. కాని వారు ఈ చర్యకు పరిహారం చెల్లించాలి. హదీసు ప్రకారం ఇలాంటి వ్యక్తి ఆరుగురు నిరుపేదలకు అన్నం తినిపించాలి. లేదా ఒక మేకను జిబహ్ చేయాలి. లేదా మూడు రోజులపాటు

فَمَنْ كَانَ مِنْكُمْ مَرِيضًا أَوْ بِهِ أَذًى مِنْ رَأْسِهِ فَفِدْيَةٌ
مِنْ صِيَامٍ أَوْ صَدَقَةٍ أَوْ نُسُكٍ ۚ فَإِذَا أَمِنْتُمْ فَمَنْ تَمَتَّعَ
بِالْعُمْرَةِ إِلَى الْحَجِّ فَمَا اسْتَيْسَرَ مِنَ الْهَدْيِ ۚ فَمَنْ لَمْ يَجِدْ
فَصِيَامُ ثَلَاثَةِ أَيَّامٍ فِي الْحَجِّ وَسَبْعَةٍ إِذَا رَجَعْتُمْ ۗ تِلْكَ عَشَرَةٌ

తర్వాత (చిక్కుల నుంచి, నిలువరింపు నుంచి) ప్రశాంతతను పొంది ఉన్న స్థితిలో మీలో ఎవరయినా ఉమ్రహ్ మొదలుకుని హజ్ వరకు సంకల్పం బూని ప్రయోజనం (తమత్తు) పొందినట్లయితే, వారు తమ వద్దనున్న ఖుర్బానీని ఇచ్చివేయాలి. ఖుర్బానీ ఇవ్వలేనివారు హజ్ దినాలలో మూడు రోజులు ఉపవాసం పాటించాలి. హజ్ నుండి తిరిగి వచ్చిన తరువాత ఏడు రోజులు ఉపవాసముండాలి.[225] ఈ

ఉపవాసముండాలి. మొదటి రెండు ఫిదియాలు ఇవ్వవలసిన చోటు విషయంలో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. పేదవారికి అన్నం పెట్టడమయినా, మేకను జిబహ్ చేయటమైనా మక్కా ప్రాంతంలోనే జరగాలని కొందరంటున్నారు. ఉపవాసాల మాదిరిగా ఈ పరిహారం కూడా ఎక్కడయినా చెల్లించవచ్చని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఇమామ్ షౌకానీ రెండో అభిప్రాయాన్నే సమర్థించారు (ఫత్హుల్ ఖదీర్).

225. హజ్‌లో మూడు రకాలున్నాయి : 1. హజ్జె ఇఫ్రాద్ 2. హజ్జె ఖిరాన్ 3. హజ్జె తమత్తు.

**హజ్జె ఖిరాన్ :** హజ్ మరియు ఉమ్రహ్ రెండింటినీ కలిపి సంకల్పం చేసుకుని ఇహ్రామ్ కట్టుకుంటే అది 'హజ్జె ఖిరాన్' అనబడుతుంది. ఈ మొదటి రెండు పరిస్థితుల్లోనూ హజ్ క్రియలన్నీ నెరవేరేవరకూ ఇహ్రామ్‌ను విప్పటం సమ్మతం కాదు.

**హజ్జె తమత్తు :** ఈ పద్ధతి ప్రకారం కూడా హజ్ మరియు ఉమ్రహ్‌ల సంకల్పంతో ఇహ్రామ్ దీక్ష బూనబడుతుంది. అయితే మొదట కేవలం 'ఉమ్రహ్' కోసం ఇహ్రామ్ వస్త్రం కట్టుకుంటారు. ఉమ్రహ్ చేయగానే ఇహ్రామ్ విప్పబడుతుంది. తిరిగి జిల్ హజ్ నెల 8వ తేదీన మక్కాలోనే 'హజ్' కోసం మళ్ళీ ఇహ్రామ్ కట్టుకోవటం జరుగుతుంది. 'తమత్తు' అంటే సౌలభ్యం పొందటం అని అర్థం. అంటే ఉమ్రహ్ చేయగానే ఇహ్రామ్ దీక్ష నుంచి బయటపడి జిల్‌హజ్ 8వ తేదీ వరకు స్వేచ్ఛగా ఉండే అవకాశాన్ని వినియోగించుకోవటమన్నమాట! హజ్జె ఖిరాన్ మరియు హజ్జె తమత్తు – రెండింటిలోనూ ఒక పశువును ఖుర్బానీ చేయవలసి ఉంటుంది. ఈ ఆయతులో హజ్జె తమత్తు ప్రస్తావన వచ్చింది. ఈ హజ్ చేసిన వ్యక్తి తన స్థోమతనుబట్టి 10వ తేదీన ఒక పశువును ఖుర్బానీగా సమర్పించుకోవాలనీ, పశువును ఖుర్బానీగా ఇవ్వలేనివాడు హజ్ దినాలలో మూడు రోజులు ఉపవాసం పాటించి, ఇంటికి వాపసు

కామిలతున్ ذٰلِكَ لِمَنْ لَّمْ يَكُنْ اَهْلُهٗ حَاضِرِي الْمَسْجِدِ الْحَرَامِ ۚ وَاتَّقُوا اللّٰهَ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ شَدِيْدُ الْعِقَابِ ﴿۱۹۶﴾

విధంగా మొత్తం పది ఉపవాసాలవుతాయి. మస్జిదె హరామ్‌కు సమీపంలో ఉండని వారికి మాత్రమే ఈ ఆదేశం వర్తిస్తుంది.[226] (ప్రజలారా!) అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడన్న సంగతిని తెలుసుకోండి.

اَلْحَجُّ اَشْهُرٌ مَّعْلُوْمٰتٌ ۚ فَمَنْ فَرَضَ فِيْهِنَّ الْحَجَّ فَلَا رَفَثَ وَلَا فُسُوْقَ ۙ وَلَا جِدَالَ فِي الْحَجِّ ؕ وَمَا تَفْعَلُوْا مِنْ خَيْرٍ يَّعْلَمْهُ

**197** హజ్ మాసాలు నిర్ధారితమై ఉన్నాయి.[227] కనుక ఈ నిర్ణీత మాసాలలో హజ్‌ను తన కొరకు విధించుకున్న వ్యక్తి – హజ్ దినాలలో – కామ క్రీడలకు,

అయిన తరువాత ఏడు రోజులు ఉపవాసాలుండాలని చెప్పబడింది. హజ్ దినాలలో ఉపవాసం ఉండవలసిన తేదీలు ఏవేవి? అంటే 9వ తేదీకి ముందు లేదా తష్రీఖ్ దినాలు (ఫత్‌హుల్ ఖదీర్).

226. 'హజ్జె తమత్తు' మూలంగా పశువును ఖుర్బానీ ఇవ్వటం లేక ఉపవాసముండటం అనే నియమం దూరప్రాంతాలనుంచి వచ్చిన వారికే వర్తిస్తుంది. హరమ్ క్షేత్రంలో ఉండేవారికి – షరీయత్ ప్రకారం ప్రయాణీకులు అనబడనివారికి – ఈ నియమం వర్తించదు (ఇబ్నె కసీర్ – 'ఇబ్నె జరీర్' ఆధారంగా).

227. ఆ మాసాలు ఇవి : 1. షవ్వాల్ 2. జుల్‌ఖఅద 3. జుల్ హిజ్జ్‌లోని మొదటి పది దినాలు. 'ఉమ్రహ్' అయితే ఏడాదిలో ఎప్పుడైనా చేయవచ్చు. కాని హజ్ మాత్రం కేవలం నిర్ధారిత దినాలలో మాత్రమే అవుతుంది. కనుక హజ్ కొరకు బూనే దీక్ష ఆ నిర్ణీత మాసాలలో తప్ప వేరితర మాసాలలో సమ్మతం కాదు (ఇబ్నె కసీర్).

గమనార్హ విషయం : హజ్జె ఖిరాన్ లేక హజ్జె ఇఫ్రాద్‌కు సంబంధించిన దీక్ష (ఇహ్రామ్)ను మక్కా వాసులు మక్కాలోనే బూనుతారు. అయితే హజ్జె తమత్తు సంకల్పం చేసుకున్నప్పుడు మక్కా స్థానికులు 'ఉమ్రహ్' కోసం నగర పొలిమేరలు దాటిపోయి, ఇహ్రామ్ కట్టుకుని రావలసి ఉంటుంది (ఫత్‌హుల్ బారీ, కితాబుల్ హజ్). అలాగే బయటినుంచి వచ్చినవారు 'హజ్జె తమత్తు'లో జిల్‌హజ్ 8వ తేదీన మక్కాలోనే ఇహ్రామ్ కట్టుకోవచ్చు. అయితే కొంతమంది విద్వాంసుల ప్రకారం స్థానిక ముస్లింలు ఉమ్రహ్ కోసం మక్కా పొలిమేరలు దాటి బయటికి పోనవసరం లేదు. కనుక వారు ఏ రకపు హజ్ చేయదలచినా, ఉమ్రహ్ చేయదలచినా తమ తమ పేటల నుంచే ఇహ్రామ్ కట్టుకోవచ్చు.

పాపకార్యాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలి.[228] మీరు ఏ సత్కార్యం చేసినా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు. (హజ్ యాత్రకు బయలుదేరినప్పుడు) ప్రయాణ సామగ్రి(ఖర్చు)ని వెంటతీసుకెళ్ళండి. అయితే అన్నింటికంటే అత్యుత్తమ సామగ్రి దైవభీతి (అని బాగా గుర్తుంచు కోండి).[229] కనుక ఓ బుద్ధిమంతులారా! నాకు భయపడుతూ ఉండండి.

اللّٰهُ ۗ وَتَزَوَّدُوْا فَاِنَّ خَيْرَ الزَّادِ التَّقْوٰى ۚ وَاتَّقُوْنِ يٰٓاُولِي الْاَلْبَابِ ﴿١٩٧﴾

**198** (హజ్ యాత్ర సందర్భంగా) మీరు గనక మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషిస్తే అందులో తప్పేమీ లేదు.[230] మీరు అరఫాత్

لَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ اَنْ تَبْتَغُوْا فَضْلًا مِّنْ رَّبِّكُمْ ۗ فَاِذَآ اَفَضْتُمْ مِّنْ عَرَفٰتٍ فَاذْكُرُوا اللّٰهَ عِنْدَ

**హెచ్చరిక :** హాఫిజ్ ఇబ్నె ఖయ్యిమ్ ఇలా అంటున్నారు – దైవప్రవక్త (స) వారి వాక్కర్మల చేత రెండే రెండు ఉమ్రహ్‌లు నిరూపితం అయినాయి. ఒకటి : హజ్జె తమత్తుతో కలుపుకుని చేసే ఉమ్రహ్. రెండు : హజ్ మాసాలు గాక, ఇతర దినాలలో కేవలం ఉమ్రహ్ సంకల్పం చేసుకుని చేసే ప్రయాణం. హరమ్ క్షేత్రం దాటి బయటికి వెళ్ళి అక్కడి నుంచి ఉమ్రహ్ కోసం ఇహ్రామ్ దీక్షబూని రావటం అనేది శాస్త్రబద్ధం కాదు. (ఎవరయినా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) లాంటి పరిస్థితిని ఎదుర్కొంటే అది వేరేవిషయం) (జాదుల్ మఆద్ – సంపుటి – 2).

**గమనిక :** హరమ్ పరిధులకు (నిషిద్ధ ప్రాంతానికి) వెలుపల గల ప్రదేశాన్ని "హిల్ల్" అనీ, 'మీఖాత్'కు వెలుపల నుంచి వచ్చే యాత్రికులను 'ఆఫాఖీ' అని పిలుస్తారు.

228. సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలలోని హదీసులో ఇలా వుంది : "ఎవరయితే నిర్మలమైన మనసుతో, కామవాంఛతో కూడుకున్న మాటలకు, పాపకార్యాలకు దూరంగా ఉంటూ హజ్ చేశాడో అతడు తన పాపాలన్నీ ప్రక్షాళనమై ఆ రోజే తన తల్లి కడుపు నుంచి పుట్టిన వానిలా పవిత్రుడు అయిపోతాడు."

229. ఇక్కడ దైవభీతి అంటే భావం యాచించకుండా ఉండటం. కొంతమంది తగినంత ప్రయాణ సామగ్రిని సమకూర్చుకోకుండానే హజ్ యాత్రకు బయలుదేరతారు. అదేమంటే మాకు అల్లాహ్‌పై పూర్తి భరోసా ఉందని అంటారు. ఈ రకమయిన భరోసాను అల్లాహ్ స్వయంగా ఖండించాడు. ప్రయాణ సామగ్రిని, ప్రయాణ ఖర్చులను సరిగ్గా అంచనా వేసి సకల సన్నాహాలతో బయలుదేరాలి – ఇదే తఖ్వా !

230. దైవానుగ్రహం అంటే భావం వర్తకం. అంటే హజ్ యాత్ర సందర్భంగా వ్యాపారం చేయటం దోషంతో కూడుకున్న పనికాదు.

الْمَشْعَرِ الْحَرَامِ ۖ وَاذْكُرُوهُ كَمَا هَدَاكُمْ وَإِن كُنتُم مِّن قَبْلِهِ لَمِنَ الضَّالِّينَ ﴿١٩٨﴾

నుండి తిరిగి వస్తున్నప్పుడు 'మష్అరె హరామ్' వద్ద దైవనామాన్ని స్మరించండి– ఆయన సూచించిన విధంగానే ఆయన నామస్మరణ చేయండి. ఇంతకు మునుపైతే మీరు దారి తప్పి ఉన్నారు.[231]

ثُمَّ أَفِيضُوا مِنْ حَيْثُ أَفَاضَ النَّاسُ وَاسْتَغْفِرُوا اللَّهَ ۚ إِنَّ اللَّهَ غَفُورٌ رَّحِيمٌ ﴿١٩٩﴾

**199** తరువాత మీరు ప్రజలందరూ మరలే చోటు నుంచే మరలండి.[232] క్షమాపణకై అల్లాహ్‌ను వేడుకుంటూ ఉండండి. నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడూను.

فَإِذَا قَضَيْتُم مَّنَاسِكَكُمْ فَاذْكُرُوا اللَّهَ كَذِكْرِكُمْ آبَاءَكُمْ أَوْ أَشَدَّ ذِكْرًا ۗ فَمِنَ النَّاسِ

**200** హజ్ క్రియలన్నింటినీ నిర్వర్తించిన తరువాత అల్లాహ్‌ను ధ్యానించండి. మీ తాతముత్తాతలను జ్ఞాపకం చేసుకున్నట్లే, ఇంకా అంతకంటే అధికంగానే అల్లాహ్‌ను

231. జిల్ హజ్ 9వ తేదీన సూర్యుడు నడి నెత్తి నుంచి వాలినప్పటి నుండి సూర్యాస్తమయం వరకు అరఫాత్ మైదానంలో ఆగటం హజ్‌కు సంబంధించిన క్రియలన్నింటిలోకీ అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే "అరఫాత్‌లో ఆగటమే అసలు హజ్" అని హదీసులో అనబడింది. ఇక్కడ మగ్రిబ్ నమాజ్ చేయకూడదు. సూర్యాస్తమయం కాగానే ఇక్కడి నుంచి 'ముజ్దలిఫా'కు బయలుదేరాలి. ముజ్దలిఫాలో మగ్రిబ్‌కి సంబంధించిన మూడు రకాతుల నమాజ్‌తో పాటు, ఇషాకు సంబంధించిన రెండు రకాతుల (ఖసర్) నమాజు చేయాలి. ఒక్క అజాన్, రెండు ఇఖామత్‌లతో ఈ రెండు పూటల నమాజులూ కలుపుకోబడతాయి. ముజ్దలిఫానే 'మష్అరె హరామ్'గా కూడా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఇది హరమ్ పరిధిలో ఉంది. ఇక్కడ దైవధ్యానం చేయమని నొక్కి వక్కాణించబడింది. ఆ రాత్రి ఇక్కడే విడిది చేయాలి. ఉషోదయపు తొలివేళలో చీకటి ఉండగానే ఫజ్ర్ నమాజు చేసి సూర్యోదయం దాకా దైవనామ స్మరణ చేయాలి. సూర్యోదయం తర్వాత అక్కడినుంచి 'మినా' ప్రదేశానికి బయలుదేరాలి.

232. పైన ప్రస్తావించబడినట్లుగా అరఫాత్ మైదానానికి వెళ్ళటం, అక్కడ విడిదిచేసి, అక్కడినుంచి తిరిగి రావటం చాలా అవసరం. అయితే అరఫాత్ మైదానం హరమ్ పరిధికి బయట ఉండటం వల్ల మక్కాలోని ఖురైషులు 'అరఫాత్'కు వెళ్ళేవారు కాదు– 'ముజ్దలిఫా' నుంచే వెనుతిరిగేవారు. అందుచేత ప్రజలంతా తిరిగివచ్చే చోటు నుంచి – అంటే అరఫాత్ మైదానం నుంచి – తిరిగి రావలసిందిగా ఆదేశించబడింది.

مَن يَقُولُ رَبَّنَآ ءَاتِنَا فِي الدُّنْيَا وَمَا لَهُۥ فِي
الْآخِرَةِ مِنْ خَلَٰقٍ ۝٢٠٠

జ్ఞాపకం చేయండి.[233] "ఓ ప్రభూ! మాకు ప్రపంచంలోనే ప్రసాదించు" అని ప్రార్థించే వారు కూడా ప్రజల్లో కొందరున్నారు. అటువంటి వారికి పరలోకంలో ఏ భాగమూ లభించదు.

وَمِنْهُم مَّن يَقُولُ رَبَّنَآ ءَاتِنَا فِي الدُّنْيَا حَسَنَةً
وَفِي الْآخِرَةِ حَسَنَةً وَقِنَا عَذَابَ النَّارِ ۝٢٠١

**201** ప్రజల్లోనే మరికొందరు "ప్రభూ! మాకు ప్రపంచంలోనూ మేలును ప్రసాదించు,[234] పరలోకంలో కూడా మేలును వొసగు. నరకాగ్ని శిక్ష నుండి మాకు విముక్తి నొసగు" అని ప్రార్థించే వారు కూడా ఉన్నారు.

أُولَٰٓئِكَ لَهُمْ نَصِيبٌ مِّمَّا كَسَبُوا۟ ۚ وَاللَّهُ سَرِيعُ
الْحِسَابِ ۝٢٠٢

**202** ఇలాంటి వారికి వారి కర్మలను బట్టి వాటా లభిస్తుంది. లెక్క తీసుకోవటానికి అల్లాహ్‌కు అట్టే సమయం పట్టదు.

---

233. పూర్వం అరబ్బులు హజ్ విధులను నిర్వర్తించిన మీదట తీరిగ్గా 'మినా' ప్రదేశంలో సమ్మేళనం జరిపి, తమ తాత ముత్తాతల ఘనకార్యాలను తలచుకుని ఆనందించేవారు. అయితే ముస్లింలకు ఏమని ఆజ్ఞాపించబడిందో చూడండి: మీరు జిల్ హజ్జ్ నెల 10వ తేదీన కంకర రాళ్లు రువ్వటం, ఖుర్బానీ ఇవ్వటం, శిరోముండనం చేయించుకోవటం, కాబా ప్రదక్షిణ, సయీలను ముగించుకోవటం – ఇత్యాది విధులన్నింటినీ పూర్తిచేసిన పిదప 'మినా'లో విడిదిచేయాల్సిన మూడు రోజులలో వీలయినంత ఎక్కువగా అల్లాహ్ నామాన్ని స్మరించండి. పూర్వం మీరు మీ పూర్వీకుల వైభవాన్ని తలచుకుని మురిసిపోయినట్లే దేవుని ఘనత్వాన్ని తలచుకుని కృతజ్ఞతాపూర్వకంగా ఆయన పవిత్రతను కొనియాడండి అని ఉపదేశించబడింది.

234. సదాచరణలను చేసే సద్బుద్ధి నొసగమని వేడుకోవటం విశ్వాసుల ముఖ్య లక్షణం. వారు ఇహలోకంలో జీవిస్తున్నప్పటికీ ఇహలోక మేళ్లతో పాటు పరలోక శుభాలను, మేళ్లను కూడా ప్రసాదించమని ప్రార్థిస్తారు. సత్కార్యాలను చేసే సద్బుద్ధిని వొసగమని వేడుకుంటారు. అంటే ప్రాపంచిక జీవితంలో నీవు ప్రసాదించే సిరిసంపదలు, అనుగ్రహాలు పరలోక జీవితానికి కూడా పనికి వచ్చేలా చెయ్యి అని దీని భావం. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా అత్యధికంగా ఈ దుఆ చేసేవారు. చాలామంది కాబా గృహ ప్రదక్షిణ సందర్భంగా – ఒక్కో ప్రదక్షిణపై – ఒక్కో దుఆను, స్వీయకల్పిత దుఆను పఠిస్తూ ఉంటారు. వాటికి బదులు ప్రదక్షిణ

**203** గణించదగిన ఆ దినాలలో (తష్రీఖ్ దినాలలో) అల్లాహ్‌ను స్మరించండి.[235] రెండు దినాలలోనే ఇక్కడి నుంచి తిరిగి వెళ్ళేందుకు ఎవరైనా తొందరపాటు కనబరచినా తప్పులేదు. వెనుక ఉండిపోయిన వారు కూడా నిందార్హులు కారు.[236] ఇది భయభక్తులు గల వారికై ఉద్దేశించినది. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరంతా ఆయన వైపుకే సమీకరించబడతారన్న యదార్థాన్ని బాగా తెలుసుకోండి.

وَاذْكُرُوا اللّٰهَ فِيْٓ اَيَّامٍ مَّعْدُوْدٰتٍ ۭ فَمَنْ تَعَجَّلَ فِيْ يَوْمَيْنِ فَلَآ اِثْمَ عَلَيْهِ ۚ وَمَنْ تَاَخَّرَ فَلَآ اِثْمَ عَلَيْهِ ۙ لِمَنِ اتَّقٰى ۭ وَاتَّقُوا اللّٰهَ وَاعْلَمُوْٓا اَنَّكُمْ اِلَيْهِ تُحْشَرُوْنَ ﴿٢٠٣﴾

**204** (ఓ ప్రవక్తా!) ప్రజలలో కొందరు పలికే ప్రాపంచిక ఉద్దేశ్యాలతో కూడుకున్న మాటలు నిన్ను అలరించవచ్చు. వాడు తన ఆంతర్యంలోనున్న అసలు విషయానికి

وَمِنَ النَّاسِ مَنْ يُّعْجِبُكَ قَوْلُهٗ فِي الْحَيٰوةِ الدُّنْيَا وَيُشْهِدُ اللّٰهَ عَلٰي مَا فِيْ قَلْبِهٖ ۙ وَھُوَ اَلَدُّ الْخِصَامِ ﴿٢٠٤﴾

---

సమయంలో రుక్నె యమానీ – హజ్రె అస్వద్‌ల మధ్య 'రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతన్.....' అనే ఈ దుఆ చేయటం మస్నూన్ (సంప్రదాయం).

235. 'తష్రీఖ్ దినాలు' అంటే జిల్ హజ్ 11, 12, 13 తేదీలు. ఈ దినాలలో దైవనామాన్ని స్మరించటం – అంటే బిగ్గరగా 'తక్బీర్' పలకటం సంప్రదాయం. కేవలం ఫర్జ్ నమాజుల తర్వాతే కాదు, ఎల్లవేళలా ఈ తక్బీర్లు పఠిస్తూ ఉండాలి. ఒక బలహీనమైన (జయీఫ్) హదీసు మూలంగా తక్బీరె తష్రీఖ్ ఫర్జ్ నమాజుల తర్వాత పఠించే ఆచారం ప్రచారం నొందింది. తక్బీర్ ఇది : **అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా యిలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, వ లిల్లాహిల్‌హమ్ద్** (అల్లాహ్‌యే గొప్పవాడు. అల్లాహ్‌యే గొప్పవాడు, అల్లాహ్‌యే గొప్పవాడు. అల్లాహ్ తప్ప వేరొక దైవం లేనేలేడు. అల్లాహ్‌యే గొప్పవాడు, అల్లాహ్‌యే గొప్పవాడు. స్తోత్రం అల్లాహ్‌కే శోభాయమానం). కంకరరాళ్లు రువ్వేటప్పుడు (రమీ చేసే సమయంలో) ఒక్కో రాయి రువ్వుతూ ఈ తక్బీర్ పలకటం సంప్రదాయం (నైలుల్ ఔతార్, కితాబుల్ ఈదైన్).

236. 'మినా'లో మూడు రోజులు ఉండి **'రమీ'** చేయటం (రాళ్ళు రువ్వటం) ఉత్తమం. ఒకవేళ ఎవరయినా రెండు రోజుల్లోనే 'రమీ' చేసి మినా నుండి వాపసు అవదలిస్తే అందులో తప్పు లేదు.

అల్లాహ్‌ను సాక్షిగా పెడుతున్నాడు. మరి చూడబోతే వాడు పెద్ద తగవులమారి.[237]

وَإِذَا تَوَلَّىٰ سَعَىٰ فِي الْأَرْضِ لِيُفْسِدَ فِيهَا وَيُهْلِكَ الْحَرْثَ وَالنَّسْلَ ۗ وَاللَّهُ لَا يُحِبُّ الْفَسَادَ ٢٠٥

**205** వాడు (నీ వద్ద నుండి) తిరిగి వెళ్ళిన తరువాత ధరణిలో కల్లోలాన్ని రేకెత్తించ డంలో, పంటలను నాశనం చేయడంలో, సంతతిని పాడుచేయటంలో నిమగ్నుడై పోతాడు. కాగా; అల్లాహ్ ఇలాంటి చెడుగును సుతరామూ ఇష్టపడడు.

وَإِذَا قِيلَ لَهُ اتَّقِ اللَّهَ أَخَذَتْهُ الْعِزَّةُ بِالْإِثْمِ ۚ فَحَسْبُهُ جَهَنَّمُ ۚ وَلَبِئْسَ الْمِهَادُ ٢٠٦

**206** "అల్లాహ్‌కు భయపడు" అని వాడితో అన్నప్పుడు, వాడి గర్వం, దురభిమానం వాడ్ని పాపం వైపుకే పురికొల్పుతుంది.[238] ఇలాంటి వారికి నరకమే గతి. అది అతి చెడ్డ నివాస స్థలం.

وَمِنَ النَّاسِ مَنْ يَشْرِي نَفْسَهُ ابْتِغَاءَ مَرْضَاتِ اللَّهِ ۗ وَاللَّهُ رَءُوفٌ بِالْعِبَادِ ٢٠٧

**207** ప్రజల్లోని మరి కొంతమంది ఎలాంటివారంటే, దైవప్రసన్నతను చూర గొనే ప్రయత్నంలో వారు తమ ప్రాణాలను సయితం పణంగా పెడుతున్నారు.[239] అటువంటి (త్యాగధనులైన) తన దాసుల పట్ల అల్లాహ్ అమితమైన వాత్సల్యం కలిగి ఉంటాడు.

237. కొన్ని బలహీన ఉల్లేఖనాల ప్రకారం ఈ ఆయతు ఆనాటి కపటి అయిన అఖ్‌నస్ బిన్ షరీఖ్ సఖఫీని దృష్టిలో పెట్టుకుని అవతరించింది. కాని ప్రమాణబద్ధమైన విషయం ఏమిటంటే కపటులు, గర్విష్ఠులందరినీ దృష్టిలో పెట్టుకుని అల్లాహ్ ఈ మందలింపు చేశాడు.

238. అహంకారం, గర్వం, దురభిమానం వారిని పాపం వైపుకే పురికొల్పుతాయి. ఆంతర్యాల్లో అహంకారం తిష్ఠవేసినప్పుడు దైవభీతి, పాపభీతి వాటిల్లో చోటును సంపాదించలేవు మరి!

239. ఈ ఆయతు హజ్రత్ సుహైబ్ రూమీ (రజి)ని దృష్టిలో పెట్టుకుని అవతరింపజేయ బడింది అని అనబడుతోంది. ఆయన మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేయదలచి నప్పుడు అవిశ్వాసులు అడ్డగించి, నువ్వు ఈ ధనాన్నంతా ఇక్కడే సంపాదించావు.

**208** ఓ విశ్వాసులారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగుజాడలలో నడవకండి.[240] వాడు మీకు బద్ధ విరోధి.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا ادْخُلُوا فِي السِّلْمِ كَافَّةً وَلَا تَتَّبِعُوا خُطُوَاتِ الشَّيْطَانِ ۚ إِنَّهُ لَكُمْ عَدُوٌّ مُبِينٌ ﴿٢٠٨﴾

**209** మీ వద్దకు స్పష్టమయిన నిదర్శనాలు వచ్చిన తరువాత కూడా మీరు ఒకవేళ తప్పటడుగు వేస్తే అల్లాహ్ సర్వశక్తి మంతుడు, వివేక సంపన్నుడన్న సంగతిని బాగా గుర్తుంచుకోండి.

فَإِن زَلَلْتُم مِّن بَعْدِ مَا جَاءَتْكُمُ الْبَيِّنَاتُ فَاعْلَمُوا أَنَّ اللَّهَ عَزِيزٌ حَكِيمٌ ﴿٢٠٩﴾

అందుచేత దీన్ని మేము నీ వెంటబెట్టుకుని వెళ్ళడానికి అంగీకరించము అని పేచీ పెట్టారు. అప్పుడు హజ్రత్ సుహైబ్ (రజి) తన ధనాన్నంతటినీ వారికి వదలిపెట్టేసి, దైవధర్మాన్ని తన వెంటబెట్టుకుని మహాప్రవక్త (స) వద్దకు వచ్చేశారు. ఈ వృత్తాంత మంతా విన్న తరువాత దైవప్రవక్త (స), "సుహైబ్ లాభసాటి వ్యాపారం చేశాడు" అని కొనియాడారు. ఈ మాటను ఆయన (స) రెండుసార్లు పలికారు (ఫత్‌హుల్ ఖదీర్). అయితే ఈ ఆయతు సర్వసాధారణమైనది. విశ్వాసులకు, దైవభక్తిపరులకు, ఇహలోకానికి బదులుగా పరలోకానికి ప్రాముఖ్యం ఇచ్చే త్యాగమూర్తులందరికీ ఇది వర్తిస్తుంది.

240. ఇది విశ్వసించిన వారినుద్దేశించి చేయబడిన హితోపదేశం. మీరు ఇస్లాంలోకి రాదలిస్తే పూర్తిగా వచ్చేయండి. పాక్షికంగా వద్దు. మీకు నచ్చిన విషయాలను, ప్రయోజనకరమైన అంశాలను అమలుపరచి, మీ ఆశలు ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఉన్నాయనుకున్న వాటిని వదలివేస్తామంటే కుదరదు. అలాగే పూర్వాశ్రమంలో మీరు వదలి వచ్చిన కాల్పనిక సిద్ధాంతాలను, ఆచార దురాచారాలను ఇస్లాంలో జొప్పించే ప్రయత్నం చేయకండి. ఇస్లాంను – సంపూర్ణంగా – అవలంబించండి. సంపూర్తిగా మీరు ఈ ధర్మాన్ని అవలంబించిననాడు మీరంతట మీరే దురాచారాలకు, మిథ్యా వాదాలకు దూరం అయిపోతారు.

ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించడానికి నిరాకరించినవాడు – వేరే మాటల్లో ధర్మాన్ని పాక్షికంగా మాత్రమే అనుసరించగోరేవాడు – దాన్ని ఆరాధనల వరకే, మస్జిద్ నాలుగు గోడల వరకే పరిమితం చేయాలనుకుంటున్నాడన్నమాట! రాజకీయాల నుంచి, చట్టసభల నుంచి దాన్ని వేరుపరచాలనుకుంటున్నాడు. అలాగే ప్రజలు తమ ప్రాంతీయ అలవాట్లను, ఆచారాలను, సంస్కృతిని ఇష్టపడతారు. వాటిని వదులుకోవడానికి సుముఖంగా ఉండరు. ముఖ్యంగా వివాహాది విషయాలలో దుబారా ఖర్చు చేయటం, ముస్లిమేతర ఆచారాలను అవలంబించటం వంటివి జరుగుతూ ఉంటాయి. అందుకే షైతాన్ అడుగు జాడలను అనుసరించకండి అని బోధించబడింది. ఎందుకంటే షైతాన్

**210** ఏమిటీ, అల్లాహ్ మరియు దూతలు స్వయంగా మేఘాల నీడలలో వచ్చి తమ కార్యాన్ని పరిపూర్తి గావిస్తారని వారు ఎదురుచూస్తున్నారా?[241] కార్యాలన్నీ (నిర్ణయం కొరకు) అల్లాహ్ వైపుకే మరలించబడతాయి.

هَلْ يَنْظُرُوْنَ اِلَّآ اَنْ يَّاْتِيَهُمُ اللّٰهُ فِيْ ظُلَلٍ مِّنَ
الْغَمَامِ وَالْمَلٰٓئِكَةُ وَقُضِيَ الْاَمْرُ ؕ
وَاِلَى اللّٰهِ تُرْجَعُ الْاُمُوْرُ ﴿٢١٠﴾

**211** మేము ఇస్రాయీల్ వంశస్థులకు ఎన్ని స్పష్టమైన నిదర్శనాలను ప్రసాదించామో వారినే అడగండి.[242] దైవ ప్రసాదితాలు తమ వద్దకు చేరిన తరువాత వాటిని తారుమారు చేసేవారు,[243] అల్లాహ్ కఠినమైన శిక్షలు విధించగలవాడన్న విషయాన్ని విస్మరించరాదు.

سَلْ بَنِيْٓ اِسْرَآءِيْلَ كَمْ اٰتَيْنٰهُمْ مِّنْ اٰيَةٍ ۢ بَيِّنَةٍ ؕ
وَمَنْ يُّبَدِّلْ نِعْمَةَ اللّٰهِ مِنْ ۢ بَعْدِ مَا جَآءَتْهُ
فَاِنَّ اللّٰهَ شَدِيْدُ الْعِقَابِ ﴿٢١١﴾

మిమ్మల్ని ఆకట్టుకోవడానికి, ఇస్లాంకు విరుద్ధంగా ఉండే విషయాలనే అందమైన ఫిలాసఫీ ద్వారా మీకు నచ్చినట్లుగా సమర్పిస్తాడు. చెడులపై అందమైన గిలాఫులను చుట్టి మీ ముందుంచుతాడు. బిద్అత్‌లను కూడా సత్కార్యాలుగా నమ్మబలుకుతాడు. అందుకే ఇస్లాంలోకి ప్రవేశించిన మీదట మనసు మెచ్చే విషయాలను దైవేచ్ఛకు దైవప్రవక్త (స) వారి సంప్రదాయానికి అప్పగించాలి. దైవప్రసన్నతతో సమరసం చెందని విషయాలను నిస్సంకోచంగా విడనాడాలి.

241. కొన్ని ఖుర్ఆన్ వ్యాఖ్యానాలలో ఉన్నట్లు ఇది ప్రళయదినం దృశ్యం కావచ్చు (తఫ్సీర్ ఇబ్నె కసీర్). లేక అల్లాహ్ తన దూతలతో, మేఘాల నీడలలో ప్రత్యక్షమై, తమ సంశయాలన్నింటినీ దూరం చేస్తే అప్పుడు తాము విశ్వసిస్తామన్నది వారి ఉద్దేశ్యం కావచ్చు. అయితే ఇటువంటి ఇస్లాం స్వీకరణకు దైవసన్నిధిలో ఎలాంటి విలువా లేదు. అందుకే ఇస్లాం స్వీకరణలో తాత్సారం చేయకండి. వీలైనంత తొందరగా ఈ సత్యామృతాన్ని ఆస్వాదించి మీ పరలోక జీవితాన్ని తీర్చిదిద్దుకోండి.

242. ఉదాహరణకు మూసా (అలైహిస్సలాం) దగ్గరున్న చేతికర్రనే తీసుకోండి. దాని ద్వారా మేము మంత్రగాళ్ళ కనికట్టును కకావికలం చేశాము. సముద్రంలో నుంచి మార్గం ఏర్పరచాము. బండరాయి నుంచి 12 నీటి ఊటలను ఉత్పత్తి చేశాము. అలాగే మేఘాల ద్వారా ఛాయను కల్పించటం, మన్న్ సల్వాలను ఆహార పదార్థాలుగా అవతరింపజేయటం – ఇవన్నీ దైవశక్తికి, దైవప్రవక్త (స) సత్యతకు ప్రబల తార్కాణాలే. కాని ఇంత చేసినా ఇస్రాయీల్ సంతతివారు దైవాదేశాల పట్ల వైముఖ్యాన్ని ప్రదర్శించారు.

زُيِّنَ لِلَّذِينَ كَفَرُوا الْحَيٰوةُ الدُّنْيَا وَيَسْخَرُونَ مِنَ الَّذِينَ
اٰمَنُوا وَالَّذِينَ اتَّقَوْا فَوْقَهُمْ يَوْمَ الْقِيٰمَةِ وَاللّٰهُ يَرْزُقُ
مَنْ يَّشَآءُ بِغَيْرِ حِسَابٍ ﴿٢١٢﴾

**212** అవిశ్వాసుల కొరకు ప్రాపంచిక జీవితం ఎంతో సుందరంగా, ఆకర్షణీయంగా మలచబడింది. వారు విశ్వసించిన వారిని అవహేళన చేస్తున్నారు.[244] వాస్తవానికి అల్లాహ్ పట్ల భయభక్తులు గలవారు ప్రళయదినాన వారికన్నా ఎంతో ఉన్నత స్థితిలో ఉంటారు. అల్లాహ్ తాను తలచిన వారికి లెక్కలేనంతగా ఉపాధిని అనుగ్రహిస్తాడు.[245]

كَانَ النَّاسُ أُمَّةً وَّاحِدَةً فَبَعَثَ اللّٰهُ النَّبِيّٖنَ
مُبَشِّرِينَ وَمُنْذِرِينَ وَاَنْزَلَ مَعَهُمُ الْكِتٰبَ بِالْحَقِّ

**213** మానవులంతా ఒకే సమాజంగా ఉండేవారు.[246] అల్లాహ్ ప్రవక్తలను శుభవార్తనిచ్చే వారుగా, భయపెట్టేవారుగా చేసి పంపాడు. ప్రజల మధ్య తలెత్తిన అభిప్రాయభేదాలపై తీర్పు చేయటానికి

243. దైవానుగ్రహాన్ని తారుమారు చేయటమంటే భావం; వాళ్లు ఈమాన్‌కు (విశ్వాసానికి) బదులుగా తిరస్కార వైఖరికి ఒడిగట్టారు. దైవసందేశం పట్ల విముఖత చూపారు.

244. ఆనాటి ముస్లిముల్లో అత్యధికులు పేదవారు, అభాగ్య జీవులే. వారి దగ్గర విలాస వస్తువులుగానీ, ఆస్తి అంతస్థులుగానీ ఉండేవి కావు. అందుచేత మక్కాకు చెందిన ఖురైషులు అడుగడుగునా ముస్లింలను అవమానపరచేవారు, ఎగతాళి చేసేవారు. తరతరాలుగా యుగయుగాలుగా జరుగుతున్నది కూడా ఇదే. సమాజంలోని శ్రీమంతులు సదా సత్య బలమున్న పేదవర్గాన్ని చిన్న చూపు చూస్తూనే వచ్చారు. కాని ఎట్టకేలకు సత్యబలం ఉన్న వర్గం మాత్రమే కాలం పెట్టే పరీక్షలో నెగ్గింది.

245. విశ్వాస వర్గం యొక్క పేదరికాన్ని, నిరాడంబరత్వాన్ని చూసి అవిశ్వాసులు చేసిన ఎగతాళికి సమాధానం ఇవ్వబడింది. మీరు ప్రాపంచికంగా ఏ అభాగ్య జీవులను పరిహసిస్తున్నారో వారే ప్రళయదినాన తమ తఖ్వా (దైవభీతి, పాపభీతి) దృష్ట్యా ఉన్నత స్థానాల్లో ఉంటారు. 'లెక్కలేనంతగా ఉపాధిని ప్రసాదిస్తాడు' అన్న మాటలో పరలోక అనుగ్రహంతో పాటు ఇహలోక ప్రసాదం కూడా ఇమిడి ఉంది. అన్నట్లుగానే – కొన్నేండ్లలోనే – అల్లాహ్ ఈ పేదప్రజల కోసం విజయ ద్వారాలు తెరిచాడు. దాంతో వారికి ప్రాపంచిక ఐశ్వర్యం కూడా ప్రాప్తించింది.

246. అంటే అందరూ తౌహీద్ (దేవుని ఏకత్వం) పై ఉండేవారు. హజ్రత్ ఆదం నుండి హజ్రత్ నూహ్ వరకు – పది తరాల వరకూ దైవప్రవక్తలు ఏకదైవారాధననే

لِيَحْكُمَ بَيْنَ النَّاسِ فِيمَا اخْتَلَفُوا فِيهِ ۚ وَمَا
اخْتَلَفَ فِيهِ إِلَّا الَّذِينَ أُوتُوهُ مِنْ بَعْدِ مَا
جَاءَتْهُمُ الْبَيِّنَاتُ بَغْيًا بَيْنَهُمْ ۖ فَهَدَى اللَّهُ
الَّذِينَ آمَنُوا لِمَا اخْتَلَفُوا فِيهِ مِنَ الْحَقِّ بِإِذْنِهِ ۗ
وَاللَّهُ يَهْدِي مَنْ يَشَاءُ إِلَىٰ صِرَاطٍ مُسْتَقِيمٍ ﴿٢١٣﴾

గాను వారివెంట (అనగా ప్రవక్తల వెంట) సత్యబద్ధమైన గ్రంథాలను పంపాడు. మరి వాళ్ళే – స్పష్టమైన ఆదేశాలు వొసగబడిన తరువాత కూడా – పరస్పర వైరభావం, అసూయ మూలంగా అందులో విభేదించుకున్నారు.[247] అందుచేత అల్లాహ్ విశ్వాసులకు ఈ భేదాభిప్రాయం నుండి కూడా తన ఆజ్ఞానుసారం సత్యం వైపుకు దర్శకత్వం వహించాడు.[248] అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు.

ప్రబోధించారు. ప్రజలు కూడా ఈ 'దేవుని ఏకత్వం'పై గట్టిగా నిలబడ్డారు. ఆ తరువాత క్రమేణా షైతాన్ వారిలో దుష్ప్రేరణలను నూరిపోశాడు. పర్యవసానంగా వారి మధ్య భేదాభిప్రాయం పొడసూపింది. షిర్క్ మరియు గోచర వస్తువుల పూజ సర్వసాధారణం అయిపోయింది. అందువల్ల మార్గభ్రష్టతకు లోనైన మానవతను తిరిగి రుజుమార్గంలోకి తీసుకు రావటానికి అల్లాహ్ తన ప్రవక్తలకు గ్రంథాలిచ్చి పంపాడు. మౌలిక విశ్వాసంపై ప్రజల మధ్య ఏర్పడిన అభిప్రాయభేదాలను విచారించి సత్యమేదో – అసత్యమేదో స్పష్టం చేయటం దీని అసలు ఉద్దేశం (ఇబ్నె కసీర్).

247. సత్యంపట్ల వైముఖ్యధోరణి, విసుగు పుట్టినచోటల్లా అభిప్రాయభేదం తప్పకుండా వస్తుంది. ఈ విముఖతకు అసలు కారణం అసూయ, విరోధం, మనసులోని అక్కసు. ముస్లిం సమాజంలోనూ ఈ విముఖత పొడసూపకుండా ఉన్నంతకాలం, ఈ సమాజం తన మౌలిక విశ్వాసంపై కదలని కొండలా నిలబడింది. కాని తఖ్లీద్ (ఇమాముల అంధానుసరణ) మరియు బిద్అత్ (ధర్మంలో సరికొత్త విషయాలకు అంకురార్పణ)ల మూలంగా సత్యమార్గం నుండి మనిషి తప్పటడుగు వేయటం ప్రారంభించాడు. విభేదాలు నానాటికీ పెరగనారంభించాయి. కడకు "ఉమ్మత్ ఐక్యత" అనేది అసాధ్యంగా పరిణమించింది. అల్లాహ్ ముస్లింలకు మార్గం చూపుగాక!

248. ఉదాహరణకు జుమా రోజు విషయంలో గ్రంథవహులు విభేదించారు. యూదులు శనివారాన్ని, క్రైస్తవులు ఆదివారాన్ని తమ పవిత్ర దినాలుగా చేసుకున్నారు. అంచేత అల్లాహ్ ముస్లిములకు జుమా రోజును (అంటే శుక్రవారాన్ని) అవలంబించ వలసిందిగా సూచించాడు. యూదులు హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) విషయంలో విభేదించారు. వారు ఆయన్ని ధిక్కరించటమేగాక, ఆయన తల్లి అయిన హజ్రత్ మర్యమ్‌పై అపనిందవేశారు. ఇదిలా వుండగా క్రైస్తవులు హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు)ను అల్లాహ్ కుమారునిగా, సాక్షాత్తూ దేవునిగా చేసుకున్నారు. కాగా; అల్లాహ్ ఆయన

**214** ఏమిటీ, మీరు స్వర్గంలో ఇట్టే ప్రవేశించగలమని అనుకుంటున్నారా? వాస్తవానికి మీకు పూర్వం గతించిన వారికి ఎదురైనటువంటి పరిస్థితులు మీకింకా ఎదురు కానే లేదు.[249] వారిపై కష్టాలు, రోగాలు వచ్చిపడ్డాయి. వారు ఎంతగా కుదిపి వేయబడ్డారంటే, (ఆ ధాటికి తాళలేక) "ఇంతకీ దైవసహాయం ఎప్పుడొస్తుంది?" అని ప్రవక్తలు, వారి సహచరులు ప్రశ్నించసాగారు. "వినండి! దైవ సహాయం సమీపంలోనే ఉంది"[250] (అని వారిని ఓదార్చటం జరిగింది).

أَمْ حَسِبْتُمْ أَن تَدْخُلُوا الْجَنَّةَ وَلَمَّا يَأْتِكُم مَّثَلُ الَّذِينَ خَلَوْا مِن قَبْلِكُم مَّسَّتْهُمُ الْبَأْسَاءُ وَالضَّرَّاءُ وَزُلْزِلُوا حَتَّىٰ يَقُولَ الرَّسُولُ وَالَّذِينَ آمَنُوا مَعَهُ مَتَىٰ نَصْرُ اللَّهِ أَلَا إِنَّ نَصْرَ اللَّهِ قَرِيبٌ ﴿٢١٤﴾

విషయంలో సరైన దృక్పథాన్ని అవలంబించే సద్బుద్ధిని ముస్లిములకు వొసగాడు. అంటే ఈసా (ఏసుక్రీస్తు) – దైవప్రవక్త మరియు దేవునికి విధేయతచూపే దాసుడు అని ముస్లిములు విశ్వసిస్తారు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) విషయంలో కూడా వాళ్లు విభేదించారు. ఆయన యూదుడు అని ఒకరంటే, 'కాదు – క్రైస్తవుడు' అని ఇంకొకరన్నారు. అయితే ఆయన "చిత్తశుద్ధి గల దైవవిధేయుడు (ముస్లిం)" అని అల్లాహ్ ముస్లిములకు ఎరుకపరిచాడు. ఈ విధంగా అనేక విషయాలలో అల్లాహ్ ముస్లింలకు తన కృపతో సరైన మార్గం చూపాడు.

249. మదీనాకు వలస వెళ్ళిన తరువాత కపటుల, యూదుల, ముష్రిక్కుల తరఫునుంచి ముస్లింలకు ఎన్నో వేధింపులు, బాధలు ఎదురయ్యాయి. కొంతమంది ముస్లింలు ఈ విషయమై దైవప్రవక్త (స)కు ఫిర్యాదు కూడా చేశారు. దానిపై ముస్లింలను ఓదారుస్తూ ఈ ఆయతు అవతరించింది. మహాప్రవక్త (సఅసం) సయితం వారిని ఈ విధంగా ఓదార్చారు: మీకు పూర్వం గతించిన వారిని నిలువునా రంపంతో కోశారు. ఇనుప దువ్వెనలతో వారి శరీరం నుంచి మాంసం తీయబడింది. అయితే ఈ చిత్రవధ, ఈ అమానుషకాండ వారిని వారి ధర్మం నుంచి మరలించలేకపోయింది." ఆ తరువాత ఆయన (స) ఇలా అన్నారు : దైవసాక్షి! అల్లాహ్ ఈ వ్యవహారాన్ని సంపూర్ణం గావిస్తాడు (అంటే ఇస్లాంకు ప్రాబల్యాన్ని వొసగుతాడు). కడకు ఒక ప్రయాణీకుడు ఒంటరిగా 'సన్ఆ' నుండి 'హజర్‌మోత్' వరకు నిశ్చింతగా ప్రయాణం చేయ గలుగుతాడు. అతడు అల్లాహ్‌కు తప్ప వేరొకరికి భయపడవలసిన అవసరం ఉండదు. ఆ కాలం వస్తుంది (సహీహ్ బుఖారీ). ఈ ఉపదేశం ద్వారా మహాప్రవక్త (సఅసం) ముస్లింలలో ఆత్మ విశ్వాసాన్ని, స్థయిర్యాన్ని పెంపొందించదలిచారు.

يَسْـَٔلُوْنَكَ مَاذَا يُنْفِقُوْنَ ۗ قُلْ مَآ اَنْفَقْتُمْ مِّنْ خَيْرٍ
فَلِلْوَالِدَيْنِ وَالْاَقْرَبِيْنَ وَالْيَتٰمٰى وَالْمَسٰكِيْنِ وَابْنِ
السَّبِيْلِ ۗ وَمَا تَفْعَلُوْا مِنْ خَيْرٍ فَاِنَّ اللّٰهَ بِهٖ عَلِيْمٌ ﴿٢١٥﴾

**215** తాము ఏం ఖర్చు చెయ్యాలి? అని వారు నిన్ను ప్రశ్నిస్తున్నారు. మీరేం ఖర్చు చేసినా అది మీ తల్లిదండ్రుల కొరకూ, బంధువుల కొరకూ, అనాథల కొరకూ, నిరుపేదలు, బాటసారుల కొరకూ ఖర్చు చేయాలి.[251] మీరు ఏ మేలు చేసినా అల్లాహ్‌కు దాని గురించి తెలుసు అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.

كُتِبَ عَلَيْكُمُ الْقِتَالُ وَهُوَ كُرْهٌ لَّكُمْ ۚ وَعَسٰٓى اَنْ تَكْرَهُوْا شَيْـًٔا
وَّهُوَ خَيْرٌ لَّكُمْ ۚ وَعَسٰٓى اَنْ تُحِبُّوْا شَيْـًٔا وَّهُوَ شَرٌّ لَّكُمْ ۗ وَاللّٰهُ
يَعْلَمُ وَاَنْتُمْ لَا تَعْلَمُوْنَ ﴿٢١٦﴾

**216** యుద్ధం చేయటం మీకు కష్టంగా అనిపించినప్పటికీ, అది మీపై విధిగా నిర్ణయించబడింది. మీరు దేన్ని ఇష్ట పడటంలేదో అదే మీ పాలిట బహుశా శుభకరం కావచ్చు. అలాగే మీరు మీ కోసం ఎంతగానో కోరుకునే విషయాలే మీ పాలిట హానికరంగా రూపొందవచ్చు. నిజ జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. మీకు ఆ విషయం తెలియదు.[252]

250. రానున్న ప్రతిదీ దాపులోనే ఉంటుంది. విశ్వాసులకు దేవుని తోడ్పాటు లభించటం అన్నది నిశ్చయం. కనుక అది చాలా సమీపంలోనే ఉంది అని అర్థం.

251. కొంతమంది ప్రవక్త సహచరులు అడిగిన దానికి సమాధానంగా, ధనం ఏ ఏ పద్దుల్లో ఖర్చుపెట్టాలో తెలియజేయబడింది. పైన పేర్కొనబడిన వారు మీ ధన సహాయానికి, సహకారానికి ఎక్కువ హక్కుదారులు. దీన్నిబట్టి బోధపడేదేమంటే ఖర్చుపెట్టడానికి సంబంధించిన ఈ ఆజ్ఞ 'సదఖాతె నాఫిలా' కు వర్తిస్తుంది. అంటే స్వచ్ఛందంగా చేయవలసిన ఖర్చు అన్నమాట! ఇది జకాత్‌కు వర్తించదు. ఎందుకంటే జకాత్ అనేది విధిగా ఇవ్వవలసిన దానం. అది తల్లిదండ్రుల కోసం ఖర్చు చేయకూడదు. హజ్రత్ మైమూన్ బిన్ మిహ్రాన్ ఈ ఆయతును పారాయణం చేస్తూ ఇలా వ్యాఖ్యానించారు : "ధనం ఖర్చుచేసే ఈ పద్దుల్లో సంగీత వాయిద్యాల ప్రస్తావనగానీ, గోడలకు వ్రేలాడదీసే చిత్రపటాల, ఖరీదైన తెరల ప్రస్తావన గానీ లేదు." అంటే ఇలాంటి విలాసవంతమైన పద్దులపై డబ్బు ఖర్చుపెట్టడం దుబారా ఖర్చు క్రిందికి వస్తుంది. కాని విచారకరమైన విషయం ఏమిటంటే ఇలాంటి దుబారా ఖర్చులు, భోగలాలస వస్తువులు మన జీవితంలో అనివార్య అంశాలైపోయాయి. వాటికోసం విచ్చలవిడిగా డబ్బు తగలెడుతున్నప్పుడు మన మనసుల్లో అయిష్టత అనేది ఏర్పడటం లేదు.

يَسْـَٔلُوْنَكَ عَنِ الشَّهْرِ الْحَرَامِ قِتَالٍ فِيْهِ ۭ قُلْ قِتَالٌ فِيْهِ
كَبِيْرٌ ۭ وَصَدٌّ عَنْ سَبِيْلِ اللّٰهِ وَكُفْرٌۢ بِهٖ وَالْمَسْجِدِ الْحَرَامِ ۤ
وَاِخْرَاجُ اَھْلِهٖ مِنْهُ اَكْبَرُ عِنْدَ اللّٰهِ ۚ وَالْفِتْنَةُ اَكْبَرُ مِنَ
الْقَتْلِ ۭ وَلَا يَزَالُوْنَ يُقَاتِلُوْنَكُمْ حَتّٰى يَرُدُّوْكُمْ عَنْ
دِيْنِكُمْ اِنِ اسْتَطَاعُوْا ۭ وَمَنْ يَّرْتَدِدْ مِنْكُمْ عَنْ دِيْنِهٖ

**217** నిషిద్ధ మాసాలలో యుద్ధం చెయ్యటం గురించి ప్రజలు నిన్ను అడుగుతున్నారు. నువ్వు వారికి చెప్పు : ఈ మాసాలలో యుద్ధం చేయటం మహాపరాధం. అయితే అల్లాహ్ మార్గంలో అవరోధాలు కల్పించటం, అల్లాహ్‌ను తిరస్కరించటం, మస్జిదె హరామ్‌ను సందర్శించే జనులను అడ్డుకోవటం, అక్కడ నివసించేవారిని అక్కడి నుంచి వెళ్ళగొట్టడం అల్లాహ్ దృష్టిలో అంతకన్నా ఘోరమైన అపరాధం. ఈ ఉపద్రవం (ఫిత్నా) హత్య కన్నా పెద్దది.[253] వారు మీతో యుద్ధం చేస్తూనే

252. జిహాద్‌కు సంబంధించిన ఒకానొక ఆజ్ఞను ఇస్తూ, అల్లాహ్ మీకు ఏ ఆదేశాన్ని ఇచ్చినా మీరు దాన్ని శిరసావహించవలసిందేనని బోధపరచబడింది. ఏదేని ఒక ఆదేశం మీకు బరువుగా, కష్టంగా అనిపించవచ్చు. కాని దాని పరిణామం ఎలా ఉంటుందో అల్లాహ్‌కు తెలుసు. మీకు తెలియదు. మీరు మీకోసం బాధాకరం అనుకున్నదే మీ పాలిట శుభకరం కూడా కావచ్చు. యుద్ధం ద్వారా మీకు ఆధిక్యత, గౌరవోన్నతులతో పాటు సిరిసంపదలు లభించవచ్చు. అశాంతి అలజడుల స్థానే శాంతీ సుస్థిరతలు నెలకొనవచ్చు. అలాగే మీరు కోరుకునే వస్తువు (యుద్ధంచేసే బదులు ఇండ్లలో కూర్చుని ఉండాలన్న తలంపు) భవిష్యత్తులో మిమ్మల్ని పరాభవానికి గురిచేయవచ్చు. శత్రువు మీపై దాడి చేసి, మీ జీవితాలను మరింత దుర్భరం చేయవచ్చు. కనుక మీరు దైవాదేశాల పట్ల విముఖత చూపే బదులు, ఆజ్ఞ అవగానే 'చిత్తం' అంటూ సకారాత్మకంగా స్పందించండి.

253. రజబ్, జుల్ ఖఅద, జుల్‌హిజ్జ్, ముహర్రం – ఈ నాలుగు మాసాలు అజ్ఞాన కాలంలో కూడా నిషిద్ధ మాసాలుగా పరిగణించబడేవి. ఈ మాసాలలో యుద్ధం, జగడం అవాంఛనీయంగా భావించబడేది. ఇస్లాం కూడా వీటి పవిత్రతను యధాతథంగా కొనసాగించింది. మహాప్రవక్త (స) కాలంలో రజబ్ మాసంలో ఒక ముస్లిం సైనిక దళం చేతిలో ఒక అవిశ్వాసి హతమార్చబడ్డాడు. కొంతమంది ఖైదీలుగా పట్టుబడ్డారు. ఎందుకంటే రజబ్ నెల ప్రారంభమైన సంగతి ముస్లింలకు తెలియలేదు. ఈ సంఘటనను ఆసరాగా తీసుకుని అవిశ్వాసులు ముస్లింలపై ఎద్దేవా చేశారు. నిషిద్ధ (పవిత్ర) మాసాల్లో కూడా వీరు రక్తపాతం సృష్టిస్తున్నారని విమర్శించారు. అప్పుడు

فِيَمُتْ وَهُوَ كَافِرٌ فَأُولَٰٓئِكَ حَبِطَتْ أَعْمَالُهُمْ فِي الدُّنْيَا وَالْآخِرَةِ ۖ وَأُولَٰٓئِكَ أَصْحَابُ النَّارِ ۖ هُمْ فِيهَا خَالِدُونَ ﴿٢١٧﴾

ఉంటారు. చివరికి వారికి వీలు కలిగితే మిమ్మల్ని మీ ధర్మం నుంచి మరలించ నయినా మరలించేస్తారు.[254] మరి మీలో గనక ఎవరయినా తమ ధర్మం నుంచి తిరిగిపోయి, అవిశ్వాస స్థితిలో మరణిస్తే వారి ఇహపర లోకాల్లోని కర్మలు సర్వనాశనమైపోతాయి. అలాంటి వారే నరకవాసులు. వారందులో కలకాలం పడి ఉంటారు.[255]

ఈ ఆయతు అవతరించింది. నిస్సందేహంగా నిషిద్ధ మాసాలలో రక్తపాతం సృష్టించటం పాపకార్యమేగాని, నిషిద్ధ మాసాలను ఉదాహరించేవారు కూడా తమ అంతరంగంలోకి తొంగిచూసుకోవాలని చురక అంటించబడింది. ఎందుకంటే వాళ్లు సయితం నిషిద్ధ మాసాలలో చేయరాని పనులన్నీ చేశారు. అల్లాహ్ మార్గంలో అడ్డంకులు సృష్టించటం, దైవగృహ సందర్శనం నిమిత్తం వెళ్ళే వారిని నిలువరించటం, మక్కాలోని ముస్లింలను మూటాముల్లె సర్దుకుని వెళ్ళిపోయే పరిస్థితుల్ని సృష్టించటం – ఇవన్నీ మామూలు అపరాధాలు కావు. క్షమార్హం కాని నేరాలు! హత్యా నేరంకన్నా తీవ్రమైన చేష్టలు!! అందువల్ల ముస్లింల చేత – పొరపాటున – నిషిద్ధ మాసంలో జరిగిన ఒక్కగానొక్క హత్యోదంతంపై కాకి గోల చేయటం విడ్డూరమే. దానికి బదులు వారు ఆత్మావలోకనం చేసుకుని, తమ కర్మల చిట్టాను ఓసారి తిరిగేసుకుని పశ్చాత్తాపం చెందటం మంచిది.

254. వాళ్ళు ఒక వైపు తమ దురాగతాలను కొనసాగిస్తూ, కుట్రలు కుయుక్తులతో మిమ్మల్ని ధర్మభ్రష్టుల్ని చేసేందుకు యత్నిస్తున్నప్పుడు మీరు మాత్రం – నిషిద్ధమాసం అని చెప్పి – ఎందుకు ఆగాలి?

255. ఎవరయినా ఇస్లాం ధర్మం వైపు నుంచి తిరిగి పోయి – అంటే ధర్మభ్రష్టులైపోయి – ఆ తరువాత పశ్చాత్తాపం చెందకపోతే ప్రపంచంలో అతనికి మరణ శిక్ష విధించబడాలి. హదీసులో ఇలా ఉంది : "మన్ బద్దల దీనహు ఫఖ్తులూహు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ జిహాద్. మరిన్ని వివరాలకు అల్ బఖర సూరా 256వ ఆయతు, దాని వివరణ చదవండి). ఈ ఆయతులో అతనికి విధించబడే పరలోక శిక్ష ప్రస్తావనకు వచ్చింది. దీనిద్వారా అవగతమయ్యేదేమిటంటే విశ్వాసస్థితిలో చేసిన సత్కార్యాలు కూడా అవిశ్వాసం మరియు ధర్మభ్రష్టత (ఇర్తిదాద్) మూలంగా వృధా అయిపోతాయి. ఏ విధంగానయితే విశ్వసించినవారి విశ్వాసం మూలంగా వారి గతకాలపు పాపాలు తుడిచిపెట్టుకుపోతాయో అదేవిధంగా ధిక్కార వైఖరి, వైముఖ్య ధోరణి మూలంగా వారి మంచి పనులన్నీ బూడిదలో పోసిన పన్నీరులా అయిపోతాయి. అయితే అవిశ్వాస

**218** అయితే విశ్వసించినవారు, హిజ్రత్ చేసిన (వలసపోయిన) వారు, దైవ మార్గంలో పోరాడేవారు మాత్రమే దైవ కారుణ్యానికి అభ్యర్థులు. అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, అపారంగా కరుణించేవాడు.

إِنَّ الَّذِينَ آمَنُوا وَالَّذِينَ هَاجَرُوا وَجَاهَدُوا فِي سَبِيلِ اللَّهِ أُولَٰئِكَ يَرْجُونَ رَحْمَتَ اللَّهِ ۚ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴿٢١٨﴾

**219** ప్రజలు నిన్ను మద్యపానం గురించి, జూదం గురించి ప్రశ్నిస్తున్నారు. నువ్వు వారికి చెప్పు: “రెండింటిలోనూ చాలా పెద్ద పాపం ఉంది.[256] ప్రజలకు దీనివల్ల కొన్ని ప్రాపంచిక లాభాలు కూడా చేకూరుతాయి. కాని వీటి ద్వారా చేకూరే లాభం కన్నా పాపం చాలా ఎక్కువ.”[257] ఏం ఖర్చు పెట్టాలి? అని వారు నిన్ను అడుగుతారు.

يَسْأَلُونَكَ عَنِ الْخَمْرِ وَالْمَيْسِرِ ۖ قُلْ فِيهِمَا إِثْمٌ كَبِيرٌ وَمَنَافِعُ لِلنَّاسِ وَإِثْمُهُمَا أَكْبَرُ مِن نَّفْعِهِمَا ۗ

స్థితిలో ప్రాణం పోయినప్పుడే ఈ కర్మలు పాడవుతాయి. ఒకవేళ చావుకు ముందే మనిషి తన తప్పును గ్రహించి క్షమాభిక్ష వేడుకుంటే, అల్లాహ్ అతని తప్పును మన్నిస్తాడు. అట్టి స్థితిలో అతని సత్కర్మలు వృధా కావు.

256. ‘పెద్ద పాపం’ అనేది ధార్మికత రీత్యా అన్నమాట. ఈ రెండు వస్తువులూ (మద్యపానం, జూదం) మనిషిని నైతికంగా అధోగతికి చేరుస్తాయి.

257. లాభాలు ప్రాపంచికమైనవి. ఉదాహరణకు : మద్యపానం వల్ల తాత్కాలికంగా మనిషి శరీరావయవాలు చురుకుగా పనిచేస్తే చేయవచ్చు. కొంతమంది మెదడు కూడా బాగా పనిచేయవచ్చు. అతని లైంగిక శక్తి కూడా పెరగవచ్చు! అలాగే వాటి క్రయవిక్రయాలు, క్లబ్బుల ఏర్పాటు లాభసాటి వ్యాపారం కావచ్చు. జూదంలో కూడా ఒక్కోసారి మనిషి గెలిచినపుడు లాభపడతాడు. కాని అతనికి చేకూరే ఈ క్షణభంగురపు లాభాలు నైతికంగా, ధార్మికంగా అతను పోగొట్టుకునే దాని ముందు ఎందుకూ సరిపోవు. అందుకే “వీటి పాపం వీటి లాభాలకన్నా ఎంతో అధికం” అని అనబడింది. ఈ విధంగా ఈ ఆయతులో మద్యపానం, జూదం హరామ్ (నిషిద్ధం)గానైతే ఖరారు కాలేదు. కాని ఇందులో రానున్న కాలంలో నిషేధించబడటానికి ‘భూమిక’ తయారు చేయబడింది.

ఈ ఆయతు ద్వారా మన ముందుకు వచ్చే ఒక ముఖ్యసూత్రం ఏమిటంటే, ఒక వస్తువు ఎంత హానికరమైనదైనప్పటికీ అందులో కూడా ఎంతో కొంత మేలు లేక

وَيَسْـَٔلُونَكَ مَاذَا يُنفِقُونَ ۖ قُلِ ٱلْعَفْوَ ۗ كَذَٰلِكَ
يُبَيِّنُ ٱللَّهُ لَكُمُ ٱلْءَايَـٰتِ لَعَلَّكُمْ تَتَفَكَّرُونَ ﴿٢١٩﴾

'మీ ఖర్చులు పోగా మిగిలినది' [258] అని నువ్వు వారికి చెప్పు. మీరు యోచన చేసేటందుకుగాను అల్లాహ్ ఈ విధంగా తన ఆదేశాలను స్పష్టంగా వివరిస్తున్నాడు.

فِى ٱلدُّنْيَا وَٱلْءَاخِرَةِ ۗ وَيَسْـَٔلُونَكَ عَنِ ٱلْيَتَـٰمَىٰ ۖ قُلْ إِصْلَاحٌ
لَّهُمْ خَيْرٌ ۖ وَإِن تُخَالِطُوهُمْ فَإِخْوَٰنُكُمْ ۚ وَٱللَّهُ يَعْلَمُ ٱلْمُفْسِدَ

**220** ఇహలోక జీవితంలో, పరలోకంలో కూడా. ఇంకా వీరు అనాథలను గురించి కూడా నిన్ను ప్రశ్నిస్తున్నారు కదూ![259] వారికి బోధపరచు : వారి బాగోగులను అభిలషించటం ఉత్తమం. (బాగుపరచే ఉద్దేశంతో) ఒకవేళ మీరు వారి సొమ్మును మీ సొమ్ములో కలుపుకుంటే

ప్రయోజనం ఉండవచ్చు. ఉదాహరణకు: రేడియో, టీ.వీ వంటి సాధనాల ఆవిష్కరణ. కొంతమంది వాటి లాభాలను లెక్కించి తమ ఆత్మలను మోసపుచ్చుకుంటారు. కాని లాభనష్టాలను బేరీజువేసి దేని శాతం ఎంత? అన్నది చూడాలి. ముఖ్యంగా ధార్మికత, నైతికత రీత్యా చేకూరే లాభనష్టాలను ఖచ్చితంగా అంచనా వేయాలి. ధార్మికత రీత్యా ఎక్కువ నష్టాలు వాటిల్లుతున్నప్పుడు కొద్దిపాటి ప్రాపంచిక ప్రయోజనాల కోసం వాటిని ధర్మసమ్మతంగా పరిగణించరాదు. ఇక టీ.వీ. ద్వారా మనిషి ధార్మికతకు కలిగే నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పేదేముందీ?!

258. చెప్పే తీరునిబట్టి ఇది నైతికోపదేశంగా తోస్తుంది. లేక అది ఇస్లాం తొలి రోజుల్లో ఇవ్వబడిన ఆజ్ఞ అయి ఉండవచ్చు. జకాత్ విధిగా నిర్ణయించబడిన తరువాత ఈ ఉపదేశంపై అమలుపరచటం తప్పనిసరి కాదు. కాకపోతే ఇది మంచి పని వైపుకు ప్రోత్సహించే విషయంగా ఎప్పుడూ చెలామణీ అవుతుంది. లేదా "మీరు సులువుగా చేయగలిగినంత చేయండి. మీ మనసుకు కష్టం అనిపించకుండా ఉన్నంతగా" అన్నది దీని భావం కావచ్చు (ఫత్హుల్ ఖదీర్). ఇస్లాం దైవమార్గంలో ఖర్చుకు సంబంధించి ఎంతగానో ప్రోత్సహించింది. అయితే మనిషి తనపై ఆధారపడి వున్న వారి పోషణపట్ల తొలుత శ్రద్ధవహించాలన్నది ఇస్లాం ఆదేశం. మరో విషయం ఏమిటంటే ; రేపటి రోజున తన పిల్లలు, కుటుంబీకులు వేరొకరి ముందు చేయి చాచి అర్థించవలసిన దుస్థితి ఏర్పడకుండా అతను జాగ్రత్తపడాలి.

259. అనాథల ఆస్తిని అన్యాయంగా కబళించేవారిని గురించి హెచ్చరిక రాగానే ప్రవక్త సహచరులు భీతితో వణికిపోయారు. తమ వద్దనున్న అనాథల వస్తువులన్నింటినీ తమ సంపదల్లో నుంచి వేరుపరచారు. ఆఖరికి తిను పదార్థాలు కూడా ఏమైనా

مِنَ الْمُصْلِحِ ۭ وَلَوْ شَاۗءَ اللّٰهُ لَاَعْنَتَكُمْ ۭ اِنَّ اللّٰهَ عَزِيْزٌ حَكِيْمٌ ﴿٢٢٠﴾

వారూ మీ సహోదరులే. చెడగొట్టేవారెవరో, బాగుపరచే వారెవరో అల్లాహ్‌కు బాగా తెలుసు. అల్లాహ్‌యే గనక తలిస్తే మిమ్మల్ని కష్టాల్లో పడవేసేవాడే.[260] నిశ్చయంగా అల్లాహ్ శక్తిమంతుడు, వివేకవంతుడు.

وَلَا تَنْكِحُوا الْمُشْرِكٰتِ حَتّٰى يُؤْمِنَّ ۭ وَلَاَمَةٌ مُّؤْمِنَةٌ خَيْرٌ مِّنْ مُّشْرِكَةٍ وَّلَوْ اَعْجَبَتْكُمْ ۚ وَلَا تُنْكِحُوا الْمُشْرِكِيْنَ حَتّٰى يُؤْمِنُوْا ۭ

**221** దైవానికి భాగస్వామ్యం కల్పించే స్త్రీలు విశ్వసించి ముస్లింలు కానంత వరకూ మీరు వారిని వివాహమాడకండి.[261] దైవానికి భాగస్వామ్యం కల్పించే స్వతంత్ర స్త్రీ మీకు ఎంతగా నచ్చినప్పటికీ ఆమెకన్నా అల్లాహ్‌ను విశ్వసించే ఒక బానిస స్త్రీ ఎంతో ఉత్తమురాలు. (అలాగే)

మిగిలిపోతే వాటిని కూడా వేరుగా ఉంచేవారు. ఆ విధంగా అవి కుళ్ళిపోయేవి. అనాథల సొమ్మును అన్యాయంగా తినేవారి జాబితాలో తమ పేరు కూడా ఎక్కడ నమోదు పరచబడుతుందోనన్న భయం వారిని అనుక్షణం పీడిస్తూ ఉండేది. దానిపై ఈ వచనం అవతరించింది (ఇబ్నె కసీర్).

260. అంటే మీరు బాగు చేసే ఉద్దేశ్యంతో అనాథల సొమ్మును మీ సొమ్ములో కలుపుకోగోరినా ఆయన అందుకు సమ్మతించేవాడు కాడు. కాని ఆయన అందుకు సమ్మతించి మీకు సౌకర్యం కలుగజేశాడు. కాబట్టి మీరు దేవుని యెడల కృతజ్ఞతా భావంతో మెలగండి. అనాథలను ఆదరించండి.

261. ముష్రిక్కు స్త్రీలంటే విగ్రహారాధన చేసే స్త్రీలని భావం. గ్రంథవహులైన స్త్రీలను (యూదులు, క్రైస్తవులు) నికాహ్ చేసుకునేందుకు ఖుర్‌ఆన్ అనుమతించింది. అయితే ఒక ముస్లిం స్త్రీని మాత్రం గ్రంథవహులగు పురుషులకు ఇచ్చి వివాహం జరిపించరాదు. హజ్రత్ ఉమర్ (రజి) గారైతే గ్రంథవహులైన స్త్రీలను కూడా మనువాడటాన్ని ఇష్టపడేవారు కాదు. కొన్ని పరమార్థాల దృష్ట్యా ఆయన ఇలా భావించేవారు (ఇబ్నె కసీర్). విశ్వాసులైన పురుషులను, విశ్వాసురాలైన స్త్రీలను మాత్రమే వివాహమాడాలని ముస్లింలకు తాకీదు చేయబడింది. ధార్మికతను విస్మరించి, కేవలం అందచందాల ఆధారంగా నికాహ్ చేసుకోవటం అంటే పరలోక జీవితాన్ని నాశనం చేసుకోవటమేనని చెప్పటం జరిగింది. హదీసులో కూడా ఈ విషయం ఉంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ప్రబోధించారు: "నాలుగు ప్రాతిపదికలపై స్త్రీని వివాహమాడటం జరుగుతుంది. 1. ఐశ్వర్యం 2. అందం 3. వంశం 4. ధార్మికత. మీరు ధార్మికురాలైన

وَلَعَبْدٌ مُّؤْمِنٌ خَيْرٌ مِّنْ مُّشْرِكٍ وَّلَوْ أَعْجَبَكُمْ ۗ أُولَٰٓئِكَ
يَدْعُونَ إِلَى النَّارِ ۖ وَاللَّهُ يَدْعُوٓا إِلَى الْجَنَّةِ وَالْمَغْفِرَةِ
بِإِذْنِهِ ۖ وَيُبَيِّنُ آيَاتِهِ لِلنَّاسِ لَعَلَّهُمْ يَتَذَكَّرُونَ ﴿٢٢١﴾

షిర్కుకు ఒడిగట్టే పురుషులు విశ్వసించ నంతవరకూ మీ స్త్రీలను వారి వివాహ బంధంలోకి ఇవ్వకండి. ఎందుకంటే షిర్కుకు పాల్పడే పురుషుడు మీకు నచ్చి నప్పటికీ అతనికంటే విశ్వసించిన ఒక బానిస పురుషుడు ఎన్నో రెట్లు నయం. వీరు (మిమ్మల్ని) నరకం వైపుకు పిలుస్తున్నారు. కాని అల్లాహ్ తన అనుజ్ఞతో స్వర్గం వైపునకూ, క్షమాభిక్ష వైపునకూ పిలుస్తు న్నాడు. ప్రజలు గుణపాఠం నేర్చుకునేం దుకు గాను ఆయన తన ఆయతు లను విడమరచి మరీ చెబుతున్నాడు.

وَيَسْـَٔلُونَكَ عَنِ الْمَحِيضِ ۖ قُلْ هُوَ أَذًى فَاعْتَزِلُوا النِّسَآءَ فِي
الْمَحِيضِ ۙ وَلَا تَقْرَبُوهُنَّ حَتَّىٰ يَطْهُرْنَ ۖ فَإِذَا تَطَهَّرْنَ فَأْتُوهُنَّ

**222** వారు నిన్ను బహిష్టు గురించి ప్రశ్ని స్తున్నారు. నువ్వు వారికి చెప్పు : అదొక అశుద్ధ స్థితి. కనుక అశుద్ధావస్థలో వారికి ఎడంగా ఉండండి.[262] వారు పరిశుద్ధుల

స్త్రీని ఎన్నుకోండి" (సహీహ్ బుఖారీ, కితాబున్నికాహ్, సహీహ్ ముస్లిం – కితాబుర్రజాఅ) అదేవిధంగా మహాప్రవక్త (సఅసం) సద్వర్తనురాలైన స్త్రీని ప్రపంచంలో కెల్లా అత్యుత్తమమైన, శ్రేష్ఠమయిన సామగ్రిగా పేర్కొన్నారు – ఖైరు మతాయిద్దున్యా అల్ మర్అతుస్సాలిహా–(సహీహ్ ముస్లిం).

262. రజస్వల తరువాత ప్రతి స్త్రీకి నెలవారీ దినాలలో అయ్యే రక్తస్రావాన్ని బహిష్టు స్థితి (హైజ్) అని అంటారు. ఒక్కోసారి వ్యాధి మూలంగా ఈ పీరియడ్‌లో మార్పు రావచ్చు. సుదీర్ఘకాలం పాటు రక్తస్రావం జరగవచ్చు. ఈ స్థితిని 'ఇస్తెహాజా'గా వ్యవహరిస్తారు. ఇస్తిహాజా ఆదేశాలు బహిష్టు స్థితి ఆదేశాల కంటే భిన్నంగా ఉంటాయి. బహిష్టుస్థితిలో ఉన్నప్పుడు స్త్రీలు నమాజు చేయనవసరం లేదు. ఉపవాసాలు పాటించకూడదు. అయితే నాగా అయిన ఉపవాసాలను తరువాతి దినాలలో పూర్తిచేసుకోవాలి. 'బహిష్టు స్థితిలో ఉన్న స్త్రీల వద్దకు పోకూడదు' అంటే భావం ఈ అశుద్ధావస్థలో భార్యాభర్తలు రతిలో పాల్గొనరాదు అని మాత్రమే. ఈ స్థితిలో భర్త భార్యను ముద్దుపెట్టుకున్నా, ఆలింగనం చేసుకున్నా, తాకినా తప్పులేదు. అలాగే స్త్రీలు ఈ అశుద్ధస్థితిలో ఇంటిపనులు చేసుకోవచ్చు. వంట చేసుకోవచ్చు.

مِنْ حَيْثُ أَمَرَكُمُ اللَّهُ ۚ إِنَّ اللَّهَ يُحِبُّ التَّوَّابِينَ وَيُحِبُّ الْمُتَطَهِّرِينَ ﴿٢٢٢﴾

య్యేవరకు వారివద్దకు పోకండి. వారు పరిశుద్ధత నొందిన మీదట,[263] అల్లాహ్ అనుమతించిన స్థానం నుంచి మీరు వారితో సమాగమం జరుపవచ్చు.[264] అల్లాహ్ పశ్చాత్తాపపడేవారిని, పారి శుద్ధ్యాన్ని అవలంబించేవారిని ఇష్టపడ తాడు.

نِسَآؤُكُمْ حَرْثٌ لَّكُمْ فَأْتُوا حَرْثَكُمْ أَنَّىٰ شِئْتُمْ ۖ وَقَدِّمُوا

**223** మీ స్త్రీలు మీ పంటపొలాలు. కాబట్టి మీ పొలాల్లోకి మీరు కోరిన

కాని యూదులు ఈ స్థితిలో స్త్రీలను పూర్తిగా వెలివేస్తారు. ఆ స్థితిలో ఆమెతో కలసి మెలసి ఉండటం, కలసి భుజించటం కూడా సమ్మతం కాదని అంటారు. ప్రవక్త ప్రియసహచరులు (రజి) ఈ విషయమై దైవప్రవక్త (స)ను సంప్రతించగా ఈ ఆదేశం అవతరించింది. ఇందులో కేవలం సంభోగించడాన్ని మాత్రమే వారించటం జరిగింది (ఇబ్నె కసీర్ తదితర వ్యాఖ్యానాలు).

263. "వారు పరిశుద్ధత నొందిన మీదట...." దీనికి రెండు అర్థాలు చెప్పబడ్డాయి. మొదటి అర్థం: 'రక్తస్రావం ఆగిన మీదట.' అంటే రుతుస్రావం నిలిచిపోయిన పక్షంలో స్నానం చేయకపోయినాసరే స్త్రీ పరిశుద్ధురాలైనట్లే లెక్క. ఇట్టి స్థితిలో భర్త ఆమెతో రమించటం సమ్మతమే. ఇబ్నె హజమ్ సహా మరి కొంతమంది ఇమాములు ఈ విధానానికి సుముఖంగా ఉన్నారు. అల్లామా అల్‌బానీ కూడా దీన్ని సమర్థించారు *(ఆదాబుజ్జిఫాఫ్–పేజీ:47).*

రెండవ అర్థం : రక్తస్రావం ఆగిన మీదట స్నానం చేసి మరీ పరిశుద్ధత నొందటం. ఈ రెండవ అర్థం ప్రకారం బహిష్టు స్థితిని అధిగమించిన స్త్రీ స్నానం చేయనంతవరకూ, భర్తతో సంభోగంలో పాల్గొనటం సమ్మతం కాదు. ఇమామ్ షౌకానీ ఈ పద్ధతికి ప్రాధాన్యత నిచ్చారు (ఫత్‌హుల్ ఖదీర్). మా దృష్టిలో రెండు పద్ధతులూ ఆచరణ యోగ్యమైనవే అయినప్పటికీ రెండవ పద్ధతి మాత్రం ప్రాధాన్యత నివ్వదగినది.

264. "అనుమతించిన స్థానం నుంచి" అంటే మర్మస్థానం (యోని లేక మానం) అని భావం. ఎందుకంటే బహిష్టు స్థితిలో కూడా ఆ స్థానాన్ని ఉపయోగించటమే నిషిద్ధంగా ఖరారు చేయబడింది. పరిశుద్ధత నొందిన తరువాత అనుమతించబడటం అంటే అర్థం ఆ (మర్మ) స్థానం తప్ప మరో భాగం కాదు. ఈ ఆదేశంలో దాగివున్న మరో మర్మం ఏమిటంటే స్త్రీ మల విసర్జనా మార్గం (దుబుర్) ద్వారా రతిక్రీడ జరపటం హరామ్ (నిషిద్ధం). హదీసులలో కూడా మరింత విపులంగా ఈ విషయం వచ్చింది.

لِأَنفُسِكُمْ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوا أَنَّكُم مُّلَاقُوهُ وَبَشِّرِ الْمُؤْمِنِينَ ﴿٢٢٣﴾

విధంగా రండి.[265] మీ స్వయం కోసం (సత్కర్మలను) ముందుకు పంపండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. మీరు ఆయన్ని కలుసుకోవలసి ఉందన్న విషయాన్ని గ్రహించండి. (ఓ ప్రవక్తా!) విశ్వాసులకు శుభవార్తను వినిపించు.

وَلَا تَجْعَلُوا اللَّهَ عُرْضَةً لِّأَيْمَانِكُمْ أَن تَبَرُّوا وَتَتَّقُوا وَتُصْلِحُوا بَيْنَ النَّاسِ ۗ وَاللَّهُ سَمِيعٌ عَلِيمٌ ﴿٢٢٤﴾

**224** సత్కార్యాన్నీ, భయభక్తులనూ, మానవుల మధ్య సంస్కరణను విడిచిపెట్టే పరిస్థితి ఏర్పడేలా[266] – మీరు అల్లాహ్‌ను మీ 'ప్రమాణా'లకు లక్ష్యంగా పెట్టకండి. అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం తెలిసినవాడు.

265. స్త్రీని ఉదరం ఆధారంగా పడుకోబెట్టి వెనుకవైపునుంచి సంభోగిస్తే పుట్టేపిల్లవాడికి మెల్లచూపు వస్తుందని యూదులు భావించేవారు. ఈ భావనకు ప్రతిక్రియగా ఈ ఆదేశం అవతరించింది. ముందు నుంచి సంభోగించినా, వెనుకవైపు నుంచి రమించినా, ఏ భంగిమలో రతిక్రీడ సాగించినా సరే సమ్మతమే. కాని ఎట్టి పరిస్థితిలోనూ స్త్రీ యోనిని మాత్రమే ఉపయోగించాలి. 'మీరు కోరిన విధంగా రావచ్చు' అన్న వాక్యంలో స్త్రీ మలవిసర్జనా స్థానం కూడా వస్తుందికదా! కాబట్టి అది కూడా సమ్మతమే' అని కొందరు నిరూపించే యత్నం చేశారు. కాని ఇది తప్పు. దివ్య ఖుర్ఆన్ స్త్రీలను పంటపొలాలుగా అభివర్ణించటం గమనార్హ విషయం. పొలం అనేది స్త్రీ మానానికి మాత్రమే వర్తిస్తుంది. లైంగిక ప్రక్రియకు, మానవ సంతానోత్పత్తికి ఏకైక మార్గం యోని (మానం) మాత్రమేగాని మల విసర్జనా స్థానం కాదు. అదీగాక అంగప్రవేశం యోనిద్వారా కాకుండా మరోవిధంగా జరపటం అంటే అది అసహజమైన ప్రక్రియ అవుతుంది. స్త్రీ మలవిసర్జనా స్థానాన్ని వాడుకునేవాడు శాపగ్రస్తుడుగా, ధూత్కరించబడినవాడుగా ఖరారు చేయబడ్డాడు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

266. ఫలానా వ్యక్తిపట్ల ఇక నుంచి మంచిగా మెలగను, ఫలానా వ్యక్తుల మధ్య తగాదాను పరిష్కరించను, ఫలానా వారికి ఉపదేశం చేయను – అంటూ కోపావేశంలో ప్రమాణం చేసి మరీ చెప్పటం సర్వసాధారణం. కాని ఎప్పుడయినా ఇలాంటి ప్రమాణాలు గనక చేస్తే వాటిని భంగపరచండి, ప్రమాణ భంగానికిగాను పరిహారాన్ని చెల్లించండి అని హదీసులో చెప్పబడింది (ప్రమాణ భంగానికి చెల్లించవలసిన పరిహారం గురించి అల్ మాయిద సూరా 89వ ఆయతును చూడండి).

لَا يُؤَاخِذُكُمُ اللَّهُ بِاللَّغْوِ فِي أَيْمَانِكُمْ وَلَٰكِنْ يُؤَاخِذُكُمْ
بِمَا كَسَبَتْ قُلُوبُكُمْ ۗ وَاللَّهُ غَفُورٌ حَلِيمٌ ﴿٢٢٥﴾

**225** అనాలోచిత ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని నిలదీయడు.[267] హృదయ పూర్వకంగా మీరు చేసే ప్రమాణాలను గురించి మాత్రం ఆయన తప్పకుండా నిలదీసి అడుగుతాడు. అల్లాహ్ క్షమాశీలి, సహనశీలి కూడా.

لِلَّذِينَ يُؤْلُونَ مِنْ نِسَائِهِمْ تَرَبُّصُ أَرْبَعَةِ أَشْهُرٍ ۖ فَإِنْ
فَاءُوا فَإِنَّ اللَّهَ غَفُورٌ رَحِيمٌ ﴿٢٢٦﴾

**226** ఎవరయితే తమ భార్యలతో సంబంధం పెట్టుకోబోమని ఒట్టేసుకుం టారో వారికొరకు నాలుగు మాసాల గడువు ఉంది.[268] మరి వారు గనక (ఈలోగా) మరలివస్తే అల్లాహ్ కూడా క్షమించేవాడు, జాలి చూపేవాడు.

267. అనాలోచిత ప్రమాణాలు అంటే సంకల్ప రహితంగా చేసే ప్రమాణాలు అని అర్థం. మాటల సందర్భంగా ప్రతి చిన్న విషయంపై 'దైవం తోడు' అన్న పదాన్ని ఊతపదంగా చేసుకోవటం. అయితే ఉద్దేశ్యపూర్వకంగా అబద్ధపు ప్రమాణం చేయటం మహాపాపం.

268. దీన్ని 'ఈలా'గా వ్యవహరిస్తారు. ఈలా అంటే ఒట్టేసుకోవటం అని అర్థం. ఏ భర్త అయినా తన భార్యతో ఒక నెలరోజులపాటో, లేక రెండు నెలలో సంబంధం పెట్టుకోనని ఒట్టేసుకుంటే దీనిని 'ఈలా' అని అంటారు. ఈ విధంగా ఒట్టేసుకొని అనుకున్న గడువు పూర్తయిన తర్వాత ఆమెతో లైంగిక సంబంధం ఏర్పరచుకుంటే ఏమీ లేదు. ఒకవేళ ఇలా ఒట్టేసుకున్న మీదట గడువు పూర్తికాకమునుపే అతను భార్య వద్దకుపోతే ఈ ప్రమాణభంగానికి గాను పరిహారం (కఫ్ఫారా) చెల్లించవలసి ఉంటుంది. ఒకవేళ నాలుగు మాసాలకన్నా ఎక్కువ కాలం వరకు లేక అసలు కాల నిర్ణయం ఏమీ లేకుండా భార్యవద్దకు పోనని ప్రమాణం చేసినట్లయితే నాలుగు మాసాల వ్యవధి ముగియగానే అతను భార్యతో సంబంధం ఏర్పరచుకోవాలి. లేకుంటే ఆమెకు విడాకులు ఇవ్వాలి. (ఎందుకంటే ఆమెను నాలుగు మాసాలకన్నా ఎక్కువ కాలం డోలాయమాన స్థితిలో ఉంచేందుకు అనుమతి లేదు). మొదటి పరిస్థితి ప్రకారం అతను ప్రమాణ భంగానికి పరిహారం ఇవ్వాలి. ఒకవేళ అతడు రెండింటిలో ఏ ఒక్కదానిని కూడా అవలంబించకుండా - అనిశ్చిత స్థితిని కొనసాగిస్తే - ఏదో ఒక నిర్ణయానికి రావలసిందిగా న్యాయస్థానం అతన్ని నిలదీస్తుంది. అంటే ఆమెతో కాపురం చేయటమో లేక విడాకులు ఇవ్వటమో చేయమంటుంది. స్త్రీకి అన్యాయం జరగరాదన్నదే దీని ఉద్దేశం (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

وَإِنْ عَزَمُوا الطَّلَاقَ فَإِنَّ اللَّهَ سَمِيعٌ عَلِيمٌ ﴿٢٢٧﴾

**227** ఒకవేళ వారు విడిపోవాలనే నిశ్చయించుకుంటే,[269] నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ వినేవాడు, అంతా తెలిసిన వాడు.

وَالْمُطَلَّقَاتُ يَتَرَبَّصْنَ بِأَنفُسِهِنَّ ثَلَاثَةَ قُرُوءٍ ۚ وَلَا يَحِلُّ
لَهُنَّ أَن يَكْتُمْنَ مَا خَلَقَ اللَّهُ فِي أَرْحَامِهِنَّ إِن كُنَّ
يُؤْمِنَّ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۚ وَبُعُولَتُهُنَّ أَحَقُّ بِرَدِّهِنَّ
فِي ذَٰلِكَ إِنْ أَرَادُوا إِصْلَاحًا ۚ وَلَهُنَّ مِثْلُ الَّذِي

**228** విడాకులు పొందిన స్త్రీలు తమను తాము మూడు రుతువుల దాకా ఆపి ఉంచుకోవాలి.[270] వారు అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ విశ్వసించేవారే అయితే అల్లాహ్ వారి గర్భాలలో సృష్టించిన దానిని దాచి ఉంచటం వారికి ధర్మ సమ్మతం కాదు.[271] ఒకవేళ ఈ గడువు

269. ఈ వాక్యంలోని పదజాలాన్ని బట్టి విదితమయ్యేదేమిటంటే, నాలుగు మాసాల గడువు ముగియటంతోనే వాటంతట అవే విడాకులు అయిపోవు. (కాని కొంతమంది విద్వాంసులు మాత్రం వేర్పాటు అయిపోతుందని అంటారు). నిజానికి భర్త విడాకులు ఇస్తేనే అది విడాకు అనబడుతుంది. ఆ మేరకు న్యాయస్థానం కూడా అతనిపై ఒత్తిడి తీసుకువస్తుంది. అత్యధికమంది విద్వాంసులు కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు (ఇబ్నె కసీర్).

270. విడాకులు పొందిన స్త్రీ గర్భవతి అయితే ఆమె గడువు (ఇద్దత్) ప్రసవం వరకూ ఉంటుంది. ఒకవేళ కాపురానికి ముందే (అంటే దాంపత్య సంబంధం ఏర్పడకముందే) ఆమెకు విడాకులు ఇవ్వబడినట్లయితే, అలాంటి స్త్రీకి అసలు ఇద్దత్ అనేదే ఉండదు. ఇక విడాకులు పొందిన స్త్రీ ముట్లుడిగిన స్త్రీ అయిన పక్షంలో ఆమె ఇద్దత్ మూడు నెలలు ఉంటుంది – ఇకపోతే ఈ ఆయత్‌లో పేర్కొనబడిన స్త్రీ పైన ప్రస్తావనకు వచ్చిన మూడు రకాల స్త్రీలలో ఏ కోవకూ చెందకుండా కేవలం భర్తతో దాంపత్య జీవితం గడుపుతూ విడాకులు పొందిన స్త్రీ అన్నమాట. ఇటువంటి స్త్రీల ఇద్దత్ (గడువు) మూడు రుతువులు. అంటే మూడుసార్లు బహిష్టు అవటం లేదా మూడుసార్లు రుతుస్రావం నుండి పరిశుద్ధత నొందటం. ఈ మూడు రుతువులు ముగిసిన తరువాత వారు పునర్వివాహం చేసుకోగలరు. సలఫ్ విద్వాంసులు 'రుతువు' (ఖురు) అనే పదానికి ఇక్కడ ప్రస్తావించబడిన రెండు అర్థాలూ సరైనవేనని అభిప్రాయపడ్డారు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్).

271. 'దాచి ఉంచటం' అనే మాటలో బహిష్టు మరియు గర్భధారణ – రెండూ ఇమిడి ఉన్నాయి. బహిష్టును దాచటమనే విషయాన్నే మనం ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు.

عَلَيْهِنَّ بِالْمَعْرُوفِ وَلِلرِّجَالِ عَلَيْهِنَّ دَرَجَةٌ وَاللَّهُ عَزِيزٌ حَكِيمٌ ﴿٢٢٨﴾

లోపల వారిని తిరిగి రప్పించుకోవాలన్న సదుద్దేశం భర్తలకు ఉంటే ధర్మం ప్రకారం అలా రప్పించుకునే హక్కు వారికి ఉంది.[272] భర్తలకు స్త్రీలపై హక్కులున్నట్లే స్త్రీలకు కూడా వారిపై హక్కులున్నాయి – కాని ఉత్తమ రీతిలో! కాకపోతే పురుషులకు స్త్రీలపై ఒకింత ప్రాధాన్యత ఉంది.[273] అల్లాహ్ సర్వాధికుడు, వివేచనాపరుడు.

اَلطَّلَاقُ مَرَّتٰنِ فَاِمْسَاكٌۢ بِمَعْرُوْفٍ اَوْ تَسْرِيْحٌ

**229** ఈ విడాకులు రెండుసార్లే.[274] ఆ తరువాత సక్రమంగా (ఆమెను)

స్త్రీకి తనకు విడాకులిచ్చిన భర్తతోనే కాపురం చేయాలని ఉంటుంది. అందుకని ఆమె తనకు మూడుసార్లు బహిష్టు వచ్చినా పైకి మాత్రం తనకు ఒకసారో లేక రెండుసార్లో మాత్రమే బహిష్టు వచ్చిందని అబద్ధం చెబుతుంది. (మూడు రుతువులు గడవలేదంటే తను ఆ భర్తకే భార్యగా ఉండగలదన్న ఉద్దేశ్యంతో అలా చెబుతుందన్న మాట!) ఒక్కోసారి భర్తకు తన విడాకుల్ని ఉపసంహరించుకోవాలని ఉంటుంది. అదే సమయంలో ఆమెకు, తిరిగి భర్త వద్దకు వెళ్ళటం ఇష్టం ఉండదు. అందుకని ఆమె తనకు మూడు రుతువులు గడవకపోయినా, గడిచిపోయాయని అబద్ధం చెప్పి భర్తకు దాంపత్య జీవితాన్ని పునరుద్ధరించుకునే హక్కు లేకుండా చేస్తుంది. ఇది బహిష్టును దాచటమయింది. అలాగే గర్భధారణ సంగతి కూడా. తను గర్భాన్ని దాల్చిన విషయం దాచిపెట్టకూడదు. స్పష్టంగా ప్రకటించాలి. ఎందుకంటే దాపరికం వల్ల ప్రమాదాలు పొడసూపుతాయి. ఆమె కడుపులో ఉన్న బిడ్డ ఒకరి వీర్యకణం వల్ల ఉత్పన్నమవగా, ఆ శిశువును వేరొక వ్యక్తికి అంటగట్టడం మహాపాతకం.

272. భార్యను వేధించే దురుద్దేశం ఏదీ లేకుండా, బుద్ధిగా కాపురం చేసుకోవాలని మనసులో ఉంటే ఇద్దత్ (గడువు) లోపల ఆమెను రప్పించుకునే హక్కు భర్తకు ఉంది. స్త్రీ తరపు సంరక్షకుడు ఈ రాజీ ప్రయత్నంలో అవరోధాలు సృష్టించకూడదు.

273. అంటే భార్యాభర్తలిరువురి హక్కులూ పరస్పరం పోలి ఉన్నాయి. వాటిని నెరవేర్చవలసిన బాధ్యత – ధర్మం ప్రకారం – ఇరువురిపైనా ఉంది. కాకపోతే భర్తకు కాస్తంత ఆధిక్యత ఉంది. ఉదాహరణకు : సహజ శక్తి సామర్థ్యాలలో, జిహాద్ అనుమతి విషయంలో, వారసత్వంలో రెండు వాటాలు లభించటంలో, ఇంటి వ్యవహారాలు నిర్వహించటంలో, విడాకులు ఇవ్వటం మరియు తిరిగి రప్పించుకోవటం మొదలైన విషయాల్లో పురుషునికి ఒకింత ఆధిక్యత ఉంది.

274. భర్తకు తన నిర్ణయం నుంచి మరలివచ్చేందుకు అవకాశం ఉన్న విడాకులు ఇవి.

بِإِحْسَانٍ ۗ وَلَا يَحِلُّ لَكُمْ أَن تَأْخُذُوا مِمَّا
آتَيْتُمُوهُنَّ شَيْئًا إِلَّا أَن يَخَافَا أَلَّا يُقِيمَا حُدُودَ اللَّهِ ۖ

ఆపుకోవాలి.[275] లేదంటే ఉత్తమ రీతిలో వదలిపెట్టాలి.[276] మీరు వారికి ఇంతకు ముందు ఇచ్చి ఉన్న వాటిలో నుంచి దేన్నయినా తిరిగి తీసుకోవటం ధర్మసమ్మతం కాదు. ఆ( ఒకవేళ అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమన్న భయం వారిరువురికీ ఉంటే అది వేరే విషయం.

ఇవి రెండు మాత్రమే. మొదటిసారి విడాకుల తరువాత, రెండవసారి విడాకుల తరువాత కూడా గడువు లోపల భార్యను తిరిగి రప్పించుకోవడానికి అవకాశం ఉంటుంది. మూడవసారి విడాకులు ఇచ్చిన తరువాత ఇక ఈ అవకాశం మిగిలి ఉండదు. అజ్ఞానకాలంలో విడాకులు ఇవ్వడానికి, తిరిగి రప్పించుకోవడానికి ఒక గడువు అంటూ ఉండేది కాదు. తత్కారణంగా స్త్రీలు ఎన్నో బాధలు భరించవలసి వచ్చేది. భర్త పదే పదే ఆమెకు విడాకులివ్వటం, మళ్లీ కాపురానికి పిలిపించుకోవటం పరిపాటి అయిపోయింది. అంటే ఆమెతో ఉత్తమరీతిలో సంసారం చేసేవాడూ కాదు, మంచితనంతో విడిచిపెట్టేవాడూ కాదు. స్త్రీలు నిత్యం అనిశ్చిత స్థితికి లోనై ఉండేవారు. ఈ అన్యాయాన్ని అల్లాహ్ ఆపాడు. అలా అని భర్తలకు కూడా అన్యాయం చేయలేదు. వారికి కూడా ఒకటి లేక రెండుసార్లు ఆలోచించుకునే, స్వీయసంస్కరణ చేసుకునే అవకాశం ఇచ్చాడు. అలా గాకుండా ఒక్క విడియాకుతోనే వ్యవహారం తెగత్రెంపులయ్యేటట్లు చేసివుంటే, దాని ద్వారా లెక్కలేనన్ని సామాజిక సమస్యలు ఉత్పన్నం అయ్యేవి. అదీగాక అల్లాహ్ **'తల్ఖతాని'** (రెండు విడాకులు) అని అనలేదు. పైగా **'అత్తలాఖు మర్రతాని'** (విడాకులు రెండుసార్లు) అని స్పష్టంగా చెప్పాడు. దీనిద్వారా బోధపడే ముఖ్య విషయం ఏమిటంటే ఒకే సమయంలో రెండు లేక మూడు విడాకులు ఇచ్చేయటం, తక్షణం వాటిని అమలుపరచటం దైవసూక్తికీ, దేవుని యుక్తికీ విరుద్ధం. దేవుడు ఈ 'రెండుసార్లు' ద్వారా వాంఛించేదేమిటీ? అన్నది ముఖ్య విషయం.

భర్త ఒకసారి విడాకులు ఇచ్చిన తరువాత, లేక రెండుసార్లు విడాకులు ఇచ్చినమీదట అతనికి ఆలోచించుకునే అవకాశం కల్పించాలి. ఆవేశం వల్లనో, అపార్థం వల్లనో అతడు తొందరపడి విడాకులు ఇచ్చి ఉండవచ్చు. తీరా విడాకులు ఇచ్చిన తరువాత అతనికి తన తప్పు తెలిసి రావచ్చు. ఒకేచోట, ఒకే సమయంలో ఆగ్రహావేశంలో మూడుసార్లు 'తలాక్' అంటూ విడాకుల ప్రయోగం చేసినప్పుడు దాన్ని 'ఒకే తలాక్'గా, అది కూడా తిరిగి మరలేందుకు అనువుండే తలాక్గా పరిగణించినప్పుడే తప్పును సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది. లేకుంటే కాపురాలు తొందరగా కూలిపోతాయి. ఈ సందేహం పూర్తిగా తీరకపోతే సత్యాన్ని నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా చెప్పే

فَإِنْ خِفْتُمْ أَلَّا يُقِيمَا حُدُودَ اللَّهِ فَلَا جُنَاحَ عَلَيْهِمَا
فِيمَا افْتَدَتْ بِهِ ۗ تِلْكَ حُدُودُ اللَّهِ فَلَا تَعْتَدُوهَا ۚ
وَمَنْ يَتَعَدَّ حُدُودَ اللَّهِ فَأُولَٰئِكَ هُمُ الظَّالِمُونَ ﴿٢٢٩﴾

అందువల్ల దంపతు లిద్దరూ అల్లాహ్ ఏర్పరచిన హద్దులకు కట్టుబడి ఉండలేరన్న భయం మీకు కలిగి, అదే సమయంలో స్త్రీ తన భర్తకు కొంత నష్టపరిహారం ఇచ్చి వేర్పడ దలిస్తే – అట్టి పరిస్థితిలో ఇరువురిపై ఎలాంటి దోషంలేదు.[277] ఇవి అల్లాహ్ నిర్ధారించిన హద్దులు. (జాగ్రత్త!) వాటిని దాటకూడదు. ఎవరు అల్లాహ్ నిర్ధారించిన హద్దులను మీరిపోతారో వారే దుర్మార్గులు.

فَإِنْ طَلَّقَهَا فَلَا تَحِلُّ لَهُ مِنْ بَعْدُ حَتَّىٰ تَنْكِحَ
زَوْجًا غَيْرَهُ ۗ فَإِنْ طَلَّقَهَا فَلَا جُنَاحَ عَلَيْهِمَا أَنْ

**230** మరి ఆమెకు (మూడవసారి) గనక విడాకులిస్తే, ఆ స్త్రీ ఇతనిని తప్ప వేరొక వ్యక్తిని వివాహం చేసుకోనంతవరకూ ఇతని కోసం ఆమె ధర్మసమ్మతం కాజాలదు.

---

విద్వాంసులను సంప్రతించండి. "మజ్మూఅ మఖాలాతె ఇల్మియా బాబత్ – ఏక్ మజ్లిస్కి తీన్ తలాఖ్" మరియు "ఇఖ్తిలాఫె ఉమ్మత్ ఔర్ సిరాతె ముస్తఖీమ్" పుస్తకాలు చదవండి. ఎందుకంటే విషయం అర్థం కానపుడు విద్వాంసులను సంప్రతించి మార్గదర్శకత్వం పొందాలి. షరీయతు వాంఛించేది కూడా ఇదే!

275. అంటే రాజీపడిన తర్వాత మంచి పద్ధతిలో కాపురం చేయాలి.

276. వదలి పెట్టడం అంటే మూడవసారి (తుదిసారి) విడాకులు ఇవ్వటం అని భావం.

277. ఈ వాక్యం 'ఖులా'ను గురించి సూచిస్తోంది. అంటే ఒకవేళ భార్య తన భర్తనుంచి వేర్పడదలిస్తే భార్యకు 'మహర్'గా ఇచ్చిన సొమ్మును భర్త తిరిగి తీసుకోగలడు. ఒకవేళ వేర్పాటుకు భర్త అంగీకరించకపోతే, అతను స్వయంగా ఆమెకు విడాకులిచ్చేలా న్యాయస్థానం అతనిపై ఒత్తిడి తెస్తుంది. అప్పటికీ అతను ఒప్పుకోకపోతే న్యాయస్థానం ఆ నికాహ్ను రద్దుపరుస్తుంది. ఈ విధంగా 'ఖులా' తలాక్ ద్వారా మరియు 'నికాహ్ రద్దు' ద్వారా కూడా అయిపోతుంది. రెండు పరిస్థితుల్లోనూ ఇద్దత్ (గడువు) ఒక రుతువుగా నిర్ధారించబడింది (అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, హాకిమ్ – ఫత్హుల్ ఖదీర్ ఆధారంగా). స్త్రీకి ఇస్లాం ఈ హక్కును ఇచ్చినప్పటికీ తగు కారణం లేకుండా భర్త నుండి వేర్పడే డిమాండు చీటికీ మాటికీ చేయరాదని కూడా చాలా గట్టిగా తాకీదు చేసింది. ఒకవేళ ఏ స్త్రీ అయినా తగు కారణం లేకుండా విడాకుల కోసం

يَّتَرَاجَعَآ اِنۡ ظَنَّآ اَنۡ يُّقِيۡمَا حُدُوۡدَ اللّٰهِ ؕ وَتِلۡكَ
حُدُوۡدُ اللّٰهِ يُبَيِّنُهَا لِقَوۡمٍ يَّعۡلَمُوۡنَ ﴿۲۳۰﴾

ఆ తరువాత అతను (రెండవ భర్త) కూడా ఆమెకు విడాకులిస్తే, మళ్ళీ వీరిద్దరూ అల్లాహ్ (విధించిన) హద్దులకు కట్టుబడి ఉండగలమన్న నమ్మకం ఉండి వివాహ బంధంలోకి రాదలిస్తే అందులో తప్పు లేదు.[278] ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. తెలుసుకోగలవారికి ఆయన వీటిని స్పష్ట పరుస్తున్నాడు.

وَاِذَا طَلَّقۡتُمُ النِّسَآءَ فَبَلَغۡنَ اَجَلَهُنَّ
فَاَمۡسِكُوۡهُنَّ بِمَعۡرُوۡفٍ اَوۡ سَرِّحُوۡهُنَّ بِمَعۡرُوۡفٍ

**231** మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చి నప్పుడు, వారి గడువు (ఇద్దత్) ముగియ నుండగా వారిని సహృదయంతో మీ వద్ద ఆపి ఉంచుకోండి. లేదంటే ఉత్తమ రీతిలో

---

ఒత్తిడి తీసుకువస్తే ఆమె స్వర్గలోక సువాసనను కూడా ఆస్వాదించజాలదని మహాప్రవక్త (సఅసం) హెచ్చరించారు (ఇబ్నె కసీర్).

278. మూడవసారి 'తలాఖ్' ఇచ్చిన తరువాత జరిగేదేమిటో ఈ వాక్యంలో వివరించబడింది. మూడవ సారి విడాకులు ఇచ్చిన పిదప భర్త ఇక రాజీపడలేడు. ఆమెను తిరిగి వివాహం కూడా చేసుకోలేడు. అయితే ఆ స్త్రీ వేరొక చోట వివాహం చేసుకున్న తరువాత, ఆ భర్త ఆమెకు తన ఇష్టపూర్వకంగా విడాకులిస్తే లేదా అతను మరణిస్తే అప్పుడు ఆమె తన మొదటి భర్తతో వివాహం చేసుకోవటం ధర్మ సమ్మతమవుతుంది. అయితే దీని కోసం మనదేశంలో కొంతమంది 'హలాలా' పద్ధతిని అనుసరించి ఈ హక్కును దుర్వినియోగపరుస్తున్నారు. ఇది కడు హేయమైన చేష్ట. దైవాదేశాలతో చెలగాటం అంటే ఇదే. 'హలాలా' చేసేవారిని, చేయించేవారిని కూడా మహాప్రవక్త (సఅసం) ధూత్కరించారు.

'హలాలా' అంటే ఆవేశంలో భార్యకు విడాకులిచ్చేసిన వ్యక్తి, తరువాత తన తప్పును తెలుసుకుని బాధపడతాడు. ఇక ఆమెను ఎలాగూ తన వివాహబంధంలోకి రప్పించుకోలేడు. కాబట్టి ఆమెను వేరొక వ్యక్తితో నికాహ్ జరిపిస్తాడు. ఆ నవ దంపతులు సమాగమం జరిపిన తరువాత విడాకుల తతంగాన్ని పూర్తి చేస్తారు. ఆ తరువాత ఇద్దత్ (గడువు) పూర్తయ్యాక మొదటి భర్త ఆమెను మళ్లీ నికాహ్ చేసుకుంటాడు. దీన్నే 'హలాలా'గా వ్యవహరిస్తారు. ఇది తప్పుడు విధానం. ఈ విధంగా జరిపించబడే నికాహ్ అసలు నికాహ్యే కాదు. అదొక ప్రహసనం. దురుద్దేశంతో కూడుకున్న చేష్ట, దైవాజ్ఞలతో చెలగాటం! పరిహాసం!! ఇంకా సూటిగా చెప్పాలంటే అది వ్యభిచారం.

وَلَا تُمْسِكُوهُنَّ ضِرَارًا لِّتَعْتَدُوا ۚ وَمَن يَفْعَلْ
ذَٰلِكَ فَقَدْ ظَلَمَ نَفْسَهُ ۚ وَلَا تَتَّخِذُوا آيَاتِ اللَّهِ
هُزُوًا ۚ وَاذْكُرُوا نِعْمَتَ اللَّهِ عَلَيْكُمْ وَمَا أَنزَلَ
عَلَيْكُم مِّنَ الْكِتَابِ وَالْحِكْمَةِ يَعِظُكُم بِهِ ۚ وَاتَّقُوا
اللَّهَ وَاعْلَمُوا أَنَّ اللَّهَ بِكُلِّ شَيْءٍ عَلِيمٌ ﴿٢٣١﴾

సాగనంపండి.[279] వారిపై దౌర్జన్యానికి ఒడిగట్టే ఉద్దేశ్యంతో వారిని ఆపి ఉంచుకొని వేధించకండి. ఈ వైఖరిని అనుసరించినవాడు నిజానికి తనకు తానే అన్యాయం చేసుకున్నాడు. దైవాదేశాలతో పరిహాసమాడకండి.[280] అల్లాహ్ మీకు చేసిన ఉపకారాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి. మీపై గ్రంథాన్ని, హిక్మత్‌ను (ప్రవక్త సంప్రదాయాన్ని, ధర్మశాస్త్రాన్ని) అవతరింపజేసి, మీకు చేసిన ఉపదేశాన్ని కూడా (అవలోకనం చేసుకోండి). అల్లాహ్ యెడల భయభక్తులు కలిగి ఉండండి. అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు అన్న విషయాన్ని మీరు తెలుసుకోండి.

وَإِذَا طَلَّقْتُمُ النِّسَاءَ فَبَلَغْنَ أَجَلَهُنَّ فَلَا
تَعْضُلُوهُنَّ أَن يَنكِحْنَ أَزْوَاجَهُنَّ إِذَا تَرَاضَوْا
بَيْنَهُم بِالْمَعْرُوفِ ۗ ذَٰلِكَ يُوعَظُ بِهِ مَن
كَانَ مِنكُمْ يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ

**232** మీరు స్త్రీలకు విడాకులు ఇచ్చిన తరువాత, వారు తమ గడువు (ఇద్దత్)ను ముగించి, తమ (మాజీ) భర్తలను ధర్మబద్ధంగా పరస్పరం ఇష్టపడి వివాహమాడదలిస్తే మీరు వారికి అడ్డు

ఎందుకంటే దుష్ట సంకల్పంతో 'హలాలా' చేయించినందున ఆ స్త్రీ తన మొదటి భర్త కోసం హలాల్ (ధర్మ సమ్మతం) కాజాలదు.

279. రెండుసార్లు విడాకులు ఇచ్చేవరకు రాజీపడటానికి వీలుంటుందని "అత్తలాఖు మర్రతాని" – ఆయతులో అనబడింది. అయితే ఈ రాజీపాటు ఇద్దత్ (గడువు) ముగిసేలోగా జరగాలనీ, గడువు దాటిందంటే ఆ సౌలభ్యం వీగిపోతుందని ఈ ఆయతులో చెప్పబడుతోంది.

280. కొంతమంది వేళాకోళానికి కూడా విడాకులిచ్చే వారుండవచ్చు. అలాగే ఉబుసుపోక వివాహం చేసుకునే వారుంటారు. అదేమంటే పరిహాసానికి అలా చేశామని అంటారు. అల్లాహ్ దీనిని దైవాజ్ఞలతో పరిహాసంగా అభివర్ణించాడు. అంటే ఇలాంటి వెకిలి చేష్టలను నిరోధించాలి అన్నది దీని అసలు ఉద్దేశ్యం. అందుకే మహాప్రవక్త (సఅసం) ఏమని సెలవిచ్చారంటే ఎవరయినా వేళాకోళానికి కూడా ఇలాంటి పనులు చేస్తే

ذٰلِكُمْ اَزْكٰى لَكُمْ وَاَطْهَرُ ۚ وَاللّٰهُ يَعْلَمُ وَاَنْتُمْ لَا تَعْلَمُوْنَ ﴿٢٣٢﴾

తగలకండి.[281] మీలో ఎవరయితే అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ విశ్వసిస్తున్నారో వారికి ఈ ఉపదేశం చేయబడుతోంది. ఇందులోనే మీ పరిశుద్ధత, పరిశుభ్రత ఇమిడి ఉన్నాయి. అంతా అల్లాహ్‌కు తెలుసు, మీకు తెలియదు.

అది వాస్తవంగానే భావించబడుతుంది. వేళాకోళానికి ఇచ్చిన తలాఖ్, ఉబుసుపోక చేసుకున్న పెళ్ళి, (బానిసకు) స్వేచ్ఛనొసగటం వంటివి అన్నీ ఈ కోవలోకి వస్తాయి (ఇబ్నె కసీర్).

281. విడాకులు పొందిన స్త్రీకి సంబంధించి మూడో ఆజ్ఞ ఇందులో ఇవ్వబడింది. అదేమంటే గడువు పూర్తయిన తరువాత (అంటే మొదటిసారి లేక రెండవసారి విడాకుల అనంతరం) ఆ దంపతులు పరస్పరం ఒక అంగీకారానికి వచ్చి, మళ్ళీ వివాహబంధంలో ఇమడగోరితే పెద్దవాళ్లు అడ్డు తగలకూడదు. దైవప్రవక్త (సఅసం) కాలంలో సరిగ్గా ఇలాంటిదే ఒక సంఘటన జరిగింది. అప్పుడు స్త్రీ సోదరుడు ఆమెకు అడ్డు తగిలాడు. దానిపై ఈ ఆయతు అవతరించింది (సహీహ్ బుఖారీ, కితాబున్నికాహ్).

దీనిద్వారా స్పష్టమయ్యే ఇంకొక విషయం ఏమిటంటే స్త్రీ తన స్వీయ నిర్ణయంతో నికాహ్ చేసుకోజాలదు. పైగా ఆమె నికాహ్ కోసం ఆమె సంరక్షకుని అనుమతి, అంగీకారం అవసరం. స్త్రీల సంరక్షకులు తమకు గల అజమాయిషీ హక్కును దుర్వినియోగపరచకూడదు అని అల్లాహ్ తాకీదు చేశాడంటే, వారికి ఆ హక్కు ఉండబట్టేకదా తాకీదు చేశాడు. కాబట్టి ఈ ఆయతు అవతరణా నేపథ్యంలో సహీహ్ బుఖారీలో పొందుపరచబడిన సంరక్షకుని వ్యవహారం సుస్పష్టం. ఇందులో ఎలాంటి అస్పష్టతకు, సంకోచానికి ఆస్కారం లేదు. ఇంకా యితర హదీసుల ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తోంది. ఉదాహరణకు : “స్త్రీ సంరక్షకుని అనుమతి లేనిదే నికాహ్ అవదు” అనే ఉల్లేఖనం ఒకటుంది. మరో ఉల్లేఖనంలో “ఏ స్త్రీ అయితే తన సంరక్షకుని అనుమతి పొందకుండా నికాహ్ చేసుకుందో, ఆమె నికాహ్ అధర్మం, ఆమె నికాహ్ అధర్మం, ఆమె నికాహ్ అధర్మం” అని ఉంది (అల్‌బానీ గారు ఈ హదీసును కూడా ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు). ఇతర హదీసువేత్తల మాదిరిగా అల్లామా అన్వర్ షా కశ్మీరీ కూడా ఈ హదీసులను ప్రామాణికమైన, అహ్‌సన్ కోవకు చెందిన హదీసులుగా గ్రహించారు (ఫైజుల్‌బారీ – సంపుటి : 4, కితాబున్నికాహ్).

ఈ ఆయతు ద్వారా స్పష్టంగా మన ముందుకు వచ్చే మరో ముఖ్యాంశం ఏమిటంటే

**233** పాల గడువును పూర్తి చేయాలని (తండ్రులు) కోరినపక్షంలో తల్లులు తమ పిల్లలకు పూర్తిగా రెండు సంవత్సరాల పాటు పాలు పట్టాలి.[282] బిడ్డల తండ్రులపై పోషణాభారం ఉంటుంది. కనుక వారు

وَالْوَالِدَاتُ يُرْضِعْنَ أَوْلَادَهُنَّ حَوْلَيْنِ كَامِلَيْنِ لِمَنْ أَرَادَ أَنْ يُتِمَّ الرَّضَاعَةَ وَعَلَى الْمَوْلُودِ لَهُ رِزْقُهُنَّ وَكِسْوَتُهُنَّ بِالْمَعْرُوفِ

స్త్రీల సంరక్షకులు కూడా మొండిగా మసలుకోకూడదు. వారు ఈ సందర్భంగా స్త్రీల మనోభావాలను అర్థం చేసుకోవాలి. ఒకవేళ స్త్రీ సంరక్షకుడు గనక స్త్రీ యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా – బలవంతంగా – ఎవరికో ఒకరికి కట్టబెడితే, అట్టి పరిస్థితిలో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించి నికాహ్‌ను రద్దు చేయించేందుకు షరీయత్ ఆమెకు అనుమతినిస్తోంది. అందుకే నికాహ్ సందర్భంగా ఇరువురి అంగీకారం చాలా అవసరం. ఏ ఒక్కరూ తన ఇష్టానుసారం వ్యవహరించకూడదు. ఒకవేళ స్త్రీ గనక తన సంరక్షకుని మాటను ధిక్కరించి వివాహం చేసుకుంటే అట్టి వివాహం సరైంది అనిపించుకోదు.

అదేవిధంగా సంరక్షకుడు మూర్ఖునిగా ప్రవర్తిస్తూ, స్త్రీ బాగోగులకు బదులు తన స్వప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్నట్లయితే న్యాయస్థానం అటువంటి సంరక్షకుని అజమాయిషీ హక్కును జప్తు చేసుకుంటుంది. ఆ తర్వాత ఆ సంరక్షకుని తదనంతరం ఆమెకు బాధ్యత వహించే వ్యక్తి పర్యవేక్షణలోగాని లేక స్వయంగా తన పర్యవేక్షణలోగాని ఆమె నికాహ్ జరిపిస్తుంది. "సంరక్షకులు పరస్పరం తగవుపడితే రాజ్యాధికారి సంరక్షణా బాధ్యతలు స్వీకరిస్తాడు" (ఇర్వావుల్ గలీల్).

282. ఈ ఆయతులో 'పాల గడువు', 'పాలవరుస'కు సంబంధించిన ముఖ్య విషయాలు ప్రస్తావించబడ్డాయి. దీనిద్వారా బోధపడుతున్న మొట్టమొదటి విషయం ఏమిటంటే పాల గడువును పూర్తి చేయదలిచేవారు పూర్తిగా రెండు సంవత్సరాలు పిల్లవాడికి పాలుపట్టాలి. పై ఆయతులోని పదాల ద్వారా అంతకంటే తక్కువ గడువు వరకు పాలు త్రాపించుకునేందుకు కూడా వెసులుబాటు ఉన్నట్లు బోధపడుతున్నది. రెండో విషయం : పాలగడువు గరిష్టంగా రెండు సంవత్సరాలన్న సంగతి దీనిద్వారా రూఢీ అవుతోంది. సుననె తిర్మిజీలో హజ్రత్ ఉమ్మె సలమా (ర.అన్హా) గారి 'మర్ఫూ' ఉల్లేఖనం ఇలా వుంది : చనువుల నుండి వెలువడి కడుపులోని ప్రేగులను వ్యాకోచింపజేసే పాలు మాత్రమే పాల వరుస సంబంధాన్ని (నిషిద్ధతను) నిరూపిస్తాయి. పాల గడువు లోపల త్రాపే పాలు మాత్రమే అటువంటి గుణం కలిగి ఉంటాయి (సుననె తిర్మిజీ, కితాబుర్రజాఅ). ఏ చంటి పిల్లవాడైనా ఆ వయస్సులో, ఆ విధంగా ఏ స్త్రీ పాలైనా సరే త్రాగి ఉంటే, తద్వారా పాల వరుస సంబంధం ఏర్పడినట్లవుతుంది. ఆ సంబంధం ఉందని తెలిసిన మీదట (అంటే ఒకే స్త్రీ చనుబాలు త్రాగిన ఒక అబ్బాయి, ఒక అమ్మాయి – ఒకే తల్లిబిడ్డలు కాకపోయినప్పటికీ – అన్నాచెల్లెలు

لَا تُكَلَّفُ نَفْسٌ إِلَّا وُسْعَهَا لَا تُضَارَّ وَالِدَةٌ بِوَلَدِهَا وَلَا مَوْلُودٌ
لَهُ بِوَلَدِهِ وَعَلَى الْوَارِثِ مِثْلُ ذَٰلِكَ فَإِنْ أَرَادَا فِصَالًا عَنْ

వారికి ఉత్తమ రీతిలో అన్నవస్త్రాలను సమకూర్చాలి.[283] ఎవరిపైనా శక్తికి మించిన భారం వేయబడదు. బిడ్డ మూలంగా తల్లిని వేధించటంగానీ, సంతానం కారణంగా తండ్రిని ముప్పు తిప్పలు పెట్టడం గానీ చేయరాదు.[284] వారసులపై కూడా ఇటువంటి బాధ్యతే ఉంటుంది.[285] ఒకవేళ ఉభయులూ (తల్లిదండ్రులు) తమ ఇష్టపూర్వకంగా,

అయిపోతారు). వారిద్దరి మధ్య వైవాహిక సంబంధం నిషిద్ధం. "వంశపారంపర్యం రీత్యా ఏ ఏ సంబంధాలు వివాహానికి నిషిద్ధమో అవే పాలవరుస మూలంగా కూడా నిషిద్ధం అవుతాయి" (సహీహ్ బుఖారీ, కితాబుష్షహాదాత్).

283. **'మౌలూద్ లహూ'** అంటే తండ్రి అని అర్థం. విడాకుల అనంతరం పాలు త్రాగే పసి పిల్లల ఆలనాపాలనా సమస్య, విడాకులు పొందిన మహిళల పోషణా వ్యవహారం ముస్లిం సమాజంలో మరింత జటిలంగా తయారవుతోంది. దీనికి కారణం ఇస్లామీయ షరీయతు పట్ల గల అవగాహనా లోపమే. దైవాదేశం ప్రకారం – ఈ ఆయతులో సూచించిన విధంగా – పాలగడువు ముగిసేవరకూ భర్త తన స్థోమతను బట్టి స్త్రీకి అన్నవస్త్రాలను, వసతి సౌకర్యాన్ని కల్పిస్తే ఏ చిక్కూ ఉండదు. బాధ్యతా నిర్వహణలో నిర్లక్ష్యం, పలాయనవాదం పొడసూపిన చోటల్లా సమస్యలు ఉత్పన్నం అవుతాయి.

284. తల్లిని వేధించటం అంటే అర్థం ఇది : ఒక్కోసారి విడాకుల అనంతరం తల్లి తన పసిబిడ్డను తన దగ్గరే ఉంచుకోగోర్తుంది. కాని ఆమె మమతానురాగాలను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా భర్త తరఫు వారు బలవంతంగా ఆ పసివాణ్ణి ఆమె నుంచి లాక్కుంటారు. లేదా ఖర్చుల కోసం చిల్లిగవ్వ కూడా ఆమెకు ఇవ్వకుండా పిల్లవాణ్ణి పోషిస్తే పోషించు లేకపోతే లేదు, నీ యిష్టం అని భర్త అంటాడు. ఇది న్యాయం కాదుకదా! అలాగే తండ్రిని ముప్పుతిప్పలు పెట్టడం అంటే భావం: విడాకులు పొందిన స్త్రీ మరియు ఆమె తరఫు బంధువులు ఏకమై అతనిపై కక్షసాధింపు ప్రయత్నంలో భాగంగా పసిపిల్లలకు పాలుపట్టేది లేదని తెగేసి చెప్పటం లేదా ఒకవేళ పాలుపట్టినా ఖర్చుల క్రింద భారీమొత్తం అతన్నుంచి రాబట్టేందుకు ప్రయత్నించటం, లేదా నీ పిల్లవాణ్ణి నువ్వు తీసుకుపో అంటూ చీటికీ మాటికీ చెప్పటం.

285. ఒకవేళ భరణం చెల్లిస్తూ ఉండే తండ్రి గనక అకస్మాత్తుగా మరణిస్తే ఆ పిల్లవాడి పాలుపట్టే ఖర్చుల్ని అతని వారసులు భరించాలి. పాలుపట్టే తల్లిపైగానీ, పసిపిల్లవాడి పోషణపై గానీ ఎలాంటి చెడు ప్రభావం పడకుండా వారు శుభ్రంగా చూసుకోవాలి.

تَرَاضٍ مِّنْهُمَا وَتَشَاوُرٍ فَلَا جُنَاحَ عَلَيْهِمَا وَإِنْ أَرَدتُّمْ أَن
تَسْتَرْضِعُوٓا أَوْلَادَكُمْ فَلَا جُنَاحَ عَلَيْكُمْ إِذَا سَلَّمْتُم مَّآ آتَيْتُم
بِالْمَعْرُوفِ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوٓا أَنَّ اللَّهَ بِمَا
تَعْمَلُونَ بَصِيرٌ ﴿٢٣٣﴾

పరస్పర సంప్రతింపులతో పాలు విడిపించ దలిస్తే వారు నిందార్హులు కారు. ఒకవేళ మీ సంతానానికి పాలుపట్టాలన్నదే మీ అభిలాష అయితే అందులోనూ దోషం లేదు. అయితే మీరు ఆమెకు సముచితమైన రీతిలో ఇవ్వవలసిన దాన్ని ఇవ్వండి.[286] అల్లాహ్‌కు భయపడుతూ మసలుకోండి. అల్లాహ్ మీ కార్యకలాపా లన్నింటి నీ గమనిస్తున్నాడన్న విషయాన్ని తెలుసుకోండి.

وَالَّذِينَ يُتَوَفَّوْنَ مِنكُمْ وَيَذَرُونَ أَزْوَاجًا يَتَرَبَّصْنَ بِأَنفُسِهِنَّ
أَرْبَعَةَ أَشْهُرٍ وَعَشْرًا فَإِذَا بَلَغْنَ أَجَلَهُنَّ فَلَا جُنَاحَ عَلَيْكُمْ
فِيمَا فَعَلْنَ فِىٓ أَنفُسِهِنَّ بِالْمَعْرُوفِ وَاللَّهُ بِمَا تَعْمَلُونَ خَبِيرٌ ﴿٢٣٤﴾

**234** మీలో ఎవరయినా మరణించి, వారు భార్యలను వదలిపోతే అటువంటి స్త్రీలు నాలుగు మాసాల పదిరోజుల వరకూ తమను తాము గడువు (ఇద్దత్)లో ఆపు కోవాలి.[287] గడువు ముగిసిన తరువాత వారు సంస్కారవంతమైన పద్ధతిలో తమ కొరకు మంచిదనుకున్న కార్యమేదయినా చేసుకుంటే అందులో మీపై దోషం ఏమీలేదు.[288] మీరు ఏమేం చేస్తున్నారో అల్లాహ్‌కు అంతా తెలుసు.

286. కన్నతల్లి కాకుండా వేరొక స్త్రీ చేత పసిపిల్లవాడికి పాలు పట్టించడానికి అనుమతి ఉంది. అయితే ఇందుకయ్యే ఖర్చుల్ని న్యాయసమ్మతంగా చెల్లించటం అవసరం.

287. ఆమె భర్తతో కాపురం చేసిన స్త్రీ అయినా లేక కాపురానికి ముందే భర్త చనిపోయి ఉన్నా, ఆమె యువతి అయినా ముసలి స్త్రీ అయినా, ఎవరికైనా ఈ గడువు వర్తిస్తుంది. ఒక్క గర్భవతి అయిన మహిళకు మాత్రమే దీన్నుంచి మినహాయింపు ఉంది. ఎందుకంటే భర్త చనిపోయిన స్త్రీలు గర్భవతులై ఉంటే వారి ఇద్దత్ (గడువు) ప్రసవం వరకు ఉంటుంది. తలాఖ్ సూరాలో ఇలా అనబడింది : "గర్భిణీ స్త్రీల ఇద్దత్ వారి కాన్పు అయ్యేవరకు ఉంటుంది." ఇద్దత్ కాలంలో ఆ స్త్రీలు సింగారించుకోవటం, (ఆఖరికి సుర్మా లేక కళ్ళకు కాటుక పెట్టుకోవటం వంటివి కూడా) చేయకూడదు. భర్త నివసించే ఇల్లు దాటి వేరొక చోటికి పోకూడదు. అయితే రాజీ పడటానికి వీలుండే విడాకులు (తలాఖె రజ్‌యీ) పొందిన స్త్రీ అలంకరించుకుంటే తప్పులేదు. రాజీ పడటానికి వీలులేని విడాకులు (తలాఖె బాయిన్) పొందినవారు ఇద్దత్ కాలంలో

وَلَا جُنَاحَ عَلَيْكُمْ فِيمَا عَرَّضْتُم بِهِ مِنْ خِطْبَةِ النِّسَاءِ أَوْ أَكْنَنتُمْ
فِي أَنفُسِكُمْ عَلِمَ اللَّهُ أَنَّكُمْ سَتَذْكُرُونَهُنَّ وَلَٰكِن لَّا تُوَاعِدُوهُنَّ
سِرًّا إِلَّا أَن تَقُولُوا قَوْلًا مَّعْرُوفًا وَلَا تَعْزِمُوا عُقْدَةَ النِّكَاحِ

**235** ఆ స్త్రీలను (వితంతువులను) నికాహ్ చేసుకోవాలన్న మీ సంకల్పాన్ని సూచనా ప్రాయంగా వారికి తెలియజేసినా లేక మీ ఉద్దేశ్యాన్ని మీ గుండెల్లోనే దాచు కున్నా అందులో తప్పేమీ లేదు. మీరు తప్పకుండా వారి గురించి ప్రస్తావిస్తారన్న సంగతి అల్లాహ్‌కు తెలుసు. అయితే మీరు వారికి లోపాయికారిగా వాగ్దానాలు చేయకండి.[289] ధర్మయుక్తంగా ఏదన్నా

అలంకరించుకోవచ్చా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు 'వచ్చు' అనంటే మరికొందరు 'కూడదు' అని అంటున్నారు (ఇబ్నె కసీర్).

288. అంటే ఇద్దత్ (గడువు) ముగిసిన పిదప వారు అలంకరించుకోవచ్చు. దానిపై ఎవరూ రాద్ధాంతం చేయనక్కరలేదు. అలాగే వితంతువు తన సంరక్షకులను, పెద్దలను సంప్రతించి పునర్వివాహం చేసుకోదలిస్తే వారు సంతోషంగా అంగీకారం తెలుపాలి. అంగీకారమే కాదు, దగ్గరుండి ఆ ఏర్పాట్లన్నీ చేసి ఆశీర్వదించి మరీ పంపాలి. వితంతు వివాహాన్ని అపచారంగానో, నామోషీగానో భావించకూడదు. ఆ సత్కార్యంలో అవరోధాలు కల్పించకూడదు. అన్య మతాలలో ఈ భావన ఉంది. ఆ ప్రభావానికి ముస్లింలు లోను కానవసరం లేదు.

289. అంటే వితంతువు లేక మూడుసార్లు విడాకులు పొందిన స్త్రీ విషయమై ఒక ముఖ్య సూచన ఇందులో ఇవ్వబడింది. అదేమంటే, గడువు (ఇద్దత్) కాలంలో మీరు ఒకవేళ ఆమెతో నికాహ్ గురించి సూచనాప్రాయంగా చెప్పదలిస్తే అందులో తప్పులేదు. (ఉదాహరణకు: నేను పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాననో, నేను ఒక ఉత్తమ ఇల్లాలి కోసం అన్వేషిస్తున్నానో అని అనటంలో దోషం లేదు) కాని ఆ మేరకు రహస్య మంతనాలు సాగించటం, ఆమెచేత ఒట్టు వేయించుకోవటం వంటివి చేయకూడదు. అలాగే గడువు ముగియకముందే నిశ్చితార్థం చేసుకోవటం కూడా సరైనదికాదు. ఇక మొదటిసారి లేక రెండవసారి విడాకులు పొందిన స్త్రీల వద్ద ఇలాంటి ప్రస్తావన చూచాయగా తీసుకురావటం కూడా ధర్మసమ్మతం కాదు. ఎందుకంటే ఆ గడువు పూర్తయ్యేవరకూ ఆమెపై భర్తకు హక్కు ఉంటుంది. బహుశా ఆమె భర్త రాజీ పడాలనుకుంటాడేమో!

**గమనిక :** కొంతమంది తెలీక ఇద్దత్ కాలంలోనే నికాహ్ చేసుకుంటారు. వీరికి సంబంధించిన ఆదేశం ఏమిటంటే, ఒకవేళ ఆ నవ దంపతులు సమాగమం

حَتّٰى يَبْلُغَ الْكِتٰبُ اَجَلَهٗ ۭ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ يَعْلَمُ مَا فِيْٓ
اَنْفُسِكُمْ فَاحْذَرُوْهُ ۚ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ غَفُوْرٌ حَلِيْمٌ ۝٢٣٥

చెబితే అది వేరే విషయం![290] కాని ఇద్దత్ (గడువు) కాలం ముగియనిదే నికాహ్ ఒప్పందాన్ని నిశ్చయం చేయకండి. మీ ఆంతర్యాల్లో దాగివున్న విషయాలను సయితం అల్లాహ్ తెలుసుకుంటాడని మరువకండి. కనుక ఆయనపట్ల అప్రమత్తంగా ఉండండి. అల్లాహ్ క్షమించేవాడు, మృదుస్వభావి అని కూడా తెలుసుకోండి.

لَا جُنَاحَ عَلَيْكُمْ اِنْ طَلَّقْتُمُ النِّسَاۗءَ مَا لَمْ تَمَسُّوْھُنَّ اَوْ
تَفْرِضُوْا لَھُنَّ فَرِيْضَةً ښ وَّمَتِّعُوْھُنَّ ۚ عَلَي الْمُوْسِعِ قَدَرُهٗ وَ
عَلَي الْمُقْتِرِ قَدَرُهٗ ۚ مَتَاعًۢا بِالْمَعْرُوْفِ ۚ حَقًّا عَلَي الْمُحْسِنِيْنَ ۝٢٣٦

**236** ఒకవేళ మీరు స్త్రీలను తాకకుండా, వారి మహర్‌ను నిర్ధారించకుండానే వారికి విడాకులిస్తే అది కూడా మీకు పాపం కాదు. అయితే వారికి ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చండి. స్థితి మంతుడు తన స్థితికి తగినట్లుగా, పేద వాడు తన స్థోమతకు తగినట్లుగా ధర్మం ప్రకారం ప్రయోజనం చేకూర్చాలి. ఉత్తమంగా వ్యవహరించేవారికి ఇది విధిగా నిర్ణయించబడింది.[291]

జరపకుండా ఉంటే వెంటనే వారిని విడదీయాలి. ఒకవేళ సమాగమం జరిగిపోయి ఉంటే అప్పుడూ వేర్పాటు తప్పదు. కాని తిరిగి వారిద్దరూ (గడువు అనంతరం) నికాహ్ చేసుకోగలరా లేదా? అన్న విషయమై ఏకాభిప్రాయం లేదు. ఇక వారు ఎన్నటికీ పరస్పరం నికాహ్ ద్వారా కలుసుకోలేరు అని కొందరు విద్వాంసులు నిర్ద్వంద్వంగా చెప్పారు. అయితే వారి మధ్య వివాహ బంధానికి అవకాశం మిగిలి ఉంటుందని చాలామంది ఉలమాలు భావిస్తున్నారు (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

290. అంటే సూచనప్రాయంగా, చూచాయగా ఉద్దేశ్యాన్ని వ్యక్తపరచటమన్నమాట. ఉదాహరణకు : నీ విషయంలో నేను శ్రద్ధాసక్తులు కలిగి ఉన్నాను అని అనటం లేదా ఆమె వివాహం విషయంలో ఒక నిర్ణయానికి వచ్చేముందు నాకు తప్పకుండా తెలియజేయండి అని ఆమె సంరక్షకునితో చెప్పటం మొదలగునవి (ఇబ్నె కసీర్).

291. నికాహ్ సందర్భంగా 'మహర్' నిర్ధారణ కాకుండా ఉండి, శోభనానికి ముందే విడాకులు ఇచ్చేసిన స్త్రీ గురించి ఇందులో చెప్పబడింది. అటువంటి స్త్రీకి ఎంతో కొంత

**237** మీరు స్త్రీలను ముట్టుకోకముందే విడాకులిచ్చేస్తే, అప్పటికే వారి 'మహర్' సొమ్ము కూడా నిర్ణయించబడి ఉంటే, నిర్ణీత మహర్‌లో సగం సొమ్ము వారికి ఇవ్వండి. ఒకవేళ వారు (స్త్రీలు) ఆ సొమ్మును కూడా మన్నించి వదలి పెడితే[292] లేక వివాహబంధం తన చేతిలో ఉన్న వ్యక్తి (పురుషుడు తాను పెళ్ళి సందర్భంగా యిచ్చిన మహర్ సొమ్మును)

وَإِنْ طَلَّقْتُمُوهُنَّ مِن قَبْلِ أَن تَمَسُّوهُنَّ وَقَدْ فَرَضْتُمْ لَهُنَّ فَرِيضَةً فَنِصْفُ مَا فَرَضْتُمْ إِلَّا أَن يَعْفُونَ أَوْ يَعْفُوَا

ప్రయోజనం చేకూర్చి సాగనంపమని తాకీదు చేయబడింది. ఈ 'ప్రయోజనాన్ని' ఆయా వ్యక్తులు తమ స్థాయికి తగ్గట్టు చేకూర్చాలి. మొత్తానికి మంచివారిపై ఇది తప్పనిసరిగా చేయబడింది. ఈ ప్రయోజన (ముత్ఆ) నిర్ధారణ కూడా జరిగింది. ఒక సేవకురాలిని కానుకగా ఇవ్వాలని కొందరంటే, 500 దిర్హములు నగదు చెల్లించాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఒకటి లేక అంతకన్నా ఎక్కువ జతల బట్టలు సమకూర్చాలని ఇంకా కొందరు వ్యాఖ్యానించారు. అయితే ఈ నిర్ధారణ షరీయతు పరంగా జరిగినది కాదు. ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితిపై, వారి ఔదార్యంపై ఇది ఆధారపడి ఉంటుంది.

మరి ఈ ప్రయోజనం (ముత్ఆ) అన్ని రకాల విడాకులకు వర్తిస్తుందా? లేక ఈ ఆయతులో, యిక్కడ పేర్కొనబడిన, ఈ రకపు విడాకులకు మాత్రమే వర్తిస్తుందా? అన్న విషయమై కూడా ద్వంద్వాభిప్రాయాలున్నాయి. అన్ని రకాల విడాకులు పొందిన మహిళకు ఇది వర్తిస్తుందని దివ్య ఖుర్ఆన్‌లోని మరికొన్ని ఆయతులు సూచిస్తున్నాయి. ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చి సగౌరవంగా పంపాలన్న ఈ ఆదేశంలో దాగివున్న పరమార్థం గురించి, దాని యొక్క లాభాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భేదాభిప్రాయాలు వచ్చి, మాటా మాటా పెరిగి, గుండెకు గాయమై వ్యవహారం విడాకుల వరకూ వచ్చినప్పుడు ఉదారంగా మసలుకోవటం, వీలైనంతవరకు స్త్రీకి ఊరట కల్పించటం చాలా అవసరం. తద్వారా భవిష్యత్తులో ప్రతీకార భావం పెల్లుబకకుండా ఉంటుంది. కాని వాస్తవంగా జరుగుతున్నదేమిటీ? మన సమాజంలో విడాకులు పొందిన స్త్రీని చిన్నచూపు చూడటమే గాకుండా, అత్యంత అవమానకరమైన దోరణిలో ఆమెను సాగనంపటం పరిపాటి అయిపోయింది. ఈ చర్యవల్ల ఆ రెండు కుటుంబాల మధ్య గల సత్సంబంధాలు శాశ్వతంగా చెడిపోతాయి.

292. మహర్ సొమ్ము ముందుగానే ఖరారై ఉండి, భర్త ఆమెను ముట్టుకోకముందే, ఖల్వతె సహీహాకు (వాస్తవమైన ఏకాంతానికి) ముందే విడాకులు ఇచ్చిన పక్షంలో నిర్ధారిత

الَّذِيْ بِيَدِهٖ عُقْدَةُ النِّكَاحِ ۭ وَاَنْ تَعْفُوْٓا اَقْرَبُ لِلتَّقْوٰى ۭ وَلَا تَنْسَوُا الْفَضْلَ بَيْنَكُمْ ۭ اِنَّ اللّٰهَ بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ۝

క్షమించివేస్తే[293] అది వేరే విషయం. మీ మన్నింపుల వైఖరి దైవభక్తికి చాలా సన్నిహితమైనది. ఒండొకరిపట్ల ఔదార్యం చూపటాన్ని విస్మరించకండి. నిస్సందేహంగా అల్లాహ్ మీ కర్మలను గమనిస్తూనే ఉన్నాడు.

మహర్‌లో సగభాగం ఆమెకు విధిగా చెల్లించాలి. ఒకవేళ విడాకులు పొందిన స్త్రీ అతన్ని క్షమిస్తే, అప్పుడు అతనిపై ఆ చెల్లింపు బాధ్యత ఉండదు.

293. వివాహబంధం తన చేతిలో ఉన్న వ్యక్తి అంటే భర్త అని అర్థం. (ఆ ముడిని విప్పాలా? లేక అలాగే ఉంచాలా? అనే కీలక నిర్ణయం గైకొనే వ్యక్తి యిక్కడ భర్తే). సగం మహర్ భర్త మాఫీ చేయటం ఏమిటీ? అన్న సందేహం యిక్కడ కలగవచ్చు. అంటే ఒకవేళ అతడు నికాహ్ సందర్భంగానే మహర్ సొమ్మును వధువుకు యిచ్చేసివుంటే, దాన్ని ఆమె నుండి వాపసు తీసుకోకుండా వదలిపెట్టడం అన్నమాట! ఈ సందర్భంగా సదమరవర్తనను, ఉపకార భావాన్ని మరువరాదని ఇస్లాం ఉపదేశిస్తోంది. మహర్ విషయంలో కనబరచే ఔదార్యం ముమ్ముందు మీ పాలిట శుభసూచకం అవుతుందని దీని భావం.

"వివాహ బంధం తన చేతిలో ఉన్న వ్యక్తి" అంటే స్త్రీ యొక్క సంరక్షకుడు అని కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. కాని యిది సరైంది కాదు. ఎందుకంటే వివాహబంధాన్ని కొనసాగించే లేక రద్దుపరచే అధికారం సంరక్షకునికి ఉండదు. మరో విషయం ఏమిటంటే మహర్ స్త్రీ హక్కు. దాన్ని మాఫీ చేసే అధికారం స్త్రీకి మాత్రమే ఉందిగాని ఆమె సంరక్షకునికి లేదు. కాబట్టి ఇంతకుముందు ఇచ్చిన వివరణే సరైంది (ఫత్‌హుల్ ఖదీర్).

గమనిక : విడాకులు పొందిన స్త్రీలు నాలుగు రకాలు :

1. మహర్ ముందుగా ఖరారై ఉండి, వివాహం తరువాత భర్త సమాగమం కూడా చేసి వుంటే అట్టి విడాకులు పొందిన మహిళకు పూర్తి మహర్ హక్కు ప్రాప్తిస్తుంది. 229వ ఆయతులో దీని వివరాలు ఉన్నాయి.
2. మహర్ సొమ్ము కూడా నిర్ధారితం కాకుండా, వివాహానంతరం సమాగమం కూడా జరగకుండా ఉన్న స్త్రీకి కేవలం కొంత లబ్ది మాత్రం చేకూర్చబడుతుంది.
3. మహర్ హక్కు ముందుగానే నిర్ణయించబడింది. కాని కార్యం జరగలేదు.

**238** నమాజులను కాపాడుకోండి ముఖ్యంగా మధ్యలో వున్న నమాజును.[294] అల్లాహ్ సమక్షంలో వినమ్రులై నిలబడండి.

حَافِظُوا عَلَى الصَّلَوَاتِ وَالصَّلَاةِ الْوُسْطَىٰ وَقُومُوا لِلَّهِ قَانِتِينَ ﴿٢٣٨﴾

**239** పరిస్థితులు భయానకంగా ఉన్నప్పుడు నడుస్తూనో లేక వాహనంపై పోతూనో (నమాజు చేయండి). శాంతి భద్రతలు నెలకొన్న తరువాత అల్లాహ్ మీకు బోధించిన విధంగా ఆయన్ని ధ్యానించండి. దాని గురించి అంతకు ముందు మీకు తెలీదు.[295]

فَإِنْ خِفْتُمْ فَرِجَالًا أَوْ رُكْبَانًا ۖ فَإِذَا أَمِنتُمْ فَاذْكُرُوا اللَّهَ كَمَا عَلَّمَكُم مَّا لَمْ تَكُونُوا تَعْلَمُونَ ﴿٢٣٩﴾

**240** మీలో ఎవరయినా చనిపోయి, వారు తమ భార్యలను వదలిపోతే, వారు ఒక ఏడాది కాలంపాటు ప్రయోజనం

وَالَّذِينَ يُتَوَفَّوْنَ مِنكُمْ وَيَذَرُونَ أَزْوَاجًا وَصِيَّةً لِّأَزْوَاجِهِم مَّتَاعًا إِلَى الْحَوْلِ غَيْرَ إِخْرَاجٍ ۚ فَإِنْ خَرَجْنَ

అటువంటి మహిళకు సగం మహర్ సొమ్ము చెల్లించాలి. వీరిరువురికి సంబంధించిన వివరాలు 237వ ఆయతులో వచ్చాయి.

4. వివాహం తరువాత సంభోగం మాత్రం జరిగింది. కాని ఆమె మహర్ ఎంతో నిర్ణయించబడలేదు. అట్టి పరిస్థితిలో ఆ మహిళకు “మహరె మిస్ల్” ఇవ్వబడుతుంది. మహరె మిస్ల్ అంటే ఆ మహిళ పుట్టింటి తరఫు వారి స్థాయినిబట్టి, లేక ఆ వంశంలో సాధారణంగా తీసుకునే మహర్‌ను బట్టి ఆమె మహర్ నిర్ధారించబడుతుంది. అదీ సాధ్యం కాకపోతే ఆ మహిళ యోగ్యతను అంచనావేసి ఆమెకు ఎంత మహర్ ఇవ్వవచ్చునో నిర్ణయిస్తారు. (నైలుల్ ఔతార్, ఔనుల్ మాబూద్)

294. మధ్య నమాజు అంటే ‘అస్ర్ నమాజ్’ అని భావం. కందకపోరాటం నాడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ నమాజును “సలాతుల్ వుస్తా” (మధ్య నమాజు)గా ఖరారు చేశారు (సహీహ్ బుఖారీ, కితాబుల్ జిహాద్).

295. శత్రువు మెరుపుదాడి చేయొచ్చన్న భయం ఉన్నప్పుడు ఏ విధంగా నమాజు చేసుకున్నా ఫరవాలేదు. అంటే నడుస్తూ నడుస్తూ, వాహనంపై కూర్చొని నమాజు చేయవచ్చు. అయితే భయంకర పరిస్థితులు తొలగిపోయి, శాంతి భద్రతలు నెలకొన్నమీదట, మీకు నేర్పిన విధంగానే నమాజు చేయవలసి ఉంటుంది.

فَلَا جُنَاحَ عَلَيْكُمْ فِي مَا فَعَلْنَ فِي أَنْفُسِهِنَّ مِنْ مَعْرُوفٍ ۗ وَاللَّهُ عَزِيزٌ حَكِيمٌ ﴿٢٤٠﴾

పొందేలా,[296] వారిని ఎవరూ ఇండ్లనుంచి గెంటివేయకుండా ఉండేలా వీలునామా వ్రాయాలి. ఒకవేళ వారు తమంతట తాముగా వెళ్ళిపోయి, తమ విషయంలో ధర్మసమ్మతంగా ఏమి చేసినా దానికి మీరు నిందార్హులు కారు. అల్లాహ్ సర్వాధికుడు, వివేచనాపరుడు.

وَلِلْمُطَلَّقَاتِ مَتَاعٌ بِالْمَعْرُوفِ ۖ حَقًّا عَلَى الْمُتَّقِينَ ﴿٢٤١﴾

**241** విడాకులు పొందిన మహిళలకు సముచిత మేలు చేయటం భావ్యం. ఇది దైవభీతిపరులపై విధిగా చేయబడింది.[297]

296. ఈ ఆయతు రద్దు పరచబడింది. అమలులో ఉన్న ఆయతు ఇంతకు ముందే ప్రస్తావనకు వచ్చింది. దాని ప్రకారం ఇద్దత్ (గడువు) కాలం 4 మాసాల 10 రోజులు అని స్పష్టం చేయబడింది. అదీగాక వారసత్వ ఆదేశాలకు సంబంధించిన ఆయతులో వితంతువు భాగం కూడా నిర్ధారించబడింది. కాబట్టి ఇకమీదట భర్త తన భార్య పేరిట ఏ రకమయిన వీలునామా కూడా రాయనవసరం లేదు.

297. ఇది సర్వసాధారణమైన ఆజ్ఞ. ఇందులో విడాకులు పొందిన మహిళలందరూ వచ్చేస్తారు. వేర్పాటు సందర్భంగా మహిళలతో సహృదయతతో మెలగాలనీ, వీలైనంత ఎక్కువగా వారికి లబ్ది చేకూర్చి సగౌరవంగా పంపించాలని ఇందులో తాకీదు చేయబడింది. ఇందులో అసంఖ్యాకమైన సామాజిక పరమార్థాలు దాగి ఉన్నాయి. ముస్లింలు ఈ ఉపదేశాన్ని సరిగ్గా అమలుపరిస్తే ఎంతబాగుండు! దురదృష్టవశాత్తు వారు ఈ బోధను విస్మరించారు. ఇదిలా ఉండగా కొంతమంది “ముజ్తహిదీన్” (దైనందిన జీవన వ్యవహారాలపై షరీయతు సూత్రాలను అన్వయింపజేసేవారు)లు ఈ ‘లబ్ది’ (ముత్ఆ)కి వక్రభాష్యం చెబుతున్నారు. ‘ముత్ఆ’ అంటే విడాకులు పొందిన స్త్రీకి జీవితాంతం చెల్లించవలసిన మనోవర్తి లేక ఆస్తిలో ఇవ్వవలసిన హక్కు అని వారిలో కొందరు విశదీకరించారు. ఇవి రెండూ నిరాధారమైనవే. తన జీవిత భాగస్వామిగా పనికిరాదని భావించి, ఆమెతో తెగత్రెంపులు చేసుకున్న పురుషుడు ఆమెకు జీవితాంతం ఎలా మనోవర్తి ఇచ్చుకుంటాడు? అలాగే తాను కాదనుకున్న, లేక తనను కాదన్న మగవాడి నుంచి అభిమానవతి అయిన ఏ ఆడది మాత్రం ఎలా అతని దగ్గర జీవితాంతం ముష్టెత్తుకుంటుంది?

كَذٰلِكَ يُبَيِّنُ اللّٰهُ لَكُمْ اٰيٰتِهٖ لَعَلَّكُمْ تَعْقِلُوْنَ ﴿٢٤٢﴾

**242** మీరు అర్థం చేసుకుని బుద్ధిగా మసలుకునేందుకుగాను అల్లాహ్ ఈ విధంగా తన ఆయతులను (ఆజ్ఞలను) మీకు విశదపరుస్తున్నాడు.

اَلَمْ تَرَ اِلَى الَّذِيْنَ خَرَجُوْا مِنْ دِيَارِهِمْ وَهُمْ اُلُوْفٌ حَذَرَ الْمَوْتِ فَقَالَ لَهُمُ اللّٰهُ مُوْتُوْا ثُمَّ اَحْيَاهُمْ اِنَّ اللّٰهَ لَذُوْ فَضْلٍ عَلَى النَّاسِ وَلٰكِنَّ اَكْثَرَ النَّاسِ لَا يَشْكُرُوْنَ ﴿٢٤٣﴾

**243** వేల సంఖ్యలో ఉండి కూడా మరణ భీతితో ఇల్లూ వాకిలీ వదలిపోవడానికి సిద్ధమైన వారిని నీవు చూడలేదా? అల్లాహ్ వారితో "చావండి" అని అన్నాడు. మరి వారిని తిరిగి బ్రతికించాడు.[298] నిస్సందేహంగా అల్లాహ్ జనులపట్ల దయ గలవాడు. కాని వారిలో అత్యధికులు కృతజ్ఞత చూపరు.

وَقَاتِلُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ وَاعْلَمُوْٓا اَنَّ اللّٰهَ سَمِيْعٌ عَلِيْمٌ ﴿٢٤٤﴾

**244** అల్లాహ్ మార్గంలో పోరాడండి. అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసిన వాడన్న విషయాన్ని మీరు తెలుసుకోండి.

298. ఈ సంఘటన గతించిన ఒకానొక సమాజానిది. దీనికి సంబంధించిన వివరాలు ఏ ప్రామాణిక హదీసులో కూడా పొందుపరచబడిలేవు. కొన్ని కథనాల ప్రకారం ఇది ఇస్రాయిల్ సంతతి కాలంలో జరిగిన ఉదంతం అనీ, హిజ్ఖీల్ అనే ప్రవక్త చేసిన ప్రార్థనను విని అల్లాహ్ ఆ జాతి ప్రజలను తిరిగి బ్రతికించాడనీ అనబడుతోంది. యుద్ధంలో చనిపోతామన్న భయంతోనో లేక ప్లేగువ్యాధి వాతనపడి చచ్చిపోతామన్న భీతితోనో వారు తమ ఇండ్లనుంచి మూటాముల్లె సర్దుకున్నారు. ఆ సమయంలో అల్లాహ్ వారందరినీ మృత్యువాతన పడేసి చావుబ్రతుకులు వారి చేతుల్లో లేవనీ, దైవచిత్తమయితేనే వారు బ్రతికి బట్ట కట్టగలరనీ గుర్తు చేయదలిచాడు. వారు ఏ దేశమేగినా, ఏ గడపవద్ద బ్రతుకు గడపగోరినా కడకు వారు అల్లాహ్ ఆశ్రయంలోకి రావలసిందేనని కూడా బోధించదలిచాడు. అలాగే అల్లాహ్ చనిపోయిన వారిని తిరిగి బ్రతికించే శక్తి కలిగి ఉన్నాడు. దానికి సజీవ సాక్ష్యం ఈ ఉదంతమే. తదుపరి వాక్యంలో దైవమార్గంలో పోరాడమని ముస్లింలకు ఉపదేశించటం జరిగింది. దైవమార్గంలో యుద్ధమనేసరికి నీళ్లు నమలకండి అని ఇంతకుముందు పేర్కొనబడిన సంఘటన ద్వారా జ్ఞాపకం చెయ్యబడింది. జీవన్మరణాల నిర్ణయం నేలపై కాదు, నింగిపైనే చేయబడింది. యుద్ధ మైదానం నుంచి వెన్నుచూపి పారిపోయినంతమాత్రాన మీరు మృత్యువు నుంచి తప్పించుకోలేరు.

**245** అల్లాహ్‌కు మంచి రుణం[299] ఇచ్చే వారు మీలో ఎవరైనా ఉన్నారా? దాన్ని ఆయన ఎన్నో రెట్లు పెంచి తిరిగి ఇస్తాడు. (ఉపాధిని) తగ్గించేవాడు, పెంచేవాడు అల్లాహ్‌యే. కడకు మీరంతా మరలి పోవలసింది ఆయన వైపుకే.

مَنْ ذَا الَّذِیْ یُقْرِضُ اللّٰهَ قَرْضًا حَسَنًا فَیُضٰعِفَهٗ لَهٗۤ اَضْعَافًا كَثِیْرَةً ؕ وَاللّٰهُ یَقْبِضُ وَیَبْصُۜطُ ۪ وَاِلَیْهِ تُرْجَعُوْنَ ﴿۲۴۵﴾

**246** మూసా తరువాత ఇస్రాయీలు సంతతి పెద్దల (రెండు నాల్కల ధోరణి)ని గురించి నువ్వు ఆలోచించావా?[300]

اَلَمْ تَرَ اِلَى الْمَلَاِ مِنْۢ بَنِیْۤ اِسْرَآءِیْلَ مِنْۢ بَعْدِ مُوْسٰی ۘ اِذْ

299. "మంచిరుణం" అంటే భావం దైవమార్గంలో ఖర్చుపెట్టడం. అంటే ప్రాణత్యాగం చేసినట్లే ధనత్యాగం చేయటం. దైవధర్మ ఉన్నతి కోసం కష్టపడి చెమటోడ్చి సంపాదించిన సొమ్మును మనస్ఫూర్తిగా అర్పించటం. దీనికోసం ఊగిసలాడకూడదు. పిసినారితనం కనబరచకూడదు. ఈ రోజు దైవమార్గంలో అర్పిస్తే రేపటి రోజున మా గతేంకాను?! అని సందేహపడకూడదు. ఎందుకంటే ఉపాధిలో సమృద్ధి నొసగటంగానీ, తగ్గించటం గానీ అల్లాహ్ చేతుల్లో ఉంది. ఆయన మిమ్మల్ని రెండు విధాలుగానూ పరీక్షిస్తాడు. ఒక్కోసారి మీ ఉపాధిని తగ్గించి, ఒక్కోసారి పుష్కలంగా ప్రసాదించి పరీక్షిస్తాడు. దైవమార్గంలో ఖర్చుపెట్టడం వల్ల సంపద తరగదు. దాన్ని ఎన్నో రెట్లు పెంచి మరీ మీకు వాపసుచేస్తాడాయన. ఈ సమృద్ధి రకరకాలుగా ఉంటుంది. భౌతిక వృద్ధితోపాటు ఆధ్యాత్మిక వికాసం మీకు ప్రాప్తిస్తుంది. ప్రాపంచిక జంఝాటాల నుంచి, రోగాల బారినుంచి అల్లాహ్ మిమ్మల్ని కాపాడి, మీ మనసులు కుదుటపడేలా చేయవచ్చు. ఇక పరలోకంలో మీకు లభించే పుణ్యఫలమైతే మిమ్మల్ని ఆశ్చర్యపరిచే విధంగా ఉంటుంది.

300. అరబీలో **'మలవున్'** అనే పదం ఉంది. ఏదేని జాతిలోని ప్రముఖులను, యోగ్యులను 'మలవున్'గా వ్యవహరిస్తారు. వీరు సలహాదారులుగా, నాయకులుగా ఉంటారు. నిఘంటువులో 'మలఅ' అనే పదానికి నిండటం అనే అర్థం ఉంది. వారిని చూడగానే ఒకవిధమైన భయం కళ్ళల్లో నిండిపోతుంది (ఐసరుత్తఫాసీర్). ఇక్కడ ప్రస్తావించబడిన దైవప్రవక్త పేరు షమ్‌వేల్ అని అనబడుతోంది. ఇబ్నె కసీర్ సహా అనేకమంది వ్యాఖ్యాతలు వివరించిన దాని ప్రకారం దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) మరణం తరువాత ఇస్రాయీల్ వంశస్థులు కొంత కాలం వరకు సన్మార్గంపైనే ఉన్నారు. కాని ఆ తరువాత వారిలో విముఖత పొడసూప నారంభించింది. ధర్మంలో లేనిపోని విషయాలు ప్రవేశపెట్టి దాని రూపురేఖలను మార్చివేయసాగారు. ఆఖరికి వారి

قَالُوا لِنَبِيٍّ لَّهُمُ ابْعَثْ لَنَا مَلِكًا نُّقَاتِلْ فِي سَبِيلِ اللَّهِ قَالَ هَلْ عَسَيْتُمْ إِن كُتِبَ عَلَيْكُمُ الْقِتَالُ أَلَّا تُقَاتِلُوا قَالُوا وَمَا لَنَا أَلَّا نُقَاتِلَ فِي سَبِيلِ اللَّهِ وَقَدْ أُخْرِجْنَا مِن دِيَارِنَا وَأَبْنَائِنَا فَلَمَّا كُتِبَ عَلَيْهِمُ الْقِتَالُ تَوَلَّوْا إِلَّا قَلِيلًا مِّنْهُمْ وَاللَّهُ عَلِيمٌ بِالظَّالِمِينَ ﴿٢٤٦﴾

"మేము దైవమార్గంలో పోరాడేందుకుగాను మాకోసం ఎవరినయినా రాజుగా నియమించు"[301] అని వారు తమ ప్రవక్తను కోరారు. దానికి ఆ ప్రవక్త, "తీరా యుద్ధం విధించబడ్డాక మీరు వెనుకంజ వేస్తారేమో!" అని అన్నాడు. దానికి వారు, "మేము ఇప్పటికే ఇళ్లనుంచి తరిమివేయబడ్డాము. మా పిల్లలకు దూరం చేయబడ్డాము. అలాంటప్పుడు మేము దైవమార్గంలో పోరాడకుండా ఉండటం అనేది ఎలా సాధ్యం?" అని (కడు గంభీరంగా) పలికారు. తీరా యుద్ధం విధిగా చేయబడినప్పుడు, వారిలో కొద్దిమంది మినహా మిగిలిన వారంతా వెన్ను చూపారు. అల్లాహ్ దుర్మార్గులను బాగా ఎరుగు.

వ్యవహారం విగ్రహారాధన వరకూ వచ్చింది. దైవ ప్రవక్తలు వారిని అన్నివిధాలా బోధపరచారు. అయినా వాళ్లు షిర్కును, పాపకార్యాలను విడనాడలేదు. పర్యవసానంగా అల్లాహ్ వారిపై శత్రు బెడదను మోపాడు. శత్రువులు వీరి ప్రాంతాలను వశపరచుకోవటమేగాక, భారీ సంఖ్యలో వీళ్ల మనుషులను ఖైదీలుగా పట్టుకున్నారు. వారిలో దైవప్రవక్తల పరంపర కూడా ఆగిపోయింది. ఎట్టకేలకు కొంతమంది సజ్జనుల ప్రార్థన ఫలితంగా షమ్వేల్ అనే ప్రవక్త ప్రభవింపజేయబడ్డారు. ఆయన వారి మధ్య మంచిని పెంపొందించే, చెడులను అరికట్టే ప్రయత్నాన్ని నిరాఘాటంగా కొనసాగించాడు. దైవమార్గం వైపుకు ప్రజలను పిలువసాగాడు. తమకొక నాయకత్వాన్ని ఇస్తే అతని నేతృత్వంలో శత్రువులతో పోరాడి, కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సంపాదించుకుంటామని వారు ప్రవక్తముందు సరికొత్త ప్రతిపాదనను తీసుకువచ్చారు. కాని ఆ ప్రవక్తకు తన జాతి ప్రజల చంచల స్వభావం గురించి బాగా తెలుసు. తీరా యుద్ధఘడియలు ఆసన్నమైనపుడు వెన్నుచూపి పారిపోతారేమో కదా! అని ఆయన చెప్పనేచెప్పాడు. కడకు ఆయన అనుమానమే నిజమయింది.

301. తమ కోసం ఒక రాజును నియమించమని ప్రజలు కోరటాన్నిబట్టి, దాని ప్రకారం దైవప్రవక్త దైవాన్ని ప్రార్థించటాన్నిబట్టి 'రాజరికం' అనేది స్వాభావికంగా చెడ్డది,

وَقَالَ لَهُمْ نَبِيُّهُمْ إِنَّ اللَّهَ قَدْ بَعَثَ لَكُمْ طَالُوتَ مَلِكًا ۚ قَالُوا أَنَّىٰ يَكُونُ لَهُ الْمُلْكُ عَلَيْنَا وَنَحْنُ أَحَقُّ بِالْمُلْكِ مِنْهُ وَلَمْ يُؤْتَ سَعَةً مِّنَ الْمَالِ ۚ قَالَ إِنَّ اللَّهَ اصْطَفَاهُ عَلَيْكُمْ وَزَادَهُ بَسْطَةً فِي الْعِلْمِ وَالْجِسْمِ ۖ وَاللَّهُ يُؤْتِي مُلْكَهُ مَن يَشَاءُ ۚ وَاللَّهُ وَاسِعٌ عَلِيمٌ ﴿٢٤٧﴾

**247** "అల్లాహ్ తాలూత్‌ను మీ రాజుగా నియమించాడ"ని వారి ప్రవక్త వారికి తెలియజేసినప్పుడు, "అతని అధికారం మాపై ఎలా నడుస్తుంది? రాజ్యాధికారానికి అతనికన్నా ఎక్కువ హక్కుదారులము మేమాయె! కనీసం అతనికి సిరిసంపదల్లో కూడా విస్తృతి వొసగబడలేదు" అని (సాకులు) చెప్పసాగారు. ప్రవక్త వారికి ఇలా నచ్చజెప్పాడు: "(చూడండి!) అల్లాహ్ అతన్నే మీపై (నాయకునిగా) ఎన్నుకున్నాడు. జ్ఞానపరంగా, శారీరకంగా కూడా అతనికి ఆధిక్యతను ప్రసాదించాడు.[302] అల్లాహ్ తాను కోరిన వారికి రాజ్యాధికారం ఇస్తాడు. అల్లాహ్ విశాల సంపన్నుడు, జ్ఞాన సంపన్నుడు కూడా!

అధర్మమైనది ఏమీ కాదని తెలుస్తోంది. ఒకవేళ రాజరికం అధర్మమైనదయితే అల్లాహ్ వారి కోరికను త్రోసిపుచ్చేవాడే. కాని అల్లాహ్ వారి కోరికను మన్నించాడు. 'తాలూత్'ను వారికి రాజుగా నియుక్తుణ్ణి చేశాడు. దీనిద్వారా బోధపడేదేమిటంటే రాజు గనక నిరంకుశుడు, దౌర్జన్యపరుడు కాకుండా, పైగా దైవాజ్ఞలను పాలిస్తూ ప్రజల మధ్య న్యాయాన్ని, ధర్మాన్ని పరిరక్షిస్తున్నవాడయితే అతని రాజరికం కేవలం ధర్మసమ్మతమే కాదు, వాంఛనీయం కూడా. మరిన్ని వివరాలకై అల్ మాయిదా సూరా 20వ ఆయతు యొక్క వివరణను అధ్యయనం చేయండి.

302. ఇస్రాయీల్ వంశీయులు తాలూత్‌ను రాజుగా అంగీకరించకపోవడానికి అసలు కారణం ఆయన ఇస్రాయీల్ సంతతిలోని రాజవంశానికి చెందినవాడు కాకపోవటమే. ఆయన సాధారణ సిపాయి మాత్రమే. అందుకే ఆయనంటే వారికి అభ్యంతరం. 'ఇది నా ఎంపిక కాదు, అల్లాహ్ ఈయన్ని ఎన్నుకున్నాడు' అని ప్రవక్త వారికి నచ్చజెప్పాడు. అదీగాక రాజరికం కోసం, నాయకత్వం కోసం సిరిసంపదలకన్నా, కులగోత్రాలకన్నా బుద్ధికుశలత, ప్రజ్ఞాపాటవాలు, ధైర్యసాహసాలు, వజ్రసంకల్పం చాలా అవసరం. ఈ సుగుణాలు మీకన్నా తాలూత్‌లోనే మెండుగా ఉన్నాయనీ, అందుకే అల్లాహ్ మీపై ఆయనకు ప్రాధాన్యతను ఇచ్చాడని దైవప్రవక్త వారందరికీ ఉపదేశించాడు. అదలా ఉంచితే అల్లాహ్ విశాల సంపన్నుడు, అన్నీ తెలిసినవాడు. ఆయన తాను కోరినవారికి లెక్కలేనంతగా అనుగ్రహిస్తాడు. గౌరవం ఆయన చేతుల్లో

**248** వారి ప్రవక్త వారికి మళ్ళీ ఈ విధంగా నచ్చజెప్పాడు: అతని రాజరికానికి సంబంధించిన బహిరంగ నిదర్శనం ఏమిటంటే (అతని ఏలుబడిలో) మీ వద్దకు ఆ (శుభసూచకాల) పెట్టె తిరిగి వస్తుంది.[303] అందులో మీ ప్రభువు తరఫున మీకు గుండె నిబ్బరం ఉంది. మూసా, హారూన్ కుటుంబీకులు వదలి వెళ్ళిన అవశేషాలు కూడా అందులో ఉన్నాయి. దాన్ని దూతలు మోసుకు వస్తారు. మీరే గనక విశ్వసించిన వారైతే ఇందులో మీకొరకు స్పష్టమయిన సూచన ఉంది.

وَقَالَ لَهُمْ نَبِيُّهُمْ إِنَّ آيَةَ مُلْكِهِ أَن يَأْتِيَكُمُ التَّابُوتُ فِيهِ
سَكِينَةٌ مِّن رَّبِّكُمْ وَبَقِيَّةٌ مِّمَّا تَرَكَ آلُ مُوسَىٰ وَآلُ هَارُونَ
تَحْمِلُهُ الْمَلَائِكَةُ ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَةً لَّكُمْ إِن كُنتُم مُّؤْمِنِينَ ﴿٢٤٨﴾

ఉంది. ఆ గౌరవాన్ని ఆయన ఎవరికంటే వారికి ఇవ్వడు. యోగ్యులైనవారికే ఇస్తాడు. అర్హత ఎవరిలో ఉందో, ఎవరిలో లేదో ఆయనకు తెలుసు – ఈ విధంగా దైవప్రవక్త తన జాతి వారికి విశదీకరించి, ఇదంతా దైవనిర్ణయానుసారం జరిగిందని చెప్పారు. (అప్పటికయినా ఆ జనం నమ్మారా? అంటే వారంత సులభంగా నమ్మే రకం కాదు మరి. "నువ్వు చెప్పేదే నిజమైతే ఏదయినా నిదర్శనం చూపించు" అని మరో డిమాండు చేశారు. రాబోయే ఆయతులో ఆ నిదర్శనం గురించి వివరించబడింది.)

303. మూలంలో పెట్టెను 'తాబూత్' అని అనబడింది. ఈ తాబూత్ 'తౌబ్' నుండి వచ్చింది. అంటే మరలటం అని దీని అర్థం. ఇస్రాయీల్ సంతతివారు శుభశ్రేయాలను ఆశించి ఆ పెట్టె వైపుకు మరలేవారు (ఫత్హుల్ ఖదీర్). ఆ పెట్టెలో దైవప్రవక్తలయిన మూసా, హారూన్ (అలైహిముస్సలాం)ల వస్తుసామగ్రి ఉండేది. ఆఖరికి ఆ పెట్టెను కూడా వారి శత్రువులు దోచుకుని వెళ్ళారు. అల్లాహ్ ఆ పెట్టెను ఒక 'సూచన'గా దైవదూతల ద్వారా హజ్రత్ తాలూత్ గడపవద్దకు చేర్చాడు. దాన్ని చూడగానే ఇస్రాయీల్ వంశీయులు ఆనందంతో పరవశించిపోయారు. అల్లాహ్ తాలూత్‌ను చక్రవర్తిగా ఇష్టపడ్డాడనటానికి దీన్ని ఒక తార్కాణంగా భావించారు. అంతేకాదు, ఆ పెట్టెను అల్లాహ్ ఇస్రాయీల్ వంశీయుల వైభవానికి, స్థిరత్వానికి ప్రతీకగా ఖరారు చేశాడు. ఏ జాతికయినా ఒక నిలకడ, ప్రశాంతత, తృప్తి, గుండె నిబ్బరం అనేది లభిస్తే అది దేవుని తరఫున ఆ జాతికి వొసగబడిన చాలా పెద్ద కానుక అని భావించాలి. 'గుండె నిబ్బరం' అనేది మామూలు వస్తువు కాదు. దేవుడు ప్రత్యేకంగా అనుగ్రహించదలచిన దాసులకు మాత్రమే అది ఒనగూడుతుంది. భీకర యుద్ధాలలో రక్తపుటేరులు

**249** తాలూత్ సైన్యాన్ని తీసుకుని బయలు దేరినప్పుడు ఇలా ప్రకటించాడు : “చూడండి! అల్లాహ్ మిమ్మల్ని ఒక కాలువ[304] ద్వారా పరీక్షించబోతున్నాడు. అందులోని నీళ్ళను త్రాగినవాడు నా వాడు కాడు. త్రాగనివాడు మాత్రమే నా వాడు. చేత్తో గుక్కెడు నీరు తీసుకుని త్రాగితే ఫరవాలేదు.” కాని కొద్దిమంది తప్ప మిగి లిన వారంతా ఆ నీళ్ళను (కడుపునిండా) త్రాగేశారు.[305] తాలూత్ విశ్వాసులైన తన

فَلَمَّا فَصَلَ طَالُوتُ بِالْجُنُودِ قَالَ إِنَّ اللَّهَ مُبْتَلِيكُم بِنَهَرٍ
فَمَن شَرِبَ مِنْهُ فَلَيْسَ مِنِّي وَمَن لَّمْ يَطْعَمْهُ فَإِنَّهُ مِنِّي إِلَّا مَنِ
اغْتَرَفَ غُرْفَةً بِيَدِهِ فَشَرِبُوا مِنْهُ إِلَّا قَلِيلًا مِّنْهُمْ فَلَمَّا جَاوَزَهُ

ప్రవహిస్తున్నప్పుడు, శవాల గుట్టలు పేరుకుపోతున్నప్పుడు గుండెనిబ్బరం లేనివారు పరిస్థితిని చూసి బెంబేలెత్తిపోతారు. అయితే దైవానుగ్రహంతో గుండెనిబ్బరం పొందిన విశ్వాసులు మాత్రం కదన రంగంలో ఏమాత్రం తొణక్కుండా, పర్వతంలా నిలబడతారు. ప్రత్యర్థివర్గం వీరి స్థయిర్యాన్ని చూసి కలవరపడుతుంది. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే ప్రవక్తలు వదలివెళ్ళిన చిహ్నాలు, అవశేషాలు – దైవాజ్ఞతో – ప్రయోజనం చేకూర్చుతాయి. కాని అవి ప్రవక్త అవశేషాలే అన్నదానికి గట్టి ఆధారాలు ఉండాలి. లేని సంబంధాన్ని ఆపాదించినంతమాత్రాన శుభాలు సంక్రమించవు. ఈ మధ్య చాలాచోట్ల ‘పవిత్ర కేశాలు’, ‘అవశేషాలు’ అనే పేర్లతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వాటి వెనుక ఏ చారిత్రక ఆధారమూ ఉండదు. అలాగే మరికొంతమంది మహాప్రవక్త (సఅసం) పేరుతో ఆయన పవిత్ర పాదుకల ఆకారాన్ని తయారుచేసి ఇంటిముంగిట వ్రేలాడదీస్తే తమ అక్కరలు తీర్తాయనీ, కష్టాలు తొలగిపోతాయనీ నమ్ముతారు. అలాగే సమాధుల వద్ద సజ్జనుల పేర మొక్కుకోవటం, మొక్కుబడి చెల్లించిన వస్తువులను తినటం అత్యంత పవిత్రంగా, శుభదాయకంగా భావించటం కూడా జరుగుతోంది. నిజానికి ఇది దైవేతరుల పేరిట మొక్కుబడి. ఇది కూడా షిర్క్ పరిధిలోకి వస్తుంది. కనుక ఇటువంటి వస్తువులు తినటం హరామ్ (నిషిద్ధం). సమాధులను కడిగి ఆ నీళ్ళను త్రాగటం, శరీరానికి పూసుకోవటం శుభప్రదం అని భావించేవారున్నారు. వాస్తవానికి ఈ సమాధుల స్నానం కూడా ‘కాబాగృహ స్నానాని’కి అనుకరణే. దీనికి ఎలాంటి ఆధారంలేదు. షిర్క్‌తో రంగరించబడిన ఆ కాలుష్య జలం పవిత్రం ఎలా అయిపోతుంది? మొత్తానికి ఈ పోకడలన్నీ నిరాధారమైనవి, నిర్హేతుకమైనవి. షరీయత్‌తో వీటికి ఎలాంటి సంబంధం లేదు.

304. ఈ కాలువ జోర్డాన్‌కు – పాలస్తీనాకు మధ్యలో ఉంది (ఇబ్నె కసీర్).

305. నేతకు విధేయులై ఉండటం ఎట్టి పరిస్థితిలోనూ అనివార్యం. అందునా యుద్ధం

هُوَ وَالَّذِينَ آمَنُوا مَعَهُ قَالُوا لَا طَاقَةَ لَنَا الْيَوْمَ بِجَالُوتَ وَجُنُودِهِ
قَالَ الَّذِينَ يَظُنُّونَ أَنَّهُم مُّلَاقُو اللَّهِ كَم مِّن فِئَةٍ قَلِيلَةٍ
غَلَبَتْ فِئَةً كَثِيرَةً بِإِذْنِ اللَّهِ وَاللَّهُ مَعَ الصَّابِرِينَ ﴿٢٤٩﴾

సైన్యంతో కాలువ దాటి ముందుకు పోతున్నప్పుడు, "జాలూత్‌తో, అతని సైన్యంతో తలపడే శక్తి ఈ రోజు మాలో లేదు"[306] అని వారన్నారు. కాని అల్లాహ్‌ను కలుసుకోవలసి ఉందనే విషయంపై దృఢ విశ్వాసం గల కొంత మంది ఇలా అన్నారు : "ఒక చిన్న వర్గం, ఒక పెద్ద వర్గాన్ని, దైవాజ్ఞతో జయించటం ఎన్నోసార్లు జరిగింది." అల్లాహ్ సహనం చూపేవారికి అండగా నిలుస్తాడు.

وَلَمَّا بَرَزُوا لِجَالُوتَ وَجُنُودِهِ قَالُوا رَبَّنَا أَفْرِغْ عَلَيْنَا صَبْرًا
وَثَبِّتْ أَقْدَامَنَا وَانصُرْنَا عَلَى الْقَوْمِ الْكَافِرِينَ ﴿٢٥٠﴾

**250** జాలూత్‌తో, అతని సైన్యంతో ముఖాముఖీ అయినప్పుడు వారు ఇలా ప్రార్థించారు: "ప్రభూ! మాకు సహన స్థయిర్యాలు ప్రసాదించు. మా కాళ్లకు నిలకడను ఇవ్వు. అవిశ్వాస జనులపై (జరిగే పోరాటంలో) మాకు తోడ్పడు."[307]

లాంటి కీలక సమయంలో ఈ విధేయత నూటికి నూరు శాతం కనబరచాలి. యుద్ధంలో విజయం వరించాలంటే సైనికులు అత్యంత సాహసంతో పోరాడాలి. ఆకలి దప్పికలను, ఇతరత్రా కష్టాలను అత్యంత నిగ్రహంతో సహించాలి. ఈ రెండు విషయాల్లో వారికి శిక్షణ, తర్ఫీదు ఇచ్చే ఉద్దేశ్యంతో తాలూత్ కాలువ ఒడ్డున ఒక పరీక్ష పెట్టాడు. వారిలో నికార్సయిన సహచరులు ఎందరున్నారో ఆయన తెలుసుకోదలిచాడు. కాని వారిలో అధికులు 'జారి'పోయారు. నీరు త్రాగిన వారి సంఖ్యపై వ్యాఖ్యాతల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. నీరు త్రాగకుండా ఉన్నవారు మాత్రం 313 మంది అని తెలియజేయబడింది. బద్ర్ సంగ్రామంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వెంట వచ్చిన సహాబీల సంఖ్యకు ఇది సమానం. వాస్తవం అల్లాహ్‌కే ఎరుక.

306. శత్రుసైన్యం భారీ సంఖ్యలో ఉండటం చూసి తొలుత ముస్లిం సేనలు భయందోళన చెందాయి. ఈ రోజు శత్రువును ఎదుర్కొనే సత్తువ తమలో లేదని చెప్పటానికి ముఖ్య కారణం ఇదే. కాని వారిలోని విజ్ఞులు, జ్ఞానులు, స్థితప్రజ్ఞులు మాత్రం తొణకలేదు. జయాపజయాలు కేవలం సంఖ్యాబలంపై, ఆయుధసంపత్తిపై ఆధారపడిలేవనీ, వాస్తవానికి అవి దైవప్రణాళిక, దైవాజ్ఞకు లోబడి ఉంటాయని వారికి తెలుసు. అల్లాహ్

فَهَزَمُوهُم بِإِذْنِ ٱللَّهِ وَقَتَلَ دَاوُۥدُ جَالُوتَ وَءَاتَىٰهُ ٱللَّهُ ٱلْمُلْكَ
وَٱلْحِكْمَةَ وَعَلَّمَهُۥ مِمَّا يَشَآءُ ۗ وَلَوْلَا دَفْعُ ٱللَّهِ ٱلنَّاسَ

**251** కడకు అల్లాహ్ అనుజ్ఞతో వారు (జాలూత్ సైన్యాన్ని) ఓడించారు. దావూద్ జాలూత్‌ను సంహరించాడు.[308] మరి అల్లాహ్ దావూద్‌కు రాజ్యాధికారాన్నీ, వివేచననూ ఒసగాడు.[309] ఇంకా, తాను కోరినంత జ్ఞానాన్ని కూడా ఆయనకు ప్రసాదించాడు. అల్లాహ్ గనక కొందరిని

తమకు ఆదరువుగా నిలవాలని అభిలషించేవారు మొక్కవోని సాహసాన్ని, స్థయిర్యాన్నీ చూపాలి.

307. **జాలూత్ :** అమాలిఖా జాతివారైన శత్రుసేనలకు అధిపతి. తాలూత్ మరియు అతని సహచరులు అతన్ని ఎదుర్కోవలసిన తరుణం ఆసన్నమయింది. జాలూత్ సైన్యం యుద్ధపిపాస కలది. పోరాటాలే ఊపిరిగా జీవించే జాతి అది. ఆ సైన్యానికున్న పేరు ప్రతిష్ఠల దృష్ట్యా విశ్వాస సేనలు కొంచెం భయపడ్డాయి. కాని తీరా యుద్ధం మొదలయ్యే ముందు, అవిశ్వాస సేనలకు ప్రతిగా తమకు సహన స్థయిర్యాలను వొసగమనీ, విజయాన్ని చేకూర్చమని వారు దైవాన్ని దీనాతిదీనంగా అర్థించారు. తమ వద్ద ఎన్ని యుద్ధ మెళకువలు ఉన్నా, సాధనసంపత్తులున్నా ఇలాంటి కీలక తరుణంలో విశ్వాసులు దైవ సహాయం కోసం ప్రత్యేకంగా మొరపెట్టుకోవటం అవసరం. బద్ర్ రణరంగంలో కూడా మహాప్రవక్త (సఅసం) ఈ విధంగానే అల్లాహ్‌ను వేడుకున్నారు. అల్లాహ్ ఆయన (స) వేడుకోలుకు ఆమోదముద్ర వేశాడు. గుప్పెడు మంది ముస్లిం సేనలకు అవిశ్వాసుల భారీ సైన్యంపై అపురూపమైన విజయాన్ని వొసగాడు.

308. అప్పటికి హజ్రత్ దావూద్ దైవప్రవక్తగా గానీ, చక్రవర్తిగా గానీ నియుక్తులు కాలేదు. తాలూత్ సైన్యంలో ఒక సాధారణ సిపాయిగానే ఆయన పోరాడారు. అయితే అల్లాహ్ ఆయన చేతుల మీదుగా జాలూత్ కథను కంచికి చేర్చాడు. అంతేకాదు, ఒక చిన్న సైనిక వర్గం ద్వారా భూమిలో చెలరేగిపోతున్న ఒక పెద్ద సైనిక వర్గాన్ని చిత్తుగా ఓడించాడు.

309. ఆ తరువాత అల్లాహ్ రాజ్యాధికారంతో పాటు, ప్రవక్త పదవి (నబువ్వత్) బాధ్యతను కూడా ఆయనకు ప్రసాదించాడు. ఇక్కడ 'హిక్మత్' అనే పదం ప్రయోగించబడింది. హిక్మత్ అంటే నబువ్వత్ అని కొందరు, లోహపు వస్తువుల తయారీలో నైపుణ్యం అని మరికొందరు అభిప్రాయపడ్డారు. హిక్మత్ అంటే ఆ యుద్ధ సమయంలో కొన్ని విషయాల్లో ఆయన కనబరచిన అవగాహనా ప్రతిభ అనీ, అల్లాహ్ అభీష్టం మరియు అల్లాహ్ సంకల్పంతో అవి ఆయన అనుకున్నట్టుగానే జరిగిపోయాయని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.

بَعْضَهُمْ بِبَعْضٍ لَّفَسَدَتِ الْأَرْضُ وَلَٰكِنَّ اللَّهَ
ذُو فَضْلٍ عَلَى الْعَالَمِينَ ﴿٢٥١﴾

మరికొందరి ద్వారా ఈ విధంగా తొలగించకపోతే భువిలో కల్లోలం రేకెత్తి ఉండేది. కాని అల్లాహ్ లోకవాసులపై ఎంతో దయానుగ్రహం కలవాడు.[310]

تِلْكَ آيَاتُ اللَّهِ نَتْلُوهَا عَلَيْكَ بِالْحَقِّ ۚ وَإِنَّكَ لَمِنَ
الْمُرْسَلِينَ ﴿٢٥٢﴾

**252** ఇవి అల్లాహ్ ఆయతులు. వీటిని మేము సత్యబద్ధంగా నీకు వినిపిస్తు న్నాము. (ఓ ముహమ్మద్!) నిస్సందేహంగా నువ్వు దైవసందేశహరులలోని[311] వాడవు.

تِلْكَ الرُّسُلُ فَضَّلْنَا بَعْضَهُمْ عَلَىٰ بَعْضٍ ۘ مِّنْهُم
مَّن كَلَّمَ اللَّهُ ۖ وَرَفَعَ بَعْضَهُمْ دَرَجَاتٍ ۚ وَآتَيْنَا عِيسَى ابْنَ
مَرْيَمَ الْبَيِّنَاتِ وَأَيَّدْنَاهُ بِرُوحِ الْقُدُسِ ۗ وَلَوْ شَاءَ اللَّهُ مَا اقْتَتَلَ

**253** వీరు దైవప్రవక్తలు. వీరిలో కొందరికి మరికొందరిపై మేము ప్రాధాన్యతను వొసగాము.[312] వీరిలో కొందరితో అల్లాహ్ సంభాషించాడు. కొందరి

310. ఈ వాక్యంలో దేవుని విధానం ఎటువంటిదో వివరించబడింది. దీని ప్రకారం ఆయన మానవుల్లోని ఒక వర్గం ద్వారా మరో వర్గపు దౌర్జన్యాన్ని, దాని దురాక్రమణను తుదముట్టిస్తూ ఉంటాడు. లేదా ఒక వర్గం ద్వారా మరో వర్గాన్ని అధికార స్థానాల నుంచి తొలగిస్తాడు. అలా జరగకపోతే – ఏదో ఒక వర్గం మాత్రమే కుర్చీలను అంటిపెట్టుకుని ఉంటే – ఆ వర్గం తన అధికార బలంతో భూమిలో చెలరేగిపోతుంది. దోపిడీ దౌర్జన్యాలు మితిమీరిపోతాయి. అందుకే ఈ దైవశాసనాన్ని లోకవాసుల పాలిట దేవుని మహదానుగ్రహంగా తలపోయాలి. దీనిగురించి అల్లాహ్ హజ్ సూరాలోని 38వ ఆయతులోనూ, 40వ ఆయతులోనూ విశదీకరించాడు.

311. ఈ గత కాలపు సంఘటనలు మీపై అవతరింపజేయబడే గ్రంథం ద్వారా లోకానికి తెలిసివస్తున్నాయి. కనుక ఓ ముహమ్మద్ (స), మీకు అందజేయబడే దైవసందేశం సత్యానికి ప్రతీక! ఎందుకంటే మీరు ఈ విషయాలను ఏదేని గ్రంథంలో చదవటమో, ఎవరి ద్వారానయినా వినటమో జరగలేదు. దీనిద్వారా విదితమయ్యే దేమిటంటే ఇవి ముమ్మాటికీ దైవం తరఫున మీపై అవతరింపజెయ్యబడే అగోచర విషయాలు. దివ్య ఖుర్ఆన్‌లో పెక్కుచోట్ల గతకాలపు ఘటనలను మహాప్రవక్త (సఅసం) వారి దైవదౌత్యానికి ప్రబల నిదర్శనాలుగా సమర్పించటం జరిగింది.

312. ఈ విషయాన్ని అల్లాహ్ ఇతరచోట్ల కూడా ప్రస్తావించాడు. ఉదాహరణకు : "మేము కొంతమంది ప్రవక్తలకు మరికొంతమందిపై ప్రాధాన్యతను వొసగాము" (బనీ ఇస్రాయీల్ – 55). ఈ వాస్తవంలో ఎలాంటి సందేహానికి ఆస్కారం లేదు. అయితే

تَرَكَتُولَنَو ...

الَّذِينَ مِنْ بَعْدِهِمْ مِنْ بَعْدِ مَا جَاءَتْهُمُ الْبَيِّنَاتُ وَلَٰكِنِ اخْتَلَفُوا فَمِنْهُمْ مَنْ آمَنَ وَمِنْهُمْ مَنْ كَفَرَ ۚ وَلَوْ شَاءَ اللَّهُ مَا اقْتَتَلُوا وَلَٰكِنَّ اللَّهَ يَفْعَلُ مَا يُرِيدُ ﴿٢٥٣﴾

తరగతులను ఉన్నతం చేశాడు. ఇంకా మేము మర్యమ్ కుమారుడగు ఈసాకు స్పష్టమైన సూచనలు ప్రసాదించాము. పరిశుద్ధాత్మ ద్వారా అతనికి తోడ్పాటునందించాము.[313] ఒకవేళ అల్లాహ్‌యే గనక తలిస్తే వీరి తరువాత స్పష్టమయిన నిదర్శనాలు చూసిన ప్రజలు పరస్పరం తగవులాడుకునే వారు కాదు. కాని వారు విభేదాల్లో పడిపోయారు. వారిలో కొందరు విశ్వసించగా, మరి కొందరు అవిశ్వాసులుగా ఉండిపోయారు. అల్లాహ్ గనక కోరితే వీరు పరస్పరం కలహించుకునే వారు కారు.[314] కాని అల్లాహ్ మాత్రం తాను తలచిందే చేస్తాడు.

మహాప్రవక్త (సఅసం) వారు తన సహచరులనుద్దేశించి, "మీరు ప్రవక్తల మధ్య నాకు ప్రత్యేకతను ఇవ్వకండి" అని అన్నారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఫజాయెల్). ఈ ప్రబోధనం ఒకరికి మరొకరిపై ఇవ్వబడిన శ్రేష్ఠతను త్రోసిపుచ్చటం లేదు. కాకపోతే దైవప్రవక్తల ఆదరాభిమానాలలో, మర్యాదలో ఎలాంటి లోటు రానివ్వకూడదన్న తాకీదు ఇందులో ఇమిడి ఉంది. దేవుడు కొందరికి మరికొందరిపై ప్రాధాన్యతను ప్రసాదించాడంటే ఏ కారణంగా ప్రసాదించాడో మీకు తెలియదు. కాబట్టి మీరు నా ప్రాముఖ్యతను గురించి చెప్పినప్పుడు ఇతర ప్రవక్తలకు గల ఘనత, మర్యాదకు ఏమాత్రం విఘాతం కలగకూడదు. నిజానికి ఎవరి ప్రత్యేకత వారిది. మరి ప్రవక్తలందరిపై అంతిమ దైవప్రవక్త (స)కు శ్రేష్ఠత నొసగబడిన విషయం కూడా తిరుగులేని సత్యమే. అహ్లె సున్నత్ వారందరూ ఈ విషయాన్ని ఏకాభిప్రాయంతో విశ్వసిస్తారు. ఈ విషయానికి ఖుర్ఆన్ హదీసుల ద్వారా కూడా రుజువులున్నాయి. (వివరాల కోసం ఫత్‌హుల్ ఖదీర్‌లో అల్లామా షౌకానీ వ్యాఖ్యానం చూడండి).

313. హజ్రత్ ఈసా (అలైహిస్సలాం) కు ఇవ్వబడిన మహిమల గురించి ఇక్కడ ప్రస్తావించటం జరిగింది. ఉదాహరణకు : ఆయన మృతులను సజీవులుగా చేయటం. ఆలి ఇమ్రాన్ సూరాలో ఈ వివరాలు వస్తాయి. పరిశుద్ధాత్మ అంటే హజ్రత్ జిబ్రీల్ అని భావం.

314. ఈ అంశాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ఉదాహరించాడు. దేవుడు అవతరింపజేసిన ధర్మంలో విభేదాలు, వైమనస్యాలు పొడసూపాలన్నది దేవుని అభిమతం అని దీని భావం ఎంతమాత్రం కాదు. నిజానికి వైమనస్యాన్ని ఆయన

**254** ఓ విశ్వాసులారా! వ్యాపార లావాదేవీలుగానీ, స్నేహబంధాలుగానీ, సిఫార్సులుగానీ[315] ఉండని ఆ రోజు రాకముందే మేము మీకు ప్రసాదించిన దానిలో నుంచి ఖర్చుచేయండి. వాస్తవానికి తిరస్కారులే దుర్మార్గులు.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓا۟ أَنفِقُوا۟ مِمَّا رَزَقْنَٰكُم مِّن قَبْلِ أَن
يَأْتِىَ يَوْمٌ لَّا بَيْعٌ فِيهِ وَلَا خُلَّةٌ وَلَا شَفَٰعَةٌ ۗ وَٱلْكَٰفِرُونَ
هُمُ ٱلظَّٰلِمُونَ ﴿٢٥٤﴾

సుతరామూ ఇష్టపడడు. తాను సమ్మతించి ఆమోదించిన జీవనధర్మాన్ని మానవులంతా అవలంబించి వారు నరకాగ్నికి ఆహుతి కాకుండా ఉండాలన్నదే ఆయన అభీష్టం. అందుకే ఆయన తన గ్రంథాలను అవతరింపజేశాడు. తన సందేశహరులను పంపించాడు. ఈ సందేశ పరంపరను ముహమ్మద్ (సఅసం)పై పరిసమాప్తం చేశాడు. అయితే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) తదనంతరం కూడా ఖలీఫాల ద్వారా, సజ్జనులైన విద్వాంసుల ద్వారా మంచిని పెంపొందించే, చెడులను నిర్మూలించే సందేశప్రధాన కార్యక్రమం కొనసాగింపబడింది. ఈ సందేశ కార్యాన్ని తరం తరం... నిరంతరం చేస్తూ ఉండాలని గట్టిగా తాకీదు చేయటం కూడా జరిగింది. ఎందుకు? ఎందుకంటే దైవం సమ్మతించిన జీవన ధర్మాన్ని ప్రజలందరూ అవలంబించి దైవప్రసన్నతను చూరగొనాలని! అయితే ఆయన ఈ జగతిలో సన్మార్గంతో పాటు అపమార్గాన్ని కూడా ఉంచి, ఆ రెండు మార్గాల పర్యవసానాన్ని కూడా విడమరచి చెప్పి మనిషికి ఆ రెంటిలో ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించాడు. అంటే ఆయన మనిషిని పరీక్షించదలిచాడు. ఆయనే గనక తలచుకుంటే తన దాసులైన మానవులందరూ తన సన్నిధిలో మోకరిల్లేలా చేసుకునేవాడే. ఒకవేళ ఆయన అలా చేసివుంటే, మనిషి సంకల్పానికీ, అతని స్వేచ్ఛాధికారానికి విలువ, అర్థం లేకుండా పోయేవి. ఇప్పుడు అల్లాహ్ చూసేది ఒక్కటే – తనకివ్వబడిన స్వేచ్ఛాధికారాన్ని ఎంతమంది సద్వినియోగం చేస్తారు? మరెంతమంది దుర్వినియోగపరచుకుని దైవధిక్కారులుగా మిగిలిపోతారు? ఇదే అసలు పరీక్ష. దేవుని ప్రణాళికకు, యుక్తికి లోబడి ఈ పరీక్ష పెట్టబడుతోంది.

315. ఈ ఆయతు ద్వారా సిఫార్సు వాస్తవికత ముందుకు వచ్చింది. ఒకప్పుడు యూదులు, క్రైస్తవులు, తిరస్కారులు, ముష్రిక్కులు దీనిపై చాలా ధీమా వ్యక్తం చేశారు. వారు తమ తమ మత పెద్దలను – అంటే ప్రవక్తలను, వలీలను, సజ్జనులను, పీర్లను, ముర్షిదులను ప్రస్తావిస్తూ వారికి దైవ సమక్షంలో గొప్ప పలుకుబడి ఉందనీ, వారు ఆ పలుకుబడిని ఉపయోగించి తమ అనుయాయుల కోసం కోరిందల్లా మంజూరు చేయించుకుంటారని ప్రగాఢంగా విశ్వసిస్తారు. దాన్నే వారు షిఫాఅత్‌గా వ్యవహరించే వారు. నేటి అజ్ఞానులు చెబుతున్న మాటలనే ఆనాడు సత్యతిరస్కారులూ చెప్పేవారు.

**255** అల్లాహ్ (మాత్రమే నిజానికి ఆరాధ్య దైవం). ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేనే లేడు. ఆయన సజీవుడు; అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునుకుగానీ, నిద్రగానీ పట్టదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగల వాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనుక ఉన్నదానిని కూడా ఆయన ఎరుగు. ఆయన కోరినది తప్ప ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్య పరిధిలోకి రాదు.[316] ఆయన

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَۚ اَلْحَیُّ الْقَیُّوْمُ ۚ لَا تَاْخُذُهٗ سِنَةٌ وَّلَا نَوْمٌ ؕ
لَهٗ مَا فِی السَّمٰوٰتِ وَمَا فِی الْاَرْضِ ؕ مَنْ ذَا الَّذِیْ یَشْفَعُ
عِنْدَهٗۤ اِلَّا بِاِذْنِهٖ ؕ یَعْلَمُ مَا بَیْنَ اَیْدِیْهِمْ وَمَا خَلْفَهُمْ ۚ
وَلَا یُحِیْطُوْنَ بِشَیْءٍ مِّنْ عِلْمِهٖۤ اِلَّا بِمَا شَآءَ ۚ وَسِعَ كُرْسِیُّهُ

తమ మత పెద్దలు అల్లాహ్ దర్బారులో హఠం చేసి మరీ తమ డిమాండ్లు సాధిస్తారన్నది వారి ఉద్దేశ్యం. కాని దైవసమక్షంలో ఇలాంటి సిఫార్సులకు ఎలాంటి అవకాశమూ లేదని ఈ వాక్యంలో నిర్ద్వంద్వంగా చెప్పేయబడింది.

ఆ తరువాత ఆయతుల్ కుర్సీ ద్వారా, ఇతర వాక్యాల ద్వారా కూడా ఎటువంటి సిఫార్సులను అల్లాహ్ సమ్మతిస్తాడో విశదీకరించటం జరిగింది. అయితే ఆ సిఫార్సు కూడా అందరూ చేయలేరు. అల్లాహ్ అనుమతించినవారు మాత్రమే సిఫార్సు చేయగల్గుతారు. అల్లాహ్ అనుమతించిన వారి కోసం మాత్రమే సిఫార్సు చేయగలరు. మరి అల్లాహ్ అనుమతించేది ఎవరికోసం అంటే సమాధానం ఒక్కటే – ఏక దైవారాధకుల కోసం! ఈ సిఫార్సును దైవదూతలు, దైవప్రవక్తలు కూడా చేస్తారు. అమరగతులకు, సజ్జనులకు కూడా ఈ అవకాశం ఇవ్వబడుతుంది. అయితే వీరిలో ఎవరూ అల్లాహ్‌పై ఎలాంటి ఒత్తిడీ తీసుకురాలేరు. పైగా వీరంతా ఆ సమయంలో అల్లాహ్ భయంతో గజగజా వణికిపోతూ ఉంటారు. వారి ముఖ కవళికలు మారిపోతుంటాయి. "అల్లాహ్ ఇష్టపడినవారి కోసమే వారు సిఫార్సు చేయగలుగుతారు. దైవభీతితో వారు కంపిస్తూ ఉంటారు" (అంబియా – 28).

316. ఇది ఆయతుల్ కుర్సీ. దీని శ్రేష్ఠత, మహిమ గురించి ప్రామాణిక హదీసులలో వచ్చింది. ఉదాహరణకు: ఈ ఆయతు దివ్య ఖుర్‌ఆన్‌లోని ఘనమైన ఆయతు. దీన్ని పారాయణం చేయటం వల్ల రాత్రిపూట షైతాన్ కీడునుంచి రక్షణ లభిస్తుంది. ప్రతి ఫర్జ్ నమాజ్ అనంతరం ఈ ఆయతుల్ కుర్సీని పఠించటం పుణ్యప్రదం (తఫ్సీర్ ఇబ్నె కసీర్).

السَّمٰوٰتِ وَالْاَرْضَ ۚ وَلَا يَـُٔوْدُهٗ حِفْظُهُمَا ۚ وَهُوَ
الْعَلِيُّ الْعَظِيْمُ ﴿٢٥٥﴾

కుర్చీ వైశాల్యం[317] భూమ్యాకాశాలను పరివేష్ఠించి ఉంది. వాటిని రక్షించటానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు.

لَآ اِكْرَاهَ فِي الدِّيْنِ ۣۙ قَدْ تَّبَيَّنَ الرُّشْدُ مِنَ الْغَيِّ ۚ فَمَنْ يَّكْفُرْ
بِالطَّاغُوْتِ وَيُؤْمِنْ بِاللّٰهِ فَقَدِ اسْتَمْسَكَ بِالْعُرْوَةِ
الْوُثْقٰى ۤ لَا انْفِصَامَ لَهَا ۭ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ﴿٢٥٦﴾

**256** ధర్మం విషయంలో బలవంతం ఏమీ లేదు. సన్మార్గం అపమార్గం నుంచి ప్రస్ఫుటమయ్యింది.[318] కనుక ఎవరయితే అల్లాహ్ తప్ప వేరితర ఆరాధ్యులను (తాగూత్‌ను) తిరస్కరించి అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తారో వారు దృఢమైన కడియాన్ని పట్టుకున్నారు. అది ఎన్నటికీ తెగదు. అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం తెలిసినవాడు.

---

ఇది అల్లాహ్ యొక్క శాసించే గుణాన్ని, ఆయన వైభవాన్ని, శక్తియుక్తులను అభివర్ణించే ఆయతు.

317. **'కుర్సీ'** అంటే అడుగు పెట్టే స్థలమని కొందరూ, జ్ఞానం అని కొందరు, దైవశక్తి అని మరికొందరు, రాజ్యాధికారం అని ఇంకొందరు, 'అర్ష్' అని కొందరు అభిప్రాయపడ్డారు. అయితే దేవుని గుణగణాల విషయంలో ఖుర్ఆన్ హదీసులు ఏమిచెప్పినా దానిపై స్వంత అభిప్రాయాలు, వర్ణనలు జొప్పించేబదులు యథాతథంగా వాటిని విశ్వసించటం సరైన విధానం. హదీసువేత్తల, సలఫ్‌ల విధానం కూడా ఇదే. కాబట్టి దీన్ని 'కుర్సీ'గానే నమ్మాలి. అర్ష్ వేరు, కుర్సీ వేరు. అది ఎలా ఉంటుంది? దానిపై ఆయన ఎలా ఆసీనుడవుతాడు?? అనే విషయం వర్ణనాతీతం. ఎందుకంటే ఆ విషయ పరిజ్ఞానం మనకు లేదు.

318. ఈ ఆయతు ఏ నేపథ్యంలో అవతరించిందనేది గమనించదగింది. అన్సార్ వర్గానికి చెందిన కొంతమంది యువకులు యూదులుగానో, క్రైస్తవులుగానో మారిపోయారు. తరువాత కొంత కాలానికి వీళ్లు ఇస్లాం స్వీకరించి, యూదులుగానో, క్రైస్తవులుగానో ఉన్న తమ నవ తరాన్ని కూడా ఇస్లాం పుచ్చుకోమని బలవంతం చేయసాగారు. అప్పుడు ఈ దైవవాక్కు అవతరించింది. అవతరణా పూర్వరంగం దృష్ట్యా కొంతమంది విద్వాంసులు ఈ ఆయతును కేవలం గ్రంథవహులను దృష్టిలో పెట్టుకుని వచ్చిందని అన్నారు. అంటే ముస్లిం రాజ్యంలో నివసించే గ్రంథవహులు గనక 'జిజ్‌యా'ను చెల్లిస్తూ ఉన్న పక్షంలో, ఇస్లాం స్వీకరించండి అని వారిపై ఒత్తిడి తీసుకురావటం జరగదు.

**257** విశ్వసించిన వారి సంరక్షకునిగా స్వయంగా అల్లాహ్ ఉంటాడు. ఆయన వారిని చీకట్లనుంచి వెలుగు వైపుకు తీసుకుపోతాడు. కాగా; అవిశ్వాసుల నేస్తాలు షైతానులే (తాగూతే). వాళ్లు వారిని వెలుగునుంచి చీకట్ల వైపుకు లాక్కుపోతారు. వారు నరకవాసులు, కలకాలం అందులోనే పడి ఉంటారు.

اَللّٰهُ وَلِيُّ الَّذِيْنَ اٰمَنُوْا يُخْرِجُهُمْ مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوْرِ ؕ وَالَّذِيْنَ كَفَرُوْۤا اَوْلِيٰٓـئُهُمُ الطَّاغُوْتُ يُخْرِجُوْنَهُمْ مِّنَ النُّوْرِ اِلَى الظُّلُمٰتِ ؕ اُولٰٓـئِكَ اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ ۞

అయితే ఈ ఆయతు 'ఆదేశం' దృష్ట్యా సర్వసాధారణమైనది. అంటే ఏ ఒక్కరిపై కూడా ఇస్లాం స్వీకరించండి అన్న ఒత్తిడి తీసుకురాబడదు. ఎందుకంటే అల్లాహ్ సన్మార్గాన్నీ – అపమార్గాన్ని కూడా స్పష్టంగా మన ముందుంచాడు. అయితే మిధ్యా వాదం మరియు షిర్క్ యొక్క దౌర్జన్యాన్ని, పీడనను అరికట్టడానికి జిహాద్ ఉంది. బలాత్కారంతో దానికి ఎటువంటి సంబంధం లేదు. అల్లాహ్ ధర్మాన్ని ఆచరించటంలో, దాని ప్రచార మార్గంలో అవరోధాలు సృష్టిస్తూ ఉంటే, అట్టి అవరోధాలను తొలగించుకోవటానికి – అనివార్య స్థితిలో – కదనరంగం వైపుకు కదలటమే జిహాద్! ప్రతి వ్యక్తి తన ఇష్టపూర్వకంగా, ఉంటే తన తిరస్కార వైఖరిపైనే నిలకడగా ఉండటానికి లేకపోతే మనస్ఫూర్తిగా ఇస్లాంలోకి ప్రవేశించటానికి మార్గాన్ని సుగమం చెయ్యటమే జిహాద్ (ధర్మయుద్ధం) యొక్క అసలు లక్ష్యం. ఈ మార్గంలో అవరోధంగా నిలిచే శక్తుల్ని తాత్కాలికంగా మన్నించి వదలివేసినా తరువాత అవి ఊరుకోవు. ఉండుండి అడ్డంకుల్ని సృష్టించటం, వేధించటం వంటి చేష్టలకు పాల్పడుతూనే ఉంటాయి. అందుకే అల్లాహ్ జిహాద్‌ను శాశ్వతమైన చర్యగా ఉంచాడు. ప్రళయదినం వరకూ అది ఉంటుంది. "జిహాద్ ప్రళయదినం వరకూ ఉంటుంది" అని హదీసులో ఉంది. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఖుద్దుగా అవిశ్వాసులతో, బహుదైవోపాసకులతో పోరాడారు. ఆయన (స) ఇలా అన్నారు :

"లా యిలాహ ఇల్లల్లాహ్ మరియు ముహమ్మదుర్రసూలుల్లాహ్" (అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడు, ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త) అనే విషయాన్ని ఒప్పుకునే దాకా జనులతో నేను పోరాడుతూనే ఉండాలని నాకు ఆదేశించబడింది" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్).

అలాగే ధర్మభ్రష్టతకు పాల్పడిన వారికి విధించబడే శిక్షకు కూడా ఈ ఆయతు విరుద్ధం కాదు. ధర్మభ్రష్టుడైన వ్యక్తికి మరణ శిక్ష ఉందంటే అది బలవంతంతో ముడిపడిన విషయం కాదు. పైగా అది ఇస్లాం రాజ్యం యొక్క సైద్ధాంతిక స్వరూపాన్ని కాపాడే చర్యలో భాగం. ఒక ముస్లిం రాజ్యంలో ఒక అవిశ్వాసికి తన అవిశ్వాసంపై నిలకడగా

أَلَمْ تَرَ إِلَى الَّذِي حَاجَّ إِبْرَاهِيمَ فِي رَبِّهِ أَنْ آتَاهُ اللَّهُ الْمُلْكَ إِذْ قَالَ إِبْرَاهِيمُ رَبِّيَ الَّذِي يُحْيِي وَيُمِيتُ قَالَ أَنَا أُحْيِي وَأُمِيتُ قَالَ إِبْرَاهِيمُ فَإِنَّ اللَّهَ يَأْتِي بِالشَّمْسِ مِنَ الْمَشْرِقِ فَأْتِ بِهَا مِنَ الْمَغْرِبِ فَبُهِتَ الَّذِي كَفَرَ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الظَّالِمِينَ ﴿٢٥٨﴾

**258** అల్లాహ్ తనకు రాజ్యాధికారం ఇచ్చాడని (గర్వంకొద్ది) ఇబ్రాహీంతో అతని ప్రభువు (ఎవరన్న) విషయంపై గొడవపడిన వానిని నీవు చూడలేదా? "జీవన్మరణాలను ఇచ్చేవాడు నా ప్రభువు" అని ఇబ్రాహీం అన్నప్పుడు, "నేనూ బ్రతికిస్తాను, చంపుతాను" అని అతనన్నాడు. అప్పుడు ఇబ్రాహీం (అలైహిస్సలాం), "సరే! అల్లాహ్ సూర్యుణ్ణి తూర్పు వైపు నుంచి ఉదయింపజేస్తున్నాడు కదా! మరి నువ్వు దాన్ని కాస్త పడమటి వైపు నుంచి ఉదయింపజెయ్యి" అని కోరినప్పుడు ఆ దైవతిరస్కారి బిత్తరపోయాడు. యదార్థ మేమిటంటే అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు.

ఉండేందుకు అనుమతి ఇవ్వవచ్చుగాని ఒకసారి ఇస్లాంలోకి వచ్చిన మీదట, మళ్లీ దాన్నుంచి తిరిగిపోవటానికి, ఇస్లాంపై తిరుగుబాటు చేయటానికి అనుమతి ఇవ్వబడదు. కాబట్టి ఇస్లాంలోకి రాదలచినవాడు బాగా ఆలోచించి, అన్నీ బేరీజు వేసుకుని మరీ రావాలి. ఈ విషయంలో దృఢంగా, ఖచ్చితంగా వ్యవహరించటం చాలా అవసరం. ఎందుకంటే ఈ వ్యవహారంలో గనక మెతక వైఖరి అవలంబిస్తే సైద్ధాంతిక చట్రమే కుప్పకూలిపోతుంది. దాంతో దాని అనుయాయుల్లో సైద్ధాంతిక వ్యాఘాతం, గంద్రగోళస్థితి ఏర్పడతాయి. ఈ అయోమయావస్థ ఇస్లామీయ సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు! తత్కారణంగా దేశంలో శాంతిభద్రతలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఏ విధంగానయితే మనిషికి జీవించే హక్కు ఉందని చెప్పి రాజ్యంలో హత్యాకాండను, దొంగతనాన్ని, వ్యభిచారాన్ని, దోపిడీని అనుమతించటం జరగదో అదేవిధంగా భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట ఒక ఇస్లామీయ వ్యవస్థలో సైద్ధాంతిక తిరుగుబాటు (ఇర్తిదాద్) కు కూడా అనుమతించటం జరగదు. ఇది 'లా ఇక్రాహ' పరిధిలోకి రాదు. ఒక రాజ్యంలో నరమేధాన్ని సృష్టించి, ప్రజా జీవితాల్లో అరాచకాన్ని రేపే వారికి మరణ దండన విధించటం ఎలా న్యాయమో, ఒక సైద్ధాంతిక సమాజంలో ధర్మభ్రష్టతకు పాల్పడి ప్రజల ధర్మపథాన్నే ప్రశ్నార్థకంగా నిలబెట్టిన వ్యక్తిని తుదముట్టించటం కూడా అలాగే న్యాయం. రాజ్యాన్ని అరాచకం అవ్యవస్థల నుండి కాపాడటం మొదటిదాని లక్ష్యమైతే, రాజ్యంలోని సైద్ధాంతిక స్వభావ

**259** లేదా ఇండ్లకప్పులు కూలి తలక్రిందులుగా పడివున్న పట్టణం మీదుగా పోయిన వాడు; (అతనిని నీవు చూడ లేదా?) "దీని చావు తరువాత అల్లాహ్ తిరిగి దీనికి ఎలా ప్రాణం పోస్తాడు?"[319] అని ఆ వ్యక్తి ఆశ్చర్యపోయినప్పుడు అల్లాహ్ అతన్ని చంపి నూరేళ్ళవరకు మరణస్థితిలో ఉంచాడు. తరువాత అతన్ని లేపి, "ఈ స్థితిలో నువ్వు ఎంతకాలం ఉన్నావు?" అని అడిగాడు. "మహా అయితే ఒక రోజు లేక ఒక రోజులో కొంత భాగం"[320] అని

أَوْ كَالَّذِي مَرَّ عَلَىٰ قَرْيَةٍ وَهِيَ خَاوِيَةٌ عَلَىٰ عُرُوشِهَا قَالَ أَنَّىٰ يُحْيِي هَٰذِهِ اللَّهُ بَعْدَ مَوْتِهَا ۖ فَأَمَاتَهُ اللَّهُ

స్వరూపాలకు విఘాతం కలగకుండా జాగ్రత్తపడటం రెండోదాని లక్ష్యం. ఈ రెండు ఉద్దేశ్యాలూ ఒక రాజ్యం కోసం అనివార్యమే. ఈనాడు ముస్లిం దేశాలు ఈ రెండు ఆశయాలను ఉపేక్షించినందుకు చెల్లించుకుంటున్న మూల్యం అంతా యింతా కాదు. వాటి దైనందిన సమస్యలకు, ఆందోళనాభరితమైన స్థితిగతులకు మూల కారణం ఇదే కదా!

319. మూలంలో **'అవ్‌కల్లజీ'** అనే పదం వచ్చింది. అవ్‌కల్లజీ అంటే "లేక అతను" అని అర్థం. ఈ పదం రాబోయే సంఘటనను ఇంతకు ముందు పేర్కొనబడిన సంఘటనతో అనుసంధానం చేస్తున్నది. (ఇంతకు ముందు చెప్పబడిన సంఘటన మాదిరిగానే) నీవు నేలమట్టం అయిన నగరం గుండా వెళ్ళిన వ్యక్తి సంఘటన గురించి ఆలోచించలేదా? అని దాని భావం. నేలమట్టం అయివున్న ఆ నగరం గుండా వెళ్ళిన వ్యక్తి ఎవరు? దీనిపై విభిన్న కథనాలు ఉన్నాయి. హజ్రత్ ఉజైర్ పేరు ఈ సందర్భంగా బాగా ప్రసిద్ధిచెందింది. కొంతమంది ప్రవక్త సహచరులు, వారి శిష్యులు కూడా దీనిని సమర్థించారు. యదార్థం అల్లాహ్‌కే తెలుసు. దీనికి ముందు వచ్చిన వాక్యంలో (హజ్రత్ ఇబ్రాహీం – నమ్రూద్‌ల సంఘటనలో) "దేవుడున్నాడు. ఆయన ఉనికి సత్యం" అని చెప్పటం జరిగింది. మరి ఈ వాక్యంలో దేవుని అద్భుతాలు, శక్తులు వివరించబడ్డాయి. నూరేళ్ళ తరువాత అల్లాహ్ ఆ వ్యక్తిని, అతని గాడిదను తిరిగి బ్రతికించాడు. నూరేళ్లు గడచినా భోజనపదార్థాలు కుళ్ళిపోకుండా కాపాడాడు. ప్రపంచంలో మన ముందు ఒక దృష్టాంతంగా ఈ పనిచేసిన అల్లాహ్‌యే ప్రళయదినాన సమస్త మానవులను తిరిగి లేపుతాడు. నూరేళ్ల తరువాత పునరుజ్జీవనం చేసినవాడు వేనవేల సంవత్సరాల తరువాత మాత్రం పునరుద్ధరించలేడా?

320. ఆ వ్యక్తి మరణించినపుడు కాస్త పొద్దెక్కిందనీ, లేపి నిలబెట్టబడినపుడు ఇంకా

مِائَةَ عَامٍ ثُمَّ بَعَثَهُ قَالَ كَمْ لَبِثْتَ قَالَ لَبِثْتُ يَوْمًا أَوْ بَعْضَ يَوْمٍ قَالَ بَلْ لَبِثْتَ مِائَةَ عَامٍ فَانْظُرْ إِلَىٰ طَعَامِكَ وَشَرَابِكَ لَمْ يَتَسَنَّهْ وَانْظُرْ إِلَىٰ حِمَارِكَ وَلِنَجْعَلَكَ آيَةً لِلنَّاسِ وَانْظُرْ إِلَى الْعِظَامِ كَيْفَ نُنْشِزُهَا ثُمَّ نَكْسُوهَا لَحْمًا فَلَمَّا تَبَيَّنَ لَهُ قَالَ أَعْلَمُ أَنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿٢٥٩﴾

అతను బదులిచ్చాడు. “లేదు. నువ్వు నూరేళ్ళు ఈ స్థితిలో పడిఉన్నావు. కాస్త నీ అన్నపానీయాల వైపు చూడు. అవి ఏమాత్రం చెడిపోలేదు. మరి నీ గాడిదను కూడా చూసుకో. మేము నిన్ను ప్రజల కోసం ఒక నిదర్శనంగా చేయదలిచాము. మేము (గాడిద) ఎముకలను ఏవిధంగా లేపి, వాటిపై మాంసం నింపుతామో చూడు! ఇదంతా ప్రస్ఫుటమయి పోయాక, “అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడని నాకు తెలుసు”[321] అని అన్నాడతను.

وَإِذْ قَالَ إِبْرَاهِيمُ رَبِّ أَرِنِي كَيْفَ تُحْيِي الْمَوْتَىٰ قَالَ أَوَلَمْ تُؤْمِنْ قَالَ بَلَىٰ وَلَٰكِنْ لِيَطْمَئِنَّ قَلْبِي قَالَ فَخُذْ أَرْبَعَةً مِنَ الطَّيْرِ فَصُرْهُنَّ إِلَيْكَ ثُمَّ اجْعَلْ عَلَىٰ كُلِّ جَبَلٍ مِنْهُنَّ

**260** (మరొక సంఘటన) “ఓ ప్రభూ! నీవు మృతులను ఎలా బ్రతికిస్తావో కాస్త నాకు చూపవా?” అని ఇబ్రాహీం విన్నవించుకున్నప్పుడు, “నీకు నమ్మకం లేదా?” అని దేవుని తరఫున సెలవీయ బడింది. “ఎందుకు లేదు?! (నాకు పూర్తి నమ్మకం ఉంది. కాకపోతే) ఆత్మ తృప్తికై ఇలా అడిగాను” అని అతనన్నాడు. అప్పుడు అల్లాహ్ “నాలుగు పక్షులను తీసుకో. వాటిని మచ్చిక చేసుకో. (వాటిని కోసి ముక్కలు ముక్కలుగా చెయ్యి).

పొద్దుగూకలేదని చెప్పబడుతుంది. దాన్నిబట్టి అతనేమని ఊహించాడంటే ఒకవేళ తాను నిన్న యిక్కడికి వచ్చి ఉంటే ఒక రోజు గడచి ఉంటుంది. లేక ఈ రోజే ఇది జరిగి ఉంటే బహుశా కొన్ని గంటల క్రితం జరిగి ఉంటుంది. మరి చూడబోతే ఈ సంఘటన జరిగి నూరేళ్ళు నిండాయి.

321. అంటే నాకు ముందునుంచీ నమ్మకముంది. కాకపోతే ఈ అనుభవం ద్వారా నా నమ్మకం మరింత బలపడింది. నా జ్ఞానం కూడా పెరిగింది అన్నది ఆ వ్యక్తి మాటల ఉద్దేశం.

جُزْءًا ثُمَّ ادْعُهُنَّ يَأْتِينَكَ سَعْيًا ۚ وَاعْلَمْ أَنَّ اللَّهَ عَزِيزٌ حَكِيمٌ ﴿٢٦٠﴾

తరువాత ఒక్కో పర్వతంపై దాని ఒక్కో (మాంసపు) ముక్కను ఉంచు. ఆపైన వాటిని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి.[322] అల్లాహ్ సర్వశక్తిమంతుడు, వివేకవంతుడన్న సంగతిని బాగా తెలుసుకో" అని అన్నాడు.

322. మృతులను బ్రతికించటానికి సంబంధించిన ఇంకొక సంఘటన ఇది. ఏకదైవోపాసనలో ఎంతో నికార్సయిన దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కోరికపై, ఆయన ఆత్మ తృప్తి కోసం ఈ దృశ్యం చూపబడింది. ఇంతకీ ఆ నాలుగు పక్షులు ఏవేవి? ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అనేకపేర్లు ప్రస్తావించారు. ఆ పేర్ల నిర్ధారణ వల్ల కలిగే ప్రయోజనం ఏమీ లేదు. అందుకే అల్లాహ్ కూడా వాటి పేర్లను తెలుపలేదు. అయితే అవి వేర్వేరు జాతులకు చెందిన పక్షులు. దైవాదేశానుసారం ఇబ్రాహీం (అలైహిస్సలాం) నాలుగు పక్షులను సేకరించి, వాటిని మచ్చిక చేసుకున్నారు. మచ్చిక చేసుకోవడానికి కారణం, తరువాత ఆ పక్షులను సరిగ్గా గుర్తుపట్టాలన్నదే. వాటిని కోసిన పిదప వాటి భాగాలను నాలుగు కొండలపై ఉంచారాయన. వాటిని పిలువగానే అవి పరుగెత్తుకుంటూ ఆయన వద్దకు వచ్చాయి. **'ఫసుర్హున్న ఇలైక'**కు ఒక అనువాదం **"అమిల్హున్న"** అని చేయటం జరిగింది. 'అమిల్హున్న' అంటే వాటిని మచ్చిక చేసుకో అని అర్థం. ఆ విధంగా మచ్చిక చేసుకోవటం మూలంగా అవి తిరిగి బ్రతికిన తర్వాత సులభంగా వాటిని గుర్తుపట్టవచ్చు, అప్పుడు ఈ పక్షులు నీవు మచ్చిక చేసుకున్నవేనని నీకు బాగా నమ్మకం కలుగుతుంది, ఇక వాటి గురించి నీకు ఎలాంటి అనుమానాలూ ఉండవు అని దాని భావం. ఈ భావం గనక తీసుకుంటే 'ఫసుర్హున్న' తర్వాత **'సుమ్మ ఖత్తీహున్న'** (అనంతరం వాటిని ముక్కలు ముక్కలుగా కోయి) అనే మాట మార్జితము (మహ్జూఫ్)గా ఉన్నట్లు భావించవలసి ఉంటుంది.

అయితే 'ఫసుర్హున్న' అనే పదానికి 'ఖత్తీహున్న' (ముక్కలు ముక్కలుగా కోయి) అనే మరో అర్థం కూడా చెప్పబడింది. ఈ అర్థాన్ని తీసుకుంటే ఇక ఏ సమస్యా ఉండదు. 'ఫసుర్హున్న' తర్వాత ఏ పదమూ మార్జితం (మహ్జూఫ్)గా ఉన్నట్లు భావించనవసరం లేదు. విషయం దానంతట అదే సుబోధకం అవుతుంది. మొత్తానికి ఈ పదాల భావం ఏమిటంటే ఆ పక్షులను ముక్కలు ముక్కలుగా కోసి, వాటన్నిటిని కలిపి, వేర్వేరు కొండలపై వాటి ముక్కలు ఉంచి, ఆ తర్వాత వాటిని పిలిస్తే అవి బ్రతికి మళ్ళీ నీ వద్దకు వచ్చేస్తాయి. అలాగే జరిగింది కూడా!

కాని దైవప్రవక్త సహచరుల, వారి శిష్యుల (అంటే తాబయీన్ల) వ్యాఖ్యానానికి, సలఫ్ల విధానానికి ఏమాత్రం విలువ ఇవ్వని సాంప్రదాయ, ఆధునిక సోకాల్డ్ వ్యాఖ్యాతలు

مَثَلُ الَّذِيْنَ يُنْفِقُوْنَ اَمْوَالَهُمْ فِيْ سَبِيْلِ اللّٰهِ كَمَثَلِ
حَبَّةٍ اَنْۢبَتَتْ سَبْعَ سَنَابِلَ فِيْ كُلِّ سُنْۢبُلَةٍ مِّائَةُ حَبَّةٍ ؕ
وَاللّٰهُ يُضٰعِفُ لِمَنْ يَّشَآءُ ؕ وَاللّٰهُ وَاسِعٌ عَلِيْمٌ ﴿٢٦١﴾

**261** అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చుచేసేవారి ఉపమానం ఇలా ఉంటుంది : ఒక విత్తనాన్ని నాటగా, అది మొలకెత్తి అందులో నుంచి ఏడు వెన్నులు పుట్టుకువస్తాయి. ప్రతి వెన్నులోనూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదేవిధంగా అల్లాహ్ తాను కోరినవారికి సమృద్ధి వొసగుతాడు.[323] అల్లాహ్ పుష్కలంగా ప్రసాదించేవాడు, ప్రతిదీ తెలిసినవాడు.

కొందరు 'ఫసుర్హున్న' అనే పదాన్ని కేవలం 'మచ్చిక చేసుకో' అని మాత్రమే అనువదించారు. పక్షులు ముక్కలు చేయబడటం, ఆ ముక్కలను వేర్వేరు కొండలపై ఉంచగా, అవి అల్లాహ్ మహిమతో కలిసి మళ్లీ యధాతథంగా పక్షులుగా మారటం – ఈ విషయాలను వారు అంగీకరించలేదు. వారి ఈ అభిమతం సరైనది కాదు. వారి అభిప్రాయం మూలంగా ఈ సంఘటనకు గల మహిమౌన్నత్యాలు తగ్గిపోతు న్నాయి. వారు చెప్పిన అర్థం ప్రకారమైతే అసలు ఈ సంఘటనను ఇక్కడ పొందుపరచవలసిన అవసరం ఏముంటుంది చెప్పండి?! మృతులను బ్రతికించి చూపమని ఇబ్రాహీమ్ ప్రవక్త అడిగిన ప్రశ్న యధాతథంగా మిగిలిపోదూ?! నిజానికి ఒక ప్రాణి మరణించి దాని దేహం అణువణువూ విడిపోయినప్పటికీ అల్లాహ్ ఆ ప్రాణిని తిరిగి బ్రతికించగలడని తెలియజెప్పటమే ఈ సంఘటన అసలు ఉద్దేశ్యం.

ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ సంఘటనను ప్రస్తావిస్తూ ఇలా అన్నారు : "మేము శంక విషయంలో ఇబ్రాహీం కన్నా ఎక్కువ హక్కుదారులము" (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్). ఇబ్రాహీం శంకించారు అని దీని భావం ఎంతమాత్రం కాదు. పైగా ఆయన శంకించారనే దాన్ని ఇది త్రోసిపుచ్చుతోంది. మృతులను తిరిగి బ్రతికించే విషయాన్ని ఇబ్రాహీం శంకించలేదు. ఒకవేళ ఆయనే గనక శంకించి ఉంటే, అలాంటి శంకను వెలిబుచ్చడానికి ఆయనకన్నా మేమే ఎక్కువ హక్కుదారులము అని దీని భావం (మరిన్ని వివరాలకై ఫత్హుల్ ఖదీర్లో షౌకానీ – రహ్మ.లై – వ్యాఖ్యను చూడండి).

323. దైవమార్గంలో ఖర్చుచేయటం వల్ల లభించే పుణ్యాన్ని వివరించటానికి ఈ ఉపమానం ఇవ్వబడింది. ఇక్కడ 'దైవమార్గంలో ఖర్చు'కు జిహాద్ కోసం పెట్టే ఖర్చు అని అర్థం తీసుకున్నట్లయితే జిహాద్ కోసం చేసే ఖర్చుకు ఆయతులో చెప్పబడినంత పుణ్యం లభిస్తుంది అన్న అర్థం వస్తుంది. ఒకవేళ ఈ 'దైవమార్గంలో ఖర్చు'ను అన్ని రకాల సత్కార్యాల కోసం చేయబడే ఖర్చుగా తలపోసినట్లయితే, అప్పుడు ఆయతులో

**262** ఎవరయితే దైవమార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేసిన తరువాత తమ దాతృత్వాన్ని మాటిమాటికీ చాటుతూ ఉండకుండా, (గ్రహీతల మనస్సును) నొప్పించకుండా[324] జాగ్రత్తపడతారో, వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంటుంది. వారికెలాంటి భీతిగానీ, దుఃఖంగానీ ఉండదు.

الَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمْ فِي سَبِيلِ اللَّهِ ثُمَّ لَا يُتْبِعُونَ
مَا أَنفَقُوا مَنًّا وَلَا أَذًى لَّهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ
وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٢٦٢﴾

**263** దానం చేసిన తరువాత మనసు నొప్పించటం[325] కంటే మంచిమాట పలకటం, క్షమించటం ఎంతో మేలు. అల్లాహ్ అక్కరలేనివాడు, సహన శీలుడు.

قَوْلٌ مَّعْرُوفٌ وَمَغْفِرَةٌ خَيْرٌ مِّن صَدَقَةٍ يَتْبَعُهَا أَذًى
وَاللَّهُ غَنِيٌّ حَلِيمٌ ﴿٢٦٣﴾

చెప్పబడిన పుణ్యం షరీఅత్‌పరమైన విధుల కోసం చేసే ఖర్చు (నఫఖాత్)కు, అలాగే దైవమార్గంలో స్వచ్ఛందంగా చేసే ఖర్చు (సదఖాతె నాఫిలా)కు లభిస్తుందన్న అర్థం వస్తుంది. (మరి ఒక సత్కార్యానికి పది రెట్ల పుణ్యం లభిస్తుందన్న మాటకు అర్థం ఏమిటి? అన్న సందేహం ఈ సందర్భంగా కలగవచ్చు. దానికి సమాధానం ఏమిటంటే ఖర్చుతో నిమిత్తం లేని) ఇతర సత్కార్యాలు **'అల్ హసనతు బి అషరి అమ్‌సాలిహా'** – ఒక సత్కార్యానికి పదిరెట్ల పుణ్యం లభిస్తుంది – అన్న ఆదేశం క్రిందికి వస్తాయి. (ఫత్‌హుల్ ఖదీర్). అంటే విధులపై, స్వచ్ఛంద సత్కార్యాలపై చేసే ఖర్చుకు లభించే పుణ్యం (ఖర్చుతో నిమిత్తం లేని) ఇతర సత్కార్యాలకు లభించే పుణ్యం కన్నా ఎక్కువగా ఉంటుందన్న మాట! అదలా ఉంచితే దైవమార్గంలో ఖర్చుకు గల ప్రాముఖ్యత, మహత్తు కూడా సుస్పష్టమే. యుద్ధసామగ్రి, సైనికుల అవసరాలు సమకూరనంత వరకూ సైనిక కార్యకలాపాలు కూడా చురుకుగా సాగవు. మరి డబ్బులేకుండా యుద్ధసామగ్రి లభించదు.

324. మరి దైవమార్గంలో ఖర్చుపెట్టిన ప్రతి ఒక్కరికీ ఈ మహత్‌పూర్వక స్థాయి ప్రాప్తించదు. ఆ పెట్టే ఖర్చులో చిత్తశుద్ధి ఉండాలి. గ్రహీత మనసును గాయపరచకుండా ఉండాలి. ఎవరికయినా ఉపకారం చేసి ఏదో ఒక సందర్భంలో దెప్పిపొడిచినట్లయితే పేదవాని మనసు చివుక్కుమంటుంది. ఈ చేష్ట కూడా ఒక నేరమే. మహాప్రవక్త (సఅసం) ఇలా ప్రబోధించారు: "ప్రళయదినాన అల్లాహ్ ముగ్గురు వ్యక్తులతో మాట్లాడడు. వారిలో ఒకడు ఉపకారాన్ని ఎంచేవాడు" (ముస్లిం : కితాబుల్ ఈమాన్).

325. యాచకులను కసిరికొట్టరాదు, విదిలించకూడదు అని దీని భావం. దీనికి బదులు

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تُبْطِلُوا صَدَقَاتِكُم بِالْمَنِّ وَالْأَذَىٰ
كَالَّذِي يُنفِقُ مَالَهُ رِئَاءَ النَّاسِ وَلَا يُؤْمِنُ بِاللَّهِ
وَالْيَوْمِ الْآخِرِ ۖ فَمَثَلُهُ كَمَثَلِ صَفْوَانٍ عَلَيْهِ تُرَابٌ فَأَصَابَهُ
وَابِلٌ فَتَرَكَهُ صَلْدًا ۖ لَّا يَقْدِرُونَ عَلَىٰ شَيْءٍ مِّمَّا كَسَبُوا ۗ وَاللَّهُ

**264** ఓ విశ్వాసులారా! తన ధనాన్ని పరుల మెప్పుకోసం ఖర్చుచేస్తూ, అల్లాహ్‌ను గానీ, అంతిమదినాన్ని గానీ విశ్వసించని వ్యక్తి మాదిరిగా మీరు మీ ఉపకారాన్ని చాటుకుని, (గ్రహీతల) మనస్సులను నొప్పించి మీ దానధర్మాలను వృధా చేసుకోకండి. అతని ఉపమానం కొద్దిగా మట్టి పేరుకుని ఉన్న నున్నని రాతి బండ వంటిది. దానిపై భారీవర్షం కురిసి, ఆ మట్టి కాస్తా కొట్టుకుపోయి, కటిక రాయి మాత్రమే మిగులుతుంది.[326]

వారితో మృదువుగా మాట్లాడాలి. యాచకులు అడిగిందల్లా మీరు ఇవ్వనవసరం లేదు. ఇవ్వలేరు కూడా. ఈసారికి మన్నించు అనో, దేవుడు నీపైనా, నాపైనా దయజూపుగాక అనో చెప్పి మంచిపద్ధతిలో పంపివేయాలి. ఇదే మృదు భాషణం లేక మంచిమాట (ఖౌలుమ్ మారూఫున్). మరి "క్షమించటం" (మగ్ఫిరతున్) అంటే ఏమిటి? అన్న సందేహం కలగవచ్చు. యాచకులలోనూ రకరకాల వారుంటారు. నిజంగా అవసరం ఏర్పడి ఒకరి ముందు చేయిచాపి అర్థించినవారి ఆత్మ గౌరవాన్ని సదా దృష్టిలో పెట్టుకోవాలి. 'వాడేమిటీ ఇలా ముష్టెత్తుకుంటున్నాడు?' లాంటి మాటల్ని పలకటంగానీ, నలుగురి ముందూ అతన్ని నవ్వులపాలు చేయటంగానీ చేయకూడదు. ఏ సందర్భంలోనయినా కోపంలో యాచకుని నోట అమర్యాదకరమైన మాట వెలువడినా వీలైనంత వరకు మన్నించి వదలిపెట్టాలి. ఇది కూడా 'మగ్ఫిరతున్' క్రిందికే వస్తుంది. దానం చేసిన తరువాత యాచకుణ్ణి నలుగురిలో నిలబెట్టి నానా మాటలనేకంటే అతనిపట్ల మృదువైఖరిని అవలంబించటం, అతని యాచనను తెరమరుగు గావించటం, ఉపేక్షించటం ఎంతో మేలు. అందుకే హదీసులో అనబడింది: "అల్ కలిమతుత్తయ్యిబతు సదఖతున్" (సద్వచనం కూడా దానమే) (సహీహ్ ముస్లిం – కితాబుజ్జకాత్). మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇంకా ఈ విధంగా ఉపదేశించారు : "మీరు ఏ సత్కార్యాన్నీ (మారూఫ్‌నూ) అల్పంగా భావించకండి – ఆఖరికి మీ సహోదరుణ్ణి నవ్వుతూ పలకరించడాన్ని కూడా!" (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

326. ఇందులో రెండు ముఖ్య విషయాలు నొక్కి చెప్పబడ్డాయి. ఒకటి : దానధర్మాలు చేసి ఉపకారాన్ని చాటటం, దానం పుచ్చుకున్నవారి మనస్సును నొప్పించటం ఇలాంటి దెప్పిపొడుపులు కపటులు మాత్రమే చేస్తారు. నలుగురిలో పేరు ప్రతిష్ఠల్ని పొందగోరి

لَا يَهْدِي الْقَوْمَ الْكٰفِرِيْنَ ۝٢٦٤

ఈ ప్రదర్శనాకారులకు తాము చేసుకున్న దానిలో నుంచి ఏమీ ప్రాప్తించదు. అల్లాహ్ సత్యతిరస్కారులకు సన్మార్గం చూపదు.

وَمَثَلُ الَّذِيْنَ يُنْفِقُوْنَ اَمْوَالَهُمُ ابْتِغَآءَ مَرْضَاتِ اللّٰهِ
وَ تَثْبِيْتًا مِّنْ اَنْفُسِهِمْ كَمَثَلِ جَنَّةٍۭ بِرَبْوَةٍ اَصَابَهَا وَابِلٌ
فَاٰتَتْ اُكُلَهَا ضِعْفَيْنِ ۚ فَاِنْ لَّمْ يُصِبْهَا وَابِلٌ فَطَلٌّ ؕ وَاللّٰهُ
بِمَا تَعْمَلُوْنَ بَصِيْرٌ ۝٢٦٥

**265** ఇక దైవప్రసన్నతను చూరగొనే తపనతో, దృఢనమ్మకంతో తమ సంపదను ఖర్చుపెట్టేవారి ఉపమానం మెరక ప్రాంతంలో ఉన్న తోట వంటిది.[327] భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. ఒకవేళ దానిపై పెద్ద వర్షం పడకుండా, కేవలం వానజల్లు కురిసినా సరిపోతుంది. అల్లాహ్ మీ పనులన్నింటినీ చూస్తూనే ఉన్నాడు.

దానం చేసినవారు మాత్రమే ఈ విధంగా నోరు జారతారు. విశ్వాసులనబడేవారికి ఇవి ఎంతమాత్రం శోభించవు. రెండు : ఈ రకమయిన దానం నున్నని బండరాయి వంటిది. ఏ కాస్త మట్టి దానిపై పేరుకుని ఉన్నా విత్తనం నాటడానికి పనికిరాదు. ఒకవేళ విత్తనం వేసినా దానిపై కురిసే వర్షానికి మొత్తం కొట్టుకుపోతుంది. దీని భావం ఏమిటంటే వర్షం ఏ విధంగా ఆ రాతి ప్రదేశానికి ప్రయోజనం చేకూర్చలేక పోయిందో అదేవిధంగా ప్రదర్శనా బుద్ధి గలవాడికి కూడా అతని దానం ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు.

327. ఇది దైవప్రసన్నతను చూరగొనే లక్ష్యంతో తమ ధనాన్ని వ్యయపరచేవారి దృష్టాంతం. వారు ఖర్చుపెట్టిన ధనం ఎత్తయిన ప్రదేశంలో వున్న తోట లాంటిది. బాగా వర్షం కురిస్తే ఆ తోట నుంచి రెట్టింపు దిగుబడి లభిస్తుంది. ఒకవేళ సన్నని జల్లు లేక తుప్పర లాంటిది పడినా దానికి సరిపోతుంది. వారి దానధర్మాలు కూడా అంతే. అవి చిన్నవైనా, పెద్దవైనా దైవకృపతో ఎన్నో రెట్లు పెంచబడి, వారికి వాపసు చేయ బడతాయి. అరబీ మూలంలో “జన్నతున్” అనే పదం వచ్చింది. మొక్కలు, చెట్లు బాగా దట్టంగా పెరగటం మూలంగా కనిపించకుండా ఉండే నేలను ‘జన్నతున్’ అని అంటారు. లేక నలువైపుల నుంచి దట్టమైన కంచె ఉండటం మూలంగా కనిపించకుండా ఉండే తోటను ‘జన్నతున్’ అంటారు. ‘జన్నతున్’ అనేది అసలు ‘జిన్’ అనే ధాతువు నుండి వచ్చింది. జిన్ అనేది కంటికి కానరాని ప్రాణి. మాతృ గర్భంలో వున్న శిశువును కూడా ‘జనీన్’ అని అంటారు – అది కూడా కనిపించదు

**266** మీలో ఎవరికయినా ఖర్జూరం, ద్రాక్ష పండ్ల తోట ఉండి, అందులో పిల్ల కాలువలు ప్రవహిస్తూ, అందులో అతనికి అన్ని రకాల ఫలాలు కూడా లభిస్తూ ఉండి, అతను ముసలివాడై పోగా, మరోవైపు అతని పిల్లలు బలహీనులుగా ఉండగా–అకస్మాత్తుగా ఆ తోటపై నిప్పులుచెరిగే వడగాలి వచ్చి ఆ తోట కాలిపోవటాన్ని మీలో ఎవరయినాసరే ఇష్టపడతారా?[328] మీరు ఆలోచించేటందుకుగాను అల్లాహ్ ఈ విధంగా తన ఆయతులను మీకు స్పష్ట పరుస్తున్నాడు.

أَيَوَدُّ أَحَدُكُمْ أَن تَكُونَ لَهُ جَنَّةٌ مِّن نَّخِيلٍ وَأَعْنَابٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ لَهُ فِيهَا مِن كُلِّ الثَّمَرَاتِ وَأَصَابَهُ الْكِبَرُ وَلَهُ ذُرِّيَّةٌ ضُعَفَاءُ فَأَصَابَهَا إِعْصَارٌ فِيهِ نَارٌ فَاحْتَرَقَتْ كَذَٰلِكَ يُبَيِّنُ اللَّهُ لَكُمُ الْآيَاتِ لَعَلَّكُمْ تَتَفَكَّرُونَ ﴿٢٦٦﴾

గనక! అలాగే ఉన్మాదాన్ని, మానసిక సంతులనం లోపించటాన్ని 'జునూన్'గా వ్యవహరిస్తారు. ఎందుకంటే ఆ స్థితిలో తెలివిపై ఒక విధమైన పొర కమ్ముకుంటుంది. ఇక జన్నత్ను (స్వర్గాన్ని) 'జన్నత్' అని అనటానికి అసలు కారణం అది కళ్లకు కనిపించకుండా దాచి ఉంచబడటమే. 'రబ్వతున్' అంటే ఎత్తుగా ఉండే నేల; 'వాబిలున్' అంటే భారీ వర్షం.

328. ఈ 'ప్రదర్శనాబుద్ధి' నుంచి కాపాడే ఉద్దేశంతో ఇక్కడ ఇంకొక ఉదాహరణ ఇవ్వబడింది. తోట ద్వారా వచ్చే ఆదాయంతో బ్రతుకు బండిని లాగే ఒక ముసలివాడున్నాడు. అతనికి చంటిపిల్లలేగాని యుక్త వయస్సుకు చేరిన కొడుకులు లేరు. మరోవైపు ఆ ముదుసలి కూడా ఇప్పుడు కష్టపడి డబ్బు సంపాయించలేడు. ఆ తోటే అతని జీవనాధారం. ఆ సమయంలో ఉన్నట్టుండి ఆ తోటపై ఒక పెనుగాలి వీచింది. దాంతో ఉన్నది కాస్తా ఊడ్చుకుపోయింది. మరి ఆ తోటను పూర్వ స్థితికి తెచ్చే సత్తువ కూడా ఆ ముసలి రైతులో లేదు. నలుగురిలో పేరుప్రతిష్ఠల్ని పొందాలన్న తలంపుతో సత్కార్యాలు చేసిన దుష్టసంకల్పుల పరిస్థితి కూడా ప్రళయదినాన ఇలాగే ఉంటుంది. కాపట్యం మూలంగా వారి సత్కర్మలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయి. మరోవంక వారు కష్టాల కడలిని దాటడానికి ఒక్కో సత్కార్యం కోసం అర్రులు చాస్తూ ఉంటారు. మరిన్ని సత్కార్యాలను సంపాదించుకు వద్దామంటే, ఆ అవకాశం కూడా ఇవ్వబడదాయె! మరి మీ పరిస్థితి కూడా ఇలాగే రూపుదాల్చాలని మీరు కోరుకుంటున్నారా? అని యిక్కడ అల్లాహ్ ప్రశ్నిస్తున్నాడు.

జీవితాంతం దైవమార్గంలో అంకితభావంతో సాధనచేసి, త్యాగాలు చేసి వయసు మీదపడిన తరువాత షైతాన్ ఎత్తులకు చిత్తయిపోయి దైవ అవిధేయతకు పాల్పడిన

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا أَنفِقُوا مِن طَيِّبَاتِ مَا كَسَبْتُمْ وَمِمَّا
أَخْرَجْنَا لَكُم مِّنَ الْأَرْضِ ۖ وَلَا تَيَمَّمُوا الْخَبِيثَ مِنْهُ
تُنفِقُونَ وَلَسْتُم بِآخِذِيهِ إِلَّا أَن تُغْمِضُوا
فِيهِ ۚ وَاعْلَمُوا أَنَّ اللَّهَ غَنِيٌّ حَمِيدٌ ﴿٢٦٧﴾

**267** ఓ విశ్వసించిన వారలారా! ధర్మ సమ్మతమైన మీ సంపాదనలో నుంచి, మేము మీ కోసం నేల నుంచి ఉత్పత్తిచేసిన వస్తువులలో నుంచి ఖర్చు చేయండి.[329] వాటిలోని చెడు (నాసిరకం) వస్తువులను ఖర్చుపెట్టే సంకల్పం చేసుకోకండి – మీరు స్వయంగా వాటిని తీసుకోరు. ఒకవేళ కళ్లు మూసుకొని ఉంటే అది వేరే విషయం.[330] అల్లాహ్ అక్కరలేనివాడు, సర్వస్తోత్ర ములకు అర్హుడని తెలుసుకోండి.

వారికి కూడా ఈ ఉపమానం వర్తిస్తుందని హ౯్రజత్ ఇబ్నె అబ్బాస్ మరియు హ౯్రజత్ ఉమర్ (రజి)లు చెప్పారు (సహీహ్ బుఖారీ – కితాబుత్తఫ్సీర్, ఫత్‌హుల్ ఖదీర్ లిష్షౌకానీ మరియు తఫ్సీర్ ఇబ్నె జరీర్ తబ్రీ).

329. దానధర్మాలు స్వీకారయోగ్యం కావాలంటే – క్రితం ఆయతులో చెప్పబడినట్లు – అవి మన్నన్ (ఉపకారాన్ని చాటుకోవటం), అజన్ (గ్రహీత మనసు నొప్పించటం) మరియు ప్రదర్శనాబుద్ధి (రియా) వంటి మాలిన్యాల నుంచి పరిశుభ్రంగా ఉండటంతోపాటు సంపాదన ధర్మసమ్మతం అయి ఉండాలి. మనిషి వ్యాపారం చేసినా, వ్యవసాయం చేసినా, ఉద్యోగం చేసినా, మరేపని ద్వారా ధనాన్ని ఆర్జించినా – అది దైవం సమ్మతించిన పద్ధతిలో – ఆర్జించాలి. అటువంటి సంపాదన 'పరిశుద్ధమైన' సంపాదన అనబడుతుంది. "చెడు (ఖబీస్) వస్తువులను అల్లాహ్ మార్గంలో ఇవ్వాలన్న తలంపు రానివ్వకండి" అంటే భావం అధర్మంగా, అన్యాయంగా, అక్రమంగా ఆర్జించిన దానిని ఇవ్వరాదు అని! అలాంటి దానాన్ని అల్లాహ్ స్వీకరించడు. "అల్లాహ్ పరిశుద్ధుడు. పరిశుద్ధ (హలాల్) వస్తువులను మాత్రమే ఆయన ఆమోదిస్తాడు" అని హదీసులో ఉంది. 'ఖబీస్'కు మరో అర్థం పనికిరాని, నాసిరకం వస్తువులు. వాటిని కూడా అల్లాహ్ మార్గంలో ఇవ్వరాదు. మదీనాలోని అన్సార్లు కొందరు దైవమార్గంలో వ్యవసాయోత్పత్తులను ఇవ్వవలసి వచ్చినప్పుడు నాసిరకం ఖర్జూరపండ్లను మస్జిదులో ఇచ్చి వెళ్ళేవారు. ఇది అల్లాహ్‌కు నచ్చలేదు. ఈ నేపథ్యంలోనే "మీరు అమితంగా ప్రేమించే వస్తువులను ఖర్చుపెట్టనంతవరకూ మీరు సత్కార్యస్థాయికి చేరుకోలేరు" అన్న దివ్య వచనం అవతరించింది (ఫత్‌హుల్ ఖదీర్ – తిర్మిజీ, ఇబ్నె మాజాల ఆధారంగా).

330. నాసిరకం వస్తువులను మీరు సయితం మనస్ఫూర్తిగా పుచ్చుకోరు. అటువంటప్పుడు దైవమార్గంలో అలాంటి వస్తువులను ఇవ్వటం భావ్యం కాదుకదా! అని దీని భావం.

268 షైతాన్ మీకు దారిద్ర్యం గురించి భయపెడతాడు. నీతిమాలిన పనులకై పురికొల్పుతాడు.[331] కాగా; అల్లాహ్ మిమ్మల్ని క్షమిస్తాననీ, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ గొప్ప ఉదార స్వభావుడు, అన్నీ తెలిసినవాడు.

اَلشَّيْطٰنُ يَعِدُكُمُ الْفَقْرَ وَيَاْمُرُكُمْ بِالْفَحْشَآءِ ۚ وَاللّٰهُ يَعِدُكُمْ مَّغْفِرَةً مِّنْهُ وَفَضْلًا ؕ وَاللّٰهُ وَاسِعٌ عَلِيْمٌ ۚ ﴿۲۶۸﴾

269 ఆయన తాను కోరిన వారికి విజ్ఞతా వివేచనలను ప్రసాదిస్తాడు. ఎవరికి విజ్ఞతా వివేచనలు వొసగబడ్డాయో అతనికి ఎన్నో మేళ్లు వొసగబడినట్లే.[332] హితబోధను బుద్ధిమంతులు తప్ప మరొకరు గ్రహించరు.

يُّؤْتِى الْحِكْمَةَ مَنْ يَّشَآءُ ۚ وَمَنْ يُّؤْتَ الْحِكْمَةَ فَقَدْ اُوْتِىَ خَيْرًا كَثِيْرًا ؕ وَمَا يَذَّكَّرُ اِلَّآ اُولُوا الْاَلْبَابِ ﴿۲۶۹﴾

331. మీరు దైవమార్గంలో ధనాన్ని వ్యయపరచాలని అనుకున్నప్పుడు మిమ్మల్ని షైతాన్ పరిపరి విధాలుగా ప్రక్కదారి పట్టించజూస్తాడు. ఇలా ఖర్చుచేస్తే మీరు దివాలా తీస్తారనీ, ముష్టెత్తుకోవలసిన పరిస్థితి దాపురిస్తుందనీ భయపెడతాడు. మరి అదే దుష్కార్యాలలో ఖర్చుపెట్టబోతున్నప్పుడు ఎలాంటి సంకోచం దరి చేరనివ్వడు. పైగా అలాంటి దుష్కార్యాలకు ఎంతో అందమైన పేర్లుపెట్టి, రంగురంగుల డిజైనులను అతికించి, మనోహరమైన తీరులో మీ ముందుకు తీసుకువస్తాడు. వాటికోసం మీరు ఎంత డబ్బు అయినా విచ్చలవిడిగా తగలెట్టేలా మిమ్మల్ని సమాయత్తపరుస్తాడు. మీరు గమనించారోలేదో ఒక సంక్షేమ కార్యక్రమం కోసం, ఒక మస్జిద్, మదర్సా పనికోసం మీరు ఎప్పుడయినా ఒక ధనవంతుని వద్దకు వెళితే తానిచ్చే వంద రూపాయల కోసం పదిసార్లు తిప్పుతాడు. పదేసి ప్రశ్నలతో మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేసేస్తాడు. కాని ఆ స్థితిమంతుడే దుష్కార్యాల కోసం డబ్బు ఖర్చుపెడుతున్నప్పుడు ఇలాంటి ఆరాలు ఏమీ తీయడు. ఆదాయపు పన్ను అధికారులను సంతోషపెట్టేందుకు, అక్రమ రీతిలో లైసెన్సులు పొందేందుకు ఎన్ని అడ్డదారులైనా తొక్కుతాడు. ఆ సమయంలో ఎలాంటి సంకోచం, తడబాటు అతనిలో ఉండదు.

332. అరబీలో **'హిక్మత్'** అనబడింది. దీన్ని పలువురు పలు భావాల్లో తీసుకున్నారు. హిక్మత్ అంటే విషయావగాహన, విద్య అని కొందరు, సరైన అభిప్రాయాన్నే కలిగి ఉండటమని కొందరు, ఖుర్ఆన్‌లోని రద్దుపరచబడిన ఆయతులు, వాటికి బదులు అమలులో ఉన్న ఆయతులకు సంబంధించిన జ్ఞానం, అవగాహన, నిర్ణయం గైకొనగల శక్తి అని మరికొందరు, కేవలం ఖుర్ఆన్ హదీసుల జ్ఞానం అని ఇంకొందరు భావించారు. నిజానికి ఈ భావాలన్నీ 'హిక్మత్' విస్తృత పరిధిలోకి వచ్చేస్తాయి. సహీహైన్ (బుఖారీ,

وَمَآ أَنفَقْتُم مِّن نَّفَقَةٍ أَوْ نَذَرْتُم مِّن نَّذْرٍ
فَإِنَّ ٱللَّهَ يَعْلَمُهُۥ ۗ وَمَا لِلظَّٰلِمِينَ مِنْ أَنصَارٍ ﴿٢٧٠﴾

**270** మీరు (దైవమార్గంలో) ఎంత ఖర్చు చేసినా, ఏ మొక్కుబడి చేసుకున్నా[333] అల్లాహ్‌కు దానిగురించి పూర్తిగా తెలుసు. దుర్మార్గులకు సహాయం చేసే వారెవరూ లేరు.

إِن تُبْدُوا۟ ٱلصَّدَقَٰتِ فَنِعِمَّا هِىَ ۖ وَإِن تُخْفُوهَا
وَتُؤْتُوهَا ٱلْفُقَرَآءَ فَهُوَ خَيْرٌ لَّكُمْ ۚ وَيُكَفِّرُ عَنكُم
مِّن سَيِّـَٔاتِكُمْ ۗ وَٱللَّهُ بِمَا تَعْمَلُونَ خَبِيرٌ ﴿٢٧١﴾

**271** ఒకవేళ మీరు బహిరంగంగా దాన ధర్మాలు చేసినా మంచిదే గాని, గోప్యంగా నిరుపేదలకు ఇస్తే అది మీ కొరకు ఉత్తమం.[334] (దీనివల్ల) అల్లాహ్ మీ పాపాలను తుడిచిపెడతాడు. అల్లాహ్‌కు మీరు చేసేదంతా తెలుసు.

ముస్లింల) లోని హదీసు ఇక్కడ గమనార్హం: "ఇద్దరు వ్యక్తుల పట్ల ఈర్ష్య (రష్క్) చెందటం ధర్మసమ్మతమే. ఒకడు : సిరిసంపదలు వొసగబడగా సత్యమార్గంలో ఖర్చుచేసేవాడు. మరొకడు : అల్లాహ్ హిక్మత్‌ను ప్రసాదించగా దాని ఆధారంగా ప్రజల మధ్య తీర్పులు ఇచ్చేవాడు. ప్రజలకు హిక్మత్‌ను బోధపరచేవాడు" (సహీహ్ బుఖారీ : కితాబుల్ ఇల్మ్ ; ముస్లిం – కితాబు సలాతిల్ ముసాఫిరీన్).

333. **నజ్ర్ :** మొక్కుబడి. నేను అనుకున్న ఫలానా పని గనక అయిపోతే లేక నేను ఎదుర్కొంటున్న ఫలానా కఠిన పరీక్ష నుండి నాకు ముక్తి లభిస్తే దైవమార్గంలో ఇంతమొత్తం దానం చేస్తాను అని ఎవరైనా మనసులో అనుకుంటే అది 'నజ్ర్' అవుతుంది. దాన్నే తెలుగులో మొక్కుకోవటం అని అంటారు. ఈ మొక్కు ధర్మసమ్మతం గనక దాన్ని చెల్లించటం తప్పనిసరి. ఒకవేళ అధర్మమైన, దైవధిక్కారంతో కూడుకున్న మొక్కుబడి చేసుకుంటే దాన్ని తీర్చటం తప్పనిసరికాదు. మొక్కుబడి కూడా నమాజ్, ఉపవాసాల మాదిరిగా ఆరాధనే. కాబట్టి అల్లాహ్ మినహా ఇంకొకరి ఎవరి పేరున మొక్కుకున్నా అది "ఆరాధనలో షిర్క్‌కు తావు కల్పించటం"తో సమానమే. నేడు మన ముస్లిం సోదరులు దర్గాల దగ్గర, సమాధుల వద్ద తీర్చే మొక్కుబడులు కూడా ఈ షిర్క్ కోవకే చెందుతాయి. దైవం మనల్ని షిర్కు నుంచి కాపాడుగాక!

334. సాధారణ పరిస్థితుల్లో రహస్యంగా దానధర్మాలు చేయటమే ఉత్తమం అని ఈ ఆయతు ద్వారా విదితమవుతోంది. ఒకవేళ ఏ సందర్భంలోనయినా బహిరంగంగా – అందరికీ తెలిసేలా – దానం చేస్తే దానివల్ల ఇతరులకు కూడా ప్రేరణ లభిస్తుందనుకుంటే అప్పుడు బహిరంగంగా కూడా దానం చేయవచ్చు. ప్రదర్శనాబుద్ధిని మనసులో రానివ్వకుండా ఇతరులను మంచివైపుకు పురికొల్పే సదుద్దేశంతో ఎవరయినా ఇలాంటి సత్కార్యాల్లో తొలి అడుగువేస్తే, అటువంటి వారికి లభించే ప్రత్యేకమైన పుణ్యం గురించి

لَيْسَ عَلَيْكَ هُدٰىهُمْ وَلٰكِنَّ اللّٰهَ يَهْدِىْ مَنْ يَّشَآءُ
وَمَا تُنْفِقُوْا مِنْ خَيْرٍ فَلِاَنْفُسِكُمْ وَمَا تُنْفِقُوْنَ
اِلَّا ابْتِغَآءَ وَجْهِ اللّٰهِ وَمَا تُنْفِقُوْا مِنْ خَيْرٍ يُّوَفَّ
اِلَيْكُمْ وَاَنْتُمْ لَا تُظْلَمُوْنَ ﴿۲۷۲﴾

**272** (ఓ ప్రవక్తా!) వారిని సన్మార్గంపై తెచ్చి నిలబెట్టే బాధ్యత నీపై లేదు. వాస్తవానికి సన్మార్గ భాగ్యాన్ని అల్లాహ్ తాను కోరిన వారికి అనుగ్రహిస్తాడు. మీరు దైవ మార్గంలో ఏ మంచి వస్తువును వ్యయపరచినా, దాని లాభాన్ని స్వయంగా మీరే పొందుతారు. కాకపోతే మీరు కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే ఖర్చు చేయాలి. మీరు ఎంత ఖర్చుచేసినా దాని పూర్తి ప్రతిఫలం మీకు ఇవ్వబడుతుంది.[335] మీకు ఎంతమాత్రం అన్యాయం జరగదు.

హదీసుల్లో స్పష్టంగా చెప్పబడింది. అయితే ఇవి ప్రత్యేక పరిస్థితులు. ఇక సాధారణ సమయాల్లో మాత్రం సాధ్యమైనంతవరకు గోప్యంగా – ఎవరికీ తెలియకుండా – దానధర్మాలు చేయటం ఎక్కువ పుణ్యప్రదం. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ఒకసారి ఇలా ప్రవచించారు : ప్రళయదినాన ఎవరెవరికయితే దైవ సింహాసనం క్రింద నీడ లభిస్తుందో వారిలో ఒక భాగ్యవంతుడు గోప్యంగా దానధర్మాలు చేసినవాడు. అతను దానధర్మాలు చేసే తీరు ఎంత గుట్టుగా ఉండేదంటే కుడిచేత్తో ఏం దానం చేశాడో ఎడమచేతికి కూడా తెలిసేది కాదు." ఈ శ్రేష్ఠత స్వచ్ఛంద (నఫిల్) దానధర్మాలకే వర్తిస్తుందనీ, 'జకాత్' లాంటి విధిగా ఇవ్వవలసిన దానాలను బహిరంగంగా ఇవ్వటమే మేలని కొందరు విద్వాంసులు అభిప్రాయపడ్డారు. అయితే ఖుర్ఆన్‌లో చేయబడిన ప్రబోధన స్వచ్ఛంద దానాలకు, తప్పనిసరి దానాలకు కూడా వర్తిస్తుంది (ఇబ్నె కసీర్). హదీసులోని విషయం కూడా ఈ భావంలోనే ఉంది.

335. వివిధ వ్యాఖ్యానాల ద్వారా బోధపడేదేమంటే; ముస్లింలు అవిశ్వాసులైన తమ బంధువులకు ఆర్థిక సహాయం చేయటం సమంజసం కాదని భావించేవారు. పైగా వారు ముస్లింలుగా మారిపోవాలని కోరుకునేవారు. అప్పుడు ఈ ఆయతు అవతరించింది. ఎవరికయినాసరే సన్మార్గాన నడిచే సద్బుద్ధి అల్లాహ్ తరఫున లభిస్తుంది. సన్మార్గం గురించి బోధపరచటం వరకే మీ బాధ్యత. ఇకపోతే, మీరు దైవమార్గంలో చిత్తశుద్ధితో ఏమి ఖర్చుచేసినా దాని పూర్తి పుణ్యఫలం మీకు లభిస్తుంది. దీన్నిబట్టి అవగతమయ్యే ఒక విషయం ఏమిటంటే ముస్లిమేతరులైన బంధువులను ఆదుకోవటం, బంధుత్వ ప్రాతిపదికపై వారితో మంచిగా మెలగటం పుణ్యప్రదం. అయితే 'జకాత్' అనబడే తప్పనిసరి దానాలకు మాత్రం ముస్లింలే హక్కుదారులు. ముస్లిమేతరులకు జకాత్ సొమ్ము ఇవ్వరాదు.

لِلْفُقَرَاءِ الَّذِينَ أُحْصِرُوا فِي سَبِيلِ اللَّهِ
لَا يَسْتَطِيعُونَ ضَرْبًا فِي الْأَرْضِ يَحْسَبُهُمُ الْجَاهِلُ
أَغْنِيَاءَ مِنَ التَّعَفُّفِ تَعْرِفُهُمْ بِسِيمَاهُمْ لَا يَسْأَلُونَ
النَّاسَ إِلْحَافًا وَمَا تُنْفِقُوا مِنْ خَيْرٍ فَإِنَّ اللَّهَ
بِهِ عَلِيمٌ ﴿٢٧٣﴾

**273** దైవమార్గంలో నిమగ్నులైన కారణంగా, (బ్రతుకు తెరువు కోసం) భూమిలో సంచరించే వీలులేని నిరుపేదలు[336] వాస్తవానికి మీ ధన సహాయానికి అర్హులు. వారి నిజస్థితిని గురించి తెలియనివారు, (ఆత్మాభిమానం వల్ల) వారెవరినీ అడగక పోవటం చూసి, వారిని అవసరాలు లేనివారుగా తలపోస్తారు. మీరు వారి వాలకాన్ని చూసి వాస్తవస్థితిని ఊహించవచ్చు. తమకు సహాయం చెయ్యమంటూ వారు ప్రజల వెంటపడరు.[337] (అటువంటి త్యాగధనుల సహాయార్థం) మీరు ఎంత సొమ్ము వెచ్చించినా, నిశ్చయంగా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు.

336. దైవమార్గంలో ఇల్లూ వాకిలీ వదలి మక్కా నుండి మదీనాకు వలసవచ్చిన ముహాజిర్లు వీరు. ధార్మిక విద్యను ఆర్జించే విద్యార్థులు, విద్వాంసులు, దైవకార్యం కోసం తమ జీవితాలను అంకితం చేసినవారు కూడా ఈ కోవలోకి వస్తారు.

337. ఇది విశ్వాసుల ఒక ముఖ్య లక్షణం. పేదరికంలో క్రుంగుతూ ఉన్నప్పటికీ వారు నోరు తెరచి ఇతరులను ఏమీ అడుగరు. సాధ్యమైనంతవరకూ ఉన్న దాంతోనే తృప్తి పడాలనీ, తమ బాధలను నలుగురికీ చెప్పుకోరాదని అనుకుంటారు. అరబీలో రెండు పదాలు వచ్చాయి. ఒకటి **తఅఫ్ఫుఫ్,** రెండోది **ఇల్‌హాఫ్.** తఅఫ్ఫుఫ్ అంటే ఆత్మాభిమానం అని అర్థం. ఇల్‌హాఫ్ అంటే సహాయం చెయ్యండి అని మరీ జిడ్డుగా అడగటం అని అర్థం వస్తుంది. అసలు ఎవరినీ ఏమీ అడగకుండా ఉండటం 'ఇల్‌హాఫ్' అని మరికొందరు భావించారు. ఎందుకంటే వీరికి 'ఆత్మగౌరవం' చాలా ముఖ్యమని ఇంతకుముందే చెప్పబడింది (ఫత్‌హుల్ ఖదీర్). ఒకవేళ ఎవరినయినా ఏదయినా అడిగినా బ్రతిమాలుతూ వెంటపడరు అని మరి కొంతమంది వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు. అవసరం లేకపోయినా యాచించటాన్ని హాబీగా చేసుకోరు (నేటి ప్రొఫెషనల్ ఫకీర్ల మాదిరిగా) అని ఇంకా కొంతమంది విద్వాంసులు వ్యాఖ్యానించారు.

ఇంటింటికీ పోయి ఓ ముద్ద అన్నం పెట్టమనో, రెండు ఖర్జూరపండ్లు ధర్మం చెయ్యమనో ముష్టెత్తుకునేవారు వాస్తవానికి నిరుపేదలు కారనీ, అవసరం ఉండి కూడా

**274** ఎవరయితే తమ సిరిసంపదలను రేయింబవళ్లు రహస్యంగానూ, బహిరంగం గానూ ఖర్చుచేస్తారో వారి కొరకు వారి ప్రభువు వద్ద (గొప్ప) పుణ్యఫలం ఉంది. వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ ఉండదు.

اَلَّذِيْنَ يُنْفِقُوْنَ اَمْوَالَهُمْ بِالَّيْلِ وَالنَّهَارِ سِرًّا وَّعَلَانِيَةً فَلَهُمْ اَجْرُهُمْ عِنْدَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ﴿٢٧٤﴾

**275** వడ్డీ సొమ్ము తినేవారు[338] షైతాను పట్టటంవల్ల ఉన్మాది అయినవాని లాగానే నిలబడతారు.[339] వారికీ దుర్గతి

اَلَّذِيْنَ يَاْكُلُوْنَ الرِّبٰوا لَا يَقُوْمُوْنَ اِلَّا كَمَا يَقُوْمُ الَّذِيْ

ఆత్మాభిమానం వల్ల ఇతరుల ముందు చేయి చాపకుండా గుట్టుగా, గుంభనంగా బ్రతికేవారే సిసలయిన నిరుపేదలని మహనీయ ముహమ్మద్ (సఅసం) వివరించారు. ఈ మాట అన్న తర్వాత ఆయన (స) "లా యస్‌అలూనన్నాస ఇల్‌హాఫా" (తమకు సహాయం చేయమంటూ వారు ప్రజల వెంట పడరు) అన్న ఆయతును పఠించారు (సహీహ్ బుఖారీ : అత్తఫ్సీర్ వ జ్జకాత్). కాబట్టి తమ ధనాన్ని 'సదకా' గా ఇవ్వదలచిన వారు ప్రొఫెషనల్ ఫకీర్లకు ఇచ్చేబదులు ధర్మజ్ఞాన సముపార్జనలో ఉండి ఉపాధిని సమకూర్చుకోలేని వారికీ, దైవమార్గంలో ప్రస్థానం చేసేవారికీ, తమ దారిద్ర్య స్థితిని చాటుకోకుండా గౌరవంగా బ్రతుకుబండిని లాగుతూ ఉండేవారిని అన్వేషించి, ఉత్తమ రీతిలో ఆదుకోవాలి. ఎందుకంటే వారు అభిమానం వల్ల ఇతరుల ముందు తమ గోడును వినిపించుకోరు.

అదే సమయంలో – తమ అవసరాలకు తగిన ఉపాధి ఉండి కూడా పరుల ముందు చేయి చాచటం తమను తాము అవమానపరచుకోవటమే. అలా చేసిన వారి ముఖాలపై ప్రళయదినాన గాయాలు కనిపిస్తాయని హదీసులో ఉంది (సునన్ గ్రంథకర్తలైన నలుగురూ ఈ హదీసును వెలికి తీశారు – తిర్మిజీలోని కితాబుజ్జకాత్‌లో ఈ హదీసు ఉంది). నిత్యం జనుల ముందు యాచిస్తూ తిరిగేవాని మొహంపై ప్రళయదినాన మాంసం ఉండదని బుఖారీ, ముస్లింలలోని హదీసులో ఉంది (మిష్కాత్, కితాబుజ్జకాత్ ఆధారంగా).

338. ఆయతులో **'రిబా'** అని ఉంది. రిబా అంటే అధికం, ఎక్కువ అనే అర్థాలు వస్తాయి. దాన్నే మనం వడ్డీగా వ్యవహరిస్తాం. రిబా (వడ్డీలో) రెండు రకాలున్నాయి: 1. రిబల్ ఫజ్ల్. 2. రిబన్నసీఅహ్. ఆరు వస్తువుల లావాదేవీల్లో హెచ్చుతగ్గుల మూలంగా, నగదు రుణ వ్యవహారం మూలంగా జరిగే వడ్డీని 'రిబల్ ఫజ్ల్' అని అంటారు. (ఆ ఆరు వస్తువుల వివరాలు హదీసుల్లో వచ్చాయి. ఉదాహరణకు గోధుమలకు బదులుగా

గోధుమలతోనే లావాదేవీలు జరపవలసి ఉంటే ఆ రెండూ సరిసమానంగా ఉండాలి. దాంతోపాటు అది నగదు వ్యవహారమై కూడా ఉండాలి. అంటే ఆ రెండు వస్తువులు అక్కడే చేతులు మారాలి. అలాగాకుండా ఆ రెండు వస్తువులు సరిసమానంగా లేకున్నా, అలాగే అప్పటికప్పుడు వస్తుమార్పిడి జరగకుండా ఒక వస్తువు నగదుగా ఉండి మరో వస్తువు రుణంగానో లేక రెండూ రుణంగానో ఉంటే ఆ వ్యవహారం వడ్డీ వ్యవహారం (క్రిందికి వస్తుంది). ఇక రెండోది **రిబన్నసీఅహ్.** ఎవరికయినా కొంత నగదు అరువుగా ఇచ్చి పుచ్చుకునేటప్పుడు ఎక్కువ పుచ్చుకుంటానని షరతు పెట్టటం 'రిబన్నసీఅహ్' అవుతుంది. ఇది కూడా వడ్డీయే. ఉదాహరణకు 6 నెలల గడువు కొరకు ఎవరికయినా 100 రూపాయలు రుణంగా ఇచ్చి వాపసు చేసే సమయంలో 125 రూ. ఇవ్వాలని షరతు పెట్టడం. అంటే 6 నెలల గడువు కోసం 25 రూపాయలు అదనంగా పుచ్చుకోవటమన్నమాట. దైవప్రవక్త ప్రియ సహచరులైన అలీగారు ఇలా అన్నారు : "కుల్లు ఖర్‌జిన్ జర్ర మన్‌ఫఅతన్ ఫహువ రిబన్." అప్పు ఇవ్వటం ద్వారా వచ్చిన ప్రయోజనమేదైనా వడ్డీయే (ఫైజుల్ ఖదీర్). ఇలాంటి అప్పు వ్యక్తిగత అవసరాల కోసం ఇచ్చిపుచ్చుకున్నా, వాణిజ్యం కొరకు ఇచ్చిపుచ్చుకున్నా – రెండు పరిస్థితుల్లో కూడా ఇది వడ్డీయే. ఈ వడ్డీ హరామ్ (నిషిద్ధం) గా పరిగణించబడుతుంది. అజ్ఞాన కాలంలోనూ ఈ రెండు రకాల రుణాల లావాదేవీలు జరిగేవి. ఈ రెంటినీ ఇస్లాం నిషిద్ధంగా ఖరారు చేసింది.

వర్తకం కోసం బ్యాంకు ద్వారా తీసుకునే రుణాలు 'వడ్డీ' లావాదేవీల పరిధిలోకి రావని కొంతమంది భావిస్తున్నారు. ఒక వ్యక్తి బ్యాంకు నుంచి రుణం తీసుకుని, వాణిజ్యం ద్వారా పెద్దమొత్తంలో లాభాలు గడిస్తున్నప్పుడు కొద్దిపాటి సొమ్మును బ్యాంకుకు అదనంగా చెల్లించటంలో దోషం ఏముందీ? అని వారు ప్రశ్నిస్తారు. ఇలాంటి వడ్డీని ధర్మసమ్మతంగా ఖరారు చేయాలని కోరే ఈ మహానుభావులకు చెడుగు కానరాకపోవచ్చు గాని దేవుని దృష్టిలో మాత్రం ఇందులో అనేక చెడుగులు ఉన్నాయి. ఉదాహరణకు : రుణం తీసుకుని వ్యాపారం చేసే వ్యక్తికి ఖచ్చితంగా లాభం వస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదు. లాభాల సంగతి అటుంచి, పెట్టిన అసలు పెట్టుబడి అన్నా తిరిగి వస్తుందన్న దృఢనమ్మకం ఏమీ ఉండదు. ఒక్కోసారి వ్యాపారంలో పెట్టే మూలధనమంతా మునిగిపోతుంది. కాని మరోవంక రుణదాత (బ్యాంకు లేక షావుకారు) మాత్రం తాను యిచ్చిన అసలుతోపాటు వడ్డీని కూడా అణాపైసలతో సహా రాబట్టుకుంటాడు. అంటే వడ్డీ వ్యాపారికి లాభనష్టాల రిస్కు ఉండదు. కాని అప్పు తీసుకుని దివాలా తీసిన వ్యక్తిపై ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ కించిత్ జాలి కూడా కనబరచకుండా అతని తోలు వలచి మరీ వసూలు చేసుకుంటుంది. ఇటువంటి అన్యాయాన్ని, దోపిడీని షరీయతు ధర్మసమ్మతంగా ఎలా ఖరారు చేస్తుంది? అదైతే సమాజంలోని నిరాధార జీవులను ఆదుకోమని చెబుతుందాయె! పేదలనుండి,

يَتَخَبَّطُهُ الشَّيْطٰنُ مِنَ الْمَسِّ ذٰلِكَ بِاَنَّهُمْ قَالُوْٓا اِنَّمَا الْبَيْعُ
مِثْلُ الرِّبٰوا وَاَحَلَّ اللّٰهُ الْبَيْعَ وَحَرَّمَ الرِّبٰوا فَمَنْ جَآءَهٗ
مَوْعِظَةٌ مِّنْ رَّبِّهٖ فَانْتَهٰى فَلَهٗ مَا سَلَفَ وَاَمْرُهٗٓ اِلَى اللّٰهِ

పట్టడానికి కారణం "వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే కదా!"[340] అని వారు అనటమే. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం చేసి, వడ్డీని నిషేధించాడు. కనుక ఎవరు తన ప్రభువు వద్దనుంచి వచ్చిన హితబోధను విని వడ్డీని మానుకున్నాడో, అతడు గతంలో పుచ్చుకున్నదేదో పుచ్చుకున్నాడు.[341]

అవసరమున్న వారి నుండి ఎలాంటి ప్రయోజనాలను ఆశించకుండా – నిస్వార్థంగా – సహాయం చెయ్యమని చెప్పే శాసనాంగం దోపిడీని సహించలేదు కదా!?

నిస్వార్థ సేవాభావంతో సమాజంలోని అగత్యపరులకు, అభాగ్యజీవులకు చేయూతనిచ్చినప్పుడు ప్రజలమధ్య గల అంతరాలు సమసిపోతాయి. సమాజంలో సోదరభావాలు, సానుభూతి, సహకారభావాలు, ప్రేమానురాగాలు చిగురిస్తాయి. దీనికి పూర్తిగా విరుద్ధమైనది వడ్డీ. ఈ వడ్డీ వ్యవస్థ మూలంగా స్వార్థ ప్రియత్వం పెంపొందు తుంది. కరకుదనం, హృదయ కాఠిన్యత ప్రబలుతాయి. ఒక పెట్టుబడి దారుడు, ఒక వడ్డీ వ్యాపారి ఎంతసేపటికీ రూపాయి ద్వారా రూపాయి సంపాదించుకో వాలనే ఆలోచిస్తారు తప్ప దీనివల్ల పేదల బ్రతుకులు ఎలా పరిణమిస్తాయో! అని ఆలోచించరు. సమాజంలో తిష్ఠవేసి ఉన్న ఆర్థిక మాంద్యంతోనూ, నైతిక అధోగతితోనూ వారికి పనిలేదు. ఇటువంటి వైపరీత్యాన్ని, నిర్దాక్షిణ్య ధోరణిని ఇస్లామీయ షరీయతు ఎట్లా హర్షిస్తుంది? వడ్డీ వ్యవస్థ వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాలు ఇంకా చాలా ఉన్నాయి. వివరాల్లోకిపోయే అవకాశం యిక్కడ లేదు. చెప్పవచ్చేదేమిటంటే వడ్డీ ముమ్మాటికీ హరామ్ (నిషిద్ధం). అది వ్యక్తిగత అవసరాలకోసం తీసుకున్నా, వర్తకం కోసం తీసుకున్నా – మరే ఉద్దేశ్యంతో తీసుకున్నా అది ధర్మసమ్మతం అయ్యే ప్రసక్తే లేదు.

339. అంటే వడ్డీ సొమ్ము తినేవాడికి ఈ దుస్థితి సమాధినుంచి లేపబడేటప్పుడో, హష్ర్ మైదానంలో లేపబడేటప్పుడో ఏర్పడుతుంది.

340. వ్యాపారాన్ని వడ్డీతో పోల్చటం దారుణం. ఎందుకంటే వ్యాపారంలో వస్తు మారకం జరుగుతుంది. వ్యాపారంలో లాభనష్టాల రిస్కు ఉంటుంది. కాని వడ్డీ వ్యవహారం అటువంటిది కాదు. అదలావుంచితే వ్యాపారాన్ని అల్లాహ్ హలాల్ (ధర్మసమ్మతం) గా ఖరారుచేసి, వడ్డీని హరామ్ (నిషిద్ధం)గా ప్రకటించాడు. అలాంటప్పుడు ఇవి రెండూ సమానం ఎలా అవుతాయి?

341. ఇస్లాం స్వీకరించిన తరువాత లేక పశ్చాత్తాపం చెందిన తరువాత, గతంలో పుచ్చుకున్న వడ్డీపై ప్రశ్నించబడదు అని భావం.

అతని వ్యవహారం దైవాధీనం.[342] ఇకమీదట కూడా దీనికి పాల్పడినవారే నరకవాసులు. వారు కలకాలం అందులో పడి ఉంటారు.

وَمَنْ عَادَ فَأُولَٰٓئِكَ أَصْحَٰبُ ٱلنَّارِ ۖ هُمْ فِيهَا خَٰلِدُونَ ﴿٢٧٥﴾

**276** అల్లాహ్ వడ్డీని హరింపజేస్తాడు, దానధర్మాలను పెంచుతాడు.[343] మేలును మరిచేవారిని, పాపిష్టులను అల్లాహ్ సుతరామూ ప్రేమించడు.

يَمْحَقُ ٱللَّهُ ٱلرِّبَوٰا۟ وَيُرْبِى ٱلصَّدَقَٰتِ ۗ وَٱللَّهُ لَا يُحِبُّ كُلَّ كَفَّارٍ أَثِيمٍ ﴿٢٧٦﴾

**277** విశ్వసించి (సున్నత్ ప్రకారం) సత్కార్యాలు చేసేవారికి, నమాజులను నెలకొల్పేవారికి, జకాత్‌ను చెల్లించేవారికి తమ ప్రభువు వద్ద పుణ్యఫలం ఉంది. వారికెలాంటి భయంగానీ, చీకూచింతగానీ ఉండవు.

إِنَّ ٱلَّذِينَ ءَامَنُوا۟ وَعَمِلُوا۟ ٱلصَّٰلِحَٰتِ وَأَقَامُوا۟ ٱلصَّلَوٰةَ وَءَاتَوُا۟ ٱلزَّكَوٰةَ لَهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿٢٧٧﴾

**278** ఓ విశ్వసించిన వారలారా! అల్లాహ్‌కు భయపడండి. మీరు నికార్సయిన విశ్వాసులే అయినట్లయితే మిగిలివున్న వడ్డీని విడిచిపెట్టండి.

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱتَّقُوا۟ ٱللَّهَ وَذَرُوا۟ مَا بَقِىَ مِنَ ٱلرِّبَوٰٓا۟ إِن كُنتُم مُّؤْمِنِينَ ﴿٢٧٨﴾

**279** ఒకవేళ మీరు గనక అలా చేయనట్లయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తతో యుద్ధానికి సిద్ధంకండి.[344] ఒకవేళ మీరు

فَإِن لَّمْ تَفْعَلُوا۟ فَأْذَنُوا۟ بِحَرْبٍ مِّنَ ٱللَّهِ وَرَسُولِهِۦ ۖ وَإِن

342. అంటే పశ్చాత్తాపం చెందిన పిదప అతడు నీతికి నిలబడతాడో లేక ఆంతర్యంలో జనించే చెడుగు వైపుకు జారిపోతాడో పరీక్షించటం జరుగుతుంది. నిజంగానే అతనిలో పరివర్తన వస్తే సరి. లేకుంటే దైవాగ్రహానికి గురవుతాడు.

343. వడ్డీ వంటి ముదనష్టపు సొమ్ము వల్ల కలిగే అనర్థాలతోపాటు, దాన ధర్మాలవంటి సత్కార్యాల ద్వారా ప్రాప్తించే శుభాలు ఇందులో వివరించబడ్డాయి. వడ్డీ పైకి పెరుగుతున్నట్లు కనిపించినా దాని పరిణామం భయంకరంగా ఉంటుంది. ఇప్పుడు ఈ వాస్తవాన్ని పాశ్చాత్య ఆర్థిక నిపుణులు సయితం అంగీకరిస్తున్నారు.

344. ఇది అత్యంత తీవ్రమయిన హెచ్చరిక. మరే యితర పాపకార్యంపై కూడా ఇలాంటి ఉత్తర్వు జారీచేయబడలేదు. అందుకే ఈ ఆయతు నేపథ్యంలో హజ్రత్ అబ్దుల్లా బిన్

تُبۡتُمۡ فَلَكُمۡ رُءُوسُ أَمۡوَٰلِكُمۡ لَا تَظۡلِمُونَ وَلَا تُظۡلَمُونَ ﴿٢٧٩﴾

పశ్చాత్తాపం చెందితే మీ అసలు సొమ్ము మీకే ఉంటుంది. మీరూ ఒకరికి అన్యాయం చేయకూడదు. మీకు కూడా అన్యాయం జరుగకూడదు.[345]

وَإِن كَانَ ذُو عُسۡرَةٖ فَنَظِرَةٌ إِلَىٰ مَيۡسَرَةٖۚ وَأَن تَصَدَّقُواْ خَيۡرٞ لَّكُمۡ إِن كُنتُمۡ تَعۡلَمُونَ ﴿٢٨٠﴾

**280** ఒకవేళ రుణగ్రస్తుడు యిబ్బందుల్లో ఉంటే అతని పరిస్థితి మెరుగుపడేవరకూ అతనికి గడువు ఇవ్వాలి. లేదా మన్నించి దానంగా వదలి పెట్టండి. మీరే గనక తెలుసుకోగలిగితే ఇది మీ కొరకు శ్రేయో దాయకం.[346]

అబ్బాస్ (రజి) ఇలా అన్నారు : "ఇస్లామీయ రాజ్యంలో వడ్డీని వదలనివాడు ఉంటే సమకాలీన ఖలీఫా అతన్ని పిలిపించి, అతనిచేత ప్రాయశ్చిత్తం (తౌబా) చేయించాలి. అతడు బుద్ధిగా వింటే సరి, లేకుంటే అతని శిరస్సును ఛేదించాలి" (ఇబ్నె కసీర్).

345. మీరు గనక అసలు సొమ్ముకన్నా అధికంగా వసూలుచేస్తే మీ తరఫున ఇతరులకు అన్యాయం జరిగినట్లు లెక్క. ఒకవేళ మీకు అసలు సొమ్ము కూడా ముట్టకపోతే మీకు అన్యాయం జరిగినట్లు లెక్క.

346. అజ్ఞానకాలంలో షావుకారు వద్ద తీసుకున్న అప్పును నిర్ణీత సమయానికి చెల్లించకపోతే, వడ్డీపై వడ్డీ వేసేవాడు. ఆ చక్రవడ్డీ దిన దిన ప్రవర్ధమానమై అనతికాలంలోనే గోరంత అప్పు కొండంత అయి కూర్చునేది. రుణగ్రస్తుడు దాన్ని చెల్లించలేక షావుకారుకు దాసోహం అనేవాడు. అతని ఈ బలహీనతను సొమ్ము చేసుకుంటూ షావుకారు అతన్ని బానిసగా మార్చుకోవటమో, వెట్టిచాకిరీ చేయించుకోవటమో చేసేవాడు. (నిన్నమొన్నటి దాకా మన నాట కూడా పరిస్థితి ఇంచుమించు అదేననుకోండి – అనువాదకుడు). అందుకే అల్లాహ్ ఏమని ఆదేశించాడంటే, రుణగ్రస్తుని నుంచి వడ్డీ గుంజటం అటుంచి, రుణగ్రస్తుడు ఆర్థిక యిబ్బందుల్లో ఉంటే అతని స్థితి మెరుగుపడే వరకూ రుణదాత అతనికి గడువు ఇవ్వాలి. ఒకవేళ అతని రుణాన్ని పూర్తిగా మాఫీచేస్తే మరీ మంచిది. ఇలా ఔదార్యంతో మెలగటం అత్యంత మహత్పూర్వక విషయమని హదీసుల ద్వారా కూడా రూఢీ అవుతోంది. ఈ రెండు వ్యవస్థ (పెట్టుబడిదారీ వ్యవస్థ – ఇస్లామీయ వ్యవస్థ)ల్లో ఎంత పెద్ద వ్యత్యాసం ఉందో చూడండి! ఒక వ్యవస్థ ఆసాంతం అన్యాయం, దౌర్జన్యం, నిర్దాక్షిణ్యవైఖరి, స్వార్థ పరత్వంపై ఆధారపడి ఉండగా మరో వ్యవస్థ సానుభూతి, సహకారభావం, చేయూతపై నెలకొని ఉన్నది. ముస్లింలు ఖుద్దుగా ఈ శుభప్రదమైన, కారుణ్యప్రదమైన వ్యవస్థను

**281** మీరు అంతా అల్లాహ్ వైపుకు మరలింపబడే రోజుకు భయపడండి. ఆ తర్వాత ప్రతి ఒక్కరికీ తాను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం వొసగబడుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.[347]

وَاتَّقُوا يَوْمًا تُرْجَعُونَ فِيهِ إِلَى اللَّهِ ثُمَّ تُوَفَّىٰ كُلُّ نَفْسٍ
مَا كَسَبَتْ وَهُمْ لَا يُظْلَمُونَ ﴿٢٨١﴾

**282** ఓ విశ్వాసులారా! మీరు పరస్పరం ఒక నిర్ణీత గడువు కొరకు అప్పు వ్యవహారం చేసుకుంటున్నప్పుడు దాన్ని (స్పష్టంగా) వ్రాసుకోండి.[348] వ్రాసేవాడు ఈ వ్యవహారాన్ని మీ మధ్య న్యాయబద్ధంగా వ్రాయాలి. అల్లాహ్ ఎవడికైతే వ్రాయటం నేర్పాడో, అతను వ్రాయటానికి నిరాకరించకూడదు. అతడు వ్రాయాలి. రుణం

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا تَدَايَنتُم بِدَيْنٍ إِلَىٰ أَجَلٍ مُّسَمًّى
فَاكْتُبُوهُ ۚ وَلْيَكْتُب بَّيْنَكُمْ كَاتِبٌ بِالْعَدْلِ ۚ وَلَا يَأْبَ كَاتِبٌ أَن
يَكْتُبَ كَمَا عَلَّمَهُ اللَّهُ ۚ فَلْيَكْتُبْ وَلْيُمْلِلِ الَّذِي عَلَيْهِ الْحَقُّ

అవలంబించకపోతే ఆ దోషం ఇస్లాందీ కాదు, దాన్ని ప్రవేశపెట్టిన దైవానిదీ కాదు. ముస్లింలు తమ కారుణ్య వ్యవస్థ యొక్క ప్రాముఖ్యాన్ని, ఆవశ్యకతను గుర్తించి, తమ జీవనరథాన్ని దానికనుగుణంగా పోనిస్తే ఎంత బావుండు!

347. ఇది మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అవతరించిన ఆఖరి దివ్య ఖుర్ఆన్ వచనమని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. ఈ వాక్యం అవతరించిన కొన్నాళ్ళకే ఆయన (సఅసం) ఇహలోక జీవితాన్ని వీడిపోయారు – సల్లల్లాహు అలైహి వ సల్లం! (ఇబ్నె కసీర్).

348. వడ్డీ నిషేధించబడిన సమాజంలో, దానధర్మాల గురించి నొక్కి వక్కాణించబడిన వ్యవస్థలో ప్రజలకు అప్పు అవసరం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే యిక్కడ వడ్డీ హరామ్‌గా ఖరారుచేయబడింది. పోతే ప్రతివ్యక్తీ దానధర్మాలు చేసే స్థోమత కలిగి ఉండడు. అలాగే ప్రతి వ్యక్తీ దానధర్మాలు పుచ్చుకోవడానికి కూడా ముందుకు రాడు. ఇటువంటి పరిస్థితిలో మనిషి తన అవసరాలను తీర్చుకోవడానికి అప్పు చేయటం అనివార్యం అవుతుంది. ఈ అప్పు వ్యవహారంలోనే గనక అజాగ్రత్త, అశ్రద్ధ వహిస్తే అది ఎన్నో అనర్థాలకు దారితీస్తుంది. అందుకే 'ఆయతుద్దయిన్' అనబడే ఈ ఆయతులో – దివ్య ఖుర్ఆన్‌లోని అత్యంత సుదీర్ఘమయిన ఈ ఆయతులో – అల్లాహ్ అప్పు వ్యవహారానికి సంబంధించిన ముఖ్యమైన సూచనలన్నింటినీ స్పష్టంగా

وَلْيَتَّقِ اللّٰهَ رَبَّهٗ وَلَا يَبْخَسْ مِنْهُ شَيْـًٔا ۚ فَاِنْ كَانَ الَّذِىْ عَلَيْهِ الْحَقُّ سَفِيْهًا اَوْ ضَعِيْفًا اَوْ لَا يَسْتَطِيْعُ اَنْ يُّمِلَّ هُوَ فَلْيُمْلِلْ وَلِيُّهٗ بِالْعَدْلِ ۚ وَاسْتَشْهِدُوْا شَهِيْدَيْنِ مِنْ رِّجَالِكُمْ ۚ فَاِنْ

పుచ్చుకున్న వ్యక్తి విషయాన్ని విడమరచి వ్రాయించాలి.[349] ఈ విషయంలో అతను తన ప్రభువైన అల్లాహ్‌కు భయపడాలి. పుచ్చుకున్న దాన్ని తగ్గించి వ్రాయించకూడదు. ఒకవేళ రుణగ్రహీత అమాయకుడో, బలహీనుడో, లేక చెప్పి వ్రాయించలేనివాడో అయి ఉంటే అతని సంరక్షకుడు న్యాయంగా వ్రాయించాలి. మీలో ఇద్దరు పురుషులను ఈ వ్యవహారానికి సాక్షులుగా పెట్టుకోండి. ఇద్దరు పురుషులు లభ్యం కానిపక్షంలో మీరిష్టపడే సాక్షులలో ఒక పురుషుణ్ణి, ఇద్దరు స్త్రీలను సాక్షులుగా పెట్టుకోండి.[350] ఎందుకంటే

పొందుపరచాడు. మనిషి దైనందిన జీవితానికి ఎంతో అవసరమైన అప్పు అతని పాలిట తప్పుగా పరిణమించరాదనీ, అతన్ని పప్పులో కాలెయ్యకుండా ఉంచాలని ఈ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయబడ్డాయి. అందుకే కాలపరిమితిని ముందుగానే నిర్ధారించుకోమని ఆదేశించబడింది. అలాగే లావాదేవీలు లిఖితపూర్వకంగా ఉండాలని కూడా తాకీదు చేయబడింది. ఆ వ్యవహారానికి సంబంధించి సాక్షులను కూడా ఉంచుకోమని నిర్దేశించబడింది.

349. రుణగ్రహీత అల్లాహ్‌కు భయపడుతూ, ఉన్నదున్నట్టుగా దస్తావేజు వ్రాయించాలి. ఎంత సొమ్ము అప్పుగా పుచ్చుకుంటే అంతే వ్రాయాలి. తగ్గించి వ్రాయకూడదు. ఒకవేళ రుణగ్రస్తుడు అమాయకుడో, విషయావగాహన లేనివాడో, మతి స్థిమితం లేనివాడో అయి ఉంటే అతని తరఫున అతని సంరక్షకుడు న్యాయసమ్మతంగా ఆ లాంఛనాలను పూర్తిచేయాలి. రుణదాతకు నష్టం వాటిల్లకుండా ఉండగలందులకు ఈ జాగ్రత్తలు తీసుకోవటం అవసరం.

350. అంటే మీకు నమ్మకస్థులైనవారు, నిజాయితీపరులు అని భావం. దివ్య ఖుర్‌ఆన్‌లోని మూలం ద్వారా తెలిసే మరో విషయం ఏమిటంటే ఇద్దరు మహిళా సాక్షులు ఒక పురుష సాక్షికి సమానం. అలాగే పురుషుడు లేకుండా కేవలం ఒక స్త్రీ సాక్ష్యం యిచ్చినా అది స్వీకారయోగ్యం కాదు. స్త్రీ తప్ప మరొకరికి తెలియని వ్యవహారం అయితే అప్పుడు ఆమె సాక్ష్యం స్వీకారయోగ్యమవుతుంది. దావాచేసిన వ్యక్తి ప్రమాణం చేసినపక్షంలో, ఒక్క మగవాడు సాక్ష్యం యిచ్చినా సరిపోతుంది కదా! మరి అలాగే

لَّمْ يَكُونَا رَجُلَيْنِ فَرَجُلٌ وَّامْرَاَتٰنِ مِمَّنْ تَرْضَوْنَ مِنَ
الشُّهَدَآءِ اَنْ تَضِلَّ اِحْدٰىهُمَا فَتُذَكِّرَ اِحْدٰىهُمَا الْاُخْرٰى ؕ
وَلَا يَاْبَ الشُّهَدَآءُ اِذَا مَا دُعُوْا ؕ وَلَا تَسْـَٔمُوْٓا اَنْ تَكْتُبُوْهُ

వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ మరచిపోయిన ఆమెకు జ్ఞాపకం చేయ వచ్చు.[351] సాక్ష్యం కోసం పిలువబడి నప్పుడు సాక్షులు రావటానికి నిరాకరించ కూడదు. నిర్ణీతకాలం కొరకు తీసుకునే అప్పు, చిన్నదైనా పెద్దదైనా దాన్ని వ్రాసుకో వటంలో మాత్రం అశ్రద్ధ చేయరాదు. అల్లాహ్ దృష్టిలో ఈ పద్ధతి ఎంతో న్యాయవంతమైనది. ఇది సాక్ష్యాన్ని స్థిరంగా ఉంచుతుంది. సందేహాలకు, (అపార్థాలకు) లోనుకాకుండా ఉండేం దుకు కూడా ఇది బాగా దోహద పడుతుంది.[352] ఒకవేళ మీ మధ్య జరిగే

ఏదేని వివాదంపై దావేదారుని ప్రమాణంతో పాటు ఇద్దరు స్త్రీలు ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా తీర్పు ఇవ్వటం సరైనదేనా కాదా? అన్న విషయంపై భిన్నాభిప్రాయా లున్నాయి. హనఫీ ధర్మవేత్తల దృష్టిలో ఇది ధర్మసమ్మతం కాదు. కాని హదీసువేత్తలు దీనికి సుముఖంగానే ఉన్నారు. ఎందుకంటే ఒక సాక్షితోపాటు, ఒక ప్రమాణం కూడా ఉంటే దాని ఆధారంగా నిర్ణయం గైకొనవచ్చని హదీసు ద్వారా రూఢీ అవుతోంది. మరలాంటప్పుడు ఇద్దరు మహిళా సాక్షులు ఒక పురుష సాక్షికి సమానమైనట్లయితే, ఇద్దరు మహిళల సాక్ష్యం మరియు ఒక ప్రమాణం ఆధారంగా తీర్పు యివ్వటం కూడా ధర్మ సమ్మతమే (ఫత్హుల్ ఖదీర్).

351. ఒక పురుష సాక్షికి బదులుగా ఇద్దరు మహిళా సాక్షులను ఉంచటంలోని మర్మం యిక్కడ చెప్పబడింది. సాధారణంగా స్త్రీ జ్ఞాపకశక్తిలోనూ, సమయస్ఫూర్తిలోనూ పురుషునికన్నా కొంచెం వెనుకంజవేస్తుంది (సహీహ్ ముస్లింలోని హదీసు ద్వారా కూడా ఈ సంగతి విదితమవుతోంది). కొంతమంది భావిస్తున్నట్లుగా ఇది స్త్రీజాతిని కించపరచే ఉద్దేశ్యంతో చెప్పబడిన మాట ఎంతమాత్రం కాదు. పురుషాధిక్యతను చాటటం అంతకన్నా కాదు. వాస్తవాల, సంఘటనల ఆధారంగా ఇది ఎవరూ కాదనలేని సత్యం.

352. వ్యవహారం లిఖితపూర్వకంగా ఉంటే న్యాయం, ధర్మాల పాలన సజావుగా సాగుతుంది. సాక్ష్యాలు దృఢంగా ఉంటాయి. ఒకవేళ సాక్షులు చనిపోయినా లేక అందుబాటులో లేకున్నా వ్రాతపూర్వకపత్రం ఒక్కటే సమస్యలన్నింటికీ పరిష్కారంగా నిలుస్తుంది.

వ్యవహారం అప్పటికప్పుడు తేలిపోయే వ్యాపార లావాదేవీలదైతే అట్టి పరిస్థితిలో దాన్ని వ్రాసుకోకపోయినా ఫరవా లేదు. కాని క్రయ విక్రయాల సందర్భంగా కూడా సాక్షులను ఉంచుకోండి.[353] దస్తావేజు వ్రాసేవారిని గానీ, సాక్షులను గానీ ఇరకాటంలో పెట్టరాదు[354] (అని తెలుసుకోండి). ఒకవేళ మీరు గనక అలాచేస్తే అది నియమోల్లంఘన క్రిందికి వస్తుంది. అల్లాహ్‌కు భయపడండి.[355] అల్లాహ్ మీకు (పద్ధతిని) నేర్పు తున్నాడు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు.

صَغِيرًا أَوْ كَبِيرًا إِلَىٰٓ أَجَلِهِۦ ذَٰلِكُمْ أَقْسَطُ عِندَ ٱللَّهِ وَأَقْوَمُ
لِلشَّهَٰدَةِ وَأَدْنَىٰٓ أَلَّا تَرْتَابُوٓا۟ إِلَّآ أَن تَكُونَ تِجَٰرَةً حَاضِرَةً
تُدِيرُونَهَا بَيْنَكُمْ فَلَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ أَلَّا
تَكْتُبُوهَا وَأَشْهِدُوٓا۟ إِذَا تَبَايَعْتُمْ وَلَا يُضَآرَّ كَاتِبٌ
وَلَا شَهِيدٌ وَإِن تَفْعَلُوا۟ فَإِنَّهُۥ فُسُوقٌۢ بِكُمْ
وَٱتَّقُوا۟ ٱللَّهَ وَيُعَلِّمُكُمُ ٱللَّهُ وَٱللَّهُ بِكُلِّ شَىْءٍ عَلِيمٌ ٢٨٢

**283** ఒకవేళ మీరు ప్రయాణంలో ఉండి, వ్రాసేవాడు దొరక్కపోతే వస్తువును తాకట్టుగా పెట్టండి.[356] ఒకరికి మరొకరి పట్ల నమ్మకం ఏర్పడినట్లయితే, తనను

وَإِن كُنتُمْ عَلَىٰ سَفَرٍ وَلَمْ تَجِدُوا۟ كَاتِبًا فَرِهَٰنٌ مَّقْبُوضَةٌ فَإِنْ
أَمِنَ بَعْضُكُم بَعْضًا فَلْيُؤَدِّ ٱلَّذِى ٱؤْتُمِنَ أَمَٰنَتَهُۥ وَلْيَتَّقِ ٱللَّهَ

విషయం లిఖించబడి ఉండటం వల్ల సందేహాలకు, అనుమానాలకు ఆస్కారం ఉండదు.

353. క్రయవిక్రయాల సందర్భంగా కూడా సాక్షులుంటే మంచిది. ముఖ్యంగా భారీఎత్తున సరుకును అప్పుగా యిస్తున్నప్పుడు, లేదా పెద్ద తరహా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నప్పుడు ఈ సాక్ష్యాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. సాక్ష్యాలు లేకపోతే ఏదో ఒక పక్షంవారు మాటతప్పే, విముఖత చూపే ప్రమాదం ఉంటుంది. కొంతమంది వ్యాఖ్యాతలు ఈ వర్తకాన్ని ఇండ్ల కొనుగోలుగా, దుకాణాల, షాపుల అమ్మకంగా, పశువుల క్రయవిక్రయాలుగా తలపోశారు (ఐసరుత్తఫాసీర్).

354. ఇరకాటంలో పెట్టరాదంటే భావం – దస్తావేజులు వ్రాసేవారిని, సాక్షులుగా ఉండే వారిని మరీ దూరప్రాంతాలకు పిలిచి వ్యవహారం చేయటం, వారి సాధకబాధకాలను పట్టించుకోకపోవటం, అబద్ధపు విషయాలకు సాక్షిగా ఉండమని వారిపై ఒత్తిడి తీసుకు రావటం, విషయాన్ని వక్రీకరించి వ్రాయమనటం, వారు ఒప్పుకోకపోతే బెదిరించటం – ఇవన్నీ ఇరకాటంలోపెట్టే, నష్టం చేకూర్చే పద్ధతులే.

355. అంటే మీకు ఏ ఏ విషయాల అమలుపై తాకీదు చేయటం జరిగిందో వాటిని ఖచ్చితంగా

رِبَّهٗ ۭ وَلَا تَكْتُمُوا الشَّهَادَةَ ۭ وَمَنْ يَّكْتُمْهَا فَاِنَّهٗٓ اٰثِمٌ قَلْبُهٗ ۭ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ عَلِيْمٌ ﴿٢٨٣﴾

నమ్మి ఇచ్చిన అమానతును అతను వాపసు చేయాలి. ఇంకా అతను తన ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతూ మసలు కోవాలి.[357] మీరు సాక్ష్యాన్ని దాచకండి. సాక్ష్యాన్ని దాచేవాని హృదయం పాప భూయిష్టమైనది.[358] మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు.

అమలుపరచండి. ఏ విషయాలను విడనాడమని ఆజ్ఞాపించబడిందో వాటిని విడనాడండి. ఈ విషయంలో ఎల్లప్పుడూ అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.

356. ఒకవేళ ప్రయాణావస్థలో అప్పు తీసుకోవలసివస్తే, అక్కడ పత్రం వ్రాసేవారుగానీ, వ్రాత పత్రంగానీ లభ్యం కాకపోతే అప్పుడు అప్పు తీసుకునేవాడు అప్పు ఇచ్చే వ్యక్తి దగ్గర తన వస్తువును కుదువపెట్టాలి. మహాప్రవక్త (సఅసం) సయితం ఒకసారి తన యుద్ధకవచాన్ని ఒక యూదుని వద్ద తాకట్టుపెట్టారు (బుఖారి – ముస్లిం). తాకట్టు పెట్టబడిన వస్తువు ప్రయోజనం చేకూర్చేదై ఉంటే అట్టి ప్రయోజనం వస్తువు యజమానికే దక్కాలి. తాకట్టు పెట్టుకొన్నవానికి మాత్రం కాదు. కాకపోతే తాకట్టు పెట్టుకున్న వస్తువు మెయింటెనన్స్ కోసం ఏమన్నా ఖర్చు అయితే ఆ ఖర్చుల్ని వస్తువు యజమానిపై వడ్డించవచ్చు. మిగిలిన ఆదాయాన్ని మాత్రం వస్తువు యజమానికే ఇవ్వవలసి ఉంటుంది.

357. ఒకవేళ ఒండొకరి పట్ల నమ్మకం ఉన్నట్లయితే వస్తువును తాకట్టుగా పెట్టుకోకుండా కూడా లావాదేవీల వ్యవహారం జరపవచ్చు. ఇక్కడ అమానతు అంటే 'అప్పు' అని అర్థం. దైవానికి భయపడుతూ తీసుకున్న అప్పును ఉత్తమరీతిలో తిరిగి ఇవ్వాలి.

358. సాక్ష్యాన్ని దాచిపెట్టడం మహాపరాధం. అందుకే దీనిపై తీవ్రమయిన హెచ్చరిక చేయబడింది. హదీసులలో కూడా దీనిపై తీవ్ర హెచ్చరిక చేయబడింది. అలాగే సాక్ష్యంపై నిలబడటం, సత్యసాక్ష్యం ఇవ్వటం ఎంతో పుణ్యప్రదమైన విషయం అని కూడా చెప్పబడింది. మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు : "సాక్ష్యం కోసం పిలువబడకముందే, స్వయంగా సాక్ష్యం ఇవ్వడానికి ముందుకు వచ్చిన సాక్షి అత్యుత్తముడు" (సహీహ్ ముస్లిం – కితాబుల్ అఖ్జియ). వేరొక ఉల్లేఖనంలో అత్యంత నీచమైన సాక్ష్యం ఏదో కూడా తెలియజేయబడింది. "అత్యంత అల్పులైన సాక్షులెవరో నేను మీకు తెలుపనా? సాక్ష్యం ఇవ్వండి అని పిలువక ముందే వారు సాక్ష్యం ఇచ్చేందుకు ఎగబడి వస్తారు." (సహీహ్ బుఖారీ – కితాబుర్రిఖాఖ్). అంటే తప్పుడు సాక్ష్యాలు, అబద్ధపు సాక్ష్యాలు యిచ్చే వారన్నమాట! ఈ పనిచేసి వారు పాపాన్ని

لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ؕ وَاِنْ تُبْدُوْا مَا فِيْٓ
اَنْفُسِكُمْ اَوْ تُخْفُوْهُ يُحَاسِبْكُمْ بِهِ اللّٰهُ ؕ فَيَغْفِرُ لِمَنْ
يَّشَآءُ وَيُعَذِّبُ مَنْ يَّشَآءُ ؕ وَاللّٰهُ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ ﴿٢٨٤﴾

**284** ఆకాశాలలో, భూమిలో ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్‌దే. మీ మనసులలో ఉన్న దాన్ని మీరు వెల్లడించినా లేక దాచిపెట్టినా అల్లాహ్ మీనుండి దాని లెక్క తీసుకుంటాడు.[359] ఆ తరువాత ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు, తాను కోరిన వారిని శిక్షిస్తాడు. అల్లాహ్‌కు అన్నింటిపై అధికారం ఉంది.

మూట కట్టుకుంటారు. ఈ సందర్భంగా 'హృదయం' అంటూ ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనార్హం. హృదయం మానవ శరీరావయవాలన్నింటికీ సారథి లాంటిది. అదెలాంటి మాంసపు ముద్దంటే అది గనక సజావుగా ఉంటే శరీరమంతా ఆరోగ్యవంతంగా ఉంటుంది. అది గనక చెడిపోతే శరీరమంతా చెడిపోతుంది (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఈమాన్).

359. ఈ ఆయతు అవతరించినప్పుడు మహాప్రవక్త ప్రియ సహచరులు (రజి) తీవ్రంగా ఆందోళన చెందారని హదీసుల ద్వారా తెలుస్తోంది. వారు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి, "ఓ దైవప్రవక్తా (స)! మాకు ఆదేశించబడినట్లుగా నమాజ్, రోజా, జకాత్, జిహాద్ తదితర ఆచరణలను సాధ్యమైనంతవరకు మేము పాటిస్తూనే ఉన్నాము. ఎందుకంటే ఇవి మా శక్తికి మించినవి కావు. కాని మనసులో జనించే ఆలోచనలు, ప్రేరణలపై మాకెలాంటి అదుపు ఉండదు. అవి మనిషి తాహతుకు లోబడనివి. మరైతే అల్లాహ్ వీటి గురించి కూడా లెక్క తీసుకుంటానని ప్రకటించాడు" అని విన్నవించుకున్నారు. "ప్రస్తుతానికి ఏ ఆజ్ఞ వచ్చినా మీరు 'మేము విన్నాము, శిరసావహించాము' అనే అనండి" అని మహాప్రవక్త (స) తన సహచరులకు సముదాయించారు. సహచరులు మారు మాట్లాడలేదు. వారి ఈ విధేయతా భావాన్ని చూచి అల్లాహ్ ఈ వాక్యాన్ని అవతరింపజేశాడు : "అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం వేయడు." ఈ ఆయతు ద్వారా పై ఆయతు ఆదేశాన్ని రద్దుపరచాడు (ఇబ్నె కసీర్, ఫత్‌హుల్ ఖదీర్). క్రింది హదీసు కూడా దీన్ని సమర్థిస్తోంది: మహాప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "నా అనుచర సమాజం వారి ఆంతర్యాల్లో జనించే విషయాలను అల్లాహ్ మన్నించాడు. అయితే ఆంతర్యంలో జనించిన చెడ్డ విషయాలను ఆచరిస్తే లేక నోటితో వ్యక్తపరిస్తే మాత్రం ఆయన తప్పకుండా ప్రశ్నిస్తాడు" (సహీహ్ బుఖారీ – కితాబుల్ ఇత్ఖ్). దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే మనసులో ఉత్పన్నమయ్యే భావాలు, భావనలపై లెక్క తీసుకోబడదు. కాని వాటిపై దృఢ సంకల్పం చేసుకుంటే లేక ఆచరణలో పెడితే

**285** తన ప్రభువు తరఫున అవతరింప జేయబడిన దానిని ప్రవక్త విశ్వసించాడు. దాన్ని విశ్వాసులు కూడా (సత్యమని నమ్మారు.) వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలనూ విశ్వసించారు. "మేము ఆయన (పంపిన) ప్రవక్తల మధ్య ఎలాంటి విచక్షణను, భేదభావాన్నీ పాటించము"[360] (అని వారు చెబుతారు). "మేము విన్నాము. విధేయులం అయ్యాము. మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము. కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే" అని అంటారు.

اٰمَنَ الرَّسُوْلُ بِمَاۤ اُنْزِلَ اِلَيْهِ مِنْ رَّبِّهٖ وَ الْمُؤْمِنُوْنَ ؕ كُلٌّ اٰمَنَ بِاللّٰهِ وَمَلٰٓئِكَتِهٖ وَكُتُبِهٖ وَرُسُلِهٖ ۟ لَا نُفَرِّقُ بَيْنَ اَحَدٍ مِّنْ رُّسُلِهٖ ۟ وَقَالُوْا سَمِعْنَا وَاَطَعْنَا غُفْرَانَكَ رَبَّنَا وَاِلَيْكَ الْمَصِيْرُ ۟

మాత్రం నిలదీసి అడగటం జరుగుతుంది. దీనికి ప్రతిగా ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ ఏమంటారంటే; ఈ ఆయతు రద్దు కాలేదు. అల్లాహ్ నిలదీసి లెక్క తీసుకున్న వారందరికీ శిక్ష పడి తీరుతుందని కూడా అనుకోరాదు. ఎందుకంటే అల్లాహ్ లెక్క తీసుకోవడానికైతే అందరి నుంచీ తీసుకుంటాడు. కాని లెక్క తీసుకున్న తరువాత చాలామంది ఆయన క్షమాగుణం ద్వారా ముక్తి పొందుతారు. మరికొందరికైతే; వారి ఒక్కొక్క పాపాన్ని గుర్తుచేసి, ఆ పాపం చేసినట్లు వారిచేత ఒప్పించి, కడకు వారికి క్షమాభిక్ష పెడతాడు (ఈ హదీసు సహీహ్ బుఖారీ, ముస్లింలలో ఉంది – ఇబ్నె కసీర్ ఆధారంగా).

360. ఈ వాక్యంలో మరోసారి 'విశ్వాసాల' ప్రస్తావనను తీసుకువచ్చి విశ్వాసులకు 'విశ్వాస' ప్రాముఖ్యతను జ్ఞాపకం చేయటం జరిగింది. తరువాత వాక్యంలో అల్లాహ్ తన దాసులకు చేసిన మహోపకారాన్ని గుర్తు చేశాడు. అదేమంటే ఆయన వారిపై శక్తికి మించిన బరువు బాధ్యతలను మోపలేదు. ఈ రెండు ఆయతులు అత్యంత మహత్పూర్వకమైనవనీ హదీసుల ద్వారా తెలుస్తోంది. దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు : "ఎవరయినా బఖరా సూరాలోని చివరి రెండు ఆయతులను రాత్రిపూట పారాయణం చేస్తే అవి అతని కోసం చాలు" (సహీహ్ బుఖారీ – ఇబ్నె కసీర్). అంటే వీటి మూలంగా అల్లాహ్ అతన్ని తన రక్షణలోకి తీసుకుంటాడు. రాత్రిపూట చేసే దైవధ్యానానికి ఈ రెండు ఆయతులు సరితూగుతాయని మరికొంత మంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు.

**286** అల్లాహ్ ఏ ప్రాణిపైనా దాని శక్తికి మించిన భారం వేయడు. అది ఏ పుణ్యాన్ని సంపాదించినా దానికే లభిస్తుంది. మరి అది ఏ పాపాన్ని మూటగట్టుకున్నా దాని ఫలితాన్ని అది చవిచూస్తుంది. (ఇలా ప్రార్థిస్తూ ఉండండి): "ఓ మా ప్రభూ! మేము మరచిపోయినా, లేక మేము పొరబడినా మమ్మల్ని నిలదీయకు. మా ప్రభూ! మాకు పూర్వం గతించిన వారిపై వేసినటువంటి భారాన్ని మాపై వేయకు. మా ప్రభూ! మేము మోయలేనటువంటి బరువును మాపై మోపకు. మమ్మల్ని మన్నించి వదలిపెట్టు. మాకు క్షమాభిక్ష పెట్టు. మాపై దయజూపు. నీవే మా సంరక్షకుడవు. అందుచేత అవిశ్వాసులకు వ్యతిరేకంగా మాకు సహాయపడు."

لَا يُكَلِّفُ اللّٰهُ نَفْسًا اِلَّا وُسْعَهَا ۭ لَهَا مَا كَسَبَتْ وَعَلَيْهَا مَا اكْتَسَبَتْ ۭ رَبَّنَا لَا تُؤَاخِذْنَآ اِنْ نَّسِيْنَآ اَوْ اَخْطَاْنَا ۚ رَبَّنَا وَلَا تَحْمِلْ عَلَيْنَآ اِصْرًا كَمَا حَمَلْتَهٗ عَلَي الَّذِيْنَ مِنْ قَبْلِنَا ۚ رَبَّنَا وَلَا تُحَمِّلْنَا مَا لَا طَاقَةَ لَنَا بِهٖ ۚ وَاعْفُ عَنَّا ۟ وَاغْفِرْ لَنَا ۟ وَارْحَمْنَا ۟ اَنْتَ مَوْلٰىنَا فَانْصُرْنَا عَلَي الْقَوْمِ الْكٰفِرِيْنَ ۲۸۶

వేరొక హదీసు ప్రకారం మహాప్రవక్త (సఅసం)కు మేరాజ్ యాత్ర సందర్భంగా ప్రసాదించబడిన మూడు వరాలలో బఖరా సూరాలోని ఈ చివరి రెండు ఆయతులు కూడా ఉన్నాయి (సహీహ్ ముస్లిం – సిద్రతుల్ మున్తహా ప్రస్తావన గల అధ్యాయం). దైవపీఠానికి (అర్ష్‌కు) క్రిందనున్న ఖజానానుంచి అంతిమ దైవప్రవక్త (స)కు ఈ రెండు ఆయతులు అనుగ్రహించబడ్డాయని మరికొన్ని ఉల్లేఖనాలు తెలుపుతున్నాయి. ఈ ఆయతులు ఆయనకు తప్ప మరొకరెవరికీ అనుగ్రహించబడలేదు (అహ్మద్, నసాయి, తబ్రానీ, బైహఖీ, హాకిమ్, దారిమీ). ఈ సూరా ముగింపుపై హజ్రత్ ముఆజ్ (రజి) 'ఆమీన్' అనేవారు (ఇబ్నె కసీర్).